

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 160

గురువారం 31-8-2017



పెద్ద కారు ఇక ప్రియం!

జీఎస్టీ సెస్సు 25 శాతానికి పెంపు.. ప్రతిపాదనకు కేబినెట్ ఓకే

- బిజినెస్‌లో



గట్టెక్కిన ఫెడరర్

యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో 5 సెట్లు పోరాడి గెలిచిన దిగ్గజం

-స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'బ్లాక్' మ్యాజిక్?



నల్లధనంపై తెల్లమొహం

అసలు ఉందా.. లేక తెల్లగా మారిందా?

- బిజినెస్‌లో

రద్దయిన నోట్లలో 99శాతం బ్యాంకుల్లోకి

- వెయ్యి నోట్లలో 1.4 శాతమే తిరిగి రాలేదు
- వార్షిక నివేదికలో రిజర్వు బ్యాంకు వెల్లడి
- మండిపడ్డ కాంగ్రెస్.. ఆర్బీఐకి సిగ్గుచేటని వ్యాఖ్య

వచ్చేసింది.. దాదాపు మొత్తం సొమ్ము వెనక్కి వచ్చేసింది!

నల్లధనాన్ని పాతాళంలోకి తొక్కేస్తామంటూ ప్రధాని మోదీ రద్దు చేసిన పెద్ద నోట్లన్నీ తెల్లరంగు పులుముకొని, తమవైన దారులను వెతుక్కొని తిరిగి ప్రభుత్వం చెంతకు చేరాయి. నోట్ల రద్దు నాటికి చలామణిలో ఉన్న రూ.వెయ్యి, 500 నోట్లలో.. రద్దు తర్వాత 99% వెనక్కి వచ్చేశాయి. మొత్తంగా రూ.15.44 లక్షల కోట్ల విలువైన నోట్లు రద్దు కాగా.. అందులో రూ.15.28 లక్షల కోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయి. కేవలం రూ.16,050 కోట్లు మాత్రమే డిపాజిట్ కాలేదు. ఈ వివరాలను ఆర్బీఐ బుధవారం వెల్లడించింది.

6లో

రద్దయిన నోట్ల మొత్తం విలువ (లక్షల కోట్లు)
15.44

వీటిల్లో డిపాజిట్ అయిన వాటి విలువ (లక్షల కోట్లు)
15.28

తిరిగి వెనక్కిరాని నోట్ల విలువ (రూ. కోట్లలో)
16,050



అదును తప్పాక పదును..!

సాగు విస్తీర్ణం పెంపునకు దోహదపడని వర్షాలు

ఖరీఫ్ ముగింపునకు వచ్చినా 40 లక్షల హెక్టార్లకు గాను సాగైంది 29 లక్షల హెక్టార్లే

అరకొరగా బతికిన మెట్ట పంటలకు మాత్రం ఊపిరి

పత్తి, మిర్చి పంటలకు తెగుళ్లు ఆశించడంతో రైతుల్లో ఆందోళన

సాక్షి, అమరావతి

ఖరీఫ్ సీజన్ ముగింపునకు వచ్చినా సాగు విస్తీర్ణం మాత్రం అనుకున్న రీతిలో ముందుకు సాగడం లేదు. అదును తప్పి కురుస్తున్న ప్రస్తుత వర్షాలు మెట్ట పంటలకు ఊపిరి పోసినా, పంట విస్తీర్ణం పెంపునకు తోడ్పడలేదు. వర్షాలు లేక రాయలసీమలో ప్రధాన పంట వేరుశనగ అనుకున్నదానికన్నా తక్కువగా సాగయ్యింది. వేసిన పంట కూడా బెట్టకు వచ్చింది. వర్షానికీ వర్షానికి మధ్య సమయం ఎక్కువగా ఉండడంతో చాలా ప్రాంతాల్లో ఎండిపోయింది. మిగిలిన పంటకు ఈ వర్షాలు జీవం పోశాయి. దీంతోపాటు కంది, మినుము, పత్తి, మిర్చి, జొన్న, సజ్జ వంటి మెట్ట పంటలు కోలుకుంటున్నాయి. నైరుతి రుతు పవనాల ప్రభావంతో జూన్ నుంచి ఇప్పటికి 398.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉంటే ఈ వారంలో కురిసిన వర్షాలతో కలిపి 418 మిల్లీమీటర్లకు చేరింది. దీంతో పక్షం రోజుల కిందట ఉన్న 5.3 శాతం లోటు ఇప్పుడు సాధారణ స్థితికి చేరింది. నిన్నా మొన్నటి వరకు లోటులో ఉన్న శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు ఈ వారానికి మిగులు వర్షం జాబితాలో చేరగా, మిగతా జిల్లాలు సాధారణ స్థితికి చేరుకున్నట్టు వ్యవసాయ శాఖ తెలిపింది. అయితే రిజర్వాయర్లు మాత్రం ఇంకా వెలవెలబోతూనే ఉన్నాయి. శ్రీశైలం రిజర్వాయర్‌లో గత ఏడాది ఇదే సమయానికి 149.8 టీఎంసీల నీళ్లుంటే, ప్రస్తుతం 22.7 టీఎంసీలు, నాగార్జున సాగర్‌లో గత ఏడాది 136.8 టీఎంసీలుంటే ఇప్పుడు 115.3 టీఎంసీల నీరు ఉంది. కృష్ణా, గోదావరి డెల్టాలకు తప్ప మరెక్కడి నుంచి నీళ్ల విడుదలైన దాఖలాలు కనిపించడం లేదు.

సాగుకు నోచుకోని 11.40 లక్షల ఎకరాలు

సెప్టెంబర్ ఆఖరుతో ఖరీఫ్

మిగతా 2వ పేజీలో ▶



రేపు తిరుపతి రానున్న రాష్ట్రపతి



- రెండు రోజుల అధికారిక పర్యటన ఖరారు
- బోధనాస్పత్రి ప్రారంభోత్సవంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న కోవింద్
- శ్రీవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం

సాక్షి ప్రతినిధి, తిరుపతి

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం తిరుమల పర్యటనకు రానున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ ప్రద్యుమ్న బుధవారం మీడియాకు తెలియజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్రపతి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ్నుంచి నేరుగా తిరుచానూరు వెళ్లి పద్మావతీ అమ్మవారిని దర్శించుకుని.. స్విమ్స్ ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన బోధనాస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే రూ.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నైపుణ్యాభివృద్ధి అకాడమీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడ్నుంచి

మిగతా 2వ పేజీలో ▶





ఇదీ అసలు రంగు!

నంద్యాల అభివృద్ధికి టీడీపీ వెనకడుగు

- పట్టణంలో అభివృద్ధి పనుల ఆమోదానికి ముందుకు రాని ఆ పార్టీ కౌన్సిలర్లు
- ఇప్పటికిప్పుడు నిధులిచ్చేందుకు సర్కారు పెద్దల విముఖత
- ఆ మేరకే హైడ్రామా.. రిజిస్టర్‌లో పెట్టిన సంతకాలు కొట్టివేత
- ఉప ఎన్నిక గండం గడిచిందని దిగజారుడు రాజకీయం

2లో

నేడే పీఎస్ఎల్వీ సీ-39 ప్రయోగం

- పూర్తిస్థాయి స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ఏర్పాటే లక్ష్యంగా ఇస్రో రూపొందించిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్ ఉపగ్రహాన్ని నేడు నింగిలోకి పంపనున్నారు. ఇందుకోసం 29 గంటల కౌంట్‌డౌన్ కొనసాగుతోంది.

6లో



ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్ ఉపగ్రహం

ప్రశ్నపత్రం అమ్మేసిన ప్రొఫెసర్!?

ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు

- ఫిబ్రవరిలో జియాలజిస్టు పోస్టుల నియామకానికి పరీక్షలు.. ప్రశ్నపత్రం రూపొందించిన ఏయూ ప్రొఫెసర్
- ఆయన వద్ద పనిచేసే స్కాలర్‌కు, అదే విభాగంలో పనిచేసే మరో స్కాలర్‌కు ఉద్యోగాలు
- రూ.8 లక్షలకు ప్రశ్నపత్రం విక్రయించినట్లు ఆరోపణలు

3లో

రాజధానిలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్!



- మూడు జోన్లలో రూ. 6,900 కోట్లతో పనులు
- రాజధాని గ్రామాల్లో రహదారులకు ఉపాధి హామీ నిధులు
- సీఆర్‌డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

5లో

నంద్యాలలో టీడీపీది గెలుపు కానేకాదు

నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

చంద్రబాబు లాంటి నక్కజిత్తుల వ్యక్తుల వల్ల సమాజానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- వివరాలు 2లో

తేరుకుంటున్న ముంబై

మహారాష్ట్రలో వర్షాలకు 10 మంది మృతి

33.14 సెం.మీ. వర్షపాతం

గత 12 ఏళ్లలో ఇదే అత్యధికం

తెరపివ్వని 'హార్వీ'

30కి చేరిన మృతులు

చనిపోయిన వారిలో ఓ భారతీయ విద్యార్థి

లూసియానాలో తీరాన్ని తాకిన తుపాను

6లో

అన్నాడీఎంకేకి కేంద్రం అభయం!

- తమిళనాడులో మైనారిటీలో పడిన పళనిస్వామి ప్రభుత్వానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు అభయహస్తమిచ్చినట్లు తెలుస్తోంది. కేంద్రం, గవర్నర్ల జోక్యం ఉండదని హోంమంత్రి రాజ్‌నాథ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, పళనిస్వామి ప్రభుత్వాన్ని బలపరీక్షకు ఆదేశించాలని కోరుతూ విపక్షనేతలు గవర్నర్ విద్యాసాగర్ రావును కలిశారు.

- 6లో

రేపు తిరుపతి రానున్న రాష్ట్రపతి

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగే పౌర సన్మాన కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సందర్భంగా జరిగే సభలో కొంత మంది నిరుపేద దళిత రైతులకు సాగు భూములు పంపిణీ చేస్తారు. తదనంతరం గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబుతో కలసి తిరుచానూరు రోడ్డులోని శిల్పారామానికి రాష్ట్రపతి చేరుకుంటారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వం మర్యాదపూర్వకంగా ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని స్వీకరించి తిరుమల కొండకు వెళతారు. శనివారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకొని.. నేరుగా రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు. కాగా, తొలిసారి తిరుపతి వస్తున్న దేశ ప్రథమ పౌరుడికి స్వాగతం పలికేందుకు గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 10 గంటలకల్లా తిరుపతి చేరుకోనున్నారు. భద్రతాపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్పీ మొహంతి తెలిపారు.



నెల్లూరు సిటీ నియోజకవర్గ నవరత్నాల సభలో మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

నంద్యాలలో... టీడీపీది గెలుపు కానేకాదు

నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీది గెలుపు అనుకుంటే పొరపాటేనని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నవరత్నాల సభలో ఆయన మాట్లాడారు. నంద్యాలలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం దారుణమన్నారు. చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు లాంటి నక్కజిత్తుల వ్యక్తుల వల్ల సమాజానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్యానించారు. సరైన సమయంలో ప్రజలు టీడీపీకి బుద్ధి చెబుతారన్నారు. ఎన్టీ రామారావు నుంచి సైకిల్ గుర్తు లాక్కున్న నీచమైన చరిత్ర చంద్రబాబుదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. సీఎం పదవికే చంద్రబాబు కళంకం తెచ్చారని విమర్శించారు. భూమా నాగిరెడ్డిని ఏ విధంగా హింసించి, భయపెట్టి పార్టీలోకి లాక్కున్నారో అందరికీ తెలుసన్నారు. ఆ విధంగానే 21 మందిని భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురి చేసి టీడీపీలో చేర్చుకున్న నీచమైన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. ఉప ఎన్నికలు వచ్చినప్పుడే నంద్యాల అభివృద్ధి గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. నంద్యాలతో పాటు రాష్ట్రంలో ముస్లింలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని చెప్పారు. నవరత్నాల సభలు పూర్తయ్యాక ప్రతి జిల్లాలోని బూత్ కమిటీల నాయకులతో విజయ శంఖారావం పేరుతో సభలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల సర్వీసు కొనసాగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 3,672 మంది ఒప్పంద అధ్యాపకుల సర్వీసును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ముగింపు రోజు వరకు వారి సర్వీసును రెన్యువల్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): ఎంఎస్సీ నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు బుధవారం తెలిపారు. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష ఈనెల 24న జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని చెప్పారు.

గుర్తింపులేని వైద్యులపై చర్యలు తీసుకోండి

రాష్ట్రానికి కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా లేఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గుర్తింపు లేకుండా వైద్యం చేస్తున్న వారిని గుర్తించి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశించారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు తాజాగా లేఖ రాశారు. సెక్షన్ 15 ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956 ప్రకారం ఆయా రాష్ట్రంలోని మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు లేకుండా వైద్యం చేస్తున్నట్టయితే రద్దు చేయాలన్నారు. ఇదిలా ఉండగా ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గుర్తింపునిస్తామన్న 4 రోజుల్లో కేంద్ర మంత్రి లేఖ రాయడంపై అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీనిని సాకుగా చూపి ఇప్పుడు గుర్తింపు ఇవ్వకుండా చేయడం ప్రభుత్వానికి మరింత సులభమని చెబుతున్నారు.

ఈఎస్ఐసీ డైరెక్టర్‌గా రామకోటికి పదోన్నతి

విశాఖపట్నం: కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ), విశాఖ ఉప ప్రాంతీయ కార్యాలయం(ఎస్ఆర్ఓ)లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.రామకోటికి డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ మనీష్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేసినట్టు విశాఖ ఎస్ఆర్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప బెహరా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రహదారి భద్రతకు రూ.10 కోట్లు

సాక్షి, అమరావతి: ఆర్థిక శాఖ అనేక కొర్రీల తర్వాత రోడ్ సేఫ్టీ ఫండ్ కోసం రూ. 10 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. రాష్ట్రంలో రహదారి భద్రతకు నిధుల్లేక రవాణా శాఖ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రోడ్ సేఫ్టీకి రూ.10 కోట్లు కేటాయించాలని సుప్రీంకోర్టు కమిటీ సూచించింది. ఈ నేపథ్యంలో నిధులకు పరిపాలన అనుమతులిస్తూ ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా జీవో జారీ చేశారు.

వావ్ ఫ్యాక్టర్



నీటిపై కొన్ని గంటల్లోనే కట్టుకోడానికి వీలైన గూళ్ల లాంటి ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఇళ్ల నమూనా.

గంటల్లో గూళ్లు రెడీ!

పేదవారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నా, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో నిర్వాసితులయ్యే వారికి తాత్కాలికంగానైనా ఒక గూడు కల్పించాలన్నా ఎంత శ్రమో మనకు తెలియంది కాదు. ఈ సమస్యకు ఇప్పటికే ఎందరో ఎన్నో రకాల పరిష్కార మార్గాలు చూపారు. తాజాగా ఛార్లెస్ అనే ఓ ఆర్కిటెక్ట్ 'లైఫ్ ఆర్క్' పేరుతో ఇంకో వినూత్నమైన సమాధానాన్ని సూచిస్తున్నారు. ఫొటోలో కనిపిస్తున్నవన్నీ నీటిపై ఏర్పాటు చేసిన ప్రీఫ్యాబ్రికేటెడ్ ఇళ్లు. వీటిని ఒకదానితో ఒకటి జతచేసుకుంటూ, ఒకేదగ్గర కాలనీలా, ఒక పల్లె మాదిరిగా ఏర్పాటు చేసుకోవచ్చు. హెచ్‌డీపీఈ పదార్థంతో రొటేషనల్ మౌల్డింగ్ అనే టెక్నాలజీతో సిద్ధమయ్యే ప్యానెళ్లను నట్లు, బోల్టులతో జోడించుకోవడం మాత్రమే మనం చేయాల్సిన పని. ఒక్కో ఇంటికి కంటెయినర్ బాక్స్‌లోకి సులువుగా ఇమిడిపోయే దాదాపు 24 ప్యానెళ్ల అవసరముంటుంది. అన్నింటినీ కాలిఫోర్నియాలోని తన ఫ్యాక్టరీలోనే తయారు చేస్తున్నారు ఛార్లెస్. ప్యానెళ్లు తయారైన తరువాత వంటింటి అరుగు, ఎలక్ట్రిక్ వైరింగ్ వంటి అదనపు హంగులను ఇంకో ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసుకోవచ్చు. ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఈ ఇళ్లు దాదాపుగా స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటాయి. అంటే విద్యుత్తు, నీళ్ల వంటి అవసరాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు వీటిల్లోనే ఉన్నాయన్నమాట. నీటిపైనే కాకుండా నేలపై కూడా సునాయాసంగా కొన్ని గంటల వ్యవధిలో ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కోటి అరవై చదరపు మీటర్ల వైశాల్యంతో ఉంటాయి. ప్రస్తుతం అక్కడికక్కడే కాయగూరలు పండించుకునేందుకు కూడా ఈ లైఫ్‌ఆర్క్ ఇంట్లో హైడ్రోపోనిక్స్ ఏర్పాట్లు ఉన్నాయి. ఛార్లెస్ ఫ్యాక్టరీలో రోజుకు పది ఇళ్లకు సరిపడ ప్యానెళ్లు సిద్ధమవుతున్నాయి. అన్నీ సవ్యంగా సాగితే వీటిని వచ్చే మార్చి నాటికి డల్లాస్, టెక్సస్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ చౌక ఇళ్లను అమ్మడం ద్వారా వచ్చే లాభాలతో మరిన్ని లైఫ్‌ఆర్క్‌లు నిర్మించి ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నిర్వాసితులైన వారికి, శరణార్థి శిబిరాల ఏర్పాటుకూ ఉపయోగిస్తామంటున్నారు ఛార్లెస్.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

ఇదీ అసలు రంగు!

- నంద్యాల అభివృద్ధికి టీడీపీ వెనకడుగు
- పట్టణంలో అభివృద్ధి పనుల ఆమోదానికి ముందుకు రాని ఆ పార్టీ కౌన్సిలర్లు



నంద్యాల మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి వచ్చి బయట నిల్చున్న టీడీపీ కౌన్సిలర్లు

నంద్యాల: అనుకున్నంతా అయ్యింది. నంద్యాల్లో టీడీపీ అసలు రంగు బయటపడింది. వందల కోట్ల రూపాయలతో పట్టణ రూపురేఖలు మారుస్తామన్న టీడీపీ పెద్దల మాటలకు.. వాస్తవ పరిస్థితికి పొంతన కుదరడం లేదని స్పష్టమైంది. ఉప ఎన్నిక ఫలితాలు వెలువడి 3 రోజులు కూడా కాకముందే అధికార పార్టీ నాయకులు నంద్యాల ప్రజలకు తమ అసలు రూపాన్ని చూపించారు. కర్నూలు జిల్లా నంద్యాల అభివృద్ధి కోసం రూ.1,500 కోట్లు మంజూరు చేశాం.. అభివృద్ధే ధ్యేయమంటూ ఉప ఎన్నిక ప్రచారంలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి, తీరా గెలిచాక నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. పట్టణంలో చేపట్టబోతున్న అభివృద్ధి పనుల ఆమోదం కోసం బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి తమ కుటిల రాజకీయాన్ని చాటుకోవడం విస్తుగొలుపుతోంది. ఉదయం 10కి ప్రారంభమైన సమావేశానికి టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హాజరయ్యారు. ముగ్గురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మాత్రం అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయారు. వీరు సమావేశానికి రావడం లేదని తెలుసుకున్న టీడీపీ కౌన్సిలర్లు డ్రామాకు తెరలేపారు. సమావేశం నుంచి బయటకు వెళితే కోరం ఉండదని, అప్పుడు కౌన్సిల్ సమావేశం వాయిదా పడుతుందని, అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపలేరని ఎత్తుగడ వేశారు. అప్పటికే టీడీపీకి మద్దతిస్తున్న ఆరుగురు కౌన్సిలర్లు కౌన్సిల్‌మీట్ రిజిస్టర్‌లో సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేశారు. దీంతో అధికార పార్టీ ముఖ్య నేతల సూచన మేరకు వారు ఆ రిజిస్టర్‌ను కమిషనర్ వద్ద నుంచి తీసుకుని సంతకాలను కొట్టేసి మరీ బయటకు వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి ముగ్గురు సభ్యులు తక్కువ పడ్డారు. అనారోగ్యం కారణంగా నంద్యాలకు దూరంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ముగ్గురు అనుకున్న సమయానికి రాలేకపోవడంతో సమావేశాన్ని కోరం లేక వాయిదా వేసినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన ప్రకటించారు.

సర్కారు పెద్దల సూచన మేరకే..

'ఒకేసారి వందల కోట్ల రూపాయలు ఇవ్వడమంటే మాటలు కాదు.. ఇప్పటికిప్పుడు ఆ పనులన్నింటికీ ఆమోదం తెలిపితే మాపై ఒత్తిడి పెరుగుతుంది.. పరిస్థితి మీకు అర్థమైందనుకుంటాం.. సమావేశంలో ఆ పనులు ఆమోదం పొందకుండా చూడండి' అని ప్రభుత్వ పెద్దల నుంచి సూచనలు రావడంతో టీడీపీ కౌన్సిలర్లు ఇలా హైడ్రామాకు తెరతీశారని తెలుస్తోంది. వారందరూ సమావేశానికి హాజరైన తర్వాతే ఈ సూచనలు అందినట్లు సమాచారం. దీంతో హడావుడిగా రిజిస్టర్‌లో పెట్టిన సంతకాలు కూడా కొట్టేసి వెళ్లారు. వారికి చిత్తశుద్ధి ఉంటే సమావేశం కోరం పొందడానికి ఒకరో ఇద్దరో తక్కువగా ఉంటే ఎదుటి పార్టీ కౌన్సిలర్లను బతిమాలి అయినా తీసుకురావాలని, ఇలా చేయడం సరికాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చైర్‌పర్సన్‌పై ఎదురుదాడి

కౌన్సిల్ సమావేశం ఆగిపోతే అభివృద్ధి పనులకు ఆమోదం లభించదని తెలిసి కూడా టీడీపీ కౌన్సిలర్లు దగ్గరుండి హాజరుకాకపోవడమే కాకుండా చైర్‌పర్సన్‌పై ఎదురుదాడికి దిగారు. పార్టీ మారిన చైర్‌పర్సన్ రాజీనామా చేసి గెలవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ టీడీపీ వారిలోనే అసమ్మతికి తెరలేపింది. గతంలో అధికార టీడీపీ.. కౌన్సిల్ పీఠాన్ని దక్కించుకుంది. మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఉన్న దేశం సుధాకర్‌రెడ్డి భార్య సులోచనను చైర్‌పర్సన్ చేశారు. ప్రస్తుతం వీరు శిల్పా మద్దతుదారులుగానే కొనసాగుతున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి టీడీపీలోకి వెళ్లిన కౌన్సిలర్లు రాజీనామా చేయకుండా.. దేశం సులోచనను మాత్రం రాజీనామా చేయాలనడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అడ్డుకోవడం బాధాకరం

నంద్యాలను అభివృద్ధి చేస్తామని చెప్పి ఉప ఎన్నికలో గెలిచిన నాయకులు నేడు అభివృద్ధి పనుల కోసం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తే అడ్డుకోవడం బాధాకరం. మా కౌన్సిలర్లు అనారోగ్య కారణాలతో సమావేశానికి రాలేకపోయారు. ఈ రోజు ముగ్గురు సభ్యులు తక్కువై కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశాం. వచ్చే నెలలో మళ్లీ నిర్వహిస్తాం. మా కౌన్సిలర్లు వస్తారు. యథావిధిగా అభివృద్ధి పనులకు ఆమోదం లభిస్తుంది. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా, నా ప్రాణం ఉన్నంత వరకు వైఎస్ఆర్‌సీపీని వీడేది లేదు. అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ఉద్దేశ పూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడడం బాధాకరం.

– దేశం సులోచన, మున్సిపల్ చైర్ పర్సన్, నంద్యాల

పదోన్నతుల జాబితా విడుదల

- డీఈవో, డిప్యూటీ డైరెక్టర్లుగా 14 మందితో జాబితా
- విచారణ కమిటీ వేయకుండానే జాబితా విడుదలపై అనుమానాలు
- ముఖ్య నేత కుటుంబసభ్యుడే వసూళ్ల రాయుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించడానికి రూ.కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. వీటిపై విచారణ అంటూనే ప్రభుత్వం బుధవారం జాబితాను విడుదల చేసింది. ముడుపుల వ్యవహారంపై కమిటీ ఏర్పాటు కాకుండానే జాబితాను ఖరారు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జాబితా ఆధారంగానే డీఈవో, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు ఇవ్వనున్నారు. మొత్తం 14 మంది పేర్లతో పాఠశాల విద్యాశాఖ జీవో విడుదల చేసింది. ఎం.జ్యోతి కుమారి, బి.విజయభాస్కర్, వీఎస్.సుబ్బారావు, ఎం.జనార్దనాచార్యులు, వి.మేరీ చంద్రిక, బి.లింగేశ్వరరెడ్డి, ఏ.సాయిబాబు, ఎం.సాయిరాం, వై.రాఘవరెడ్డి, ఆర్ఎస్.గంగాభవాని, ఎంఎస్ఎస్.లక్ష్మీవాట్, ఎస్.అబ్రహం, జి.విజయలక్ష్మి, పి.విజయలక్ష్మి జాబితాలో ఉన్నారు.

విచారణ తూతూమంత్రమే..

విచారణ కమిటీ వేయకుండానే జాబితా ప్రకటించడంతో ఇక విచారణ జరిగినా అది తూతూమంత్రమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వయంగా విద్యాశాఖకు చెందిన ముఖ్య నేత కుటుంబ సభ్యుడే వసూళ్ల దందాలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలున్నాయి. డీఈవో, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల కోసం కీలక జిల్లాలయితే రూ. 50 లక్షలు, ఇతర జిల్లాలయితే రూ.30 లక్షల నుంచి 40 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఆయా పోస్టులను వేలంలో పెట్టి అమ్మినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో ప్రస్తుతానికి పదోన్నతుల పేర్లతో ప్యానల్‌ను ఖరారు చేస్తూ జీవో ఇచ్చారు. త్వరలోనే నిర్ణీత మొత్తాలు ముట్టచెప్పినవారికి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారని తెలుస్తోంది. కమిటీ వేయకుండానే జాబితా ఖరారుపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి కార్యాలయాన్ని వివరణ కోరగా కమిటీ వేసి విచారణ చేయిస్తామని, ఆ తర్వాతే పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది.

'ఫాతిమా' విద్యార్థుల సర్దుబాటు ఎలా?

కేంద్రం, ఎంసీఐకి సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఫాతిమా వైద్య కళాశాలకు చెందిన 2015-16 బ్యాచ్ విద్యార్థులను ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేయటంపై సెప్టెంబరు 21లోగా వివరాలు అందచేయాలని కేంద్రంతో పాటు భారత వైద్య మండలి(ఎంసీఐ)కి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఫాతిమా వైద్య కళాశాల అనుమతులు రద్దయినందున విద్యార్థులకు అన్యాయం జరిగిందని, వీరిని 2017-18లో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేయాల్సిన అవసరముందని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకునేందుకు కళాశాలలు సుముఖంగా ఉన్నాయని ప్రభుత్వం తరపున న్యాయవాది గౌరవ్ బెనర్జీ తెలిపారు. విద్యార్థుల సర్దుబాటు తదితర వివరాలతో 2వారాల్లో అఫిడవిట్ సమర్పించాలని సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

రిజర్వ్‌డ్ కేటగిరీ సీట్లపై జీవో 550 నిలిపివేత

వైద్య ఆరోగ్య శాఖ, ఎన్టీఆర్ వర్సిటీ, నీట్ కన్వీనర్‌లకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతుడైన రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థికి కేటాయించిన సీటు ఖాళీ అయితే, ఆ సీటును రిజర్వ్‌డ్ కేటగిరీకే చెందిన మరో అభ్యర్థితోనే భర్తీ చేయాలంటూ 2001లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 550 పేరా 5(2) అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రమేశ్‌రామ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని జీవో 550 అమలును నిలుపుదల చేస్తున్నట్లు స్పష్టం చేసింది. జీవోపై కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ వైస్ చైర్మన్, రిజిస్ట్రార్, 2017 నీట్ కన్వీనర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 18కి వాయిదా వేస్తూ జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ తెలప్రోలు రజనీలతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. భర్తీ కాని ఎంబీబీఎస్ రిజర్వ్‌డ్ సీట్లను ప్రతిభావంతులైన ఇతర కేటగిరీ అభ్యర్థులకు కేటాయించేలా ఎన్టీఆర్ వర్సిటీని ఆదేశించాలని కోరుతూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఆకుల వెంకట హర్షవర్ధన్, మరో ఇద్దరు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది కంభంపాటి రమేశ్‌బాబు వాదనలు వినిపించారు. పిటిషనర్లు నీట్‌లో అర్హత సాధించారని, అయితే జీవో 550 నేపథ్యంలో పిటిషనర్ల కన్నా తక్కువ ర్యాంకు వచ్చిన వారు సీట్లు పొందారని తెలిపారు. ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందిన రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కొందరు తర్వాత రిజర్వ్‌డ్ కేటగిరీ సీట్లను ఎంచుకున్నారని, ఇలా ఖాళీ అయిన సీట్లను తిరిగి రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులతోనే భర్తీ చేస్తున్నారని నివేదించారు. జీవో 550 ద్వారా ఇలా చేస్తున్నామని అధికారులు చెప్పారన్నారు. సీట్ల భర్తీకి సంబంధించి అన్ని కేటగిరీల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని రమేశ్ రామ్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. అయితే జీవో 550 ఇందుకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో జీవో 550 పేరా 5(2) అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

అదును తప్పాక పదును!

▶ మొదటి పేజీ తరువాయి

సీజన్ ముగుస్తుంది. అక్టోబర్ నుంచి రబీ సీజన్ మొదలవుతుంది. అయినప్పటికీ ఖరీఫ్‌కు నిర్దేశించిన 40.47 లక్షల హెక్టార్లలో ఇప్పటికీ 29.07 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. అంటే 11.40 లక్షల ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం కురిసే వానలను పరిగణనలోకి తీసుకుని పంటలు వేసినా ఆ తర్వాత వానలు లేకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో రైతులు మెట్ట ప్రాంతాల్లో పంటలు వేసేందుకు వెనకాడుతున్నారు. కృష్ణా, గోదావరి డెల్టాల్లో మాగాణి విస్తీర్ణం మాత్రమే పెరగనుంది. గోదావరి డెల్టాలో ఇప్పటికే 95 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పడ్డాయి. కృష్ణా డెల్టాలో ఇప్పుడిప్పుడే నాట్లు ముమ్మరమవుతున్నాయి. కేసీ కెనాల్ కింద ఉన్న వైఎస్సార్, కర్నూలు జిల్లాలకు ఇంతవరకు చుక్క నీరు విడుదల కాలేదు.

పంటలకు తెగుళ్ల బెడద

అకాల వర్షాలతో పలు పంటలకు చీడపీడలు ఆశించినట్టు వ్యవసాయ శాఖ గుర్తించింది. కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి, అనంతపురం జిల్లాల్లో పత్తి పంటను గులాబీ రంగు పురుగు ఆశించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మిర్చి పంటకు రసం పీల్చే పురుగు సోకింది. అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో ఆకు ముడత, పచ్చపురుగు, వేరుపురుగు ఆశించింది. వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, కంది, మినుము, పెసర పంటలకూ వివిధ రకాల చీడపీడలు సోకాయి. కాగా, పంటలకు తెగుళ్లు సోకుతున్నా వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పత్తి విషయంలో తప్ప ఇతర పంటలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా	సాగు లక్ష్యం (హెక్టార్లలో)	ఈ నెల 30 నాటికి సాగైంది (హెక్టార్లలో)
శ్రీకాకుళం	2,38,930	2,10,194
విజయనగరం	1,92,080	1,19,666
విశాఖపట్టణం	1,93,267	1,19,214
తూర్పు గోదావరి	2,74,965	2,41,529
పశ్చిమ గోదావరి	2,70,035	2,36,027
కృష్ణా	3,30,765	3,10,917
గుంటూరు	4,96,185	3,87,571
ప్రకాశం	2,28,232	1,21,308
నెల్లూరు	77,400	35,133
చిత్తూరు	1,95,791	1,60,942
వైఎస్సార్	1,36,674	65,108
అనంతపురం	8,00,927	4,54,814
కర్నూలు	6,11,332	4,44,456
మొత్తం	**40,46,583**	**29,06,879**

కాగా, గత ఏడాది ఇదే సమయానికి 31,62,213 హెక్టార్లు సాగైంది. అంటే గత ఏడాది కంటే ఈ ఏడాది 2,55,334 హెక్టార్లు తక్కువగా సాగైనట్లు సీఎం డ్యాష్ బోర్డు స్పష్టం చేస్తోంది.

మీడియా ప్రతినిధులపై టీడీపీ నేతల దాడి

- మంత్రి అఖిలప్రియ సమక్షంలో ముష్టిఘాతాలు
- నలుగురు పాత్రికేయులకు గాయాలు
- మంత్రి క్షమాపణ చెప్పాలంటూ జర్నలిస్టుల ఆందోళన
- డీజీపీకి ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్ సంఘాలు



దాడి ఘటనపై మంత్రి అఖిలప్రియను నిలదీస్తున్న జర్నలిస్టులు

సాక్షి, గుంటూరు: మంత్రి అఖిల ప్రియ, నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్న కార్యక్రమాన్ని కవరేజ్ చేసేందుకు వచ్చిన వీడియో జర్నలిస్టులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గుంటూరు నగరంలో బుధవారం చోటుచేసుకుంది. దాడిలో నలుగురు వీడియో జర్నలిస్టులకు గాయాలయ్యాయి. మంత్రి అఖిల ప్రియ, నంద్యాల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కళ్లెదుటే దాడి జరుగుతున్నా నిలువరించలేకపోయారు. గుంటూరు నగరంలోని డొంకరోడ్డు నాలుగవ లైనులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ, నంద్యాల ఎమ్మెల్యే భూమ బ్రహ్మానందరెడ్డిలు వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని కవర్ చేయాలంటూ మీడియా ప్రతినిధులకు టీడీపీ ప్రచార కార్యదర్శి చిట్టిబాబు సమాచారం పంపారు. మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకుని కెమెరాలతో చిత్రీకరిస్తున్న సమయంలో టీడీపీ నేతలు తోపులాటకు దిగారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మీడియా ప్రతినిధులకు హుకుం జారీ చేశారు. 'మిమ్మల్ని ఎవరు పిలిచార్రా..?' అంటూ పత్రికలో రాయలేని భాషలో దుర్భాషలాడుతూ ముష్టిఘాతాలకు దిగడంతో జర్నలిస్టులంతా నిర్ఘాంతపోయారు. దీంతో నలుగురు వీడియో జర్నలిస్టులకు గాయాలయ్యాయి. దాడి ఘటనపై జర్నలిస్టులు మంత్రి అఖిల ప్రియ సమాధానం చెప్పాలంటూ నిలదీయగా మరోసారి రెచ్చిపోయిన టీడీపీ నేతలు వారిని దుర్భాషలాడుతూ నెట్టి వేశారు. దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు వీడియో జర్నలిస్టులు స్థానిక అరండల్‌పేట పోలీసుస్టేషన్‌కు వెళ్లగా సీఐ బందోబస్తులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. దాడిని జర్నలిస్టు సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. బాధ్యాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల కళ్లెదుటే జర్నలిస్టులపై దాడి జరుగుతుంటే నిలువరించకపోవడం దారుణం అని మండి పడ్డారు. గుంటూరు నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డీజీపీ సాంబశివరావును కలిసిన జర్నలిస్టు సంఘాల నేతలు దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డీజీపీ.. అర్బన్ ఎస్పీ విజయరావును ఆదేశించారు. సెప్టెంబరు 3వ తేదీన తన కార్యాలయానికి వచ్చి కలవాలని జర్నలిస్టు సంఘాల నేతలు, బాధిత వీడియో జర్నలిస్టులకు డీజీపీ సూచించారు.



ఈ ఒరిజినల్ జైలు బ్యాక్‌డ్రాప్‌తో సినిమా తీసుకో.. నీ బయోపిక్‌గా మిగిలిపోతుంది!



శ్రీవారి ఆలయం వెలుపల గవర్నర్ దంపతులు, అనిల్‌కుమార్ సింఘాల్, శ్రీనివాసరాజు

శ్రీవారి సేవలో గవర్నర్ దంపతులు

సాక్షి, తిరుమల: తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన ఆలయానికి విచ్చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో గవర్నర్ దంపతులకు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. గవర్నర్ వెంట సీవీఎస్‌వో రవికృష్ణ, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మొహంతి, రిసెప్షన్ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌లు ఉన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ దేవేంద్రగుప్తా తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

సాక్షి, తిరుమల: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్రగుప్తా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి వచ్చిన ఆయన తొలుత ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. తర్వాత శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం జస్టిస్ దేవేంద్రగుప్తాకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ప్రోటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ఉన్నారు.

రేపు ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల

సాక్షి, తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లకు సంబంధించి డిసెంబర్ కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుక్రవారం విడుదల చేయనుంది. అలాగే ప్రతినెలా మొదటి శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని కూడా తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఇందుకోసం భక్తులు 0877– 2263261 నంబర్‌ను సంప్రదించవచ్చు.

విలువలతో కూడిన జీవనం సాగించాలి

కమలానంద భారతి స్వామిజీ



భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కమలానందభారతీ స్వామిజీ

వెంకటగిరి రూరల్: ప్రతి ఒక్కరిలో దైవభక్తితో పాటు దేశభక్తి కూడా ఉండాలని, విలువలతో కూడిన జీవనం సాగించాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠాన పీఠం పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ సూచించారు. సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్రలో భాగంగా బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అమ్మపాళెం, కలపాడు, పాపమాంబపురం, కుప్పంపల్లి, టీడీ కండ్రిగ, గుండ్ల సముద్రం, రాధాకృష్ణపురం, విశ్వనాథపురం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భక్తి ఉద్యమం ద్వారా ఆలయాల పరిరక్షణ, గో సంరక్షణ, ఆదర్శ హిందూ కుటుంబ వ్యవస్థపై అవగాహన, మాతృభాష సంరక్షణ పెంపొందుతాయన్నారు. ప్రతి ఇంటా వేంకటేశ్వరస్వామిని పూజించాలని సూచించారు. అనంతరం టీటీడీ ముడుపులు, శ్రీనివాసుని చిత్రపటాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకుడు డామా శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మౌలిక వసతులకు రూ.4,848 కోట్లు

- 25 కేజీబీవీల్లో ఇంటర్ విద్య
- సర్వశిక్షా అభియాన్ పీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి గంటా



సర్వశిక్షా అభియాన్ పీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి గంటా

సాక్షి అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో తాగునీటితోపాటు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. విద్యాలయాల్లో మౌలిక వసతులకోసం యాన్యుటీ ప్రతిపాదికన రూ.4,848 కోట్లు ఖర్చు చేయనున్నామని, ప్రహరీ గోడలు, భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలకోసం వీటిని వెచ్చిస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాలకోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు అందిస్తున్నదని, అయినప్పటికీ ఇంకా లోపాలు ఉంటున్నాయంటూ.. ఎక్కడా అలాంటి సమస్య రానివ్వవద్దని సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్(పీవో)లకు మంత్రి సూచించారు. తనిఖీలు చేసి మౌలిక సదుపాయాల కొరతుంటే పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బుధవారం ఆయన సచివాలయంలోని తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఎస్ఏ పీవోలతో సమీక్ష జరిపారు. మధ్యాహ్న భోజనం కొన్నిచోట్ల నాణ్యత లేకుండా ఉందని, తన తనిఖీల్లోనూ ఇది వెల్లడైందని ఆయన చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనమందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 25 కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో(కేజీబీవీ) ఇంటర్ విద్యను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు పొందవచ్చన్నారు. కేజీబీవీల్లో నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ తప్పనిసరిగా అనుసరించాలన్నారు. పిల్లలు చదువుతోపాటు ఫిజికల్ లిటరసీపై దృష్టిపెట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కేజీబీవీకి ఐదు కంప్యూటర్లు అందజేస్తున్నామని, వీటిద్వారా కంప్యూటర్ విద్యను విద్యార్థినులకు అందించాలన్నారు. జాతీయస్థాయిలో ఏపీ ఎస్ఎస్ఏకి మూడో స్థానం రావడం పట్ల మంత్రి గంటా.. పీవోలకు అభినందనలు తెలిపారు. పశ్చిమగోదావరి, ప్రకాశంతోపాటు పలు జిల్లాల పీవోలు తమ కేజీబీవీ విద్యార్థులు వివిధ జాతీయ స్థాయి పోటీల్లో నెగ్గారని చెప్పడంతో.. వారికి సన్మాన కార్యక్రమాన్ని నవంబర్ 14న నిర్వహించాలని సమీక్షలో నిర్ణయించారు. పదిలోపు స్కూళ్లు పాడైన భవంతుల్లో నడుస్తున్నాయని గుంటూరు పీవో తెలపగా.. వెంటనే వాటిని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ భవనాల్లో విద్యనందించాలని మంత్రి సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఎస్ఎస్ఏ ఎస్పీడీ జి. శ్రీనివాసులుతోపాటు ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య మరణానికి అనుమతించండి

- చిన్నారిని కబళిస్తోన్న న్యూరో ఫైబ్రోమా
- రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యం
- ఆదుకోలేకపోతున్న ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ
- తల్లడిల్లుతున్న పేద తల్లిదండ్రులు
- మదనపల్లెలోని ఏడీజే కోర్టులో పిటిషన్ దాఖలు



ఏడీజే కోర్టు ఆవరణలో బాధిత చిన్నారితో తల్లిదండ్రులు

మదనపల్లె టౌన్: తమ బిడ్డ కారుణ్య మరణానికి అనుమతించాలంటూ ఓ తల్లితండ్రులు కోర్టును ఆశ్రయించిన దీనగాథ ఇది. చిత్తూరు జిల్లా కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పులగూరవాండ్లపల్లెకు చెందిన చేనేత కార్మికులు బొగ్గల చిన్నరెడ్డప్ప, సునీతలకు ముగ్గురు సంతానం. మొదటి సంతానం శృతిహాసిని(6)కు మెడ, వెన్నులో గడ్డలు వచ్చాయి. న్యూరో ఫైబ్రోమా వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. దీంతో ఉన్నదంతా ధారబోసి ప్రభుత్వ ఆస్పత్రితోపాటు తిరుపతి స్విమ్స్, బెంగళూరు ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. అయినా వ్యాధి నయం కాలేదు. రెండేళ్లక్రితం తిరుపతి స్విమ్స్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీద్వారా ఆపరేషన్ చేయించి గడ్డలు తొలగించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. కాళ్లూచేతులు చచ్చుబడిపోయి పూర్తిగా మంచానికే పరిమితమైంది. ఆపరేషన్ చేయించడానికి, మరింత మెరుగైన వైద్యం అందించడానికి రూ.5 లక్షలకుపైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అయితే చేనేత మగ్గం నేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి అంత ఆర్థికస్తోమత లేక తీవ్ర మనోవేదనతో కుమిలిపోతున్నారు. కనీసం బిడ్డకు మందులు, మాత్రలు కొనివ్వలేని దుస్థితిలో వారు పడుతున్న వేదన వర్ణనాతీతం. అదేసమయంలో రోజురోజుకు వ్యాధి తీవ్రతతో క్షీణిస్తున్న బిడ్డను చూసి వారు తల్లడిల్లిపోతున్నారు. దాతలెవరైనా ఆర్థిక సాయమందిస్తే ఆపరేషన్ చేయించి బిడ్డకు పునర్జన్మ ప్రసాదించుకోవాలన్న వారి ఆశా నెరవేరలేదు. ఈ పరిస్థితుల్లో బిడ్డకు వ్యాధి మరింత ముదరడంతో చేసేదిలేక కారుణ్య మరణానికి అనుమతివ్వాలంటూ బాలిక తల్లితండ్రులు మదనపల్లెలోని ఏడీజే కోర్టు న్యాయమూర్తి కేవీ మహాలక్ష్మిని మంగళవారం ఆశ్రయించారు. తీవ్రమైన నొప్పితో విలవిల్లాడుతూ.. నొప్పి భరించలేక తమ బిడ్డ పడుతున్న వేదనను చూడలేకపోతున్నామని వారీ సందర్భంగా కన్నీటి పర్యంతమయ్యారు.

ఉపయోగపడని ఎన్టీఆర్ వైద్యసేవ

తమకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డు ఉండేదని, ప్రస్తుతం ఆ కార్డుతో ఎన్టీఆర్ వైద్యసేవలు అందట్లేదని బాధితులు తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారుల్ని కలిసినా, ఆసుపత్రులకు వెళ్లినా కార్డు ఉపయోగపడదని చెపుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వారు కోరుతున్నారు.

ఉపరాష్ట్రపతి కార్యాలయానికి పీవీకే రామాచార్యులు!

సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శిగా పనిచేస్తున్న పీవీకే రామాచార్యులు ఉప రాష్ట్రపతి కార్యాలయానికి బదిలీపై వెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన స్థానంలో ఎవరిని నియమిస్తారన్న దానిపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. అనర్హత ఆరోపణలపై అసెంబ్లీ ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన కె.సత్యనారాయణ రావును తిరిగి ఆ బాధ్యతల్లో నియమించేందుకు ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళనతో ఆ స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే విషయంపైనా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఢిల్లీ అసెంబ్లీలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని అసెంబ్లీ కార్యదర్శిగా నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది.

అన్ని పత్రాలు ఒకే పీడీఎఫ్‌లో ఇవ్వాలి

జీఎస్టీ నమోదుపై రాష్ట్ర వాణిజ్య శాఖ సూచన

సాక్షి, అమరావతి: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నప్పుడు ఎదురవుతున్న సమస్యలకు రాష్ట్ర వాణిజ్య శాఖ పరిష్కారాన్ని సూచించింది. జీఎస్టీలో ట్రేడరుగా నమోదు చేసుకునే వారు వ్యాపార స్థల అద్దె అగ్రిమెంట్, ఎలక్ట్రిసిటీ బిల్లు లేదా మున్సిపల్ ప్రాపర్టీ ట్యాక్స్ లేదా ఇతర రశీదులను జత పరచాల్సి ఉంటుందని, అయితే ఆన్‌లైన్‌లో కేవలం ఒక రశీదు మాత్రమే అప్‌లోడ్ చేయడానికి అవకాశం ఉండటంతో రిజిస్ట్రేషన్ పొందడం కుదరట్లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని రాష్ట్ర వాణిజ్య శాఖ చీఫ్ కమిషనర్ జె.శ్యామలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి అద్దె కాగితాలు, కరెంట్ బిల్లు లేదా ప్రాపర్టీ ట్యాక్స్‌లను ఒకే పీడీఎఫ్ ఫైల్‌గా చేసి జత చేయాల్సిందిగా కోరారు.

బహుళ రంగాల్లో మైనారిటీల అభివృద్ధికి కార్యక్రమం

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎస్ దినేశ్ కుమార్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మైనారిటీలు అధికంగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లోని వారి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బహుళ రంగాల్లో అభివృద్ధి (మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమంలో భాగంగా మైనారిటీల సంక్షేమంపై ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం బుధవారం సీఎస్ అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వం 2008లో బహుళ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. దీని ద్వారా మైనారిటీలకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వృత్తి నైపుణ్యం పెంపొందించడం, ఆరోగ్యం, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చడం, పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారులు, తాగునీరు వసతి కల్పించడం, ఆదాయ వనరులు సమకూర్చడం వంటి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 500 అంగన్‌వాడీ కేంద్రాలు, బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్సు, మైనారిటీ జూనియర్ కళాశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. గత ఏడాది ఈ కార్యక్రమం కింద రూ. 73 కోట్లు మంజూరు కాగా వాటిలో రూ. 47 కోట్లు విడుదల చేసి రూ. 23 కోట్లకు వినియోగ పత్రాలు సమర్పించినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కాకినాడ ఎన్నికల్లో ఓటు గల్లంతైందని ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధితుడు



సాకల నానాజీ

కాకినాడ క్రైం: ఓటర్ జాబితాలో పేరు గల్లంతవ్వడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో చోటుచేసుకుంది. పోర్టు పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ సంజయ్‌నగర్‌కు చెందిన సాకల నానాజీ(29) లారీ క్లీనర్‌గా పనిచేస్తుంటాడు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మంగళవారం పోలింగ్ స్టేషన్‌కి వెళ్లగా జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందాడు. మనోవేదనతో రాత్రి భోజనం కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య వేసుకునే మాత్రలను మోతాదుకు మించి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు. ఓటు గల్లంతు కావడాన్ని అవమానంగా భావించి ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు బాధితుడి భార్య దీపిక తెలిపింది. ఘటనపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నపత్రం అమ్మేసిన ప్రొఫెసర్!?

- ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు
- రూ.8 లక్షలకు ప్రశ్నపత్రం విక్రయించినట్లు ఆరోపణలు

సాక్షి, విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆరు నెలల కిందట నిర్వహించిన అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు పోస్టుల భర్తీలో ఆశ్చర్యం గొలిపే అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షలకు రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లోని సీనియర్ ప్రొఫెసర్లతో ప్రశ్నపత్రాల (పేపర్ సెట్టింగ్)ను రూపొందించడం రివాజు. ఈ అంశాన్ని సర్వీస్ కమిషన్ గోప్యంగా ఉంచుతుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 21 అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు (గ్రౌండ్‌వాటర్ విభాగం) పోస్టుల నియామకానికి ఏపీపీఎస్సీ 11/2016, 12/2016 నంబర్లతో నోటిఫికేషన్ విడుదలచేసింది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రం రూపొందించే బాధ్యతను విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగానికి అప్పగించింది. ఈ పరీక్షలను ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించింది. ఫలితాలను ఏప్రిల్లో విడుదల చేసింది. అభ్యర్థులకు ఇంటర్వ్యూలను మే నెలలో నిర్వహించి జూన్‌లో నియామకాలు జరిపింది. ఈ నియామకాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగానికి చెందిన ఇద్దరు పరిశోధక విద్యార్థులు ఈ ఉద్యోగాలు పొందారు. వీరిలో ఒకరు ఈ పరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించినట్టు చెబుతున్న జియాలజీ ప్రొఫెసర్ సుబ్బారావు వద్ద స్కాలర్ కాగా, మరో విద్యార్థి కూడా అదే విభాగంలో స్కాలరే. వీరికి ఇతర అభ్యర్థులకంటే అత్యధిక మార్కులు రావడంతో ప్రతిభ ఆధారంగా వీరి నియామకాలు చేపట్టినట్టు పేర్కొనడంతో తోటి అభ్యర్థుల్లో అనుమానాలు వెల్లువెత్తాయి. తీరా ఆరాతీయడంతో సదరు ప్రొఫెసర్ రూపొందించిన ప్రశ్నపత్రం ముందుగా లీకవ్వడం వల్లే ఆ విభాగంలోని స్కాలర్లు ఈ ఉద్యోగాలు పొందారన్న భావనకు వచ్చారు.

భారీగానే చెల్లింపులు

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ ప్రశ్నపత్రం లీకు చేసినందుకు రూ.8 లక్షలు చెల్లించారని తెలిసింది. ఒకరిద్దరికి ఈ ప్రశ్నపత్రాన్ని విక్రయించే ఒప్పందం కుదరగా వారు తమకు అత్యంత సన్నిహితంగా, నమ్మకంగా ఉండే ఇతర ప్రాంతాల్లోని అభ్యర్థులకు కూడా చేరవేసినట్టు తెలిసింది. దీంతో ఏయూలోని ఇద్దరు జియాలజీ స్కాలర్లతో పాటు మిగతా ప్రాంతాల్లో ఎంపికైన వారిలో ఇంకొందరు ఉన్నారని అంటున్నారు. అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టులుగా నియమితులైన ఏయూ స్కాలర్లలో ఒకరు చిత్తూరు, మరొకరు గుంటూరు జిల్లాలో ఉద్యోగాలు చేస్తున్నారు. మరోవైపు ప్రొఫెసర్ వద్ద స్కాలర్‌గా ఉంటూ ఈ ఉద్యోగం పొందిన వ్యక్తి గతంలో ఇంతకన్నా చిన్న ఉద్యోగమైన టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగానికీ అర్హత సాధించలేకపోవడాన్ని కొందరు ఉదహరిస్తున్నారు. ఏయూ కేంద్రంగా జరిగిన ఈ కుంభకోణంపై కొంతమంది అభ్యర్థులు, స్కాలర్లు ఇటీవల ఏపీపీఎస్సీకి ఫిర్యాదుచేశారు. దీనిపై ఏపీపీఎస్సీ అధికారులు ఇంటిలిజెన్స్ విభాగంతో విచారణకు ఆదేశించినట్టు సమాచారం. రంగంలోకి దిగిన ఇంటిలిజెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నట్టు తెలిసింది.

ఆ విషయం నాకు తెలియదు

ఈ వ్యవహారంపై ఏయూ జియాలజీ విభాగాధిపతి నాగేశ్వరరావును 'సాక్షి' సంప్రదించగా ఈ విషయం తనకు తెలియదన్నారు. ఒకవేళ ఏపీపీఎస్సీ ఏదైనా పరీక్షకు ప్రశ్నపత్రం తయారు చేసే బాధ్యతను యూనివర్సిటీ ప్రొఫెసర్లకు అప్పగించినా దానిని రహస్యంగా ఉంచుతుందని చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ సుబ్బారావును వివరణ కోరగా ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని చెప్పారు.

కాపు ఉద్యమానికి 3 నెలల విరామం

ముద్రగడ పద్మనాభం వెల్లడి

- బీసీ జాబితాలో చేర్చడానికి చంద్రబాబుకు డిసెంబర్ 6 వరకూ గడువు
- అసెంబ్లీ తీర్మానం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్
- లేకుంటే నిరసనలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక
- కాపు జేఏసీ భేటీలో నిర్ణయం



విలేకరులతో మాట్లాడుతున్న ముద్రగడ. చిత్రంలో కాపు నేతలు

జగ్గంపేట: కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు సర్కారుకు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మరో అల్టిమేటమ్ ఇచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి అయిన డిసెంబర్ 6 వరకు ఉద్యమానికి విరామం ప్రకటిస్తున్నామని, ఈలోగా కాపులను బీసీల జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు ఊహకందని విధంగా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో బుధవారం రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన కాపు జేఏసీ నేతలతో కీలక సమావేశం నిర్వహించిన అనంతరం ముద్రగడ మీడియాతో మాట్లాడారు. జేఏసీ పెద్దల సూచనలకు అనుగుణంగా తదుపరి ఉద్యమం ఉంటుందన్నారు. మూడు నెలలు ఉద్యమానికి విరామం ప్రకటిస్తున్నామని, ఈలోగా కాపులను చైతన్య పరిచేందుకు నియోజకవర్గ లేదా జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సీఎం చంద్రబాబు కాపులపై చిన్నచూపు మానుకుని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధిని ప్రదర్శించాలన్నారు. ఆనాడు కాపులకు రిజర్వేషన్లు తొలగింపునకు అడ్డు చెప్పిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి వరకు ముఖ్యమంత్రికి గడువు ఇస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనపై నమ్మకంతో అసెంబ్లీకి ఆయనకే ఓటు వేశానని అందుకే ఆయనిచ్చిన హామీపై బల్ల గుద్ది అడుగుతున్నానన్నారు. రాజకీయంగా చంద్రబాబు కంటే తానే సీనియర్‌నని, మూడు నెలల్లోగా సీరియస్‌గా ఆలోచించి తమకిచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

మీరే తెలివైనవారనుకుంటే పొరపాటే...

చంద్రబాబు తెలివైన వారనుకుంటున్నారని, ఆయనకంటే తెలివైన వారుంటారని, గర్వం తగ్గించుకుని తప్పులను సరిచేసుకోవాలని ముద్రగడ సూచించారు. అవమాన పరచడం, పోలీసులు కాపలా, అణచివేత ధోరణి మానుకోవాలన్నారు. జిల్లా పర్యటనల ద్వారా తమ జాతిని చైతన్య పరుస్తామని, హామీ అమలు చేయకపోతే ఎక్కడ స్విచ్ ఆపాలో తమకు తెలుసునని అన్నారు. 2019లో ఎన్నికలు వస్తున్నాయని, ఆ విషయం గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేంద్రంలో ఆమోదం పొందేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. తప్పుడు సమాచారంతో పక్కదారి పట్టిస్తున్న ఇంటెలిజెన్స్ బాస్‌ను మార్చుకోవాలని, అలాగే ముఖ్యమైన పోస్టుల్లో ఓ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించుకొని కక్ర పెత్తనం చేయించడం మానుకోవాలని సూచించారు.

పోలీసులు అడిగితే సంతకాలు పెట్టొద్దు

''కాపు రిజర్వేషన్లకోసం పోరాటం సాగిస్తున్నాం. ఏ విధమైన నష్టం లేకుండా పాదయాత్ర చేపట్టి చూపించాం. అయినా ఆధార్‌కార్డు ఇవ్వాలని, సంతకం పెట్టాలని పోలీసులు వేధిస్తున్నట్టు తెలిసింది. పోలీసులడిగినా సంతకం పెట్టవద్దు. స్టేషన్‌కు ఎవరిని పిలిచినా వెంట జేఏసీ నాయకులు వెళ్లాలి, అవసరమైతే నేను వస్తాను'' అని కాపు జేఏసీ నాయకులనుద్దేశించి ముద్రగడ స్పష్టం చేశారు. 'మీ అభిప్రాయాలు ఆలకించాను.. పాదయాత్రకు విరామం ఇవ్వాలని, మండల, నియోజవర్గ, జిల్లా స్థాయి, ఢిల్లీ జంతర్ మంతర్ స్థాయిలో నిరసనలు, బస్సు యాత్ర చేయాలన్న మీ సూచనలు తప్పక పాటిద్దాం. ఇందుకనుగుణంగా కార్యాచరణ రూపొందిద్దాం' అని ఆయన అన్నారు. తొలుత చంద్రబాబుకు హామీ నెరవేర్చేందుకు మూడు నెలల గడువిద్దామని, ఈలోగా నియోజకవర్గ సమావేశాలు పూర్తి చేద్దామని చెప్పారు. అసెంబ్లీ తీర్మానం తరువాత ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుద్దామని ఆయన అన్నారు. సమావేశంలో కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు, ఆరేటి ప్రకాశ్, గౌతు స్వామి, కలవకలను తాతాజీ, కాపు నాయకులు నల్లా పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యుత్ సంస్థకు విద్యుత్ గణాంక దర్శిని

అందజేసిన నీతి ఆయోగ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ గణాంకాలను లెక్కించేందుకు వీలుగా నీతీ ఆయోగ్, రాష్ట్ర ఇంధనశాఖకు స్టేట్ లెవల్ ఎనర్జీ క్యాలిక్యులేటర్ (విద్యుత్ గణాంక దర్శిని)ను అందించింది. దీనిపై బుధవారం విజయవాడలో ఓ వర్క్‌షాప్ జరిగింది. 2050 వరకు రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, లభ్యత, థర్మల్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు అవసరాలు, విద్యుత్ వ్యవస్థ విస్తరణ తీరుతెన్నులను క్యాలిక్యులేటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐసీఎఫ్' దీన్ని రూపొందించింది. ఎక్సెల్ ఫార్మాట్‌లో ఉండే ఈ సాఫ్ట్‌వేర్‌ను తేలికగా ఉపయోగించుకునే వీలుందని ఇంధనశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ సలహాదారు రంగనాథం, ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి, నీతి ఆయోగ్ సలహాదారు రంజిత్‌రాం, హైదరాబాద్‌లో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రాఫ్లేమింగ్ పాల్గొన్నారు.

సాక్షి
గురువారం, ఆగస్టు, 31

'డోక్లామ్' సుఖాంతం

దాదాపు 75 రోజుల తర్వాత భారత్–చైనాల మధ్య భారత్–భూటాన్–చైనా సరిహద్దుల కూడలిలో తలెత్తిన వివాదం సద్దుమణిగింది. అయితే ఇదంత సజావుగా ఏమీ పూర్తి కాలేదు. ఇరు దేశాల మధ్య దౌత్య స్థాయిలో సాగిన సంభాషణల పర్యవసానంగా రెండు పక్షాలూ దళాలను ఉపసంహరించుకోవాలన్న నిర్ణయం జరిగిందని మన విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన పని ప్రారంభమై కొనసాగుతున్నదని చెప్పింది. కానీ చైనా విదేశాంగ శాఖ మాత్రం భారత దళాలు తిరిగి తమ సరిహద్దులకు మళ్లాయని, చైనా దళాలు వివాదాస్పద ప్రాంతంలో కొనసాగుతాయని ప్రకటించి గందరగోళంలో పడేసింది. ఇరుగుపొరుగు దేశాల మధ్య వివాదాలు తలెత్తడం, అవి కొనసాగుతున్న సమయంలో మాటల తీవ్రత పెరగడం సహజమే. అవి సద్దుమణిగే క్రమంలో సైతం ఆ తీవ్రత ఎంతో కొంత కొనసాగుతుంది. ముఖ్యంగా వీరావేశంతో మాట్లాడినవారు వెనక్కి తగ్గే క్రమం కొంత భిన్నంగా ఉంటుంది. డోక్లామ్ వివాదం మొదలైన దగ్గరనుంచీ మన దేశం సంయమనంతోనే మాట్లాడింది. సమస్యపై సైన్యం స్థాయిలోనూ, దౌత్య స్థాయిలోనూ చర్చలు కొనసాగుతాయని, త్వరలోనే వివాదం సమసిపోతుందని మన విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గత నెల జూలైలో విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ రెండు దేశాలూ తమ తమ సైన్యాలను వెనక్కి పిలిపించుకుని, అటుమీదట చర్చలు ప్రారంభించాలని ప్రతిపాదించారు. కానీ ఈ ప్రకటనలన్నిటికీ చైనా వైపునుంచి దూకుడే జవాబైంది. 1962నాటి అనుభవాలు మర్చిపోవద్దని హెచ్చరించడంతో మొదలుపెట్టి రెండు దేశాల సైనిక వ్యయం, జీడీపీ, రక్షణ సామర్థ్యం వగైరాల మధ్య పోలిక తెచ్చి మీరు అన్నివిధాలా తీసికట్టని చెప్పడం వరకూ అందులో ఎన్నో ఉన్నాయి. ఎలాంటి చర్చలు జరగాలన్నా ముందు భారత్ బేషరతుగా అక్కడినుంచి వెనక్కి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. దళాల ఉపసంహరణ విషయంలో అంగీకారానికొచ్చాక కూడా ఈ ధోరణి పోలేదు. అందుకే ఉపసంహరించుకున్నది భారత్ మాత్రమే తప్ప తాము కాదంటోంది. దీన్నుంచి గుణపాఠం తీసుకోవాలని హితవు చెబుతోంది. సరిహద్దుల్లో యథాతథంగా తమ దళాల గస్తీ కొనసాగుతుందని చెప్పింది. చైనా దళాలు సరిహద్దుల్లో గస్తీ కాస్తే భారత్‌కు అభ్యంతర ఉండాల్సిన పనిలేదు. ఆ సరిహద్దును వదిలి 2012 సరిహద్దు ఒప్పందాన్ని ఉల్లంఘించి డోక్లామ్ పీఠభూమి వరకూ రహదారిని పొడిగించడానికి చైనా ప్రయత్నించడమే వివాదానికి కారణం. చైనా రోడ్డు పనుల్ని నిలిపేసిందని, అక్కడి సామగ్రిని, దళాలను తరలించిందని ఇప్పటికే వెల్లడైంది. ఇతరత్రా మాటలన్నీ భారత్ కంటే చైనా జనాన్నుద్దేశించి చేసినవే. తీవ్ర పదజాలంతో ప్రకటనలు చేశాక ఇవన్నీ తప్పనిసరి.

త్వరలో చైనా రాజధాని బీజింగ్‌లో జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లడానికి ఈ దళాల ఉపసంహరణ నిర్ణయం ఎంతో దోహదపడింది. ఆ సదస్సుకు మోదీ వెళ్లకపోతే చైనాపై బ్రిక్స్‌లోని ఇతర సభ్య దేశాల్లో సందేహాలు తలెత్తుతాయి. బ్రిక్స్‌లో చైనా తర్వాత భారత్ ఆర్థిక వ్యవస్థే పటిష్టంగా ఉంది. ఈ రెండు దేశాలూ సరిహద్దు సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటేనే బ్రిక్స్ వంటి సంస్థలు సమర్థవంతంగా పనిచేయగలవని ఆమధ్య రష్యా అధ్యక్షుడు పుతిన్ అభిప్రాయపడ్డారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే చైనా తన దూకుడు ధోరణిని తగ్గించుకున్నదని కొందరు చెబుతున్నారు. అయితే తాజా పరిణామాలకు ఇతర కారణాలు కూడా ఉన్నాయి. చైనా సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ)ను ప్రక్షాళన చేయాలని గత కొంతకాలంగా చైనా అనుకుంటోంది. ముఖ్యంగా ఉన్నతస్థాయి సైనికాధికార వ్యవస్థను చక్కదిద్దాలని, దళాల సామర్థ్యాన్ని పెంచేలా పునశ్చరణ కార్యక్రమాలు మొదలుపెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా వైమానిక, నావికాదళాల సామర్థ్యం మరింత మెరుగుపరచాలని చైనా నాయకత్వం అనుకుంటోంది. మరోపక్క అక్టోబర్‌లో చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ కాంగ్రెస్ జరగాల్సి ఉంది. భారత్‌తో యుద్ధం వచ్చి ఆ సమయానికి తేలకపోతే రాజకీయంగా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు అది ఇబ్బందికరం. మరోపక్క పొరుగునున్న ఉత్తర కొరియాకు అమెరికాతో తలెత్తిన వివాదం ఒక కొలిక్కి రాలేదు. అంచనాలకు దొరక్కుండా క్షిపణి పరీక్ష ద్వారానో, అణు పరీక్ష ద్వారానో అమెరికాను కవ్విస్తున్న కిమ్ వల్ల ఆ ప్రాంతంలో ఎప్పుడేమవుతుందో తెలియదు. ఇలాంటి తరుణంలో భారత్‌తో ఘర్షణకు దిగి శక్తియుక్తులన్నీ దానిపైనే కేంద్రీకరించడం వల్ల సమస్య అవుతుందని చైనాకు అనుమానాలున్నాయి. వచ్చేది శీతాకాలం కావడంతో డోక్లామ్ పీఠభూమి ప్రాంతం చైనా దళాల కదలికకు అనువుగా ఉండదు. భారత దళాలకు అది అలవాటైన ప్రాంతం.

యుద్ధం దేనికీ పరిష్కారం కాదు. అది ప్రారంభించడం తేలిక. గౌరవప్రదంగా దాన్నుంచి బయటకు రావడం అంత సులభం కాదు. ప్రత్యర్థి పక్షంపై మొదట వేసుకున్న అంచనాలు తలకిందులవుతున్నాయని తెలిసినప్పుడు మరింత దూకుడుగా ముందుకెళ్లాలి తప్ప వెనక్కిరావడం కుదరదు. ఉన్నకొద్దీ ఇది తీవ్రమవుతున్నదనుకుంటే ఎవరో ఒకరి మధ్యవర్తిత్వం కోసం అర్రులు చాచటం తప్ప గత్యంతరం ఉండదు. అందుకు భిన్నంగా వివాదం తలెత్తిన పక్షంతో చర్చించడం ప్రారంభిస్తే తన వైఖరిలోని సహేతుకతను చెప్పవచ్చు. ఒప్పించే ప్రయత్నాలు చేయొచ్చు. పరస్పర అవగాహన సాధ్యమవుతుంది. ప్రపంచ దేశాల్లో పరిణతితో వ్యవహరించిన ఖ్యాతి దక్కుతుంది. సంక్షోభం తలెత్తినప్పుడు సంయమనం పాటించడం, ఓపికతో వేచి ఉండటం అవసరం. అది అర్థం చేసుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, కొందరు వ్యక్తులు అత్యుత్సాహంతో వ్యాఖ్యలు చేశారు. వీటన్నిటికీ అతీతంగా ఆచితూచి వ్యవహరించినందుకు ప్రభుత్వాన్ని అభినందించాలి. ఇదే స్ఫూర్తితో చైనాతో ఉన్న ఇతర వివాదాల విషయంలోనూ పరిష్కారాన్ని సాధిస్తుందని ఆశిద్దాం.



సుస్థిర శాంతి సైనిక పరిష్కారాలతో సాధ్యంకాదు. చర్చలు, దౌత్యం మాత్రమే అందుకు హామీ ఇస్తాయి.

మార్టిన్ మెక్‌గిన్నిస్
(ఐర్లాండ్ రాజకీయవేత్త)

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.దశమి పూర్తి(24గంటలు), నక్షత్రం మూల తె.4.52 వరకు(తెల్లవారితే శుక్రవారం), తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం తె.3.04 – 4.54 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం ఉ.9.56– 10.46 వరకు, తదుపరి ప.2.54– 3.44 వరకు, అమృతఘడియలు రా.9.45 నుంచి 11.31 వరకు

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.16
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	4.48	మగ్రీబ్	6.31
జొహర్	12.16	ఇషా	7.44
అసర్	4.42		

వ్యక్తిగత స్వేచ్ఛకు కొత్త రెక్కలు



మల్లెపల్లి లక్ష్మయ్య

కొంతకాలంగా ప్రజల ఆహారపుటలవాట్లు, మత స్వేచ్ఛ, నివాస స్వేచ్ఛ, వనరులను కలిగి ఉండే స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛలపై జరుగుతున్న దాడులకు పరోక్షంగా సుప్రీంకోర్టు సమాధానమిచ్చింది. గోసంరక్షణ పేరుతో ఇతర వర్గాలపై దాడులకు తెగబడటం, తమకు నచ్చని ఆహారాన్ని తింటున్న వారిపై హత్యాకాండకు పాల్పడటం చూస్తున్నాం. స్వేచ్ఛగా చర్మవృత్తి చేసుకొంటున్న వారిపైనా, గోమాంసాన్ని విక్రయిస్తున్న వారిపైనా దాడులు చేయడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనన్న సందేశాన్ని సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చింది.

కొత్త కోణం



'వాస్తవానికి ప్రజాభిప్రాయాల వ్యక్తీకరణకు ప్రతిబింబమే ప్రభుత్వాలు. మన వెనుక ఉన్న ప్రజల శక్తే మనందరినీ ఇక్కడ సమావేశపరిచింది. మనం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలే కానీ పార్టీల, వర్గాల రాజకీయాల కోసం కాదు. ప్రజల మనసుల్లో ఏమి ఉందో గ్రహించి, వాటికనుగుణంగా పనిచేయాలి.' భారత రాజ్యాంగ సభ ప్రారంభ సమావేశంలో 1946, డిసెంబర్ 13వ తేదీన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్య ప్రకటనలోని వాక్యాలివి. రాజ్యాంగ సభ ప్రారంభమైన నాలుగవ రోజునే నెహ్రూ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్ చిత్రాన్ని నిర్దేశించింది. ఇటీవల భారత సుప్రీంకోర్టు వ్యక్తిగత స్వేచ్ఛపైన ఇచ్చిన తీర్పుకు జవం, జీవం ఎక్కడో లేదు. రాజ్యాంగ సభ అందించిన అపారమైన, లోతైన ఆ అవగాహనే ఆ తీర్పుకు పునాది. రాజ్యాంగ సభ దాదాపు మూడేళ్ల పాటు సుదీర్ఘంగా జరిపిన వివేకవంతమైన చర్చలే ఈరోజు ప్రజలకు హక్కులుగా సంక్రమించాయి.

రాజ్యాంగమే సర్వోన్నతం

సుప్రీంకోర్టు గత గురువారం వెలువరించిన తీర్పులో రాజ్యాంగం విశిష్టతను ధర్మాసనం సమున్నతంగా అభివర్ణించింది. భారత రాజ్యాంగం సజీవమైన, శక్తిమంతమైన కలకాలం చరిత్రలో నిలువగలిగే గొప్ప గ్రంథమని కూడా కొనియాడింది. నెహ్రూ ప్రతిపాదించిన తీర్మానం మొదలుకొని, రాజ్యాంగం సంపూర్ణ పాఠాన్ని సభకు అందించే వరకు జరిగిన చర్చలే ఇప్పటికీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతున్నాయి. రాజ్యాంగ సారాన్ని గమనిస్తే ప్రజల జీవనం, సంక్షేమం, భద్రత, ప్రగతి లాంటి అంశాలపైనే ఎక్కువగా చర్చ జరిగిన సంగతి అర్థమవుతుంది.

రాజ్యాంగ సభ ప్రారంభంలో నెహ్రూ ప్రతిపాదించిన తీర్మానంలోనే 'అణగారిన, వెనుకబడిన కులాలు, ఆదివాసులు, మైనారిటీల రక్షణకు రాజ్యాంగంలో హక్కులు పొందుపరుస్తాం.' అని హామీ ఇచ్చారు. దేశ ప్రజలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని అందించడం, అందరికీ సమాన అవకాశాలు, సమాన హోదాతో పాటు చట్టం ముందు అందరూ సమానులేనని, రాజ్యాంగంలో అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భావ ప్రకటన, మత, ఉద్యోగ, నివాసం, సంఘం పెట్టుకునే స్వేచ్ఛను కల్పించాలని కూడా స్పష్టం చేశారు. ఆ తీర్మానం వెలుగులోనే బాబాసాహెబ్ అంబేడ్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. రాజ్యాంగంలోని ప్రకరణాలలో మూడు, నాలుగు భాగాలు ముఖ్యమైనవి. మూడోభాగంలో ప్రాథమిక హక్కులను, నాలుగో భాగంలో ఆదేశిక సూత్రాలను చేర్చారు.

చర్చంతా ఆర్టికల్ 21 పైనే

ఆధార్ అంశం మీద సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సాంకేతికంగా ఆ కార్డు వినియోగం విషయమే అయినప్పటికీ, చర్చంతా ప్రధానంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21పైన జరిగింది. ఈ ఆర్టికల్ వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవంతో జీవించే హక్కులకు హామీ ఇస్తున్నది. ఏ ఒక్క వ్యక్తి స్వేచ్ఛనైనా ప్రభుత్వం హరించదలుచుకుంటే చట్టపరమైన అన్ని సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుందని ఆ ఆర్టికల్ స్పష్టం చేసింది. ఈ ఆర్టికల్ పైన రాజ్యాంగ సభలో జరిగిన చర్చను గమనిస్తే వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవంతో జీవించే హక్కుల గురించి నాటి న్యాయ నిపుణులు ఎంతటి శ్రద్ధ వహించారో అర్థం చేసుకోవచ్చు. 1948 డిసెంబర్ 6, 13 తేదీల్లో రాజ్యాంగ సభలో జరిగిన సుదీర్ఘమైన చర్చ ప్రతిఫలమే ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుగా భావించవచ్చు. ఈ చర్చలో సెంట్రల్ ప్రావిన్స్ నుంచి కాజీ సయ్యద్ కరీముద్దీన్, మద్రాస్ నుంచి మహబూబ్ అలీబేగ్ సాహెబ్ బహద్దూర్, పంజాబ్ నుంచి పండిట్ ఠాకూర్ దాస్ భార్గవ, సౌరాష్ట్ర నుంచి చిమన్‌లాల్ చిక్కూ బాయ్‌షా, యునైటెడ్ ప్రావిన్సెస్ నుంచి శ్రీకృష్ణచంద్ర శర్మ, బొంబాయి నుంచి హెచ్‌వి పటాస్కర్, కె.యం. మున్షీ, అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్, జడ్‌హెచ్ లారి, డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ పాల్గొన్నారు.

ముఖ్యంగా ఈ చర్చలో ప్రభుత్వాలు ప్రజల స్వేచ్ఛకు సంబంధించి వ్యవహరించే తీరుపైన అనుమానాలను వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి ప్రజలకు ఎన్నో హామీలను, వాగ్దానాలను ఇస్తూ ఉంటాయనీ, ఆచరణలో విఫలమైనప్పుడు ప్రజల్లో చెలరేగే నిరసనలను అణచిపెట్టడానికి ప్రజల స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తుంటారనీ, అందువల్ల రాజ్యాంగంలో వ్యక్తిస్వేచ్ఛకు జీవన భద్రతకు స్పష్టమైన గ్యారంటీ ఉండాలనీ రాజ్యాంగ సభ సభ్యులు సుస్పష్టంగా మాట్లాడారు. ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ప్రజల హక్కులు ఆధారపడి ఉండకూడదని, అది ఎప్పటికైనా వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాదకరమేనని ఆనాడే న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై డాక్టర్ అంబేడ్కర్ సమాధానమిస్తూ ప్రభుత్వాలు ఏ విధానాలు అవలంబించినా చట్టసభల్లో శాసనాలు చేసినా వాటిని సమీక్షించే బాధ్యత, ప్రభుత్వాల పనితీరు రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక విలువలకు అనుగుణంగా ఉందా లేదా అని తేల్చే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసం కొన్నిసార్లు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక సూత్రాలను మర్చిపోయి ప్రవర్తిస్తున్నప్పుడు వారిని అదుపుచేసే అధికారం న్యాయస్థానాలకు ఉండాలని కూడా అంబేడ్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగం అందించే విలువలు ప్రభుత్వ పాలనలో భాగంగా ఉన్నాయా, లేవా అనే అంశాన్ని కూడా న్యాయస్థానాలు నిత్యం పరిశీలించాలని కూడా అంబేడ్కర్ స్పష్టం చేశారు.

వ్యక్తి స్వేచ్ఛకే పెద్ద పీట

వ్యక్తి స్వేచ్ఛకూ, సామాజిక ప్రయోజనానికీ మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు వ్యక్తి స్వేచ్ఛ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. సమాజానికి ప్రాధాన్యం పెరిగి, వ్యక్తి ప్రయోజనాలు అప్రధానమైనప్పుడు రాజ్యాంగం అనుసరించాల్సిన విధానాలను కూడా ఆ రెండురోజుల చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. అప్పుడు కూడా సాధ్యమైనంత వరకు వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలగకుండా రాజ్యాంగం హామీ యివ్వాలనే నిపుణులు అభిప్రాయపడ్డారు. అందువల్లనే ఈ రోజు ఏ వ్యక్తి ఆస్తికి గానీ, ప్రాణానికి గానీ, జీవన భద్రతకు గానీ భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించడం చూస్తున్నాం. సరిగ్గా ఇదే విషయం ఆధార్ వివాదంలో సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించిన తీర్పులో చూడవచ్చు. సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పులోని కొన్ని భాగాలను పరిశీలిస్తే రాజ్యాంగం విశిష్టత, రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి అర్థం కాగలవు. ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 రాజ్యాంగానికి హృదయ కవాటాల్లాంటివని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, గౌరవప్రదమైన జీవితం ప్రధానమైన రాజ్యాంగ విలువలని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే వ్యక్తిగత జీవితాల్లోకి రాజ్యంగానీ, మరేయితర సంస్థలుగానీ, వ్యక్తులుగానీ చొరబడకుండా రాజ్యాంగం తగు రక్షణలు కల్పించిందని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. అందుకనుగుణంగానే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛకు హామీ పడుతున్నాయని తేల్చి చెప్పింది. ఆర్టికల్ 14 నుంచి, ఆర్టికల్ 35 వరకు కల్పించిన హక్కులను పరిశీలిస్తే రాజ్యాంగ నిపుణులు వ్యక్తిగత స్వేచ్ఛపట్ల చూపిన ముందుచూపు, శ్రద్ధ అర్థం అవుతుంది. చట్టం ముందు అందరినీ సమానంగా పరిగణించాలని, సమానత్వ హక్కును ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజ్యం నిరాకరించకూడదని ఆర్టికల్ 14 పేర్కొంటున్నది. కాగా, కుల, మత, జాతి, ప్రాంత, లింగ వివక్షలను నిషేధించాలని ఆర్టికల్ 15 స్పష్టం చేసింది. పబ్లిక్ స్థలాలైన హోటళ్లు, రెస్టారెంట్లు, పాఠశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ వివక్షారహితంగా ఉంచాలని ఆదేశిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగాల్లో సమానావకాశాల్ని కల్పించాలని, ఇందులో ఎటువంటి వివక్ష పాటించకూడదని ఆర్టికల్ 16 నిర్దేశిస్తున్నది. సమాజానికీ, ఊరికీ దూరంగా తరిమివేసిన అస్పృశ్యులను సంఘంలో సభ్యులుగా గుర్తించడానికి హామీనిస్తూ ఆర్టికల్ 17 ద్వారా రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. ఆర్టికల్19లో వ్యక్తిగత స్వేచ్ఛను మరింత విస్తృతంగా రాజ్యాంగం నిర్వచించింది. అందులో భావప్రకటనా స్వేచ్ఛ, సమావేశపు హక్కు, సంఘ నిర్మాణం లాంటి కార్యక్రమాలకు స్వేచ్ఛనిస్తూనే దేశంలో ఎక్కడైనా జీవించే హక్కును, నివాసం ఉండే హక్కును, తనకు ఇష్టమైన ఉపాధిని పొందే హక్కును, వ్యాపారాన్ని నిర్వహించే హక్కును రాజ్యాంగం కల్పించింది.

బడుగులకు గొంతునిచ్చిన రాజ్యాంగం

ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత స్వేచ్ఛను పకడ్బందీగా పొందుపర్చడం వల్ల భారత ప్రజలందరికీ ముఖ్యంగా హక్కులను పొందలేకపోతున్న వారికీ రాజ్యాంగం ఒక ఆయుధంగా మారింది. అదే ఆయుధం ఈ రోజు సుప్రీంకోర్టు ధర్మాసనం మరొక్కసారి శక్తిమంతంగా ప్రయోగించి, దేశంలో క్రమంగా పెరుగుతున్న పెడధోరణులపై గొడ్డలివేటు వేసింది.

కొంతకాలంగా ప్రజల ఆహారపుటలవాట్లు, మత స్వేచ్ఛ, నివాస స్వేచ్ఛ, వనరులను కలిగి ఉండే స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛలపై జరుగుతున్న దాడులకు పరోక్షంగా సుప్రీంకోర్టు బలమైన సమాధానమిచ్చింది. ముఖ్యంగా మత స్వేచ్ఛపై దాడులు మితిమీరిపోతున్నాయి. గోసంరక్షణ పేరుతో ఇతర వర్గాలపై దాడులకు తెగబడటం, తమకు నచ్చని ఆహారాన్ని తింటున్న వారిపై సైతం హత్యాకాండకు పాల్పడటం చూస్తున్నాం. స్వేచ్ఛగా చర్మవృత్తి చేసుకొంటున్న వారిపైనా, గోమాంసాన్ని విక్రయిస్తున్న వారిపైనా దాడులు చేయడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనన్న సందేశాన్ని సుప్రీం కోర్టు ధర్మాసనం చెప్పకనే చెప్పింది. రాజ్యాంగం కేవలం న్యాయ సూత్రాల పుస్తకం మాత్రమే కాదని, ప్రజలందరి ఆశల, ఆకాంక్షల, ఆశయాల సమాహారమని; ఇది జాతి జీవనచక్రమని ధర్మాసనం స్పష్టం చేసింది.

రాజ్యాంగం మంచిచెడులను ప్రస్తావిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగ సభలో ఉటంకించిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించడం విశేషం. ఒక దేశ రాజ్యాంగం మంచిదా కాదా? అనే విషయం రాజ్యాంగంపైన ఆధారపడి లేదని, దానిని అమలుపరిచే వారి మంచి చెడులపైననే రాజ్యాంగం అమలు ఆధారపడి ఉంటుందని అంబేడ్కర్ చెప్పారు. ఆ గొప్ప సూక్తిని రాజ్యాంగ ధర్మాసనం సొంతం చేసుకొని, మరొక్కసారి దేశంలోని కోట్లాది ప్రజల హక్కుల గొంతుకగా మారిన వాస్తవాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన ఈ తీర్పు ఎంతో విస్తృతమైనది, మరెంతో శక్తిమంతమైనది మాత్రమే కాకుండా ప్రజల భవిష్యత్తు జీవన గమనానికి రక్షణ ఛత్రమై నిలుస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు ı 97055 66213

రాబందు రెక్కల చప్పుడు

కోట్లమంది విశ్వాసం పెట్టుబడితో విర్రవీగితే ఏమవుతుంది? డేరా సచ్చా సౌదా అవుతుంది. కోట్లమంది ఓట్లను దండుకునే రాజకీయ పార్టీల కక్కుర్తికి ఆధారమౌతుంది. ఈ మధ్యలో 'దేవుడు' అటకెక్కిపోతాడు.



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్



పాపం, దేవుడు నిస్సహాయుడు. అడ్డమయిన వాళ్లకీ కొంగు బంగారమవుతాడు. అయితే, హేతువాదులు కొంగుల్ని మరిచిపోయి బంగారాన్ని తప్పు పడతారు. నిజమైన విశ్వాసం నికార్సయిన సౌందర్యం. పబ్బం గడవడానికి పెట్టుబడిగా ఉపయోగించే విశ్వాసం– భయంకరమైన వికృతం. అందువల్లనే విశ్వాసం పెట్టుబడిగా ఉన్న, ప్రతీదీ వీధిన పడుతోంది. ఇలాంటి విశ్వాసానికి వికటమైన రూపం– డేరా సచ్చా సౌదా గుర్మీత్ రామ్ రహీమ్.

చానళ్ల పేర్లు అనవసరం. ఒకాయన పెద్ద బొట్టుతో, దుశ్శాలువాతో టీవీ తెర అంతా ఆక్రమించి కూచుంటాడు. విశ్వాసాన్ని నమ్ముకున్న ఒక తల్లి 'రెంటచింతల'నుంచి అడుగుతుంది– మా రెండో అబ్బాయికి ఉద్యోగం రావాలంటే ఏం చెయ్యాలి బాబూ– అని. ఈయన చెప్తాడు– ''ప్రతీ బుధవారం మర్రి ఆకు నెత్తిన పెట్టుకుని, దాని మీద చింతగింజని ఉంచి స్నానం చెయ్యమనండి. ఆరువారాలు చేశాక– కావిరంగు పంచె కట్టుకుని మీ ఊళ్లో ఉన్న మర్రి చెట్టు మొదట్లో ఆ చింత గింజని పాతిపెట్టమనండి. ఆరో రోజుకి ఉద్యోగం రాకపోతే నాదగ్గరికి రండి 1,500 రూపాయల తావీజు కడతాను''అంటాడు. ఇది విన్నాక– దిక్కుమాలిన జ్యోతిషం మీదా, దేవుడిమీదా నమ్మకం మంటగలవకుండా ఎందుకుంటుంది?

విశాఖపట్నం బీచిలో తెన్నేటి పార్కు ఎదురుగా పేవ్‌మెంట్ మీద చిలక జ్యోతిష్కులు ఉంటారు. తోక తెగిన చిలక బోనుల నిస్సహాయంగా బయటికి వస్తుంది. దానికి రెండే అలవాట్లు– బొత్తిలో కార్డు లాగితే బియ్యం గింజలు వస్తాయి. లాగుతుంది. ఆ కార్డు ఈ 'మనిషి' భవిష్యత్తు. ''నీ కూతురి పెళ్లి ఈ సెప్టెంబరులో అవుతుంది'' అంటాడు చిలకయ్య. అది అయిదు రూపాయల సంతోషం– పల్లెటూరి మనిషికి ఇక్కడ పెట్టుబడి ఏమిటి?– విశ్వాసం. మనిషి ఆశకి ఊతం కావాలి. దాన్ని ఎదుటి వ్యక్తి కలిగిస్తున్నాడన్న నమ్మకం రావాలి. అందుకూ చెల్లింపు. దానికి చిలక స్థాయి చాలు రైతుకి.

దేవుడిని చంకన ఎత్తుకుని తాను దేవుడి ప్రతినిధినంటూ– వెనుకబడిన వర్గాల తరఫున ముందుపడిన 'రాబందు' జిగ జిగా మెరిసే కళ్లజోళ్లతో, అమెరికా మార్కు బనీన్లతో, అందంగా దువ్విన గెడ్డంతో, స్ఫురద్రూపంతో, పాప్ పాటలతో, సినిమా నిర్మాణ సంరంభంతో, మెర్సిడిస్ కార్ల హంగులతో, కోట్లమంది విశ్వాసం పెట్టుబడితో విర్రవీగితే ఏమవుతుంది? డేరా సచ్చా సౌదా అవుతుంది. కోట్లమంది ఓట్లను దండుకునే రాజకీయ పార్టీల కక్కుర్తికి ఆధారమౌతుంది. ఈ మధ్యలో 'దేవుడు' అటకెక్కిపోతాడు. ఇప్పుడు చిలక స్థానంలో రాబందు ఉంది. ఇక 'రాబందు'కి కొదవేముంది?

విశ్వాసాన్ని ఆధారం చేసుకున్న ఎందరు బాబాలు? విశ్వాసానికి కొలబద్దలు లేవు. ప్రజల ఎగబాటే వారి శక్తి. హర్యానా సత్యలోక్ ఆశ్రమాధిపతి రామ్‌పాల్ బాబా లీలలు, స్వాధీన్ భారత్ సుభాష్ సేన రామ్ వృక్ష యాదవ్, బెంగళూరులో ధ్యాన్ పీఠానికి చెందిన నిత్యానంద లీలలు, ఇంకా ఒక కొలిక్కిరాని ఆశారామ్ లీలలు, సనాతన్ ధన్ హూగ్లీ బాలక్ బ్రహ్మచారి– ఇలా ఎందరు?

తనని నమ్మి వచ్చిన ఇద్దరు మహిళల్ని మానభంగం చేసి, గర్వంగా 15 సంవత్సరాలు కేసు నడిపి, తన చుట్టూ ఉన్న 'దన్ను' కారణంగా తనకేమీ జరగదని గర్వంగా రొమ్ము విరిచి, మొన్నటి తీర్పుకి 300 కార్లతో విహారంగా వచ్చిన 'గ్లామరు'బాబా 20 ఏళ్ల జైలుశిక్ష పడ్డాక కోర్టులో ''నన్ను క్షమించండి మొర్రో''అని నిస్సహాయంగా కూలబడి ఏడవడం ఎందుకు? ఇంతకాలం లక్షల మందిని నమ్మించి, చంకన ఎత్తుకున్న దేవుడు ఏమయ్యాడు?

మతాన్ని, దేవుడిని ఎరచూపి– కింద మధ్యతరగతి ప్రజానీకం 'విశ్వాసా'లను సమీకరించి వ్యవస్థల్ని ఏర్పరచుకున్న ఇలాంటి బాబాలు– ఇంకా మతంలోనూ, సంప్రదాయంలోనూ తమ మాలాలు ఉన్న 'నిస్సహాయమైన' వ్యవస్థకి పట్టే చీడపురుగులు.

పాపం, తెన్నేటి పార్కుకి ఎదురుగా పేవ్‌మెంట్ మీద చిలక అతి చిన్న నమూనా. ప్రాథమికమైన విశ్వాసం అతని కొంగుబంగారం. ఉపాధి మాత్రమే అతని లక్ష్యం. కాని ఈదేశంలో దేవుడు, మతాన్ని పొగరుగా వ్యాపారం చెయ్యగల–దుర్మార్గమయిన స్వార్థానికి విశ్వరూపం గుర్మీత్ రామ్ రహీమ్.

పంజాబు కట్టలు తెంచుకునే ఆవేశానికీ, పరిమితి లేని విశ్వాసానికి ప్రతీక. తాము నమ్మిన విలువలకి ప్రాణం ఇచ్చే స్వభావం ఆ జాతిది. ఇక్కడే జైన బౌద్ధ, బ్రహ్మ సమాజ్, ఆర్య సమాజ్, సిక్కు మతాలు విస్తరించాయి, వేళ్లు నిలదొక్కుకున్నాయి. అయితే మధ్య మధ్య కుళ్లు చూపిన ఓ భయంకరమైన 'వేరు' కథ ఈ గుర్మీత్ రామ్ రహీమ్‌ది. మరో 20 ఏళ్లు– వెర్రి తలలు వేయించిన విశ్వాసానికి గమ్యాన్ని ఈ 'రాబందు' గుర్తు చేస్తూనే ఉంటుంది.

అసమర్థతతో తంటా



ఒక సమర్థుడైన శత్రువు కన్నా అసమర్థుడైన మిత్రుడి వల్ల జరిగే కీడు అధికం అని పెద్దలు చెప్పిన మాట. సమర్థుడు ఎప్పుడేం చేస్తాడో ఊహించవచ్చు. అసమర్థుడి విషయంలో అటువంటి నమ్మకం పెట్టుకోలేం. మనని ఉద్ధరిస్తాడో, ముంచుతాడో తెలియదు. చేతకానితనంతో మంచి చెయ్యబోయి హాని చెయ్యవచ్చు. మంచి అనుకుని చేసే పని సరిగా లేకపోవటం వల్ల ఇబ్బంది కలగవచ్చు. అందరూ అన్ని విషయాల్లో సమర్థులై ఉండరు. ఉండవలసిన అవసరం కూడా లేదు. ఒక్కొక్కరూ ఒక్కొక్క రంగంలోనో, పనిలోనో సమర్థులై ఉంటారు. సమర్థతలో కూడా తేడాలుండవచ్చు. అందుకని జాగరూకత వహించవలసి ఉంటుంది. అసమర్థులని వీలైనంత దూరంగా పెట్టటం మంచిది. అంటే మనుషులని దూరం చేసుకోమని కాదు. వారు తమకు చేతకాని పనులలో అతి ప్రేమతో తల దూర్చకుండా ఉండేట్టు చూడమని.

జ్యోతిర్మయం

సమర్థుడైన శత్రువుకి శ్రీరామచంద్రుడే సరైన ఉదాహరణ. రావణుడు కూడా మంచి శత్రువే. రావణుడు ఏం చేస్తాడో రాముడు అంచనా వెయ్యగలడు. రాముడేం చేస్తాడో రావణుడు ఊహించగలడు. అదే ఉత్తరకుమారుడైతే? మాటలు కోటలు దాటుతాయి. కాలు గడప దాటదు. అసలు కదలకపోతే ఫరవా లేదు. చేస్తానని అర్థంతరంగా వదిలేస్తే?.....

"నీరసంగా ఉందన్నావ్. రెస్ట్ తీసుకో! వంట నేను చేస్తాను" అని ఏ భర్త అయినా అంటే... వెంటనే ఆ ఇల్లాలు 'మీరు నాకు చెయ్యగలిగిన సహాయం వంట గది సమీపానికి రాకుండా ఉండటమే 'అని చెపుతుంది, తరువాత వంట గది బాగుచేసుకోటం ఎంత ప్రయాసో తెలుసు కనుక. ఇది ప్రమాదం కాదు, కాస్త ఇబ్బంది మాత్రమే. "దేని కోసమో ఉదయం నుండి వెతుకుతున్నారు. నేను కూడా సహాయం చేస్తాను చెప్పండి" అని ఇల్లు సర్దుకోటంలో నేర్పరి అయిన ఇల్లాలు అడిగితే "నువ్వు నాకు చేయగలిగిన సహాయం ఈ ఫైళ్లని, కాగితాలని ముట్టుకోకుండా ఉండటమే." అని ఆ భర్త బతిమాలటం గమనించవచ్చు. అంటే ఆవిడకి ఇల్లు సద్దుకోటంలో ఉన్న సమర్థత ఆయన కాగితాలు సర్దటంలో లేదని.

ఉపాధ్యాయుడు సరిగా లేకపోతే విద్యార్థులకి అప్పటి వరకు తెలిసినది కూడా పోవటమే కాదు, మరెప్పుడూ ఆ విషయం అర్థమవటం కష్టం. అందుకే మంచివాడు, మన మేలుకోరేవాడు అని, అసమర్థుణ్ణి తోడుగా తీసుకు వెళ్లకూడదు. సహాయం తీసుకోకూడదు. ఎవరికి తగిన స్థానం వారికి ఇవ్వటం నేర్చుకోవాలి.

– డాక్టర్ ఎన్ అనంతలక్ష్మి

ఆంధ్రా అంబేడ్కర్‌కు నివాళి



అప్పికట్ల జోసెఫ్

విజయవాడలోని లంబాడీపేట కొండ మీద వర్షం వస్తే తడిచి ముద్దయ్యే ఒక తాటాకుల ఇల్లు ఒక రాజ్యసభ (ప్రథమ పార్లమెంటు) సభ్యుని నివాసంగా ఉండేది. ఆ గుడిసె వాసి, ఆంధ్రా అంబేడ్కర్‌గా పేరు మోసిన దివంగత అప్పికట్ల జోసెఫ్ చిరునామా. అంటరానితనం, ఆర్థిక అసమానతలతో సతమతమవుతూనే ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం, పోరాడుతూనే మరో వైపు ఆదిమాంధ్ర జాతిలో చైతన్యం నింపి వారిని అభ్యుదయం వైపునకు అడుగులు వేయించిన అరుదైన నేత, సామాజిక విప్లవ యోధుడు ఆయన. నిరాడంబరులు, కార్యదీక్షా తత్పరులైన జోసెఫ్ నమ్మిన సిద్ధాంతాల కోసం నిలచి, వెనుకడుగు వేయని గాంధేయవాద నాయకుడు. తూర్పు గోదావరి జిల్లాలోని క్రైస్తవ పాఠశాలలో చదువుకుంటూ, కూలీ పనులు చేస్తూ మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. 1940లో ముసునూరు, ఆగిరిపల్లిని కేంద్రాలుగా స్వాతంత్ర ఉద్యమాన్ని నడిపిన ఏకైక మాదిగ క్రైస్తవ కాంగ్రెస్ యువ నేత ఆయన. సాతంత్రోద్యమంలో భాగంగా జోసెఫ్ అనేక సార్లు జైలు జీవితం గడిపారు. జోసెఫ్ తన జీవితకాలమంతా అస్పృశ్యుల స్థితిని మెరుగుపరచడానికి పాటుపడి దళితుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. సంఘ సంస్కర్త, దళిత నాయకుడు, బంధు మిత్రులకు ఆప్తుడు, భరతమాత ముద్దుబిడ్డ 1996 ఆగస్టు 31వ తేదీన తుది శ్వాస విడిచారు. అప్పికట్ల జోసెఫ్ స్మృతి అజరామరం.

నేడు అప్పికట్ల జోసెఫ్ 20వ వర్ధంతి
ఏవీ పటేల్, చైర్మన్,
మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ı 9949418222

నంద్యాల 'కిక్కు' దిగేనా?

ఇన్ బాక్స్

ఎట్టకేలకు నంద్యాల ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి గెలుపును సాధించిపెట్టారు కాబట్టి సీఎం చంద్రబాబు ఇకనైనా పరిపాలనపై దృష్టిని సారిస్తారని ఆశించవచ్చా? ఒక ఉప ఎన్నికలో, అది కూడా తల్లిని, తండ్రిని కోల్పోయిన పిల్లల మొహం చూసి, ఏ పార్టీ, ఏ జెండా, ఏ ఎజెండా, ఏ చరిత్ర అని చూడకుండా సానుభూతిని వెల్లువెత్తించడం మన ఓటర్లకు అలవాటే. అతి సునాయాసంగా సానుభూతి పవనాలపై గెలవగల ఉప ఎన్నిక కోసం చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన రాజకీయవేత్త ఇంత ప్రయాస ఎందుకు పడ్డారో ఎంతకూ అంతుబట్టదు. ఇప్పటికైనా ప్రజాసమస్యలపై, రాష్ట్ర విభజనతో విద్య ఉద్యోగ అవకాశాలలో కలిగిన విపరీతమైన లోటును పరిష్కరించడంపై దృష్టిని కేంద్రీకరిస్తారా? లేక నంద్యాల 'కిక్కు'తో తూలుతారా?

టి. కాశీనాథ్, తారాపేట, విజయవాడ

టీడీపీలో చేరి తప్పు చేశా...

2019లోపు పోలవరం పూర్తి కాదు: టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి



గుత్తి: తనకు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరి తప్పు చేశానని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం అనంతపురం జిల్లా గుత్తిలో వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. గుంతకల్లు శాసనసభ్యుడు జితేందర్‌గౌడ్‌తోపాటు మంత్రి కాలవ శ్రీనివాసులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తాను వలస పక్షినని, కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరి తప్పు చేశానన్నారు. తనకు కుల పిచ్చి ఉందన్నారు. మావాడికి రాజకీయ అనుభవం లేదంటూ పరోక్షంగా ప్రతిపక్ష నేత జగన్‌పై వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు ఏమీ తనకు కిరీటం పెట్టలేదని, అయినా అది తనకు అవసరం లేదన్నారు. చంద్రబాబు 2019లోపే పోలవరం పూర్తి చేస్తానని చెబుతున్నా.. ఎట్టి పరిస్థితుల్లో పూర్తి కాదన్నారు. చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని చెబుతున్నారన్నారు. అలాంటి వాళ్లు తన దృష్టికి తీసుకొస్తే వారంలోగా మాఫీ చేయిస్తానన్నారు.

మూడు రోజులు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. మధ్యప్రదేశ్‌పై కొనసాగిన అల్పపీడనం అక్కడి నుంచి గుజరాత్‌వైపు మళ్లడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం వరకు కోస్తాంధ్రపై చురుగ్గా ప్రభావం చూపిన నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయి. మరోవైపు విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు రాయలసీమ, తెలంగాణల మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. అలాగే అల్పపీడన ప్రాంతం నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం బుధవారం తెలిపింది.

ఏపీఈఆర్‌సీ సభ్యులకు ప్రోటోకాల్ కల్పించండి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) చైర్మన్, సభ్యుల జిల్లాల పర్యటనలకు సంబంధించి తగిన ప్రోటోకాల్ కల్పించాలని సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సెక్రటేరియట్, అన్ని విభాగాల అధిపతులకు జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరి సాగుపై వ్యవసాయ శాఖ సర్వే

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి డెల్టాల్లో నీటి విడుదలకు అనుగుణంగా వరి నాట్లు పడుతున్నాయో లేదో తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ సర్వే నిర్వహించనుంది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మూడు బృందాలుగా ఏర్పడి అధ్యయనం చేస్తారు. తూర్పు గోదావరి జిల్లాలో అధ్యయనం చేసే బృందంలో వ్యవసాయ శాఖ జేడీఏ (పంటల పథకాలు) వి.శ్రీధర్, యూనివర్సిటీ శాస్త్రవేత్త ఒకరు, జిల్లా అధికారి ఒకరు ఉంటారు. పశ్చిమ గోదావరి జిల్లా బృందానికి వ్యవసాయ శాఖ జేడీఏ (విత్తనాలు) కె.రామరాజు, వ్యవసాయ శాఖ డీడీఏ (ప్లానింగ్) వెంకటేశ్వర్లు, కృష్ణా జిల్లా బృందానికి కె.లక్ష్మణ రావు (జేడీఏ), సీహెచ్ బాలూ నాయక్ (డీడీఏ) నాయకత్వం వహిస్తారు. వీరితో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, జిల్లా అధికారి కూడా ఉంటారు.

రుణమాఫీ మొత్తాన్ని ఒకేసారి ఇవ్వాలి

7న రైతు సాధికార సంస్థ ముట్టడికి ఏపీ రైతుసంఘం పిలుపు

సాక్షి, అమరావతి: రైతుల రుణమాఫీకి విడుదల చేయాల్సిన రెండు విడతల మొత్తాన్ని ఒకే దఫా ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వచ్చేనెల 7న 'చలో గన్నవరం' కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. ఇందులో భాగంగా గన్నవరంలోని రైతు సాధికార సంస్థ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించింది. వచ్చేనెల ఒకటి నుంచి 7 వరకు నిర్వహించే రైతాంగ డిమాండ్ల వారోత్సవంలో భాగంగా ఈ ఆందోళన చేపట్టినట్టు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య బుధవారం విజయవాడలో మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కేవీవీ ప్రసాద్, కాట్రగడ్డ జోషి, పరసా వెంకటేశ్వరరావు, మల్నీడి యలమందరావుతో కలసి 'చలో గన్నవరం' పోస్టర్‌ను విడుదల చేశారు.

నారాయణ.. నారాయణ.. ఇదేమి శిక్ష!



పార్కింగ్ స్థలంలో నేలపై విద్యార్థులను కూర్చోబెట్టిన దృశ్యం

రాజాం: కళాశాలకు ఆలస్యంగా వస్తున్నారని, ఫీజులు సకాలంలో చెల్లించడంలేదనే నెపంతో విద్యార్థులను నారాయణ కళాశాల యాజమాన్యం ఆరుబయట ఎండలో కూర్చోబెడుతోంది. సోదరుడిని కలిసేందుకు ఓ యువకుడు కళాశాలకు వెళ్లగా, అక్కడ తన తమ్ముడితో పాటు విద్యార్థులు గేటు వద్ద నేలపై కూర్చోడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. ఈ విషయాన్ని మీడియాకు చేరవేయగా, విలేకరులు అక్కడకు చేరుకునేసరికి కళాశాల యాజమాన్యం వెంటనే విద్యార్థులందరినీ తరగతి గదులకు పంపించేసింది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా రాజాంలో బస్టాండ్ వెనకున్న నారాయణ కార్పొరేట్ కళాశాల వద్ద బుధవారం జరిగింది. కళాశాలకు ఆలస్యంగా వస్తున్నారని, ఫీజులు సకాలంలో చెల్లించడంలేదనే నెపంతో యాజమాన్యం గత 15 రోజులుగా విద్యార్థులను ఎండలో నేలపై కూర్చోబెట్టి శిక్ష విధిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్‌ను 'సాక్షి' సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన మాట్లాడేందుకు నిరాకరించారు.

మాజీ డీజీ రామకృష్ణారావు కన్నుమూత



హైదరాబాద్: రిటైర్డ్ డీజీ దామరాజు వెంకట లక్ష్మీనర్సింహ రామకృష్ణారావు బుధవారం సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన గత కొద్దికాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రకాశం జిల్లా శేర్వాన్ గ్రామానికి చెందిన రామకృష్ణరావు 1957లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. అనంతరం శ్రీకాకుళం ఎస్పీగా, డీఐజీగా, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డైరెక్టర్‌గా, సీఐడీ ఐజీగా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇండోటిబేటిన్ బోర్డర్ పోలీస్‌గా అనేక పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ప్రకాశ్, శ్రీరాం, కుమార్తెలు అనురాధ, రత్నమాల, భార్య విజయలక్ష్మి ఉన్నారు. నేడు హబ్సిగూడలోని కాకతీయనగర్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

లక్ష్మణ్‌రెడ్డికి కీర్తి పురస్కారం

సాక్షి, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఏటా అందజేసే కీర్తి పురస్కారానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి. లక్ష్మణ్‌రెడ్డి ఎంపికయ్యారు. తెలుగు వర్సిటీలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఈ నెల 31న (గురువారం) సాయంత్రం 3.30కి జరిగే కార్యక్రమంలో ఆయన కీర్తి పురస్కారం –2016 ని అందుకోనున్నారు. హేతువాదం గురించి విస్తృతంగా ప్రచారం చేసినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

అంతర్గత భద్రతపై దక్షిణాది రాష్ట్రాల డీజీపీల భేటీ

ఆక్టోబర్‌లో ఆలిండియా డీజీపీల కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేరళలోని త్రివేండ్రంలో బుధవారం దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు భేటీ అయ్యారు. కేరళలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్ష్యద్వీప్, కేరళ రాష్ట్రాల డీజీపీలు హాజరయ్యారు. మావోయిస్టు సమస్య, కోస్టల్ సెక్యూరిటీ, ఐసిస్ కార్యకలాపాలు, రైల్వే భద్రత, డ్రగ్స్ అక్రమ రవాణా అంశాల్లో సంయుక్తంగా ముందుకు సాగాలని డీజీపీలు నిర్ణయించారు. కేంద్ర హోంశాఖ ప్రతి ఏడాది అక్టోబర్‌లో నిర్వహించే ఆలిండియా డీజీపీల కాన్ఫరెన్స్‌కు ఈసారి కేరళ వేదిక కానుంది.

తెగ తాగేస్తున్నారు



మద్యం ఆదాయంలో 56 శాతం మించి వృద్ధి

- ఈ ఏడాది 4 నెలల్లో అదనంగా రూ.829.73 కోట్ల మద్యం వినియోగం
- సీఎం సొంత జిల్లా చిత్తూరులోనే అత్యధిక తాగుడు
- అతి తక్కువగా వైఎస్సార్ జిల్లాలో

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మద్యం తెగ తాగేస్తున్నారు. మిగతా రంగాల్లో వృద్ధి ఎలాగున్నా మద్యం వృద్ధిలో మాత్రం రాష్ట్ర దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లోనే ఏకంగా రూ.2,304.89 కోట్ల రూపాయల విలువైన మద్యం రాష్ట్రంలో సేవించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే నాలుగు నెలల కాలంలో సేవించిన మద్యం కన్నా ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లో సేవించిన మద్యం విలువ అధికంగా రూ.829.73 కోట్లు కావడం గమనార్హం. 2016–17లో (ఏప్రిల్ నుంచి జూలై వరకు) రూ.1,475.16 కోట్ల మద్యం సేవించగా 2017–18లో (ఏప్రిల్ నుంచి జూలై వరకు) రూ.2,304.89 కోట్ల మద్యం తాగారు. ఈ ఆర్థిక సంవత్సరం జూలై వరకు మద్యం ఆదాయంలో 56.25 శాతం వృద్ధి నమోదైంది. ఒక్క ల్యాండ్ రెవెన్యూ ద్వారా ఆదాయంలో తప్ప మిగతా అన్ని రంగాల ఆదాయంలో రాష్ట్రం వృద్ధిలో కొనసాగుతోంది. ప్రధానంగా సీఎం సొంత జిల్లా చిత్తూరుతో సహా ఆరు జిల్లాల్లో మద్యం వినియోగం ఎక్కువగా ఉంది. చిత్తూరు జిల్లాలో మద్యం ఆదాయం వృద్ధి రేటు మిగతా జిల్లాల కన్నా అత్యధికంగా 70.82 శాతం నమోదైంది. తూర్పుగోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా మద్యం ద్వారా ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు రాష్ట్ర ఆదాయంలో 16.81 శాతం వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు ఆదాయ వనరుల రంగాల ద్వారా రూ.15,12,808 ఆదాయం రాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు రూ.17,671.12 ఆదాయం వచ్చింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు మద్యం ఆదాయం వివరాలు

జిల్లా పేరు	మద్యం ఆదాయం (రూ.కోట్లలో)
శ్రీకాకుళం	114.27
విజయనగరం	122.71
విశాఖపట్నం	249.13
తూర్పుగోదావరి	251.05
పశ్చిమగోదావరి	204.08
కృష్ణా	229.93
గుంటూరు	221.25
ప్రకాశం	123.72
నెల్లూరు	160.04
చిత్తూరు	230.59
అనంతపురం	137.65
కర్నూలు	146.16
వైఎస్సార్	114.29
మొత్తం	2,304.89

ఆయా రంగాల్లో వచ్చిన ఆదాయం, వృద్ధి శాతం వివరాలు (రూ.కోట్లలో)

రంగం	2016-17 (జూలై వరకు)	2017-18 (జూలై వరకు)	వృద్ధి శాతం
వాణిజ్య పన్నులు	10,860.04	12,122.61	11.63
మద్యం	1,475.16	2,304.89	56.25
రిజిస్ట్రేషన్-స్టాంప్స్	1,334.89	1,350.14	1.14
రవాణా	903.46	1,123.79	24.39
గనులు	437.00	636.00	46.00
ల్యాండ్ రెవెన్యూ	98.86	77.25	-21.86
అటవీ	18.67	56.44	202.25

ఆశలు 'భద్ర'మేనా!

- తుంగభద్ర డ్యామ్‌లోకి నిలకడగా కొనసాగుతున్న వరద ప్రవాహం
- గతేడాది ఈ పాటికే టీబీ డ్యాంకు చేరిన 78.29 టీఎంసీలు
- కానీ ఈ ఏడాది ఇప్పటికి చేరింది కేవలం 64.97 టీఎంసీలే..

సాక్షి, అమరావతి: తుంగభద్ర నదిలో గత వారం రోజులుగా వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతున్నా తుంగభద్ర జలాశయం (టీబీ డ్యామ్) ఆయకట్టు రైతుల్లో నిస్తేజం నెలకొంది. టీబీ డ్యామ్ చరిత్రలో గతేడాది అత్యల్ప నీటి లభ్యత (91.33 టీఎంసీలు) సంవత్సరంగా నమోదైంది. అలాంటిది గతేడాదే ఆగస్టు 30 నాటికి టీబీ డ్యామ్‌లోకి 78.29 టీఎంసీలు చేరగా... ఈ ఏడాది ఇప్పటికీ 64.97 టీఎంసీలకు మించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. టీబీ డ్యామ్ వద్ద 230 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ లెక్క కట్టింది. కానీ.. గత నాలుగేళ్లు ఆ మేరకు టీబీ డ్యామ్‌కు జలాలు చేరడం లేదు. తుంగభద్ర నదిపై కర్ణాటక సర్కార్ ఎక్కడికక్కడ చెక్ డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు చేపట్టడంతో టీబీ డ్యామ్‌లో నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం టీబీ డ్యామ్‌లో ఉన్న జలాల్లో రాష్ట్ర కోటా కింద వచ్చే జలాలు రాయలసీమ తాగునీటి అవసరాలకే సరిపోతాయి. అంటే.. వరుసగా నాలుగో ఏటా తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ), దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టులో పంటలు సాగు చేయలేని దుస్థితి నెలకొంటుంది. కర్నూలు-కడప(కేసీ) కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి మరీ దయనీయం.

ఎగువన కళకళ.. దిగువన వెలవెల

ఎగువ వరద ప్రవాహంతో కృష్ణా నది కళకళలాడుతుంటే.. దిగువన నీళ్లు లేక వెలవెల బోతోంది. మహారాష్ట్రలోని ఉజ్జయిని జలాశయం నిండిపోయింది. దిగువన కర్ణాటకలో ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నెలన్నర క్రితమే నిండిపోయాయి. కానీ.. ఆ తర్వాత వస్తోన్న వరద నీటిని దిగువకు విడుదల చేయకుండా కర్ణాటక ఒడిసిపడుతోంది. జూరాలకు అరకొరగా చేరిన వరద నీటిని తెలంగాణ తన అవసరాలకు వినియోగించుకుంటోండటంతో దిగువకు చుక్క నీరు చేరడం లేదు. స్థానికంగా కురిసిన వర్షాలకు ఈ ఏడాది బుధవారం వరకూ శ్రీశైలం జలాశయంలోకి 5.95 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లోకి 3.813 టీఎంసీలు, పులిచింతల ప్రాజెక్టులోకి 6.613 టీఎంసీలు మాత్రమే చేరాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



గోదావరి, నాగావళి పరవళ్లు


మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణాల్లో వర్షాలు కురుస్తోండటంతో గోదావరికి వరద ప్రవాహం పెరిగింది. బుధవారం ధవళేశ్వరం బ్యారేజీకి 2,70,832 క్యూసెక్కుల ప్రవాహం రాగా.. 10,900 క్యూసెక్కులను గోదావరి డెల్టాకు విడుదల చేసి మిగతా 2,59,932 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. దాంతో ఈ ఏడాది ఇప్పటివరకూ 575.51 టీఎంసీలు కడలిపాలైనట్లు అయ్యింది. మరోవైపు ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కొనసాగుతోండటంతో నాగావళి, వంశధార నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఇప్పటికే తోటపల్లి, గొట్టా బ్యారేజీల్లో నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దాంతో గొట్టా బ్యారేజీ నుంచి బుధవారం 36,398 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. దాంతో ఈ ఏడాది ఇప్పటివరకూ 35.997 టీఎంసీల నాగావళి, వంశధార జలాలు కడలిపాలైనట్లు అయ్యింది.

ఆల్మట్టి 'ఎత్తు' చిత్తు!

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ జలాలను ఒడిసిపట్టి యథేచ్ఛగా వాడుకుంటున్న కర్ణాటక జోరుకు కేంద్రం అడ్డుకట్ట వేసింది. ఆల్మట్టి ఎత్తు పెంచి అదనంగా దక్కించుకునే నీళ్ల ఆధారంగా నిర్మించ తలపెట్టిన 9 ఎత్తిపోతల పథకాలకు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ పథకాలకు నీటి లభ్యత(హైడ్రాలజీ)పై స్పష్టత లేదని, అంతర్రాష్ట్ర అంశాలతో ముడిపడి ఉన్నందున అనుమతులివ్వలేమని స్పష్టం చేసింది. కృష్ణా జలాలపై బ్రిజేశ్ ట్రిబ్యునల్ తీర్పు ఆధారంగా 130 టీఎంసీలు వాడుకునేలా 9 ఎత్తిపోతల పథకాలను కర్ణాటక చేపట్టింది. వీటి కోసం 1,45,937 ఎకరాలు భూమి అవసరం కాగా ఇందులో 535 ఎకరాల అటవీ భూమి కూడా ఉండటంతో పర్యావరణ అనుమతుల కోసం కేంద్రానికి కర్ణాటక దరఖాస్తు చేసుకుంది. అయితే పర్యావరణ అనుమతులు దక్కాలంటే కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని 'ఎన్విరాన్‌మెంట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ)' స్పష్టం చేసింది. ముఖ్యంగా నీటి లభ్యతపై పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. కృష్ణా జలాల పంపిణీలో అంతర్రాష్ట్ర వివాదాలు ఉన్నాయన్న అంశాన్ని కూడా ఈఏసీ ప్రస్తావించిందని, దీనిపై కర్ణాటక సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది. ఈ అంశాలపై స్పష్టతతో పాటు సీడబ్ల్యూసీ అనుమతులు వచ్చే వరకు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని తేల్చిచెప్పినట్లు సమాచారం. ఇక మరో 4 టీఎంసీలను వినియోగించుకుంటూ బెల్గావ్ జిల్లాలో చేపట్టిన బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి కూడా అనుమతి ఇవ్వలేదు.

బెదిరింపులే మీ ఆదర్శమా చంద్రబాబూ?

- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పార్థసారధి
- దొడ్డిదారి గెలుపుకే ఇన్ని గొప్పలా?
- దమ్ముంటే ఆ 20 మందిని మళ్లీ గెలిపించు
- డిపాజిట్లు దక్కించుకోలేని చరిత్ర మరిచావా?



సాక్షి, హైదరాబాద్: నంద్యాల తరహా నమూనానే వచ్చే ఎన్నికల్లో అనుసరిస్తామని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కె.పార్థసారథి విమర్శించారు. ప్రజలను బెదిరించి, విచ్చలవిడిగా డబ్బులు గుమ్మరించి నంద్యాలలో గెలిచారని, ఇదే విధానాన్ని అనుసరిస్తామని తెలుగుదేశం పార్టీ నిస్సిగ్గుగా చెప్పుకోవడం దారుణమన్నారు. 2019 ఎన్నికల్లో మీరు ఎంచుకున్న మోడలే మిమ్మల్ని ఇంటిదారి పట్టిస్తుందని హెచ్చరించారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికలో ఓడిపోతామనే భయంతోనే చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనట్లుగా దాదాపు రూ.12 వందల కోట్ల అభివృద్ధి పనులు ప్రకటించారని, రూ. 200 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఒక ఉప ఎన్నికల్లో దొడ్డిదారిన విజయం సాధించి చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు దమ్ముంటే పార్టీ ఫిరాయించిన 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాలు విసిరారు.

ఒక్క గెలుపుకే ఇన్ని బీరాలా..?

వైఎస్సార్‌సీపీ పుట్టిన తరువాత జరిగిన 18 ఉప ఎన్నికల్లో కనీసం ఒక్కదాంట్లో నూ టీడీపీకి గెలవలేదని, కొన్నింటిలో డిపాజిట్లు కోల్పోయిన విషయం మరచిపోయారా అని పార్థసారథి గుర్తు చేశారు. ఒక్క నంద్యాల స్థానంలో గెలిస్తేనే ఈ స్థాయిలో బీరాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. కడప పార్లమెంట్‌కు తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోటీ చేస్తే కనీవినీ ఎరుగని రీతిలో 6,92,251 ఓట్లు వచ్చాయని, అప్పుడు టీడీపీకి 1,29,565 ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తుచేశారు. నెల్లూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి 5,35,436 ఓట్లు వస్తే.. టీడీపీకి 1,54,103 ఓట్లు వచ్చాయన్నారు. పులివెందుల అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మకు 1,10,098 ఓట్లు వస్తే.. టీడీపీకి 11 వేల ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు.

బెదిరింపులే మీ మోడలా?

నంద్యాల మోడల్‌నే రాబోయే ఎన్నికల్లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం విడ్డూరంగా ఉందని పార్థసారథి ధ్వజమెత్తారు. ''టీడీపీకి ఓట్లు వేయకపోతే పెన్షన్లు రద్దు చేస్తాం, ఇళ్లు క్యాన్సిల్ చేస్తాం, కేసులు పెడతాం... అని కత్తి మెడమీద పెట్టి, ఇంకోవైపు మూడు విడతలుగా ఆరేడు వేల రూపాయలు చేతుల్లో పెట్టి ఓట్లడగడమేనా మీ మోడల్?' అని ప్రశ్నించారు. టీడీపీ ఎన్ని బెదిరింపు కార్యక్రమాలు చేసినా 70 వేల మంది ధైర్యంగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నంద్యాలకు ఇచ్చి వాగ్దానాలు నెరవేర్చకపోతే చూస్తూ ఊరుకోమని, భరతం పడతామని హెచ్చరించారు.

మా బాబాయ్‌కి ప్రమోషన్ ఇవ్వాల్సిందే

- లేకుంటే కౌన్సెలింగ్ నిలిపివేయండి
- అధికారులపై జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్ అసహనం
- కౌన్సెలింగ్ వాయిదా వేసిన అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: 'మా బాబాయ్‌కి ప్రమోషన్ ఇవ్వకుంటే ఎవ్వరికీ ప్రమోషన్ ఇచ్చేందుకు వీలు లేదు. ప్యానెల్ జాబితాలో పేరు చేర్చి హెచ్‌ఎం కౌన్సెలింగ్ నిర్వహించండి... లేకుంటే మొత్తంగా నిలిపివేయండి.' అని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్ ఆదేశించారు. తన బంధువుకు పదోన్నతి ఇవ్వని పక్షంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిపివేయాలని విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో ఉన్న 31 మంది స్కూల్ అసిస్టెంట్లను బుధవారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరానికి హెచ్‌ఎం కౌన్సెలింగ్‌కు రావాలని సమాచారమిచ్చారు. కౌన్సెలింగ్ ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్న సమయంలో సీనియార్టీ జాబితాపై తనకు అనుమానాలున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్ అభ్యంతరం లేవనెత్తారు. పిడుగురాళ్ల ప్రాంతంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు హలీం బాషాను తన బాబాయ్‌గా పేర్కొన్న జానీమూన్, అతని పేరును చేర్చి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. అయితే ఏడాది క్రితం ఆమోదం పొందిన ప్యానెల్‌లో తాజాగా పేర్లు చేర్చరని డీఈవోతో పాటు సంఘాల నాయకులు ఆమెకు నచ్చజెప్పారు. గురువారం పదవీ విరమణ పొందుతున్న మరో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ల పేర్లను చేర్చి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించుకోవచ్చని సలహా ఇచ్చారు. దీంతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. హెచ్‌ఎం కౌన్సెలింగ్ వాయిదా వేయడంతో ఫ్యాప్టో, జాక్టో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పరీక్షా భవన్‌కు చేరుకుని కౌన్సెలింగ్ హాల్లో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. చివరికి డీఈవో కలెక్టర్ కోన శశిధర్‌తో చర్చించి, గురువారం సాయంత్రం 4.00 గంటలకు యథావిధిగా కౌన్సెలింగ్ జరుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కౌన్సెలింగ్ హాల్లో బైఠాయించి ఆందోళనకు దిగిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాజధానిలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్!

సీఆర్‌డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాజధానిలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చ జెండా ఊపారు. (హైబ్రీడ్ యాన్యుటీ మోడల్: మొత్తం ప్రాజెక్టు వ్యయంలో మొదట కొంత శాతం నిధులను కేటాయించి.. మిగిలిన మొత్తాన్ని విడతల వారీగా విడుదల చేయడం) అమరావతిలోని ప్రతిపాదిత 13 జోన్లలో మూడు జోన్లను హైబ్రీడ్ యాన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సీఎం అధ్యక్షతన బుధవారం జరిగిన సీఆర్‌డీఏ సమీక్ష సమావేశం నిర్ణయించింది. నాలుగు, ఐదు, తొమ్మిది జోన్లలో మొత్తం రూ. 6,900 కోట్లతో రహదారులు, వంతెనలు, తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ వంటి మౌలిక వసతులను హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ ద్వారా కల్పించాలని భావిస్తున్నారు. జోన్ నాలుగులో రూ. 817 కోట్లు, జోన్ ఐదులో రూ. 2,383 కోట్లు, జోన్ ఆరులో రూ. 3,714 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో రాజధాని అమరావతి ప్రాంతంలోని 29 గ్రామాల్లో అభివృద్ధి చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈ గ్రామాల్లో పరిశుభ్రత, రహదారుల నిర్మాణం వంటి వసతుల కల్పన కోసం ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల భవనాలు, ఇతర పౌర నివాస సముదాయాలను 1.47 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో తలపెట్టినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని, దీనికి 11,602 కోట్ల రూపాయలు వ్యయం కానుందని అధికారులు వివరించారు. అమరావతిలోని శాఖమూరు పార్కు ప్రాంతానికి సంబంధించి అభివృద్ధి నమూనాలపైనా సమావేశంలో చర్చకు వచ్చింది. 280 ఎకరాల్లో ఈ పార్కును ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అక్షరధామ్ నిర్మాణానికి నదీ ముఖంగా 30 ఎకరాలు కేటాయించాలని నిర్వహకులు కోరినట్లు అధికారులు తెలిపారు. అమెరికాలో అక్షరధామ్ నిర్మాణం పూర్తికాగానే అమరావతిలో నిర్మాణం చేపట్టనున్నారని అధికారులు తెలిపారు. దీనికి సానుకూలత వ్యక్తం చేసిన సీఎం దక్షిణ భారతదేశంలోనే తలమానికంగా నిలిచేలా అద్భుత కట్టడాన్ని నిర్మించేలా చూడాలన్నారు. రాజధాని ప్రాంతంలో పది వరకు హోటళ్లు త్వరలో నిర్మాణానికి నోచుకుంటాయని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ విద్యా సంస్థలు అమరావతిలో అడుగుపెట్టేందుకు వచ్చే నెలలో ఒప్పందాలు చేసుకోనున్నాయని అధికారులు తెలిపారు.



సచివాలయంలో సీఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం జరిగిన బీసీ సంక్షేమ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే బీసీ వర్గానికి చెందిన వివాహ జంటలకు ఒక్కో జంటకు రూ.25 వేల చొప్పున ఏటా 40 వేల జంటలకు 'చంద్రన్న పెళ్లి కానుక' ఇవ్వనున్నట్లు సీఎం చెప్పారు. బీసీ ఫెడరేషన్‌ల ద్వారా ఐదుగురు సభ్యులతో గ్రూపు ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపనకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించేందుకు సీఎం నిర్ణయించారు. ఎంబీసీలకు బ్యాంకుల ద్వారా కాకుండా ప్రభుత్వమే రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఉదయలక్ష్మి పాల్గొన్నారు.


మెరుగైన రవాణా వ్యవస్థకు ప్రణాళిక!

సీఎస్ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ప్రభుత్వ ప్రధాన శాఖల ముఖ్య కార్యదర్శులకు భాగస్వామ్యం కల్పించారు. చైర్మన్‌గా సీఎస్, మెంబర్ కన్వీనరుగా రవాణా, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి, సభ్యులుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్తు, మౌలిక సదుపాయాల కల్పన, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శులు, పర్యాటకం, పరిశ్రమల శాఖ కార్యదర్శులు, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్, భవనాలు, రైల్వే శాఖ చీఫ్ ఇంజనీర్లు ఉన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులను సభ్యులుగా నియమించినప్పటికీ రవాణా శాఖ కమిషనర్‌కు చోటు కల్పించకపోవడం గమనార్హం.

'రైట్స్' సంస్థతో అవగాహన ఒప్పందం

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్(రైట్స్) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ మెరుగైన రవాణా వ్యవస్థకు కొన్ని ప్రతిపాదనలు చేసింది. విజయవాడలోని బెంజిసర్కిల్ వద్ద నిర్మించనున్న ఫ్లైఓవర్ లైట్ మెట్రో, రోడ్డు రవాణాకు అనుకూలంగా ఉండేలా 'రైట్స్' సంస్థ ప్రతిపాదనలిచ్చింది. ఈ సంస్థ ఇచ్చిన ప్రతిపాదనలపై సీఎస్ చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ సమీక్షిస్తుంది. ఏపీ అభివృద్ధికి 'రైట్స్' సంస్థ ఇచ్చిన ప్రతిపాదనలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది.



గోరఖ్‌పూర్‌లో మరణమృదంగం

ఒక్క నెలలోనే 296 మంది చిన్నారుల దుర్మరణం

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్ దాస్ (బీఆర్డీ) వైద్య కళాశాలలో ఒక్క ఆగస్టు నెలలోనే దాదాపు 296 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. వీరిలో 213 నవజాత శిశువులు ఐసీయూలో చికిత్స పొందుతూ మృతి చెందగా, 83 మంది చిన్నారులు మెదడువాపు వ్యాధితో చనిపోయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీకే సింగ్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఆస్పత్రిలోని మెదడువాపు, చిన్నారుల వార్డుల్లో దాదాపు 1,256 మంది మృతి చెందినట్లు సింగ్ పేర్కొన్నారు. గడిచిన 24 గంటల్లో 17 మంది చిన్నారులు మెదడువాపు వ్యాధితో ఆస్పత్రిలో చేరగా, ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో 37 మంది పిల్లలు (వీరిలో 11 మంది మెదడువాపు వ్యాధితో) ఆస్పత్రిలో మృత్యువాత పడ్డారని సింగ్ వెల్లడించారు. నెలలు నిండకుండానే పుట్టడం, తక్కువ బరువు ఉండడం, కామెర్లు, న్యుమోనియా, ఇన్ఫెక్షన్, మెదడువాపు తదితర కారణాలతో, విషమ పరిస్థితుల్లోనే చిన్నారులను ఆస్పత్రికి తీసుకొస్తున్నారని సింగ్ తెలిపారు. చిన్నారులను కొంచెం ముందుగా ఆస్పత్రికి తీసుకురాగలిగితే చాలామంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. మరోవైపు చిన్నారుల మరణాలకు కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్డీ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రాతో పాటు ఆయన భార్యను ఉత్తరప్రదేశ్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అరెస్టు చేసింది.

క్రీమీలేయర్‌లోకి పీఎస్‌యూ ఉద్యోగాలు

- ప్రభుత్వ బ్యాంకులు, బీమా కంపెనీలు కూడా..
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



న్యూఢిల్లీ: ఓబీసీల్లో సంపన్న వర్గమైన 'క్రీమీలేయర్' పరిధిని కేంద్రం విస్తరించింది. ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూలు), ప్రభుత్వ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో కొన్ని పోస్టులు దీని కిందికి వస్తాయని పేర్కొంది. దీంతో ఆయా స్థానాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు, కుటుంబీకులు ఓబీసీ కోటాలో రిజర్వేషన్‌కు దూరమవుతారు. ఇందుకు సంబంధించి కేంద్ర కేబినెట్ బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఓబీసీల్లో సామాజికంగా అభివృద్ధి చెందిన వ్యక్తులు, వర్గాలను కూడా రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించింది. తాజా నిర్ణయం ప్రకారం... పీఎస్‌యూల్లో అన్ని ఎగ్జిక్యూటివ్ పోస్టుల(బోర్డు, మేనేజ్‌మెంట్ స్థాయి కలుపుకుని)ను గ్రూప్ ఏ పోస్టులతో సమానంగా క్రీమీలేయర్‌గా భావిస్తారు. ప్రభుత్వ బ్యాంకులు, బీమా కంపెనీల్లో జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-1 ఆపై స్థాయి ఉద్యోగులని గ్రూప్ ఏ ఉద్యోగులతో సమానంగా భావిస్తూ క్రీమీలేయర్ హోదా ఇస్తారు. ఇక క్లర్కులు, ప్యూన్‌లకు సంబంధించి సమయానుగుణంగా వారి ఆదాయ వనరుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. 'క్రీమీలేయర్ పరిధి విస్తరణతో పీఎస్‌యూలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో దిగువ స్థాయిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలు... ప్రభుత్వ విభాగాల్లో దిగువ స్థాయిల్లో పనిచేస్తున్న వారి పిల్లలతో సమానంగా ఓబీసీ రిజర్వేషన్ల ఫలాలు పొందుతారు' అని కేబినెట్ భేటీ అనంతరం ప్రకటనలో కేంద్రం పేర్కొంది.

- ఎన్నికల నిర్వహణలో ఆరు దేశాలతో ఒప్పందాలు చేసుకోవాలన్న ఈసీ ప్రతిపాదనకు కేబినెట్ అంగీకారం. ఇందులో ఈక్వెడార్, ఆల్బేనియా, భూటాన్, అఫ్గానిస్తాన్, గినియా, మయన్మార్ దేశాలున్నాయి.
- పారిశ్రామిక అభివృద్ధి కోసం 40 మిలియన్ డాలర్లతో ఫండ్ ఏర్పాటుకు భారత్, ఇజ్రాయెల్ మధ్య కుదిరిన ఒప్పందానికి ఆమోదం.

వైద్యుల ఘర్షణకు శిశువు బలి




జోధ్‌పూర్: అప్పుడే జన్మించిన శిశువు హార్ట్ బీట్ పరీక్షించేందుకు వైద్యులు పోటీపడ్డారు. నేను చేస్తానంటే.. కాదు .. నేను చేస్తానని ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు బూతులు తిట్టుకున్నారు. వీరి కొట్లాట మధ్య ఆ శిశువు కన్నుమూసింది. రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ ఉమైద్ ఆసుపత్రిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. డెలివరీ గదిలో ఉన్న సిబ్బంది ఒకరు ఈ తతంగాన్ని రికార్డుచేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అసలు సంగతి వెలుగుచూసింది. అనిత అనే మహిళకు జన్మించిన బిడ్డను పరీక్షించే సమయంలో వైద్యులు అశోక్ నైన్వాల్, ఎంఎల్ తక్ ఆపరేషన్ థియేటర్‌లోనే గొడవకు దిగారు. ఇంతలో పల్స్‌రేట్ పడిపోవడంతో ఆ చిన్నారి చనిపోయింది. ఘర్షణకు దిగిన ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ కమిటీని ఏర్పాటుచేశామని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది.

కాంగ్రెస్‌లో 'హిమాచల్' ముసలం!

సాక్షి, న్యూఢిల్లీ: ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి హిమాచల్ ప్రదేశ్, బిహార్‌లలో మరిన్ని కష్టాలు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే హిమాచల్‌లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సుఖ్వీందర్ సింగ్ సుక్కు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్ షిండేలతో ముఖ్యమంత్రి వీరభద్రసింగ్‌కు ఎన్నికలకు సంబంధించిన పలు విషయాల్లో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తాను తదుపరి ఎన్నికల్లో పోటీ, ప్రచారం చేయనని వీరభద్ర సింగ్ చెప్పారు. తమ నాయకుడి బాటలోనే తామూ నడుస్తామని కొంతమంది హిమాచల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్‌తో భేటీ అయిన అనంతరం...ఎన్నికల్లో పోటీ చేయనని వీరభద్ర సింగ్ ప్రకటించారు. అటు బిహార్‌లోనూ ఇటీవల సీఎం నితీశ్ కుమార్ మహా కూటమి నుంచి బయటకు రావడంతో కాంగ్రెస్ అధికారం కోల్పోవడం తెలిసిందే. దీంతో కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జేడీయూలో చేరేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. బిహార్ కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత సదానంద్ సింగ్‌ను ఢిల్లీ రావాల్సిందిగా సోనియా ఆదేశించారు.

ఐఐఎం-ఏ డైరెక్టర్ ఇన్‌చార్జ్‌గా డిసౌజా



అహ్మదాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-అహ్మదాబాద్ (ఐఐఎం-ఏ) నూతన డైరెక్టర్ ఇన్‌చార్జ్‌గా ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా నియమితులయ్యారు. ఈయన నియామకం సెప్టెంబర్ 2 నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఈయన అదే విద్యాసంస్థలో ఎకనమిక్స్ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముంబై యూనివర్సిటీలో ఎకనమిక్స్, స్టాటిస్టిక్స్ పూర్తిచేసిన ఈయన అక్కడ ఎంఏ (ఎకనమిక్స్)లో గోల్డ్ మెడల్ సాధించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ముంబై వర్సిటీ, పారిస్‌లోని యూనివర్సిటీ సైన్సెస్‌లో చైర్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సిమ్లాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేశారు.

జర్మనీలో 1400 టన్నుల బాంబు

ఫ్రాంక్‌ఫర్ట్: జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి పేలని బాంబును కనుగొన్నారు. బ్లాక్‌బస్టర్‌గా పిలిచే ఈ భారీ బాంబును వచ్చే ఆదివారం నిర్వీర్యం చేయనున్నారు. దీంతో బాంబును గుర్తించిన చోటు నుంచి సుమారు 70 వేల మందిని ఇతర ప్రాంతాలకు తరలించడానికి స్థానిక అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. గోథె యూనివర్సిటీ వెస్ట్‌ఎండ్ క్యాంపస్ సమీపంలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనుల్లో 1400 టన్నుల బరువున్న ఈ బాంబు బయటపడిందని పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశామని, ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు.

'మేకిన్ ఇండియా'లో ఎఫ్-16 విమానాలు

న్యూఢిల్లీ: ఎఫ్-16 యుద్ధ విమానాలను భారత్‌లో తయారుచేయడానికి అమెరికా రక్షణ ఉత్పత్తుల సంస్థ లాక్‌హీడ్ ముందుకొచ్చింది. భారత వాయుసేన నుంచి ఈ విమానాలకు ఆర్డర్ లభిస్తే 'మేకిన్ ఇండియా' కింద వాటిని ఇక్కడే ఉత్పత్తి చేస్తామంది. అంతేకాకుండా భారత్ నుంచే వాటిని ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తామని తెలిపింది. అయితే వాయుసేనకు 100 ఎఫ్-16 జెట్ విమానాలు సమకూర్చడానికి సంబంధించిన ఆర్డర్ కోసం స్వీడన్ కంపెనీ సాబ్‌తో లాక్‌హీడ్ పోటీ పడుతోంది. ఈ విమానాల తయారీ కేంద్రాన్ని భారత్‌కు తరలించాలన్న లాక్‌హీడ్ ప్రతిపాదనకు అమెరికా ప్రభుత్వం మద్దతు తెలిపింది.

ఆ నోట్లు 99% తిరిగొచ్చాయి!

రద్దయిన నోట్లపై ఆర్బీఐ ప్రకటన

- రూ. 15.44 లక్షల కోట్లకు గానూ రూ. 15.28 లక్షల కోట్లు డిపాజిట్ అయ్యాయి
- వెయ్యి నోట్లలో 1.4 శాతమే తిరిగి రాలేదు
- మండిపడ్డ కాంగ్రెస్; ఆర్బీఐకి సిగ్గుచేటని వ్యాఖ్య



ముంబై: అవినీతి, నల్లధనంపై పోరాటంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయమైన నోట్ల రద్దు తదనంతర ఫలితాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) వెల్లడించింది. నోట్ల రద్దు నాటికి చలామణిలో ఉన్న రూ. 1000, రూ. 500 నోట్లలో రద్దు అనంతరం 99% బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని పేర్కొంది. రూ. 15.44 లక్షల కోట్ల విలువైన రద్దయిన నోట్లలో రూ. 15.28 లక్షల కోట్లు తిరిగి బ్యాంకుల్లో జమ అయ్యాయని తెలిపింది. అంటే, కేవలం రూ. 16, 050 కోట్లు మాత్రమే తిరిగి బ్యాంకుల్లో డిపాజిట్ కాలేదని వెల్లడించింది. అలాగే, రద్దు నిర్ణయం అనంతరం రూ. 1000 నోట్లలో కేవలం 1.4% మాత్రమే తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోనికి రాలేదని, 98.6% నోట్లు బ్యాంకుల్లో జమ అయ్యాయని పేర్కొంది. అలాగే, రద్దు నాటికి సంఖ్యాపరంగా, 1,716.5 కోట్ల రూ. 500 నోట్లు చలామణిలో ఉన్నాయని తెలిపింది. అయితే, రద్దయిన రూ. 500 నోట్లలో ఎన్ని తిరిగి వచ్చాయనే కచ్చితమైన సంఖ్యను ఆర్బీఐ వెల్లడించలేదు. 2016-17 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను బుధవారం విడుదల చేసిన ఆర్బీఐ.. అందులో నోట్ల రద్దు తదనంతర వివరాలను వెల్లడించింది. దేశంలో నల్లధనాన్ని రూపుమాపే లక్ష్యంతో గత సంవత్సరం నవంబర్ 8న రూ. 1000, రూ. 500 నోట్లను ప్రభుత్వం రద్దు చేసింది. అసాధారణ డిపాజిట్లపై విచారణ జరుపుతామని పేర్కొంటూ.. రద్దయిన నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకునేందుకు డిసెంబర్ చివరి వరకు గడవు విధించింది. ఎన్ఆర్ఐలు సహా కొన్ని వర్గాలకు మాత్రం షరతులతో జూన్ 30, 2017 వరకు పాత నోట్లను డిపాజిట్ చేసుకునేందుకు అవకాశమిచ్చింది. అనంతరం, కొత్త డిజైన్‌లో రూ. 500 నోట్లను, కొత్తగా రూ. 2 వేల నోట్లను మార్కెట్లోకి ఆర్బీఐ విడుదల చేసింది. తాజాగా, రూ. 200, కొత్త డిజైన్‌లో రూ. 50 నోట్లను మార్కెట్లోకి తీసుకువచ్చింది. రూ. 1000 నోటును మాత్రం మళ్లీ తీసుకురాలేదు. కాగా, 2016, డిసెంబర్ 2న నోట్ల రద్దు వివరాలను ఆర్థిక శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ లోక్‌సభకు తెలిపారు. అప్పుడు, రద్దయిన రూ. 1000 నోట్ల సంఖ్యను ఆయన 685.8 కోట్లుగా పేర్కొన్నారు. అప్పటికి మార్కెట్లో ఉన్న రూ. 1000, రూ. 500 నోట్ల మొత్తం విలువ రూ. 15.44 లక్షల కోట్లని తెలిపారు. ఆ వివరాలకు, బుధవారం ఆర్బీఐ వెల్లడించిన వివరాలకు తేడా ఉండటం గమనార్హం.

వారికి నోబెల్ ఇవ్వాలి: చిదంబరం

నోట్ల రద్దును సిఫారసు చేసిన ఆర్బీఐ ఇప్పుడు ఈ వివరాలతో సిగ్గుపడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిదంబరం మండిపడ్డారు. 'నోట్ల రద్దు.. బ్లాక్‌మనీని వైట్‌గా మార్చుకొనే పథకమా? అని ప్రశ్నించారు. నోట్ల రద్దుకు ప్రణాళిక రచించినవారికి నోబెల్ బహుమతి ఇవ్వాలంటూ ఎద్దేవా చేశారు. రూ. 15.44 లక్షల కోట్లలో రూ. 16 వేల కోట్లు మాత్రమే వెనక్కురాకపోవడంపై స్పందిస్తూ.. 'రూ. 16 వేల కోట్లు సంపాదించి.. కొత్త నోట్ల ప్రింటింగ్ కోసం రూ. 21 వేల కోట్లను పోగొట్టుకుంది' అని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటరీ కమిటీకి తప్పుడు వివరాలు ఇచ్చినందుకు ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌పై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెడ్తానని సమాజ్‌వాదీ నేత నరేశ్ అగర్వాల్ హెచ్చరించారు.

నోట్ల రద్దు విజయవంతం: జైట్లీ

నోట్లరద్దు నిర్ణయం విఫలమైందన్న వాదనను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తోసిపుచ్చారు. 'నల్లధనం నిర్మూలన, ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడం, పన్ను చెల్లింపుదారుల విస్తృతి తదితర నోట్ల రద్దు లక్ష్యాలను సాధించగలిగాం' అన్నారు. బ్యాంకుల్లో డిపాజిట్ అయిన నగదులో గణనీయ భాగం నల్లధనమయ్యే అవకాశముందని ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్బీఐ నివేదికలోని వివరాలు

- సంఖ్యాపరంగా.. 632.6 కోట్ల వెయ్యి నోట్లలో 8.9 కోట్ల నోట్లు మాత్రమే బ్యాంకుల్లో జమ కాలేదు. అంటే 623. 7 కోట్ల నోట్లు తిరిగి వ్యవస్థలోకి వచ్చాయి. విలువ పరంగా.. రూ. 6.326 లక్షల కోట్లలో రూ. 8,900 కోట్లు మాత్రమే బ్యాంకుల్లోకి తిరిగి రాలేదు.
- మార్చి 31, 2017 నాటికి 588. 2 కోట్ల కొత్త, పాత రూ. 500 నోట్లు మార్కెట్లో ఉన్నాయి. అలాగే, మార్చి 31, 2016 నాటికి మార్కెట్లో ఉన్న రూ. 500 నోట్ల సంఖ్య 1,570.7 కోట్లు.
- కరెన్సీ నోట్ల ప్రింటింగ్ ఖర్చు భారీగా పెరిగింది. 2015-16లో రూ. 3,421 కోట్లు ఖర్చు కాగా, 2016-17లో అది రెండింతలు దాటి రూ. 7,965 కోట్లకు చేరింది.
- చలామణిలో ఉన్న నగదు విలువ 2017 మార్చి నాటికి 13.1 లక్షల కోట్లు. గత సంవత్సరం కన్నా ఇది 20.2% తక్కువ.
- గత మార్చి నాటికి చలామణిలో ఉన్న నగదు విలువలో రూ.2 వేల నోట్ల వాటా 50.2% (సంఖ్యాపరంగా 328.5 కోట్ల నోట్లు).
- 2016 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన నకిలీ నోట్ల సంఖ్య 6.32 కోట్లు కాగా, 2017లో అది 7.62 కోట్లు.
- ఆర్బీఐ శాంపిల్ సర్వేలో నోట్ల రద్దు నాటికి చలామణిలో ఉన్న పది లక్షల రూ. 500 నోట్లలో సగటున 7.1 నోట్లు, 10 లక్షల రూ. వెయ్యి నోట్లలో 19.1నోట్లు నకిలీగా తేలాయి.





ప్రయోగానికి సిద్ధమైన పీఎస్‌ఎల్వీ రాకెట్

నేడే పీఎస్ఎల్‌వీ సీ-39 ప్రయోగం

అందుబాటులోకి రానున్న సొంత నావిగేషన్ వ్యవస్థ

శ్రీహరికోట (సూళ్లూరుపేట): పూర్తిస్థాయి స్వదేశీ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ఏర్పాటే లక్ష్యంగా ఇస్రో రూపొందించిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు లాంచ్ ఆథరైజేషన్ బోర్డు 29 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 7 గంటలకు ఈ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ సీ-39 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు. ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏ ఉపగ్రహంలో 3 రుబీడియమ్ అణు గడియారాలు పనిచేయకపోవడంతో ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్‌ను ప్రయోగిస్తున్నారు. బుధవారం రాకెట్ నాలుగో దశలో ద్రవ ఇంధనం నింపే ప్రక్రియ చేపట్టిన శాస్త్రవేత్తలు, గురువారం రెండో దశలో ద్రవ ఇంధనాన్ని నింపనున్నారు. అనంతరం రాకెట్‌కు తుదివిడత తనిఖీలు నిర్వహించి హీలియం, నైట్రోజన్ గ్యాస్ నింపే పనులను పూర్తి చేస్తారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలను అప్రమత్తం చేసి గురువారం సాయంత్రం 7 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ-39 ద్వారా 1,425 కిలోల బరువైన ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించనున్నారు. ఈ ప్రయోగంతో దేశానికి సొంత నావిగేషనల్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

ఆధార్ గడువు పెంపు

డిసెంబర్ 31 వరకు పెంచుతున్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: సంక్షేమ పథకాలకు ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించనున్నట్లు సుప్రీం కోర్టుకు కేంద్రం తెలిపింది. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆధార్‌ను కేంద్రం తప్పనిసరి చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. సెప్టెంబర్ 30తో ముగియనున్న ఆధార్ అనుసంధానం గడువును డిసెంబర్‌కు పొడిగించినట్లు నివేదికను అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనం ముందుంచారు. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని ఇటీవల 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించిందని, ఆధార్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణ చేపట్టేందుకు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాది శ్యాం దివన్ కోరారు. సెప్టెంబర్ 30తో ఆధార్ అనుసంధానం గడువు ముగియనుందని శ్యాం పేర్కొనగా, ఆ గడువును డిసెంబర్ 31కి పెంచుతున్నట్లు అటార్నీ జనరల్ తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన పిటిషన్లపై నవంబర్ చివరి వారంలో వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది.

అన్నాడీఎంకేకి కేంద్రం అభయం!

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులో మైనారిటీలో పడిన పళనిస్వామి ప్రభుత్వానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు అభయహస్తమిచ్చినట్లు తెలుస్తోంది. కేంద్రం, గవర్నర్ల జోక్యం ఉండదని హోం మంత్రి రాజ్‌నాథ్ హామీ ఇచ్చినట్లు సమాచారం. దినకరన్ వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో తమిళనాడు సర్కారు మైనారిటీలో పడింది. తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య 21కి చేరిందని, రెండ్రోజుల్లో గవర్నర్‌ను కలుస్తానని బుధవారం దినకరన్ ప్రకటించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళ అనుమతి లేకుండా పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించే అధికారం ఎవరికీ లేదన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ బలపరీక్షకు విపక్షాలు డిమాండ్లు పెరగడంతో పళనిస్వామి ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని కోరింది. ఢిల్లీకి వెళ్లిన పళని వర్గం ఎంపీలు తంబిదురై, మైత్రేయన్ బుధవారం హోంశాఖ కార్యదర్శిని కలిశారు.

సైన్యంలో భారీ సంస్కరణలు: జైట్లీ



న్యూఢిల్లీ: సైన్యం పోరాట సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వీలుగా ఆర్మీలో భారీ ఎత్తున సంస్కరణలు చేపట్టనున్నట్లు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ మీడియాకు తెలిపారు. ఇందులో భాగంగా ఆర్మీలో సివిల్ విధులు నిర్వహిస్తున్న 57,000 మంది అధికారులు, జూనియర్ కమిషన్డ్ అధికారులను యుద్ధ విధుల్లోకి తీసుకోనున్నట్లు జైట్లీ వెల్లడించారు. చైనాతో డోక్లామ్ వివాదం నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్న విలేకరుల ప్రశ్నకు జైట్లీ స్పందిస్తూ ఈ అంశం అంతకంటే ముందే కేంద్రం పరిశీలనలో ఉందన్నారు. ఆర్మీలో నిర్మాణాత్మక సంస్కరణల కోసం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ షెకత్కర్ కమిటీ సమర్పించిన నివేదికలోని 99 సిఫార్సుల్లో 65 అంశాలకు రక్షణ శాఖ ఆమోదం తెలిపిందని జైట్లీ పేర్కొన్నారు. సమాచార వ్యవస్థను మెరుగుపరచుకోవడం, శాంతియుత ప్రాంతాల్లో సైనిక పోస్టల్ కార్యాలయాలు, సైనిక క్షేత్రాలను మూసివేయడం, బేస్ వర్క్‌షాపులను పునరుద్ధరించడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. 2019, డిసెంబర్ 31 నాటికల్లా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని జైట్లీ తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 39 సైనిక క్షేత్రాలను దశల వారీగా మూసివేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

తెరపినివ్వని 'హార్వీ'

30కి చేరిన మృతుల సంఖ్య

- మృతుల్లో ఓ భారతీయ విద్యార్థి
- లూసియానాలో తీరాన్ని తాకిన తుపాను



హ్యూస్టన్‌లో ఆడిక్స్ రిజర్వాయర్ దగ్గర్లో జలమయమైన వ్యాపార, నివాస సముదాయాలు

హ్యూస్టన్: గత ఐదురోజులుగా అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని వణికిస్తున్న తుపాను హార్వీ మరింత విధ్వంసకరంగా మారుతోంది. బుధవారం నాటికి తుపాను సంబంధిత కారణాలతో మరణించిన వారి సంఖ్య 30కి చేరింది. వారిలో ఓ భారతీయ విద్యార్థి కూడా ఉన్నాడు. గురువారానికల్లా 150 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు అంటున్నారు. వరదలు తగ్గితే ఇంకా భారీ సంఖ్యలో మృతదేహాలు, మృతుల వివరాలు లభించే అవకాశం ఉందన్నారు. వరదలను అవకాశంగా తీసుకుని జరిగే దొంగతనాలు, నేరాలను నివారించేందుకు హ్యూస్టన్ నగరంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కర్ఫ్యూ విధిస్తున్నారు. వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు వేలాది సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. హ్యూస్టన్, సమీప ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు వరదలో చిక్కుకున్న 13 వేల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు తెలిపారు.

రెండోసారి తీరాన్ని తాకిన హార్వీ..

హార్వీ తుపాను బుధవారం టెక్సాస్ పొరుగు రాష్ట్రం లూసియానాలో గంటకు 72 కి.మీ వేగంతో గాలులు వీస్తుండగా రెండోసారి తీరాన్ని తాకింది. 2005లోనూ కత్రినా తుపాను లూసియానాలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. హార్వీ గత శుక్రవారమే టెక్సాస్‌లో తొలిసారి తీరాన్ని తాకడం తెలిసిందే. కేమరూన్ పట్టణానికి సమీపంలో హార్వీ తాజాగా తీరాన్ని తాకినట్లు అమెరికా వాతావరణ విభాగం తెలిపింది. తీవ్రత ప్రకారం హార్వీని నాలుగోరకం తుపానుగా పేర్కొంది. లూసియానాలో ఇంకా 13 నుంచి 25 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందనీ, బుధవారం రాత్రి నుంచి తుపాను తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొంది.

సరస్సులో మునిగిన విద్యార్థి మృతి

బ్రయాన్ సరస్సులో మునిగిన భారతీయ విద్యార్థి నిఖిల్ భాటియా (24) వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతూ ప్రాణాలు విడిచాడు. టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చదువుతున్న జైపూర్‌కు చెందిన నిఖిల్ తన సహ విద్యార్థులతో కలిసి వర్షంలోనే శనివారం ఈతకొట్టేందుకు సరస్సు వద్దకు వెళ్లాడు. నిఖిల్‌తోపాటు షాలిని సింగ్ అనే మరో విద్యార్థిని కూడా సరస్సులో మునిగిపోగా, ఆ ఇద్దరిని పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించడం తెలిసిందే. ఢిల్లీ అమ్మాయి షాలిని పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

భారతీయుల సాయం

వరదల్లో చిక్కుకున్న అమెరికా ప్రజలకు అక్కడి అధికారులతో పాటు భారత సంతతి ప్రజలు కూడా ఆపన్న హస్తం అందిస్తున్నారు. అవసరమైన వారికి ఆహారం, వైద్యం, ఆశ్రయం కల్పిస్తున్నారు. అబీజార్ త్యేబ్జీ అనే వ్యక్తి 1,500 మందికి ఆహారం ఏర్పాటు చేశారు. ఇండో-అమెరికన్ చాంబర్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్, స్థానిక రెస్టారంట్ మద్రాస్ పెవిలియన్ కలిసి శిబిరాల్లో ఉన్న 500 మందికి భోజనం పంపాయి. కష్టాల్లో ఉన్న వారికి వందలాది భారతీయ-అమెరికన్ వాలంటీర్లు కూడా సాయం అందిస్తున్నారు. అనేక భారతీయ వ్యాపార సంస్థలు, ప్రార్థనా స్థలాలు నిరాశ్రయులకు చోటు కల్పిస్తున్నాయి. భారతీయ రెస్టారెంట్లు, కుటుంబాలు వారికి ఆహారాన్ని సరఫరా చేస్తున్నాయి. అనేక మంది భారత సంతతి వైద్యులు ఉచితంగా సేవలు అందిస్తున్నారు. హిందూస్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్, ఇండియా హౌస్, ఇండియా కల్చర్ సెంటర్, ది ఇండో-అమెరికన్ చారిటీ ఫౌండేషన్ తదితర సంస్థలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి.

తేరుకుంటున్న ముంబై



మహారాష్ట్రలో వర్షాలకు 10 మంది మృతి

ముంబైలో వరదనీటి ఉధృతికి దెబ్బతిన్న కార్లు

ముంబై: మహారాష్ట్రలో రికార్డు స్థాయిలో కురిసిన వర్షం... తత్ఫలితంగా వచ్చిన వరదలకు ముంబై, పొరుగు జిల్లాలు పాల్‌ఘర్, ఠాణేలో కలిపి 10 మంది మరణించారు. కుండపోత వర్షాలతో కుదేలైన ముంబై నగరం ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. మంగళవారం మొత్తంగా కలిపి ముంబైలో 33.14 సెం.మీ. వర్షం కురిసిందని వాతావరణ విభాగం తెలిపింది. గత పన్నెండేళ్లలో ముంబైలో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదేనంది. 2005 జూలై 26న 94.4 సెం.మీ. వర్షపాతం నమోదై.. దాదాపు ముంబై మొత్తం నీటమునిగింది. ఆ వరదల్లో 500 మందికిపైగా మరణించారు. తాజా వర్షాలకు ముంబైలోని ఘాట్కోపర్‌లో గోడ కూలి ఒకరు చనిపోయారు. ముగ్గురు కాలువల్లో పడి మరణించగా, వినాయక నిమజ్జనం సమయంలో ఒకరు మృతి చెందారు. పాల్‌ఘర్ జిల్లాలో నలుగురు వరదల్లో కొట్టుకుపోయారు. వారిలో మూడేళ్ల వయసున్న పాప మృతదేహాన్ని వెలికితీయగా, మిగతావారి మృతదేహాల కోసం గాలిస్తున్నారు. ఠాణే నగరంలో కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ముంబైలో మంగళవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమవడం, విమాన, రోడ్డు, రైలు రవాణా సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడటం తెలిసిందే. బాంబే ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యుడు దీపక్ ఆమ్రపుర్కర్ మంగళవారం రోడ్డుపై నడచుకుంటూ వెళ్తుండగా ఎల్ఫిన్‌స్టోన్ రోడ్ సమీపంలో కనిపించకుండా పోయారు. ఆయన మ్యాన్‌హోల్లో పడిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
గురువారం ॥ 31-8-2017



ముందడుగు వేసేది పాదమే
ముందంజలో ఉంచేదీ పాదమే
పాదానికి ప్రాబ్లమ్ వస్తే వెనకబడిపోతాం
అవును... పడిపోతాం
పాదాన్ని జాగ్రత్తగా చూసుకోకపోతే
ఆరోగ్యాన్నే తొక్కేస్తుంది.
పాదం... పదిలం!

పాదం తొక్కేస్తోందా?

కాలు లేకపోతే కదలిక లేదు. పాదం కదలకపోతే పురోగతి లేదు. అంతెందుకు పాదంలో ఏదైనా సమస్య ఉండి కాళ్లను కదిలించలేకపోతే మన క్యాలరీల ఖర్చు తగ్గుతుంది. దాంతో మొత్తం ఆరోగ్యమే దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చిన్నప్పటి నుంచి కాళ్లు కదలాలి. కదలిక ఉండాలి. అంటే వ్యాయామ రూపంలోనన్నమాట. అప్పుడే ఆరోగ్యం ఉంటుంది. ఇది కేవలం శారీరక ఆరోగ్యానికి మాత్రమే పరిమితం కాదు... మానసిక ఆరోగ్యానికి కూడా. పిల్లల్లో ఏమాత్రం కదలికలు లేకుండా ఇంటికే పరిమితమయ్యేవారు, ఏవో కారణాలతో కాళ్లు కదలికలు మందగించి మంచానికే అంటిపెట్టుకుని ఉండేవారిలో కొన్ని మానసిక సమస్యలూ కనిపించవచ్చు. తాము బయటికి వెళ్లకపోవడం, నలుగురిలో కలవకపోవడంతో డిప్రెషన్ వంటి సమస్యలూ రావచ్చు. అంతేకాదు... పోటీతత్వం మందగించి మందకొడిగానూ మారిపోవచ్చు. పిల్లల్లో ఆ పరిస్థితి రానివ్వకుండా చూసుకుంటే చదువుల్లో, ఆటల్లో, ఎదిగాక సమాజంలోనూ వారిది క్రియాశీల భూమిక. అంత కీలకమైనది కాలు. చలనశీలమైనది పాదం. ఆ పాదం గురించి కొన్ని విషయాలు ఆపాదం నుంచి మస్తకంలోకి వెళ్లడానికి ఈ కథనం.

పాదాల నిర్మాణం: మానవ పాదంలో 26 ఎముకలు ఉంటాయి. మానవ శరీరంలో మొత్తం 206 ఎముకలు ఉంటాయి. అంటే రెండు పాదాల్లోనూ కలుపుకుంటే 52 కాబట్టి... ఒక వ్యక్తిలో ఉండే మొత్తం ఎముకల్లోని నాలుగో వంతు పాదాల్లోనే ఉంటాయన్నమాట. 107 లిగమెంట్లు, 19 కండరాలు ఉంటాయి. ఒక వ్యక్తి బరువంతా మోయడానికి వీలుగా పాదం విశాలంగా రూపొందింది.

మొదటి నష్టం షూస్ లేదా పాదరక్షలతోనే...



ప్రతి వ్యక్తిలోనూ 20 ఏళ్ల వయసు వచ్చే వరకూ పాదం పూర్తిగా రూపొందే ప్రక్రియ పూర్తి కాదు. కానీ మారుతున్న జీవనశైలి ప్రకారం చిన్నప్పట్నుంచే ప్రతివారి పాదాలనూ షూలతో బిగించి ఉంచడం సాధారణమైంది. బుడిబుడి అడుగులు వేసే బుడతల పాదాలను సైతం రంగురంగుల సాక్స్ లేదా షూలతో బిగిస్తుంటారు. దీనివల్ల వచ్చే చిన్న చిన్న లోపాలే పెద్దయ్యాక నడకలో నష్టం కలిగించే అవకాశం ఉంది.

హైహీల్ వల్ల నష్టాలు ఎందుకంటే...



జీవులు తమ నాలుగు కాళ్ల మీద నడవడానికి అనువుగా రూపొందాయి. కానీ మనిషి తన రెండు కాళ్ల మీదే మొత్తం బరువు మోపేలా ముందు వైపు లింబ్స్‌ను చేతులుగా రూపొందించుకుంటూ నిటారుగా నిలబడ్డాడు. దాంతో మనిషి బరువంతా రెండు కాళ్ల మీద వెన్ను మీద పడటం ప్రారంభమైంది. మన వీపు భాగం ఇంగ్లిష్ అక్షరమైన 'ఎస్' అనే ఆకృతితో ఉంటుంది. వెన్నెముక ఉన్న జీవులన్నీ నడిచే సమయంలో పడే ఒత్తిడిని గణనీయంగా తగ్గించడానికి ఈ 'ఎస్' ఆకృతి ఉపకరిస్తుంది. హైహీల్స్ తొడగడం వల్ల నడుం భాగంలో ఉండే వీపు (లంబార్) ప్రాంతం తన ఒంపును కోల్పోయి నిటారుగా అవుతుంది. ఆపైన ఉండే ఛాతీ భాగంలోని వెనకభాగపు వీపు (థొరాసిక్ లేదా మిడ్ బ్యాక్), మెడ, తల... ఇవన్నీ సాధ్యమైనంత నిటారుగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఈ ప్రయత్నంలో మనిషికి స్వాభావికంగా ఉండే 'ఎస్' ఆకృతి ఒంపు కాస్తా నిటారుగా మారుతుంది. దాంతో కండరాలపై ఉండాల్సినదాని కన్నా ఒత్తిడి అధికమవుతుంది. పైగా వాటిని సరైన అలైన్‌మెంట్‌లో లేకుండా అదేపనిగా ఉపయోగించడం వల్ల కండరాలు దెబ్బతిని నొప్పి వస్తుంటుంది.

హైహీల్స్ ఇష్టపడేవారికి టిప్స్

❖ రోజంతా హైహీల్స్ మాత్రమే వేసుకోకండి
❖ మధ్యాహ్నం లేదా సాయంత్రాలే షాపింగ్ చేయండి. ఆ సమయంలో మీ పాదాల ఫ్లెక్సిబిలిటీ ఎక్కువ.
❖ మీ హైహీల్ షూను ఎంచుకునే సమయంలో ఒకదాని తర్వాత మరొకటి ధరించి కాకుండా... రెండింటినీ ఒకేసారి వేసుకుని నడిచి చూడండి. (ఒక్కోసారి హీల్ నిడివిలోనూ మార్పు ఉండవచ్చు. రెండింటినీ ఒకేసారి వేసుకుంటే ఆ తేడా తెలిసేందుకు అవకాశం ఎక్కువ)
❖ మీ మడమ వెడల్పులో మడమ ఎత్తు సగం ఉంటే అది సరైన ఆరోగ్యకరమైన హీల్ అని గుర్తుంచుకోండి.
❖ మీరు హైహీల్స్ తొడిగే ఫ్రీక్వెన్సీ ఎంత తగ్గితే మీకు దాని వల్ల వచ్చే నొప్పులూ అంతగా తగ్గుతాయి
❖ పాయింటెడ్ హైహీల్స్ లేదా మరీ బిగుతుగా ఉండే షూస్ వేసుకోవద్దు
❖ మీరు హైహీల్స్ వేసుకోవడం వల్ల కలిగే కొన్ని ప్రమాదాల వల్ల అసలు పాదరక్షలే తొడగలేని పరిస్థి తి కూడా తలెత్త వచ్చని గుర్తుంచుకోండి
❖ హైహీల్స్ వేసుకునే ముందు మీ మోకాలి కింద వెనక భాగంలో ఉండే కాఫ్ మజిల్స్‌ను కాసేపు రుద్దుకుంటూ వార్మప్ మసాజ్‌లా చేయండి. కాఫ్ మజిల్స్‌కు ప్రతిరోజూ తగినంత వ్యాయామాన్ని, స్ట్రెచింగ్‌ను ఇవ్వండి
❖ మీరు నిర్దేశించుకున్న సమయం కంటే ఎక్కువ సేపు హైహీల్స్ వేసుకుంటే... అవి విడిచాక కాసేపు రెండు కాళ్లూ కాస్తంత దూరంగా పెట్టి పాదాలు నేలకు ఆనేట్లుగా ఉంచి కాసేపు అలాగే నిలబడండి. ఈ సమయంలో ముందుకు వంగి మోకాళ్లు ఒంగకుండా చేతి వేళ్లతో కాలివేళ్లను ముట్టుకునే స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజ్‌ను చేయండి
❖ హైహీల్స్ తొడిగినప్పుడు నొప్పిగా ఉంటే అలా భరిస్తూ నడక కొనసాగించకండి. వెంటనే వాటిని విడిచేయండి.

పాదాలలో పగుళ్లు



పాదాల పగుళ్లకు అలర్జీలు మొదలుకొని చాలా కారణాలు ఉండవచ్చు. శరీరానికి తగిన నీరు అందకపోతే కూడా కాళ్లకు పగుళ్లు ఏర్పడతాయి. మనం వాడే సబ్బు, తీసుకునే ఆహారంలో న్యూట్రిషన్ పాళ్లు తక్కువగా ఉండటమూ కారణం కావచ్చు. కాళ్ల పగుళ్లకు బ్యాక్టీరియా/ఫంగల్ ఇన్ఫెక్షన్స్ కారణమైతే ఒక్కోసారి అవి పగుళ్ల నుంచి పుండ్లుగా మారొచ్చు. అందుకే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. కొన్నిసార్లు డయాబెటిస్/థైరాయిడ్ /ఒబేసిటీ లాంటివీ కాళ్ల పగుళ్ల సమస్యకు కారణం కావచ్చు. పాదాల పగుళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందాలంటే ఈ కింది సూచనలు పాటించాలి. మంచినీటిని ఎక్కువగా తాగాలి. గోరువెచ్చటి నీటిలో కాస్తంత ఉప్పు వేసి కాళ్లను కొన్ని నిమిషాల పాటు అలాగే ఉంచి, శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత పొడిబట్టతో శుభ్రంగా, తడిలేకుండా తుడవాలి. మాయిశ్చరైజర్ ఎక్కువగా ఉండే క్రీములను కాళ్లకు రాసుకొని సాక్సులను ధరించాలి. రాత్రంతా సాక్స్‌లు ధరించడం మంచిది.

కాలికి వచ్చే ఆరోగ్య సమస్యలు ఎన్నెన్నో...



పాదాలకు వచ్చే ఆరోగ్య సమస్యలు చాలా రకాలుగా ఉంటాయి. అందులో ముఖ్యమైన కొన్ని సమస్యలివే...

ఆనెకాయలు: షూ వల్ల ఒకేచోట నిరంతరం ఒత్తిడి పడుతుండటం వల్ల ఈ ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. దాంతో అక్కడ మృతకణాలు చేరుతూ పోవడం వల్ల ఈ ఆనెకాయలు వస్తుంటాయి. కొందరు ఆనెకాయలను బ్లేడుతో కోసేస్తుంటారు. మరికొందరు ఆనెకాయలపై కొన్ని చుక్కల యాసిడ్ పోస్తూంటారు. కానీ ఆనెకాయలు వస్తే దాని చుట్టూ ప్లాస్టర్ వేసి డాక్టర్‌కు చూపించాలి.

బ్యూనియన్: కొందరికి షూ ముందు భాగం సన్నగా ఉండటం వల్ల కాలి బొటనవేలు లోపలి వైపునకు నొక్కుకుపోయి, దాని వెనకవైపు ఎముక ముందుకు పొడుచుకువచ్చినట్లుగా అవుతుంది. ఈ సమసయను 'బ్యూనియన్' అంటారు. కొందరిలో ఇది వారసత్వంగానూ కనిపిస్తుంది. షూ వల్ల మరింత పెరుగుతుంది. షూ ఒరుసుకుపోతున్న చోట... పాదం తనను తాను రక్షించుకునేందుకు మరో అదనపు కణజాలాన్ని వృద్ధి చేసుకుంటుంది. ఇలాంటి సందర్భాల్లో సమస్య ఉన్నవారు డాక్టర్‌ను కలిసి, అవసరమైతే శస్త్రచికిత్స చేయించుకోవడం అవసరం.

అథ్లెట్స్ ఫుట్ : ఈ సమస్య ఫంగస్ కారణంగా వస్తుంది. నిజానికి ఈ ఫంగస్ ఎప్పుడూ పాదాలపై ఉండే ఉంటుంది. కానీ పాదం నిత్యం తేమ, తడిలో ఉన్నప్పుడు ఆ ఫంగస్ పెరిగి, చర్మం చిట్లి, అథ్లెట్స్ ఫుట్ సమస్య వస్తుంది. అరికాళ్లలో ఉండే చెమట గ్రంథుల స్రావంతోనూ పాదం చెమ్మబారి ఈ సమస్య రావచ్చు. ఇలాంటప్పుడు పాదాన్ని శుభ్రంగా కడిగి, వీలైతే ఆల్కహాల్ ఉన్న వాష్‌లను ఉపయోగించి శుభ్రం చేసి, పాదాల మీద పౌడర్ చల్లి, ఎప్పుడూ పొడిగా ఉండేలా చూసుకుంటే పాదం ఆరోగ్యంగా ఉంటుంది. సమస్య తీవ్రతను బట్టి యాంటీ ఫంగల్ ట్యాబ్లెట్స్ కూడా వేసుకోవాల్సి రావచ్చు.

బొటనవేలి గోరు లోపలికి పెరగడం : కొందరికి బొటనవేలిపై ఉన్న గోరు లోపలివైపునకు పెరుగుతూ ఉంది. ఇలా జరగకుండా చూసుకోవాలంటే కాలి గోర్లు తీసే సమయంలో మూలల్లో మరీ చిగుర్ల నుంచి కాకుండా కాస్తంత దూరం నుంచే కట్ చేసుకుంటే ఈ సమస్యను ఎప్పటికీ రాకుండా చూసుకోవచ్చు.

పాదాలకు తిమ్మిర్లు పట్టడం : పాదానికి తిమ్మిర్లు పట్టి, పాదం మొద్దుబారినట్లుగా ఉండటం చాలా మందిలో కనిపించే సాధారణ లక్షణమే. ఇలాంటి లక్షణం కనిపించినవారిలో షుగర్ వ్యాధి లేకపోతే దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. అయితే షుగర్ వ్యాధి ఉండి తిమ్మిర్లతో పాదం మొద్దుబారి స్పర్శ తెలియకపోతే మాత్రం తప్పక డాక్టర్‌ను సంప్రదించాల్సిందే.

పాదాల వ్యాయామం: పాదాల కోసం చేయాల్సిన వ్యాయామాలు చాలా రకాలుగా ఉంటాయి. చిన్న వయసులో అయితే స్కూలు ఆవరణలో ఆడే అనేక రకాల ఆటలు పిల్లలకు ఆరోగ్యాన్ని ఇస్తాయి. స్కిప్పింగ్ లాంటివి కాళ్ల ఆరోగ్యంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకూ తోడ్పడతాయి. ఇక టీనేజ్ దాటాక జిమ్‌కు వెళ్లే యువకులు స్క్వాట్స్ మొదలుకొని, వారికి అనువుగా ఉండే అనేక రకాల వ్యాయామాలు చేస్తారు. పిక్కలు మనకు గుండెలాంటివి కాబట్టి వాటిని ఆరోగ్యంగా ఉంచుకోవడం, వాటి రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు రాకుండా జాగ్రత్తపడటం వల్ల కాళ్ల ఆరోగ్యం బాగుటుంది. అయితే ఏ వయసు వారిలోనైనా బ్రిస్క్ వాకింగ్ చేయడం అన్ని విధాలా ఆరోగ్యకరం. అది కాళ్లతో పాటు సమస్త అవయవాలకూ ఆరోగ్యాన్ని ప్రదానం చేస్తుంది.

పాదరక్షల ఎంపిక ఎలా ఉండాలంటే...

పాదరక్షల ఎంపికలో మొదట రెండు పాదాల పొడవును కొలిచి, రెండింటికీ సౌకర్యంగా ఉండే జోడునే ఇవ్వమని చెప్పాలి. మనం తొడుక్కునే షూస్ పాదం చివరే ముగియకుండా... మరో రెండు సెంటీమీటర్లు ఎక్కువగా ఉండాలి. అలా ఖాళీ ఉందో లేదో నొక్కి చూసుకోవాలి. పాదంలో వెడల్పులగా ఉండే భాగం ముడుచుకోకుండా, సౌకర్యంగా పరచుకునేలా షూ ఉండాలి. ఈమధ్య చాలామంది పొట్టిగా ఉండే 'షార్ట్ సాక్స్' తొడుగుతున్నారు. అవి కాలిని బాగా బిగుతుగా మడిచినట్లుగా చేసే టైట్ షూ అంత ప్రమాదకరం. సాక్స్ కాస్త సాగుతూ ఉండేవి అయితేనే మంచిది.

డయాబెటిస్ ఉన్నవారు పాదాల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...



మిగతావారితో పోలిస్తే డయాబెటిస్‌తో బాధపడేవారు పాదాలను మరింత శుభ్రంగా ఉంచుకోవాలి. అందునా ఐదు నుంచి పదేళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు తమ కాళ్లను ప్రత్యేకంగా పాదాలను చాలా జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించుకుంటూ ఉండాలి. వారు పాదాల పరిరక్షణ కోసం పాటించాల్సిన సూచనలివి...

- తరచూ కాలి పరీక్ష స్వయంగా చేసుకుంటూ ఉండాలి. పాదాల కింద అద్దం పెట్టుకుని, పాదం ఏవిధంగా ఉందో చూసుకోవాలి. కాలి పైభాగాన్ని కూడా నిశితంగా పరిశించుకోవాలి. అలాగే కాలి వేళ్ల మధ్య భాగాలనూ పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరిశీలనలో చిన్న పొక్కులాంటిది ఉన్నా దాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో అది పుండుగా మారే ప్రమాదం కూడా ఉండవచ్చు. అది భవిష్యత్తులో కాలిని తొలగించేంత ప్రమాదకరంగా కూడా మారేందుకు అవకాశం ఉంటుంది. అందుకే పొక్కు చిన్నగా ఉన్నప్పుడే పూర్తిగా మానిపోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నిత్యం పాదాలను పొడిగా ఉంచుకోవాలి. కాళ్లు కడుక్కున్న వెంటనే పొడిగా అయ్యేలా తుడుచుకోవాలి. కాలి వేళ్ల మధ్య కూడా పొడిగా ఉండటం కోసం పౌడర్ రాసుకోవాలి.
- కాలికి చెప్పులు, బూట్లు లేకుండా నడవకూడదు. అయితే ఈ చెప్పులు, బూట్లూ కాలికి చాలా సౌకర్యంగా ఉండాలి. ఏమాత్రం అసౌకర్యం ఉన్నా ఆ పాదరక్షలు వాడకండి. సౌకర్యంగా ఉండేవి మాత్రమే ఎంచుకోవాలి.
- వేడి వస్తువులనుంచి మీ కాళ్లను దూరంగా ఉంచుకోండి. డయాబెటిస్ ఉన్నవారు హాట్ వాటర్ బ్యాగ్‌తో కాళ్లకు కాపడం పెట్టుకోక పోవడమే మంచిది.
- పాదాలను మృదువుగా ఉంచుకోవాలి. ఇందుకోసం కాళ్లు కడుక్కున్న తర్వాత పొడిగా తుడుచుకొని, ఆ తర్వాత వాజిలైన్‌తో కాళ్లను రుద్దుకొని, మళ్లీ ఆ తర్వాత పొడిగానూ మారేలా శుభ్రం చేసుకోవాలి.
- కాళ్లమీద పులిపిరి కాయల్లాంటివి ఏవైనా ఏర్పడితే డాక్టర్‌ను సంప్రదించి, వారి పర్యవేక్షణలోనే వాటిని తొలగించుకోవడం చాలా అవసరం.
- కాలిగోళ్లను ప్రతివారమూ తొలగించుకోవాలి. ఈ సమయంలో గోళ్లను మరీ లోపలికి కట్ చేసుకోకూడదు. అలాంటప్పుడు ఒక్కోసారి గోరుమూలల్లో రక్తం వచ్చేంతగా గోరు కట్ కావచ్చు. ఇది జరిగినప్పుడు కొందరిలో గోరు లోపలి వైపునకు పెరగవచ్చు. ఇది డయాబెటిస్ రోగుల్లో ప్రమాదం.
- ఇంట్లోకూడా పాదరక్షలు లేకుండా నడవకూడదు. ప్రత్యేకంగా తడి, తేమలో పనిచేసే మహిళలు స్లిప్పర్స్ వంటివి తొడుక్కునే పనిచేసుకోవాలి.
- ఏడాదికోసారి డాక్టర్‌కు చూపించుకుంటూ ఉండాలి. ఇవన్నీ పాదాల సంరక్షణకు ఉపయోగపడే మార్గాలు.



డాక్టర్ కె.సుధీర్‌రెడ్డి
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్, ల్యాండ్‌మార్క్ హాస్పిటల్స్, హైదరాబాద్

చివరగా... పాదాలు మన ప్రతి కదలికనూ నిర్ణయిస్తాయి... నియంత్రిస్తాయి. ప్రగతి పథాన ఉంచుతాయి. అందుకే పాదాల ఆరోగ్య పరిరక్షణే అందరి ప్రథమ ప్రాధాన్యం కావాలి.

బ్యూటిప్స్

ఫ్రూట్స్ ఫేస్ ప్యాక్



పియర్ – సగం; ఆపిల్ – సగం
ద్రాక్ష – 3
నిమ్మరసం – టీ స్పూన్
కోడిగుడ్డు – 1

పియర్‌ని, ఆపిల్‌ని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ద్రాక్షలో గింజలు తీసేసి, అన్నింటినీ కలిపి మిక్సీలో తిప్పాలి. దీంట్లో నిమ్మరసం, కోడిగుడ్డులోని తెల్లసొన కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 30 నిమిషాల పాటుంచి చన్నీటితో కడిగేయాలి. వేసవిలో ఈ ఫ్రూట్ ప్యాక్‌ని పది రోజులకి ఒకసారి వేసుకోవడం వల్ల చర్మంలో జిడ్డు తగ్గి కాంతివంతం అవుతుంది.

హెల్త్ టిప్స్

పచ్చికూరలు ఉప్పునీరు



- పచ్చి కూరగాయలు, ఆకులను తినే ముందు వాటిని తప్పనిసరిగా ఉప్పు కలిపిన గోరువెచ్చటి నీటితో కడగాలి. వాటిని పండించేటప్పుడు చల్లిన క్రిమిసంహారక మందుల అవశేషాలు, పొలం నుంచి ఇంటికి వచ్చే వరకు అవి చేసే ప్రయాణంలో వాటినాశించిన రకరకాల క్రిమికీటకాలు, దుమ్ముధూళి చన్నీటితో కడిగితే పూర్తిగా పోవు. ఇక్కడ నిర్లక్ష్యం చేస్తే పచ్చి కూరగాయలతో వచ్చే ఆరోగ్యం కంటే ముందు పురుగు మందుల ప్రభావంతో సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయి.
- ముఖం మీద బ్లాక్ హెడ్స్, మొటిమలు వస్తుంటే నూనెలో వేయించిన ఆహారాన్ని పూర్తిగా మానేయాలి. ఆహారంలో తాజా పండ్లు, పచ్చికూరగాయలతో చేసిన సలాడ్లు, మొలకెత్తిన గింజలు, మీగడ లేని పెరుగు తీసుకోవాలి. క్రమం తప్పకుండా వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరంలోని విషపదార్థాలన్నీ బయటకు పోయి అనవసరమైన కొవ్వు శరీరంలోకి చేరకుండా చర్మం తాజాగా ఉంటుంది.

ఇంటిప్స్

పాతవాటికే కొత్త ధగధగలు




- ఇంట్లో డెకరేషన్ కోసం పెట్టుకునే ఇత్తడి ఆర్టికల్స్ కాని ఇత్తడి పాత్రలు కాని మురికి పట్టినా, రంగు మారినా అమోనియాలో ముంచిన క్లాత్‌తో కాని మెత్తటి బ్రష్‌తో కాని తుడిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.
- బంగారు నగలకు దుమ్ము పట్టి డల్‌గా ఉన్నట్లనిపిస్తే ఒక కప్పు వేడినీటిలో అర కప్పు అమోనియా కలిపి ఆ మిశ్రమంలో నగను పదినిమిషాలసేపు ఉంచాలి. అమోనియా మిశ్రమంలో నుంచి తీసిన తర్వాత మెత్తని వస్త్రంతో రుద్ది ఆరనివ్వాలి. ముత్యాలు, పగడాలు, రాళ్లు పొదిగిన నగలకు ఈ పద్ధతి పనికి రాదు.

సాక్షి ఫ్యామిలీ

వైఎస్ఆర్ జిల్లా
గురువారం
31-8-2017

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్! మాది ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ! నేను ఐ.టి.ఐ అయిపోయాక ఒక సంవత్సరం జాబ్ చేసి మళ్లీ డిప్లమాలో జాయిన్ అయ్యాను. నేను నైంత్ క్లాస్ నుంచి ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నా. తనకి కూడా నేనంటే చాలా ఇష్టం. మా నేపథ్యాలు వేరు. మేము కలిసేది చాలా రేర్. లాస్ట్ మంత్ వాళ్ల అమ్మ తనకి ఫోన్ కొనిచ్చారు. దాంతో అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్లం. అనుకోకుండా ఓ రోజు దొరికిపోయాం. అప్పటి నుంచి ఫ్రెండ్ ఫోన్ తీసుకుని మాట్లాడేది. అయితే ఇప్పుడు తనకి సంబంధాలు చూస్తున్నారట. త్రీ ఇయర్స్ టైమ్ అడిగింది. తను లేకుండా నేను ఉండలేను. నేను లేకుండా తను ఉండలేదు. నేను ఇద్దరి సిస్టర్స్ పెళ్లి చేయ్యాలి. హౌస్ బాగా కట్టుకోవాలి. తను దక్కదేమో అని భయమేస్తుంది సార్. సలహా ఇవ్వండి ప్లీజ్!!

– అరుణ్



ఏందన్నా ఈ లొల్లి..
ముగ్గురు సిస్టర్స్ రెస్పాన్స్‌బులిటీ ఉంది!
వాళ్లకు పెళ్లి చెయ్యాలి!
వాళ్ల మంచి చెడూ చూసుకోవాలి!
గుడ్ బ్రదర్ అనిపించుకోవాలి!
ఇన్ని గొప్ప బాధ్యతలు పెట్టుకుని..
ప్రేమలో మునిగి పోయావా బ్రదర్?
మునగడమే కాకుండా ఈత కొట్టనంటావా బ్రో?
సుడిగుండంలో ఫ్యామిలీని వదిలేసి...
నీ సుఖం నువ్వు చూసుకుంటానంటావా భయ్యా?
ఒక్కసారి నువ్వు ఎంత గొప్పవాడివో గుర్తుచేసుకో..
నువ్వు ఎంత మంచివాడివో నీ ఫ్యామిలీకి గుర్తు చెయ్యి!
లవ్‌కి లైఫంతా ఉంది అన్నా!
ముందు నీ గురించి నీ కుటుంబం గురించి ఆలోచించు!!
నాకు తెలుసు నువ్వు నేను చెప్పినట్లే చేస్తావని!
శహబాస్ అరుణ్ అని అనిపించుకుంటావని!
'సార్.. ఇవాళ్ల అబ్బాయితో మీరు అంత ప్రేమగా మాట్లాడారు.. ఇదిగో డబుల్ అరటిపండు!'



లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

3		6	7		2		5	
	1			4	6		9	
8	4	7						
		8			1			5
	3	9		5		8	1	
7			3			6		
						5	8	1
	6		1	7			4	
	8		5		3	9		6

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	6	4	7	8	9	1	5	2
9	5	8	1	3	2	6	7	4
2	7	1	4	6	5	9	3	8
1	9	3	2	7	8	4	6	5
7	8	6	5	9	4	2	1	3
4	2	5	6	1	3	8	9	7
6	3	9	8	2	7	5	4	1
8	4	7	9	5	1	3	2	6
5	1	2	3	4	6	7	8	9

డంబెల్ షేప్-2

ఆసన్నం

గత వారం విభిన్న రకాల శరీరపు తీరుతెన్నులను బట్టి ఒబేసిటీని 3 రకాలుగా విభజిస్తారని తెలుసుకున్నాం. పొట్టకన్నా పిరుదులు, తొడలు, భుజాలు బాగా లావుగా ఉంటే డంబెల్ ఒబేసిటీ అంటారని, ఆ డంబెల్ ఒబేసిటీ సమస్యకు పరిష్కారంగా కొన్ని ఆసనాలను, అవి చేసే విధానాన్ని వివరించడం జరిగింది. అదే క్రమంలో డంబెల్ షేప్ సమస్య నుంచి బయట పడేందుకు ఉపకరించే మరికొన్ని ఆసనాలు, అవి వేసే విధానాన్ని ఈ వారం కూడా అందిస్తున్నాం.



1.చక్రాసన

వెల్లకిలా పడుకుని కాళ్లు రెండూ మడచి పాదాలు–మడమలను పిరుదుల దగ్గరగా తీసుకొని మోకాళ్లు పైకి నిలబెట్టాలి. తలకి ఇరువైపులా అరచేతులు నేల మీద ఉంచి (చేతి వేళ్లు లోపలి వైపునకు ఉంటాయి) శ్వాస తీసుకుంటూ అరచేతులూ, అరిపాదాలు భూమికి బలంగా నొక్కుతూ శరీరాన్ని పైకి లేపాలి. రెండు లేదా మూడు శ్వాసల తరువాత శ్వాస వదులుతూ నెమ్మదిగా శరీరాన్ని కిందకు తీసుకురావాలి. కాళ్లను స్ట్రెచ్ చేసి చేతులు శరీరం పక్కన ఉంచి శవాసనంలో విశ్రాంతి తీసుకోవాలి. ఒక వేళ పూర్తి స్థితిలో చేయలేకపోతే...

స్టెప్-1 ముందుగా భుజాలు భూమి మీదనే ఉంచి పిరుదులను పైకి లేపాలి. శ్వాస వదులుతూ పిరుదులను భూమి మీద ఉంచాలి.

స్టెప్-2 మళ్లీ స్టెప్ 1 లోకి వచ్చి, ఈ సారి తలను (మాడు భాగాన్ని) నేలమీద ఉంచి అర చేతులు భూమి మీద ఉంచి భుజాలను కూడా పైకి లేపి రెండు మూడు సాధారణ శ్వాసల అనంతరం శ్వాస వదులుతూ ముందు భుజాలను తరువాత సీటు భాగాన్ని నేల మీదకు తీసుకు రావాలి.

స్టెప్-3 ఇంకా పూర్తి స్థాయిలో చేయాలనుకుంటే స్టెప్ 2లో నుంచి, చేతుల మీద భారం ఉంచుతూ తలను భుజాలను పూర్తిగా పైకి లేపే ప్రయత్నం చేయాలి. పూర్తి స్థితిలోకి వచ్చిన తరువాత శరీరం మొత్తాన్ని చేతుల మీద తేలికగా నిలుపగల స్థితి ఉన్నట్లయితే కుడి కాలుని పైకి లేపి పాదాన్ని కాలివేళ్లను పైకి స్ట్రెచ్ చేసి ఉంచవచ్చు. తరువాత కుడి కాలుని కిందకు తీసుకువచ్చి తిరిగి ఎడమ కాలుని పైకి తీసుకువెళ్లవచ్చు.

జాగ్రత్తలు: ఇది కొంచెం ముందస్తు భంగిమ (అడ్వాన్స్‌డ్ పోశ్చర్) కాబట్టి ఊబకాయం ఉన్నవారు శరీరాన్ని పైకి లేపాల్సి వచ్చినప్పుడు భుజాలు, చేతి మణికట్టు బలంగా ఉన్నట్లయితే తేలికగా చేయవచ్చు. మణికట్టు ఏమాత్రం బలహీనంగా ఉన్నా పూర్తి స్థాయిలో చేయకుండా స్టెప్ 1 లేదా స్టెప్ 2 వరకూ చేయడం మంచిది.



2. వీరాసన

విడదీసి ఉంచిన పాదాల మధ్యలో కూర్చున్న తరువాత వెనుకకు ఒరిగి, రెండు మోచేతులూ భూమి మీద ఆనించి, రెండు అరచేతులూ సీటు పక్కన భూమి మీద ఉంచి భూమికి నొక్కుతూ, వీపు భాగాలని తరువాత మెడ భాగాలని ఆ తరువాత తల భాగాన్ని భూమి మీద ఉంచి, చేతులు రెండూ వెనుకకు స్ట్రెచ్ చేసి ప్రశాంతంగా పడుకోవచ్చు. ఆసనం పూర్తి స్థితిలో వీపుపై భాగాలే కాకుండా వీపు మధ్య భాగం, కింద భాగం కూడా భూమి మీద ఆనించి ఉంచే ప్రయత్నం చేయాలి. మోకాళ్లు రెండూ దూరంగా కాకుండా వీలైనంత వరకు కలిపి ఉంచే ప్రయత్నం చేయాలి. అలాగే మోకాళ్లు గాలిలోకి లేవకుండా పూర్తిగా భూమి మీదనే ఆనించి ఉంచే ప్రయత్నం చేయాలి.

జాగ్రత్తలు: మోకాలు సమస్య ఉన్నవారు ఎంతవరకు సాధ్యపడితే అంతవరకే చేయాలి.

3. వీరభద్రాసనం

త్రికోణాసనం, పరివృత్త త్రికోణాసన తరువాత చేసే ఆసనం ఈ వీరభద్రాసనం. రెండు కాళ్ళమధ్య వీలైనంత దూరం ఉంచి, కుడి పాదాన్ని ముందు వైపునకు, ఎడమపాదాన్ని పక్కకు ఉంచి, కుడి మోకాలును ముందుకు వంచి, కుడి మోకాలు నుంచి కుడి తొడ కీలుభాగం వరకు 90 డిగ్రీల కోణంలో ఉండేటట్లు చూసుకోవాలి. చేతులు రెండూ 180 డిగ్రీల కోణంలో ఉంచాలి. శరీర బరువు ఎడమ పాదం మీదకు షిఫ్ట్ అయ్యేటట్లుగా శరీరాన్ని కొంచెం వెనుకకు ఏటవాలుగా ఉంచితే కుడి మోకాలు మీద లోడ్ పడదు. శ్వాసతీసుకుంటూ పూర్తి ఆసనస్థితిలోకి వచ్చి 3 లేదా 5 సాధారణ శ్వాసల తరువాత శ్వాస వదులుతూ చేతులు రెండూ క్రిందకు, కుడి మోకాలు స్ట్రెయిట్‌గా తీసుకురావాలి. ఇదే విధంగా రెండవవైపు కూడా చేయాలి.





ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్ యోగా ఫౌండేషన్

4. ఏకపాద ప్రసారిత మార్జాలాసనం

రెండు అరచేతులు ముందువైపు నేల మీద ఉంచాలి. రెండు మోకాళ్ళ మధ్య 1 లేదా ఒకటిన్నర అడుగుల దూరం ఉంచి మార్జాలాసనంలో నడుమును రిలాక్స్ చేస్తూ, నెమ్మదిగా కుడి మోచేయి, ముంజేయి, అరచేయి నేలమీద ఉంచి శ్వాస తీసుకుంటూ ఎడమకాలును బాగా స్ట్రెచ్ చేసి శ్వాస వదులుతూ ఎడమకాలును కుడివైపు పక్కకు పడేసి నడుము భాగాల్లో ట్విస్ట్ ఫీల్ అవుతూ తొడ కీలును బాగా ఓపెన్ అయ్యేటట్లుగా రిలాక్స్ చెయ్యాలి. శ్వాస తీసుకుంటూ ఎడమకాలును మళ్ళీ స్ట్రెచ్ చేసి ఎడమ మోకాలు కిందకు తీసుకు వచ్చి మళ్ళీ మార్జాలాసనంలో రిలాక్స్ అవ్వాలి. ఇదేవిధంగా రెండవవైపు కూడా చేయాలి.



డంబెల్ షేప్ నుంచి విముక్తి పొందే క్రమంలో వేయాల్సిన ఆసనాల క్రమం...

1) పరివృత్త త్రికోణాసనం 2) వీరభద్రాసనం వేరియంట్ 3) ఏకపాద ప్రసారిత మార్జాలాసనం 4) ఎల్బో ప్లాంక్ 5) ఏకపాద అధోముఖ శ్వానాసనం 6) కోణాసనం 7) ఏకపాద కపోతాసనం 8) వీరాసనం 9) చక్రాసనం

– సమన్వయం: **ఎస్. సత్యబాబు**

ఫ్యామిలీ డాక్టర్ | హోమియో కౌన్సెలింగ్స్

తిన్న వెంటనే ఇబ్బంది... తగ్గేదెలా?

నా వయసు 42 ఏళ్లు. భోజనం తిన్న వెంటనే టాయిలెట్‌కు వెళ్తున్నాను. కొన్నిసార్లు మల బద్దకం, విరేచనం ఒకదాని తర్వాత మరొకటి కనిపిస్తున్నాయి. కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి వస్తోంది. మల విసర్జనలో బంకపడుతోంది. తేన్పులు, కడుపు ఉబ్బరం, వికారం, తలనొప్పి, ఆందోళన వంటివి ఉన్నాయి. నా సమస్య ఏమిటో వివరించి, హోమియోలో చికిత్స చెప్పండి.

– రామరాజు, ఏలూరు

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీరు ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ జబ్బు రావడానికి కారణాలు స్పష్టంగా తెలియదు. అయితే ● జీర్ణవ్యవస్థలో తరచూ వచ్చే ఇన్ఫెక్షన్లు ● దీర్ఘకాల జ్వరాలు ● మానసిక ఆందోళన ● కుంగుబాటు ● ఎక్కువరోజులు యాంటీబయాటిక్స్‌వాడటం ● జన్యుపరమైన కారణలు ● చిన్న పేగుల్లో బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో ఉండటం వంటివి ఐబీఎస్‌కు దోహదం చేస్తాయి. కొందరిలో కడుపునొప్పి లేకుండా కూడా ఐబీఎస్ వస్తుంది. వీళ్లలో చాలా వేగంగా మలవిసర్జనకు వెళ్తుంటారు. ఐబీఎస్ క్యాన్సర్‌కు దారితీయదు. ప్రాణాంతకమూ కాదు. అయితే చాలా ఇబ్బంది పెడుతుంది. దీన్ని నిర్ధారణ చేయడానికి నిర్దిష్టమైన పరీక్షలు లేవు. అయితే జీర్ణవ్యవస్థకు సంబంధించిన కొన్ని పరీక్షలు చేయించి, మిగతా సమస్యలను రూల్ అవుట్ చేయడం ద్వారా ఐబీఎస్‌ను నిర్ధారణ చేస్తారు.

వ్యాధి నివారణ/నియంత్రణకు సూచనలు : ● పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి ● ఒత్తిడిని నివారించుకోవాలి ● పొగతాగడం, మద్యంపానం అలవాట్లను పూర్తిగా మానుకోవాలి ● రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలి.

హోమియోలో చికిత్స: ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌కు హోమియోలో అత్యంత శక్తిమంతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. కారణం ఏదైనప్పటికీ అంటే జీర్ణవ్యవస్థలో ఉండే ఇన్ఫెక్షన్లూ, దీర్ఘకాలంగా మందులు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావం వల్ల జీర్ణవ్యవస్థలో వచ్చే మార్పులు, ఒత్తిడి, ఆందోళన వల్ల ఐబీఎస్ వస్తే దాన్ని హోమియో పద్ధతిలో చికిత్స చేసి, సమస్యను చాలావరకు శాశ్వతంగా పరిష్కరించవచ్చు.



డాక్టర్ టి. కిరణ్ కుమార్, డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి, విజయవాడ, వైజాగ్

మూత్ర విసర్జనపై అదుపు లేదు..?

నా వయసు 52. రాత్రిపూట మూత్ర విసర్జన కోసం మాటిమాటికీ లేచేవాణ్ణి. ఈ మధ్య మూత్రం బొట్లుగా వస్తోంది. మూత్రవిసర్జన ప్రక్రియపై నా కంట్రోల్ లేదు. నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

- కె. శ్రీనివాస్, కొత్తగూడెం

పురుషుల్లో అత్యంత ప్రధానమైన గ్రంథి ప్రోస్టేట్ (పౌరుషగ్రంథి). ఇది వీర్యం ఉత్పత్తిలో కీలకమైన భూమిక పోషిస్తుంది. సంతానం కలగజేయడానికి కారణమయ్యే శుక్రకణాలు ఈ ప్రోస్టేట్ గ్రంథి తయారు చేసే స్రావాలలో కలిసి వీర్యం రూపంలో బయటకు వస్తుంటాయి. ఇలా సంతాన సాఫల్యంలో ఈ గ్రంథికి అంతటి ప్రాధాన్యం ఉంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఆ గ్రంథి కొద్దికొద్దిగా ఉబ్బుతుంటుంది. ఫలితంగా మూత్రవిసర్జనలో రకరకాల సమస్యలు తలెత్తడం సహజంగా జరిగే పరిణామమే. దీన్ని బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా' అంటారు. ప్రోస్టేట్ గ్రంథి సమస్య సాధారణంగా 40 సంవత్సరాలు పైబడ్డ వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మిగతా దేశాలతో పోలిస్తే మన దేశవాసుల్లో ఈ సమస్య ఒకింత తక్కువేగానీ... పట్టణ ప్రాంతాల్లో, మాంసాహారం తినేవాళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి సంబంధించిన లక్షణాలు కనిపించినా, మూత్ర సమస్యలు వేధిస్తున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కారణాలు: ● ప్రోస్టేట్ పెరగడానికి హార్మోన్ల స్థాయి తగ్గుదల ముఖ్య కారణం ● కాస్త అరుదుగా గాయాలు కావడం ● గౌట్ సమస్య.

లక్షణాలు: ● మాటిమాటికీ మూత్రం రావడం ● పదే పదే మూత్ర విసర్జన చేయాలనిపించడం ● మూత్రం ఆపుకోలేకపోవడం ● మూత్రం ఆగి ఆగి రావడం ● మూత్ర విసర్జనలో రక్తం పడటం

వ్యాధి నిర్ధారణ: ● అల్ట్రా సౌండ్ సోనోగ్రఫీ, బయాప్సీ, స్కానింగ్

చికిత్స: హోమియోపతి వైద్య విధానంలో ప్రోస్టేట్ గ్రంథి వాపు నుంచి పూర్తి ఉపశమనం కలిగించే మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ విధానంలో కేవలం లక్షణాలను తగ్గించడమే కాకుండా సమస్యను పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతుంది. రోగి శారీరక తత్వాన్ని బట్టి వైద్యులు తగిన మందులు సూచిస్తారు. ఆర్నికా, బెల్లడోనా, కోనియం, తూజా, మెర్క్‌సాల్ వంటి మందులు హోమియోలో అందుబాటులో ఉన్నాయి. అయితే అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో తగిన మోతాదులో వీటిని వాడాల్సి ఉంటుంది.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి, ఎండీ (హోమియో)
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

నాలుగేళ్లయినా పిల్లల్లేరు!

నా వయసు 30 ఏళ్లు. వివాహమై నాలుగేళ్లు అయ్యింది. ఇంతవరకు సంతానం లేదు. డాక్టర్‌ను సంప్రదిస్తే కొన్ని వైద్య పరీక్షలు చేసి ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అని చెప్పారు. ఇన్‌ఫెర్టిలిటీ అంటే ఏమిటి? దానికి కారణాలు ఏమిటి? హోమియోలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉందా?

- ఈశ్వరి, అమలాపురం

ఇటీవల చాలా మందిలో సంతానలేమి సమస్య కనిపిస్తోంది. దీనికి అనేక అంశాలు కారణమవుతాయి. సమస్య మహిళల్లో లేదా పురుషుల్లో ఉండవచ్చు.

స్త్రీలలో సాధారణంగా కనిపించే కారణాలు: ● జన్యుసంబంధిత లోపాలు ● థైరాయిడ్ సమస్యలు ● అండాశయంలో లోపాలు; నీటిబుడగలు ● గర్భాశయంలో సమస్యలు ● ఫెలోపియన్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలు ● డయాబెటిస్ ● గర్భనిరోధక మాత్రలు అధికంగా వాడటం.

పురుషుల్లో సాధారణంగా కనిపించే కారణాలు: ● హార్మోన్ సంబంధిత సమస్యలు ● థైరాయిడ్ ● పొగతాగడం ● శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం

సంతానలేమిలో రకాలు : ● ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ ● సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ

ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ: అసలు సంతానం కలగకపోవడాన్ని ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు. ఇది ముఖ్యంగా జన్యుసంబంధిత లోపాలు, హార్మోన్ సంబంధిత లోపాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ: మొదటి సంతానం కలిగిన తర్వాత లేదా అబార్షన్ అయిన తర్వాత మళ్లీ సంతానం కలగకపోవడాన్ని సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు. ఇది ముఖ్యంగా గర్భాశయంలో ఏమైనా లోపాలు ఏర్పడటం, ఇన్ఫెక్షన్స్ రావడం వల్ల సంభవిస్తుంది.

గుర్తించడం ఎలా: వైద్య పరీక్షల ద్వారా సమస్యను నిర్ధారణ చేస్తారు. ముఖ్యంగా థైరాయిడ్ ప్రొఫైల్, సాల్పింజోగ్రఫీ, అల్ట్రాసోనోగ్రఫీ, ఫాలిక్యులార్ స్టడీ వంటి టెస్ట్‌లు చేస్తారు.

చికిత్స: హోమియోలో ఎలాంటి సమస్యలకైనా కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స చేస్తారు. వ్యాధి తీవ్రతను పరిగణనలోకి తీసుకొని క్రమంగా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తూ సమస్యను పూర్తిగా నివారిస్తారు.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

రేణుక... గోల్డ్‌మెడలిస్ట్!

● వెన్నాడిన ఫ్లోరైడ్ భూతం ● చదువుకు వెళ్లిన చోటల్లా అవమానాలు
● కష్టాలను అధిగమించి పీజీ, బీఎడ్ చదివింది ● యూనివర్సిటీ టాపర్‌గా బంగారు పతకం సాధించింది
● వెక్కిరించిన నోళ్లే ఇప్పుడు వెరీగుడ్ అంటున్నాయ్.... ● సర్కారు కరుణించాలంటున్న చదువుల తల్లి

రేణుక... పసి ప్రాయంలోనే ఫ్లోరోసిస్ భూతం బారిన పడింది. వయస్సుకు తగ్గట్టుగా ఎదగలేకపోయింది. కనీసం నడవడానికి కూడా కాళ్లు సహకరించవు. కన్నవారికి భారమైనా కడుపుతీపి ఆమెను కాపాడింది. బిడ్డను కంటికి రెప్పలా చూసుకున్న తల్లిదండ్రులు ఆమె సంకల్పానికి ఊపిరినిచ్చారు. ఆమె చదువు కోసం ఎన్నో త్యాగాలు చేశారు. కష్టాలెన్నింటినో ఎదుర్కొంటూనే బిడ్డ ఆశయానికి అండగా నిలిచారు. తల్లిదండ్రులు అందించిన ధైర్యంతో, వెక్కిరించిన విధిని, అవమానించిన సమాజాన్ని చాలెంజ్ చేసింది. తన సంకల్పాన్ని నెరవేర్చుకుంది. ఎంఎ, బీఈడీ చదివిన రేణుక యూనివర్సిటీ టాపర్‌గా గోల్డ్‌మెడల్ అందుకుంది. ఉన్నత చదువులతో వెక్కిరించిన నోళ్లను మూయించింది. వారితోనే వెరీగుడ్ అనిపించుకుంది. కాని సర్కారు కొలువు దొరికితేనే తన సంకల్పం నెరవేరినట్టవుతుందని ఉద్యోగం కోసం తపిస్తోంది. సర్కారు కరుణ కోసం ఆరాటపడుతోంది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని ఆరెపల్లి పంచాయతీ పరిధిలో గల 'ఆరేడు' గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి–గంగ దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు. వ్యవసాయంపైనే ఆధారపడ్డ ఆ కుటుంబం సాగునీటి వేటలో అనేక కష్టాలను ఎదుర్కొంది. అయితే లక్ష్మారెడ్డి కూతురు రేణుక చిన్నతనంలోనే ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడి ఇబ్బందులపాలైంది. కూతురికి వైద్యం చేయించడం కోసం తల్లిదండ్రులు ఎన్నో ప్రయత్నాలు చేసినా లాభం లేకుండాపోయింది. అయితే కూతురికి చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు కష్టాలెన్నింటినో ఎదుర్కొంటూ ఆమెకు ఉన్నత చదువులు చెప్పించారు. సొంత ఊరైన ఆరేడులో నాలుగో తరగతి వరకే ఉండడంతో అక్కడ నాలుగో తరగతి దాకా చదివింది. తరువాత ఐదు, ఆరు తరగతులు పక్క గ్రామమైన అచ్చంపేటలో చదువుకుంది. ఏడోతరగతి నుంచి పదోతరగతి వరకు నిజామాబాద్ పట్టణంలోని వివేకానంద హైస్కూల్‌లో చదివించారు. పదో తరగతిలో 400 మార్కులు సాధించింది. తరువాత ఇంటర్మీడియల్ మెదక్ పట్టణంలో చదివింది. 658 మార్కులు సంపాదించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీకి అనుబంధమైన ఆంధ్రమహిళా సభ కళాశాలలో డిగ్రీ చదివి కాలేజ్ టాపర్‌గా నిలిచింది. బీఈడీ కూడా అదే కళాశాలలో అభ్యసించింది. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన రేణుకకు గోల్డ్‌మెడల్ అందించారు. పీజీ ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కూడా క్వాలిఫై అయ్యింది.



రేణుక

కూతురి చదువు కోసం తల్లి ఆమె వెంటే ఉండేది. కూతురు ఎక్కడ ఉంటే అక్కడ తల్లి ఉండి ఆమెను చదువుకోసం తీసుకెళ్లడం, తిరిగి ఇంటికి తీసుకురావడం జరిగేది. తండ్రి అటు వ్యవసాయం చూసుకుంటూ పిల్లల చదువుల కోసం ఆరాటపడేవారు. తల్లిదండ్రులు తన కోసం పడుతున్న శ్రమను చూసిన రేణుక పట్టుదలతో ధైర్యాన్ని కూడగట్టుకుని మరీ ఉన్నత చదువులు పూర్తి చేసింది. చదువుల్లో ఏనాడూ వెనుకబడకుండా అందరికన్నా తనే ఎక్కువ మార్కులు సాధించే ప్రయత్నం చేసింది. ఆంధ్రమహిళా సభ కళాశాలలో బీఈడీ చదివిన రేణుక గోల్డ్‌మెడల్ కూడా సాధించిందంటే ఆమె పట్టుదలకు ఇదే నిదర్శనంగా చెప్పవచ్చు.



తండ్రి సాయంతో కలెక్టరేట్ వద్ద రేణుక

సర్కారు కరుణ కోసం....

ఎంఏ; బీఈడీ పూర్తి చేసిన రేణుక ఉద్యోగం కోసం ఎదురు చూస్తోంది. డీఎస్సీ నోటిఫికేషన్లు పడకపోవడంతో ఆమె ఆశయం నెరవేరడం లేదు. కనీసం ప్రభుత్వం తన పరిస్థితిని గుర్తించి ఏదైనా ఉద్యోగం ఇస్తే కుటుంబానికి ఆసరా అవుతానంటూ ఇటీవలే కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించింది. ఫ్లోరోసిస్ బారిన పడిన తను నిత్యం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటోంది. తల్లిదండ్రులు ఆమెకు అన్ని రకాల సేవలు చేస్తూ ధైర్యాన్నివ్వడం వల్లే ఆమె ఇంతదాక నెట్టుకువచ్చింది. అయితే ప్రభుత్వం తనకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది. సాధారణంగా వికలాంగులు ఏదో ఒక పనిచేసుకుని బతకగలుగుతారని, తాను పూర్తిస్థాయిలో ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నందున ఏ పనీ చేసుకునే పరిస్థితి లేదని, తనకు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు వెంట ఉంటేనే బయటకు వెళ్లే పరిస్థితి ఉందని తెలిపింది. తనను ఆదుకోవాలని వేడుకుంటోంది రేణుక.

- సేపూరి వేణుగోపాలాచారి, సాక్షి, కామారెడ్డి
– ఫొటోలు: **జి. అరుణ్**

సినిమా
వైఎస్ఆర్ జిల్లా
గురువారం
31-8-2017
సాక్షి ఫ్యామిలీ





● ప్రభాస్

ఏమాత్రం తగ్గడం లేదు... నటీనటుల ఎంపిక విషయంలో! ఎక్కడా వెనకడుగు వేయడం లేదు... ఖర్చులో! 'సాహో' చిత్ర బృందం వేస్తోన్న ప్రతి అడుగూ సంచలన మవుతోంది. ప్రభాస్‌కు తోడు దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రేక్షకులకు తెలిసిన నటీనటులనే దర్శక-నిర్మాతలు సుజీత్, 'యూవీ క్రియేషన్స్' వంశీ-ప్రమోద్‌లు ఎంపిక చేస్తున్నారు. ఇందులో విలన్లుగా బీ-టౌన్ నుంచి నీల్

సాహోలో మందిర... మరి మోహన్‌లాల్?



● మోహన్‌లాల్

నితిన్ ముఖేశ్, జాకీ ష్రాఫ్, చంకీ పాండేలను తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ లిస్టులోకి బీ-టౌన్ నుంచి మరో లేడీని తీసుకున్నారు. మోడల్, టీవీ హోస్ట్, నటి అయిన మందిరా బేడీ 'సాహో'లో నటిస్తున్నారు. కల్కి అనే నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఇటీవల మందిరా బేడీ, జాకీ ష్రాఫ్‌లపై హైదరాబాద్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారట. మందిరా బేడీని పక్కన పెడితే... ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ 'సాహో'లో నటిస్తారని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ వార్తపై యూనిట్ సభ్యులు ఎక్కడా స్పందించడం లేదు. త్వరలో ఈ సిన్మా దుబాయ్ షెడ్యూల్ మొదలు కానుంది. ఆల్రెడీ దర్శకుడు సుజీత్ దుబాయ్ వెళ్లారు. ఆయన లొకేషన్ల వేటలో ఉన్నారు.

● మందిరా బేడీ

చైతూకి రెండోది... శర్వాకు మొదటిది!

'ప్రేమమ్'... నాగచైతన్య నటించిన చక్కటి ప్రేమకథా చిత్రాల్లో ఇదొకటి! సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. వెంకటేశ్‌తో 'బాబు బంగారం'ను నిర్మించిందీ ఈ సంస్థే. ఈ రెండిటికీ సూర్యదేవర నాగవంశీ నిర్మాత. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వరుసగా చిత్రాలను నిర్మిస్తున్న 'హారికా అండ్ హాసిని క్రియేషన్స్'కు ఈ సితార అనుబంధ సంస్థ అన్న విషయం విదితమే. ఈరోజు 'హారికా అండ్ హాసిని' అధినేత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) పుట్టినరోజు సందర్భంగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ రెండు చిత్రాలను ప్రకటించారు. నాగచైతన్య (చైతూ) హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ చిత్రం, శర్వానంద్ (శర్వా) హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో మరో చిత్రం నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ సంస్థలో చైతూకి ఇది రెండో చిత్రం కాగా, శర్వాకు మొదటిది. ''ఈ రెండు చిత్రాలకు సంబంధించిన వివరాలు త్వరలోనే ప్రకటించి, చిత్రాలను ప్రారంభిస్తాం'' అని చిత్రసమర్పకులు పీడీవీ ప్రసాద్ తెలిపారు.



● నాగచైతన్య



● మారుతి



● సుధీర్‌వర్మ



● శర్వానంద్



● కృష్ణ
● మహేశ్‌బాబు

అచ్చం నాన్నలానే!

ఫొటోలు చూశారా? అప్పట్లో కృష్ణ... ఇప్పుడు మహేశ్‌బాబు! వాళ్ల సిట్టింగ్ స్టైల్ అబ్జర్వ్ చేశారా? సేమ్ టు సేమ్ ఒకలానే ఉంది కదూ! కాలు మీద కాలేసుకోవడమయితే డిటో అసలు. కృష్ణ దిగిన బ్లాక్ అండ్ వైట్ ఫొటో ఎప్పటిదో తెలీదు గానీ... మహేశ్‌ది మాత్రం ఇప్పటిదే. రొమేనియాలో 'స్పైడర్' చివరి పాట చిత్రీకరణలో, విరామ సమయంలో సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్ తీసిన ఫొటో ఇది. ''అప్పుడు.. మా లెజండరీ మావయ్యగారు అండ్ ఇప్పుడు ఆయన సొగసరి కుమారుడు'' అని ఈ రెండు ఫొటోలను ఉద్దేశించి మహేశ్ భార్య నమ్రత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అలాగే మహేశ్ సోలో ఫొటోపై ''మహేశ్ విత్ హిజ్ ఫ్యాన్'' అని మహేశ్ ఎదురుగా ఉన్న ఫ్యాన్‌ని ఉద్దేశించి, ఆమె చిన్న జోక్ కూడా వేశారండోయ్!

నిర్మాతల శ్రేయస్సే ముఖ్యం... రేంజ్ గురించి ఆలోచించను!

"స్టోరీ నచ్చితే సినిమా చేసేయడమే. అన్నీ కుదిరితే ఒకే ఏడాది నాలుగు సినిమాలు చేస్తా" అన్నారు బాలకృష్ణ. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆయన హీరోగా వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన 'పైసా వసూల్' రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బాలకృష్ణతో 'సాక్షి' స్పెషల్ టాక్.



● బాలకృష్ణ

● **'పైసా వసూల్' అని పాజిటివ్ టైటిల్‌తో వస్తున్నారు.. పూరి జగన్నాథ్, మీ కాంబినేషన్ అంటే ఇది సెట్టవుతుందా? తేడాగా ఉంటుందా? అనుకున్నవాళ్లూ ఉన్నారు...**

పాజిటివ్ టైటిల్ అని ఇప్పుడు చాలా మంది అంటున్నారు. కానీ, ఎనౌన్స్ చేసినప్పుడు 'ఇదేం టైటిల్' అనుకున్నారు. అసలు వీళ్ళు ఏ సబ్జెక్ట్ టేకప్ చేయబోతున్నారని చర్చించుకున్నవాళ్లు ఉన్నారు. సేమ్‌టైమ్ ఎంతో క్యూరియాసిటీ, ఎగ్జైట్‌మెంట్ కనబర్చినవాళ్లూ ఉన్నారు. వాస్తవానికి పూరి డైరెక్టర్ అన్నప్పుడు నేనెంత ఎగ్జైట్ అయ్యానో నిర్మాత ఆనంద ప్రసాద్‌గారు కూడా అంతే ఎగ్జైట్ అయ్యారు. స్టంపర్ రిలీజ్ చేసేవరకూ ఈ సినిమాపై టోటల్ పాజిటివ్ టాక్ అయితే లేదు. కానీ, స్టంపర్ రిలీజ్ చేశాక సినిమాపై అపనమ్మకం పోయింది. పాజిటివ్ వైబ్ మొదలైంది.

● **కొత్త దర్శకులతోనూ, ఫ్లాప్ ఇచ్చిన దర్శకులతోనూ సినిమాలు చేస్తుంటారు. ఫర్ ఎగ్జాంపుల్ ఆ మధ్య పూరి తీసిన 'రోగ్' ఆశించిన స్థాయిలో ఆడలేదు...**

హిట్టూ, ఫ్లాపులను పట్టించుకోను. టెక్నీషియన్‌ని నమ్మి, సినిమా చేస్తా. పూరిలో మంచి టెక్నీషియన్ ఉన్నాడు. నేను కొత్తరకం సినిమాలు ట్రై చేయాలనుకుంటా. పూరితో కుదురుతుందనుకున్నా. నిజంగానే నా లుక్, బాడీ లాంగ్వేజ్‌ని డిఫరెంట్‌గా చూపించాడు. మామూలుగా నేనేదైనా సినిమా చేసే ముందు ఖాళీ సమయాల్లో గెటప్స్ ట్రై చేస్తుంటాను. 'డైరెక్టర్స్ చూసి, బాగుంది. ఇదే సినిమాకు ఉంచేద్దాం' అంటుంటారు. పూరి విషయంలో మాత్రం తనకు తగ్గట్టు మౌల్డ్ అయ్యా. ఆ క్యారెక్టర్‌లో బాలకృష్ణ నటించలేదు... పూరి పరకాయ ప్రవేశం చేస్తే బాలకృష్ణ నటించాడు (నవ్వేస్తూ). అందుకే ప్రేక్షకులకు నా బాడీ లాంగ్వేజ్, నా డైలాగ్ డెలివరీలో కొత్తదనం కనిపిస్తుంది. కొత్త దర్శకులతో సినిమాలు చేసే విషయానికొస్తే... మామూలుగా ఒక స్టార్‌డమ్ వచ్చాక కొత్తవాళ్లతో సినిమాలు చేయాలంటే ఓ భయం ఉంటుంది. స్టార్‌డమ్ అనేది ఒక అడ్డంకి లాంటిది. కానీ, నేను కొత్తవాళ్లతో చేయాలనుకుంటా. మనిషిలో విషయం ఉందనిపిస్తే ఎంకరేజ్ చేస్తా.

● **సినిమాలో 'ఏక్ పెగ్ లా...' పాట కూడా పాడారు...?**

నాన్నగారి పాటలు ఎక్కువగా వింటుంటా. విసుగు అనిపించినా, కోపం వచ్చినా పాటలు వింటాను. ఆ పాటతో పాటు గొంతు కలిపి పాడటం అలవాటు. నేనేదో పెద్ద సింగర్ అని కాదు కానీ, ఎప్పటికైనా 'శివశంకరీ.. శివానంద లహరి..' పాటను స్టేజ్ మీద పాడాలన్నది లైఫ్ యాంబిషన్. ఆ పాటను ప్రతిరోజూ సాధన చేస్తున్నాను. అది ప్రాక్టీస్ చేసీ చేసీ నా గొంతు పోయింది.

● **'గౌతమిపుత్ర శాతకర్ణి', 'పైసా వసూల్'తో ఈ ఏడాది రెండు సార్లు స్క్రీన్‌పై కనిపించడం మీ ఫ్యాన్స్‌కి ఆనందం.. 'గౌతమిపుత్ర..'లో విరామం లేదు.. విశ్రాంతి లేదు అనే డైలాగ్‌లా రియల్‌గానూ చేస్తున్నారనిపిస్తోంది...**

(నవ్వేస్తూ). వచ్చే ఏడాది నాలుగు సార్లు కనిపిస్తానేమో. నేను వర్క్ హాలిక్‌ని. నాకెప్పుడూ పని ఉండాలి. గ్యాప్ లేకుండా సినిమాలు చేసినా నాక్కావాల్సిన టైమ్ నేను తీసుకుంటాను. లేకపోతే రొటీన్‌గా అనిపిస్తుంది. నా అదృష్టం ఏంటంటే.. అన్ని రకాల పాత్రలు చేసే అవకాశం దక్కుతోంది. పౌరాణిక పాత్రలు, సామాజిక పాత్రలు.. ఇలా అన్నీ చేయగలుగుతున్నా. భవిష్యత్‌లోనూ డిఫరెంట్ రోల్స్ ట్రై చేస్తాను.

● **ఎంత పెద్ద బడ్జెట్‌తో సినిమా చేస్తే అంత రేంజ్ పెరుగుతుందని కొందరు హీరోలు భారీ బడ్జెట్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. మీకలాంటి సినిమాలు చేసే ఆలోచన?**

అప్పట్లో మా నాన్నగారు (ఎన్టీఆర్) కథకు తగ్గట్టే ఖర్చు పెట్టమనేవారు. మామూలు గోడ ఉంటే.. ఆ గోడ బ్యాక్‌డ్రాప్‌లోనే సీన్ తీయమనేవారు. అదనపు హంగులు వద్దనేవారు. నిర్మాతల శ్రేయస్సు కోరుకునేవారు. నేనూ అంతే. బడ్జెట్ కోసం స్టోరీ కాదు. కథకు తగ్గ బడ్జెట్ అనేది నా పాలసీ. ఎక్కువ ఖర్చుపెట్టి సినిమా తీస్తే రేంజ్ పెరుగుతుంది.. లాంటివి ఆలోచించను. నాకవసరంలేదు. నిర్మాతల గురించి ఆలోచిస్తా. నా దర్శకుడు ఏం చెబితే అది చేస్తా. కొన్ని విషయాల్లో నేను కమర్షియల్‌గా ఆలోచించను. సినిమా ఆనౌన్స్ చేసిన వెంటనే నీకెంత బిజినెస్ అవుతుంది? నాకెంత? అని ఆలోచించను..

● **మీ నెక్ట్స్ మూవీస్?**

పూరి డైరెక్షన్‌లో ఓ మల్టీస్టారర్ మూవీ అనుకుంటున్నాం. నాన్నగారి జీవిత చరిత్రతో సినిమా తీయాలని ఉంది. దానికి సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. వీలైతే వచ్చే మే 28న విడుదల చేయాలనుకుంటున్నాం. కేఎస్ రవికుమార్‌తో చేస్తున్న సినిమా నెక్స్ట్ షెడ్యూల్‌ను తమిళనాడులోని కుంభకోణం, ఆ తర్వాత వైజాగ్‌లో ప్లాన్ చేశాం. బోయపాటి శ్రీనుతో ఓ సినిమా ఉంది. జూన్‌లో ఈ సినిమాను స్టార్ట్ చేయాలనుకుంటున్నాం. 'నర్తనశాల' కూడా తీయాలని ఉంది. ఆ ప్లాన్స్ కూడా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది నావి మూడు, నాలుగు సినిమాలు వస్తాయేమో.

మోక్షజ్ఞ ఎంట్రీ మాస్ మూవీతోనా? వయసుకు తగ్గట్టు లవ్‌స్టోరీతోనా?
వచ్చే ఏడాది ఎంట్రీ ఖాయం. తన ఏజ్‌కి తగ్గట్టు లవ్‌స్టోరీతోనే లాంచ్ చేయాలని ఉంది.
మీ ఫ్యామిలీ హీరో అంటే.. డైలాగులు బాగా పలకాలని ఎదురు చూస్తారు...?
ఒకప్పటి ట్రెండ్ వేరు.. ఇప్పుడు ట్రెండ్ వేరు. ఇప్పుడు భాష గురించి పెద్దగా పట్టించుకోవడంలేదు. కానీ, మన భాష మీద పట్టు ఉండటం ముఖ్యం. ఆ విషయంలో తప్పకుండా జాగ్రత్త తీసుకుంటాం. కొన్ని సలహాలు ఇస్తుంటాను. ఏదేమైనా డైరెక్టర్ ఎలా చెబితే అలానే.

చుట్టూ బౌన్సర్స్ లేకుండా పబ్లిక్‌లోకి వచ్చేస్తుంటారు. దాంతో ఫ్యాన్స్ మీద పడటం, మీరు ఇరిటేట్ కావడం జరుగుతోంది. ఒకవేళ చుట్టూ బౌన్సర్స్ ఉంటే అలా జరగదు కదా?

నా ఫ్యాన్స్‌ని నేను కంట్రోల్ చేసుకోగలను. వాళ్లు నా దగ్గరకు రావాలని, మాట్లాడాలని అనుకుంటారు. మీద పడిపోతారు. అలా పడినప్పుడు మాత్రం కోపం వస్తుంది. ఎందుకంటే, ఒక క్రమశిక్షణ ఉండాలి కదా? ఎలా పడితే అలా ఉండటం నాకు నచ్చదు. నేను పాటించేవే నా ఫ్యాన్స్‌కి చెబుతా. ఉదాహరణకు, నేను ట్రాఫిక్ రూల్స్‌ని ఉల్లంఘించను. ఆడవాళ్లు, పెద్దవాళ్లు రోడ్ క్రాస్ చేస్తున్నప్పుడు వాళ్ల కోసం కారు ఆపుతా. అప్పుడు వెనకాల వాళ్లకు ఇబ్బంది ఉండకూడదని, ఆగమని చెయ్యి చూపిస్తా. ఇవన్నీ పాటించడం మన బాధ్యత. అది లేకుండా ప్రవర్తిస్తే కోపం వస్తుంది తప్ప అభిమాని అంటే ఇష్టం లేక కాదు. కొన్ని విషయాలు గట్టిగానే చెప్పాలి. ఆ సమయంలో అక్కడ నిలబడి 'అమ్మా... బుజ్జీ...' అని చెప్పలేం. అంత టైమ్ ఉండదు. అందుకే ఇరిటేట్ అవ్వాల్సి వస్తుంది. అప్పుడు కొట్టాననుకోండి, 'మా బాలయ్య కొట్టాడు. ఆయన చేతి స్పర్శ నా చెంపను తాకింది. మధ్యలో మీకేంటి' అని ఆ ఫ్యాన్ అంటాడు. ఫ్యాన్స్‌కూ, నాకూ మధ్య ఉన్న అనుబంధం అది. మాది ఎన్ని జన్మల బంధమో, ఏ విడదీయలేని బంధమో.. రుణానుబంధమో అనిపిస్తుంది.

డైరెక్ట్‌గా మార్కెట్‌లోకి!

ఎన్టీఆర్, రాశీ ఖన్నా, నివేధా థామస్ హీరో, హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న చిత్రం 'జై లవకుశ'. కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్న ఈ సినిమా పాటల చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను సెప్టెంబర్ 3న డైరెక్ట్‌గా మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు. నిర్మాత కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''జై లవకుశ' పాటలను గ్రాండ్‌గా రిలీజ్ చేయాలనుకున్నాం. భారీ వర్ష సూచనతో పాటు, పోలీస్ శాఖవారు వినాయక నిమజ్జనంలో నిమగ్నమై ఉండటంతో, అభిమానుల భద్రతకి ప్రాధాన్యం ఇస్తూ, పాటలను డైరెక్ట్‌గా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాం. కానీ, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్‌ను మాత్రం అభిమానుల సమక్షంలో గ్రాండ్‌గా చేస్తాం'' అన్నారు.



● ఎన్టీఆర్

ఖుషీ కుమారి



కుమారి ఫుల్ ఖుషీగా ఉన్నారు. కుమారి అంటే 'కుమారి 21ఎఫ్' ఫేమ్ హెబ్బా పటేల్ అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అందులో హాట్ హాట్‌గా నటించిన ఈ బ్యూటీ ఆ తర్వాత తెలుగులో వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఇప్పుడు తమిళ పరిశ్రమ నుంచి కుమారికి ఓ కబురొచ్చిందట. ఆమె ఆనందానికి కారణం అదే. ఎందుకంత ఆనందం అంటే.. ఏకంగా స్టార్ హీరో విజయ్ సినిమాలో అవకాశం వచ్చిందని ఖబర్. విజయ్ హీరోగా మురగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించే అవకాశం ఉందట. అందులో ఒక ఛాన్స్‌ను హెబ్బా పటేల్ దక్కించుకున్నారన్న ఖబర్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

● హెబ్బా పటేల్

పొల్లాచ్చిలో ప్రేమ యుద్ధం

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా శ్రీవాస్ దర్శకత్వంలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా ఓ సిన్మా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సిన్మా షూటింగ్ త్వరలో పొల్లాచ్చిలో ప్రారంభం కానుంది. ఆల్రెడీ హైదరాబాద్‌లో రెండు షెడ్యూల్స్ జరిగాయి. ఇప్పుడీ పొల్లాచ్చిలో పీటర్ హెయిన్ నేతృత్వంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత అభిషేక్ నామా మాట్లాడుతూ– ''కొత్త తరహా కథ, కథనాలతో శ్రీవాస్ ఈ కథ సిద్ధం చేశారు. లవ్, యాక్షన్, డిఫరెంట్ స్క్రీన్‌ప్లే... అన్నీ ఉన్నాయి. ప్రేమ కోసం ఓ యువకుడు ఎలాంటి యుద్ధం చేశాడనే సన్నివేశాలను పొల్లాచ్చిలో తెరకెక్కిస్తాం. పదిహేను రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగుతుంది. ఈ ఫైట్ కోసం భారీ సెట్ వేశాం'' అన్నారు. జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, 'వెన్నెల' కిశోర్, రవికిషన్, అశుతోష్ రాణా, పవిత్రా లోకేశ్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్థర్ ఎ.విల్సన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్.



● సాయి శ్రీనివాస్, పూజా హెగ్డే

డి ఫర్ డెవిల్!



● పూజా రామచంద్రన్

దేవిశ్రీ ప్రసాద్ అంటే తెలుగు ప్రేక్షకులకు సంగీత దర్శకుడు డీయస్పీ గుర్తొస్తారు. కానీ, ఇప్పుడాయన పేరుతో ఓ సినిమా రూపొందుతోంది. అలాగని, ఇదేదో మ్యూజికల్ బేస్డ్ సిన్మా కాదు. డి ఫర్ డెవిల్, ఎస్ ఫర్ సస్పెన్స్‌లతో తెరకెక్కిన పి ఫర్ పక్కా హారర్ థ్రిల్లర్. పూజా రామచంద్రన్, మనోజ్ నందన్, భూపాల్ ముఖ్య తారలుగా శ్రీ కిశోర్ దర్శకత్వంలో ఆర్వీ రాజు, ఆక్రోశ్ నిర్మించిన థ్రిల్లర్ 'దేవిశ్రీ ప్రసాద్'. ధనరాజ్ కీలక పాత్రధారి. అక్టోబర్‌లో సిన్మాను విడుదల చేయాలనుకుంటున్నారు. ''వినోదంతో పాటు సందేశంతో రూపొందిన చిత్రమిది. దేవి, శ్రీ, ప్రసాద్... అనే ముగ్గురు నటులు, లీలా రామచంద్రన్ అనే నటి చుట్టూ కథ నడుస్తుంది. సిన్మాలో ప్రతి సీన్ ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురి చేస్తుంది. తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ రేకెత్తిస్తుంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

హారర్ నేపథ్యంలో...

సాయికిరణ్, ప్రాచీ అధికారి జంటగా తెరకెక్కిన చిత్రం 'వలపు సౌధం'. కష్ణమోహన్ దర్శకత్వంలో సునీల్‌సాగర్, మజ్ను సాహెబ్ నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. సునీల్ సాగర్ మాట్లాడుతూ– ''లవ్, హారర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. ఎస్.కె.మజ్ను స్వరపరచిన ఏడు పాటలు శ్రోతలను అలరిస్తాయి'' అన్నారు. ''నువ్వే కావాలి, ప్రేమించు' చిత్రాల తర్వాత సాయికిరణ్‌కు 'వలపు సౌధం' మంచి బ్రేక్ ఇస్తుందని నమ్ముతున్నాం. మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ పోలీసాఫీసర్‌గా నటించారు'' అన్నారు దర్శకుడు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: మజ్ను రెహాన బేగం, కె.ఫిష్‌లక్ష్మి, సమర్పణ: పి.విజయ శేఖర్.



● సాయికిరణ్, ప్రాచి

కాలనీ ప్రేమకథ

దిలీప్, శ్రావణి, రాజ్‌బాల, అపర్ణ, బేబీ అక్షర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. ఆనంద్ కానుమోలు దర్శకత్వంలో ఏఎం రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. ''ఒక కాలనీలో జరిగే ప్రేమ కథ ఇది. ప్రేమకథా చిత్రాల్లో ఓ వినూత్న ప్రయత్నం అవుతుంది. తమ మధ్య ఉన్నది ఎలాంటి బంధమో తెలియని జంట చివరి వరకు ఒకరికి ఒకరు ఆ బంధాన్ని వ్యక్తీకరించుకోరు. క్లైమాక్స్‌లో ప్రేమను వ్యక్తపరచుకోవడం అనేది ఆసక్తికరం. త్వరలో రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం. డిసెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు దర్శకుడు. ఈ చిత్రానికి సమర్పణ: గురు రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్.



● మాధురి

మాధురి.. ఓ మంచి నిర్మాత!

బాలీవుడ్ బ్యూటీలు ప్రియాంకా చోప్రా, అనుష్కా శర్మ కేవలం నటనపైనే దృష్టి పెట్టడం లేదు. నిర్మాతలుగానూ రాణిస్తున్నారు. ఇప్పుడీ జాబితాలో సీనియర్ నటి మాధురీ దీక్షిత్ కూడా చేరారు. ఆర్.ఎన్.ఎం. మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌ని ఆరంభించారు. స్వప్ననీల్ జయకర్ దర్శకత్వంలో త్వరలో ఓ మరాఠీ చిత్రాన్ని ఆమె నిర్మించనున్నారు. ''సినిమా నిర్మాణ రంగంలో అడుగుపెట్టడం చాలా ఆనందంగా ఉంది. యోగేశ్ వినాయక్ జోషి ఈ సినిమాకి మంచి కథ అందించారు. మంచి టీమ్‌తో ఈ సినిమా నిర్మించబోతున్నాం. త్వరలోనే చిత్రీకరణ మొదలుపెట్టనున్నాం. ఇప్పటివరకూ చేసిన సినిమాల ద్వారా మంచి నటి అనిపించుకున్నా. ఈ సినిమాతో మంచి నిర్మాత అని కూడా అనిపించుకుంటా'' అని మాధురి అన్నారు.

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ హిస్టరీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: బ్యాంకింగ్ అవేర్‌నెస్ టెస్ట్ క్లాస్ : బయాలజీ ప్రిపరేషన్ టిప్స్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?
- ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1300 ఏసీఐఓ-2/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు చివరి తేదీ: సెప్టెంబర్ 2
- సింగరేణిలో 665 బదిలీ వర్కర్ పోస్టులకు చివరి తేదీ: సెప్టెంబర్ 2
- ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 139 ట్రేడ్/టెక్నీషియన్ అప్రెంటీస్ పోస్టులకు చివరి తేదీ: సెప్టెంబర్ 2



దేశంలోనే తొలి విదేశ్ భవన్ ప్రారంభం

జాతీయం

జమిలి ఎన్నికలకు నీతి ఆయోగ్ సిఫారసు



దేశంలో 2024 నాటికి లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. దీనికోసం కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలాన్ని పొడిగించడమో/తగ్గించడమో చేయాలని, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇదేమంత పెద్ద విషయం కాదని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ఆగస్టు 27న విడుదల చేసిన తన త్రైవార్షిక(2017-18 నుంచి 2019-20) ప్రణాళికలో పలు అంశాలను వెల్లడించింది.

బార్‌కోడ్‌తో యుద్ధ వాహనాల ప్రారంభం

సైన్యం అవసరాలకు అనుగుణంగా బార్‌కోడ్‌తో రూపొందించిన అత్యాధునిక బీఎంపీ-2 వాహనాలను ఆర్మీకి అందించే కార్యక్రమాన్ని రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆగస్టు 27న సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారంలో ప్రారంభించారు. బార్‌కోడ్ ఆధారంగా వాహన ఉత్పత్తికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు.

ట్రిపుల్ తలాక్ చెల్లదన్న సుప్రీంకోర్టు

ముస్లిం సమాజంలో ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులివ్వడం ఇకపై కుదరదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇది చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ తీర్పు వెలువరించింది. ట్రిపుల్ తలాక్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ ఆగస్టు 22న 395 పేజీల తీర్పులో పేర్కొన్నారు. పునరాలోచన చేసుకునేందుకు ఆస్కారం లేని, క్షణాల్లో ఇచ్చేసే ట్రిపుల్ తలాక్ అంగీకార యోగ్యం కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులివ్వడం అత్యంత ఏక పక్షం, అహేతుకం, రాజ్యాంగ ఉల్లంఘన అని పేర్కొంది.

దక్షిణాది రాష్ట్రాల మధ్య 'విద్యుత్' సహకారం

దక్షిణాది రాష్ట్రాలు విద్యుత్‌ను పరస్పరం ఇచ్చిపుచ్చుకునేందుకు అంగీకరించాయి. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ(ఎస్ఆర్‌పీసీ) అధ్యక్షుడు, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆగస్టు 22న ముగిసిన సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఉచితంగా స్మార్ట్ ఫోన్లు

ఛత్తీస్‌గఢ్‌లో 55 లక్షల స్మార్ట్ ఫోన్లను ఉచితంగా పంపిణీ చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 23న నిర్ణయించింది. ఈ పథకానికి సంచార్ క్రాంతి యోజన అని పేరు పెట్టారు.

ఓబీసీ ఉప వర్గీకరణకు కేంద్రం నిర్ణయం

కేంద్ర జాబితాలోని ఓబీసీ(ఇతర వెనకబడిన కులాలు) ఉప వర్గీకరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 23న నిర్ణయించింది. చైర్‌పర్సన్‌ను నియమించిన నాటి నుంచి 12 వారాల్లోపు ఈ కమిషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. కాగా జాతీయ స్థాయిలో ఓబీసీ కేటగిరీలో క్రీమీలేయర్ గరిష్ట వార్షికాదాయ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పథకం పేరు మార్పు

కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పథకానికి ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజనగా పేరు మార్చేందుకు కేంద్ర కేబినెట్ ఆగస్టు 23న అంగీకరించింది. రూ.6,000 కోట్లు కేటాయించిన ఈ పథకం ద్వారా 2020 నాటికి 20 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. 5.30 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి.

దేశంలోనే తొలి విదేశ్ భవన్ ప్రారంభం



ముంబైలో ఏర్పాటుచేసిన విదేశ్ భవన్‌ను విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆగస్టు 27న ప్రారంభించారు. దేశంలో ఈ తరహా కార్యాలయం ఏర్పాటుకావడం ఇదే ప్రథమం. విదేశీ వ్యవహారాల శాఖకు సంబంధించి మహారాష్ట్రలో ఉన్న అన్ని కీలక కార్యాలయాలు విదేశ్ భవన్‌లో ఉంటాయి.

దేరా సచ్చా సౌధా చీఫ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

దేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్‌కు సీబీఐ కోర్టు ఆగస్టు 28న 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2002 నాటి రెండు అత్యాచార కేసుల్లో(ఒక్కో కేసులో పదేళ్ల చొప్పున) శిక్ష విధిస్తూ న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్ తీర్పు వెలువరించారు. జైలు శిక్షతోపాటు ఒక్కో కేసుకు రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షల జరిమానా కూడా విధించారు.

వ్యక్తిగత గోప్యత.. ప్రాథమిక హక్కు



వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు ఆగస్టు 24న స్పష్టం చేసింది. వ్యక్తుల గౌరవప్రదమైన జీవితానికి ఈ హక్కు తప్పనిసరని తెలిపింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వానికి ఉండే హక్కుల్ని, పరిమితుల్ని గుర్తుచేసింది. డిజిటల్ ప్రపంచంలో సమాచారాన్ని భద్రపరచాల్సిన జాగ్రత్తలన్నీ సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయ మూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పును వెలువరించింది.

సివిల్ సర్వీసెస్ అధికారులకు జోన్ల వారీ కేడర్లు

సివిల్ సర్వీస్ అధికారులకు కేడర్ల కేటాయింపునకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని ఖరారు చేసింది. సివిల్ సర్వీస్ అధికారుల్లో జాతీయ సమగ్రత భావనను పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. నూతన విధానం ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 26 కేడర్లను ఐదు జోన్లుగా విభజించారు. దీంతో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఇకపై రాష్ట్రాలకు బదులు జోన్ల కేడర్లను ఎంపిక చేసుకోవాలి.

కరెంట్ అఫైర్స్

అంతర్జాతీయం

మూడు క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా

ఉత్తర కొరియా మూడు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు అమెరికా సైనిక అధికారులు ఆగస్టు 26న పేర్కొన్నారు. పసిఫిక్ సముద్ర తూర్పు జలాల్లో ఈ ప్రయోగాలు నిర్వహించిందని తెలిపారు. మొదటి రెండు విఫలమవడంతో మూడోది ప్రయోగించినట్లు చెప్పారు. 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై ప్రయోగించే ఈ మూడు క్షిపణులు తేలికపాటివే అన్నారు.

నేపాల్‌తో ఎనిమిది ఒప్పందాలు



నేపాల్ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవుబా భారత పర్యటనలో ఆగస్టు 24న ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. తమ గడ్డపై భారత వ్యతిరేక కార్యకాలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. ఇందులో మాదకద్రవ్యాల రవాణాకు కళ్లెం వేయడం, భూకంప అనంతర పునర్నిర్మాణ చర్యలతోపాటు వివిధ అంశాల్లో పరస్పర సహకారానికి సంబంధించిన ఒడంబడికలు ఉన్నాయి.

క్రీడలు

సింధుకి రజతం



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ పీవీ సింధు రజత పతకం కైవసం చేసుకుంది. గ్లాస్గో(స్కాట్లాండ్)లో ఆగస్టు 27న జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో జపాన్ క్రీడాకారిణి నోజొమి ఒకుహార చేతిలో సింధు ఓటమి చవిచూసింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో సింధు పతకం సాధించడం ఇదో మూడోసారి. 2013, 14ల్లో కాంస్య పతకాలు పొందింది. మహిళల డబుల్స్ టైటిల్‌ను చెన్ క్వింగ్ చెన్, జియా విఫాన్ (చైనా) గెలుచుకోగా పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ ఆక్సెల్సన్ (స్వీడన్) గెలుచుకున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను మొహమ్మద్ ఆసన్, లిలియానా నట్సిర్ (ఇండోనేషియా) కైవసం చేసుకున్నారు.

మేవెదర్ వరల్డ్ రికార్డులు

అమెరికా స్టార్ ప్లేయర్ ఫ్లాయిడ్ మేవెదర్.. ప్రొఫెషనల్ బాక్సింగ్ కెరీర్‌లో అజేయంగా నిలిచిన ఏకైక వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. లాస్‌వేగాస్(అమెరికా)లో ఆగస్టు 27న జరిగిన జూనియర్ సూపర్ ఫైట్ బౌట్‌లో గెలుపొందడం ద్వారా ప్రొఫెషనల్ కెరీర్‌లో వరుసగా 50వ విజయాన్ని నమోదు చేశాడు. మేవెదర్ పోటీపడిన 50 బౌట్లలోనూ ఆయనే విజేత. 49 వరుస విజయాలతో అమెరికా హెవీ వెయిట్ ప్రొఫెనల్ బాక్సర్ రాకీ మర్సియానో పేరిట ఉన్న రికార్డును మేవెదర్ అధిగమించాడు. కాగా తాను మళ్లీ రింగ్‌లోకి దిగే అవకాశాలు లేవని మేవెదర్ ప్రకటించాడు.

హామిల్టన్‌కు బెల్జియం గ్రాండ్ ప్రీ టైటిల్

బెల్జియం ఫార్ములావన్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను లూయిస్ హామిల్టన్ సాధించాడు. ఆగస్టు 27న బెల్జియంలో జరిగిన రేసులో మెర్సిడెస్ జట్టు డ్రైవర్ హామిల్టన్ విజేతగా నిలిచాడు. 32 ఏళ్ల హామిల్టన్(బ్రిటన్)కు ఇది ఓవరాల్‌గా 58వ విజయం.

అవార్డులు

2017 క్రీడా పురస్కారాలు

2017 ఏడాదికి క్రీడా పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 22న ప్రకటించింది. వీటిని ఆగస్టు 29న రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం చేశారు. ఇద్దరికి 'రాజీవ్ ఖేల్‌రత్న', ఏడుగురికి 'అర్జున', మరో ఏడుగురికి 'ద్రోణాచార్య', ముగ్గురికి 'ధ్యాన్‌చంద్' పురస్కారాలు అందజేసింది. భారత పారా అథ్లెట్ దేవేంద్ర జఝరియాకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ ఖేల్‌రత్న దక్కింది. రియో పారాలింపిక్స్‌లో జావెలిన్ త్రోయర్ దేవేంద్ర జఝరియా రెండు స్వర్ణాలు గెలుపొందాడు. 25 ఏళ్ల ఖేల్‌రత్న అవార్డుల చరిత్రలో ఈ పురస్కారాన్ని ఓ పారాలింపియన్ అందుకోవడం ఇదే తొలిసారి. దశాబ్ద కాలానికి పైగా భారత హాకీకి సేవలందిస్తున్న మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్‌కు కూడా ఖేల్‌రత్న దక్కింది.

- **రాజీవ్ ఖేల్‌రత్న:** దేవేంద్ర జఝరియా (పారా అథ్లెటిక్స్), సర్దార్ సింగ్ (హాకీ)



- **అర్జున:** జ్యోతి సురేఖ(ఆర్చరీ), సాకేత్ మైనేని(టెన్నిస్), ఖుష్బీర్ కౌర్, రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి(బాస్కెట్ బాల్), దేవేంద్రోసింగ్(బాక్సింగ్); పుజారా, హర్మన్ ప్రీత్ కౌర్(క్రికెట్); ఓయినమ్ బెంబెందేవి(ఫుట్‌బాల్), చౌరాసియా (గోల్ఫ్), సునీల్(హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), ప్రకాశ్ నంజప్ప(షూటింగ్), ఆంథోనీ అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), మరియప్పన్ తంగవేలు, వరుణ్ భటి (పారా అథ్లెటిక్స్), సత్యవర్త్ కడియన్ (రెజ్లింగ్).
- **ద్రోణాచార్య:** డాక్టర్ ఆర్.గాంధీ (అథ్లెటిక్స్), హీరానంద్ కటారియా (కబడ్డీ), జీఎస్‌వీ ప్రసాద్(బ్యాడ్మింటన్), బ్రిజ్ భూషణ్ మహంతి(బాక్సింగ్), రోహన్‌లాల్(రెజ్లింగ్), రాఫెల్(హాకీ), సంజయ్ చక్రవర్తి(షూటింగ్).
- **ధ్యాన్‌చంద్:** భూపిందర్ సింగ్(అథ్లెటిక్స్), సయ్యద షాహిద్ హకీం(ఫుట్‌బాల్), సుమరాయ్ టకే(హాకీ).

ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా దీపక్ మిశ్రా

వార్తల్లో వ్యక్తులు



సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా ఆగస్టు 28న బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ జేఎస్ ఖేహర్ పదవీ కాలం ముగియడంతో నూతన చీఫ్ జస్టిస్‌గా దీపక్ మిశ్రా చేత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణం చేయించారు. మిశ్రా ఈ పదవిలో 13 నెలలు కొనసాగుతారు.

పార్లమెంట్ నిర్మాణం

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగంలోని 5వ భాగంలో 79 నుంచి 123 వరకు గల అధికరణలు పార్లమెంట్ నిర్మాణం, విధులు, అధికారాలు తదితరాల గురించి పేర్కొంటున్నాయి. కేంద్రంలో ద్విసభా విధానాన్ని భారత ప్రభుత్వ చట్టం-1919 ద్వారా ప్రవేశపెట్టారు. అధికరణ-79 ప్రకారం పార్లమెంట్ అంటే రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ. రాష్ట్రపతి ప్రమేయం లేకుండా ఏ బిల్లూ శాసనం కాదు. కాబట్టి రాష్ట్రపతి కూడా పార్లమెంటులో అంతర్భాగమే. పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభ (రెండు సభలు) ఉంటాయి.



లోక్‌సభ

- దీన్ని దిగువ సభ/ప్రజాప్రాతినిధ్య సభగా పేర్కొంటారు. దీని నిర్మాణం గురించి అధికరణ 81 తెలియజేస్తుంది. లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య 545. వీరిలో 543 మంది ఎన్నికవుతారు. ఇద్దరిని రాష్ట్రపతి నియమిస్తారు. మొత్తం సభ్యుల్లో రాష్ట్రాల నుంచి 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది ఎన్నికవుతారు. తొలుత లోక్‌సభ సభ్యుల సంఖ్య 525గా ఉండేది. 1973లో 31వ రాజ్యాంగ సవరణ ద్వారా 545కు పెంచారు. సభ్యుల సంఖ్యను 2026 వరకు పెంచరాదని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు.
- లోక్‌సభకు ఎక్కువ మంది సభ్యులు ఉత్తరప్రదేశ్(80), మహారాష్ట్ర(48), పశ్చిమ బెంగాల్(42), బిహార్(40), తమిళనాడు(39), మధ్యప్రదేశ్(29), కర్ణాటక(28) రాష్ట్రాల నుంచి ఎన్నికవుతుండగా, అతి తక్కువగా సిక్కిం(1), మిజోరాం(1), నాగాలాండ్(1), గోవా(2), అరుణాచల్‌ప్రదేశ్(2), మణిపూర్(2), మేఘాలయ(2), త్రిపుర(2) నుంచి ఎన్నికవుతున్నారు.
- అధికరణ 330 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేక సీట్లు కేటాయించారు. ప్రస్తుతం ఎస్సీలకు 84 సీట్లు, ఎస్టీలకు 47 సీట్లను రిజర్వ్ చేశారు. తొలుత రిజర్వేషన్లను పదేళ్లకు కేటాయించారు. ఇప్పటివరకు వీటిని ఆరు పర్యాయాలు పొడిగించారు. అత్యధిక ఎస్సీ స్థానాలు ఉత్తరప్రదేశ్‌లో 17 ఉండగా, ఎస్టీ స్థానాలు మధ్యప్రదేశ్‌లో ఎక్కువగా(6) ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 లోక్‌సభ స్థానాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 25, తెలంగాణకు 17 స్థానాలను కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, తెలంగాణలో ఎస్సీలకు 3, ఎస్టీలకు 2 సీట్లు కేటాయించారు.
- లోక్‌సభకు ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకు 5 సార్లు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. మొదటి మధ్యంతర ఎన్నికలు 1971లో జరిగాయి. 1971లో ఏర్పడిన ఐదో లోక్‌సభ ఎక్కువ కాలం కొనసాగగా, తక్కువ కాలం 1998లో ఏర్పడిన 12వ లోక్‌సభ కొనసాగింది.
- **కాల పరిమితి:** ఆర్టికల్ 83 ప్రకారం లోక్‌సభ సాధారణ కాలపరిమితి ఐదేళ్లు. అత్యవసర సమయంలో అవసరమైతే ఒక ఏడాది పొడిగించవచ్చు. ఆర్టికల్ 85 ప్రకారం రాజకీయ అనిశ్చిత పరిస్థితి ఏర్పడినప్పుడు ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ముందుగానే లోక్‌సభను రద్దు చేయొచ్చు. కాలపరిమితిని 1976లో 42వ సవరణ ద్వారా 5 నుంచి 6 ఏళ్లకు పొడిగించి, తిరిగి 1978లో 44 సవరణ ద్వారా 6 నుంచి 5 ఏళ్లకు తగ్గించారు.

రాజ్యసభ

- రాజ్యసభను ఎగువ సభ/రాష్ట్రాల ప్రాతినిధ్య సభగా పేర్కొంటారు. రాజ్యసభ 1952లో ఏర్పడింది. దీని నిర్మాణం గురించి ఆర్టికల్ 80 తెలియజేస్తుంది. రాజ్యసభ గరిష్ట సభ్యుల సంఖ్య 250. వీరిలో 238 మంది ఎమ్మెల్యేలచే నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ద్వారా ఎన్నికవుతారు. ఆర్టికల్-80(3) ప్రకారం సాహిత్యం, సాంఘిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, కళలు, క్రీడలు తదితర రంగాలకు చెందిన 12 ప్రముఖులను రాష్ట్రపతి రాజ్యసభకు ఎంపిక చేస్తారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి 31, మహారాష్ట్ర 19, తమిళనాడు 18, పశ్చిమ బెంగాల్ 16, బిహార్ 16 మంది సభ్యులు, అతి తక్కువగా సిక్కిం, గోవా, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్‌ల నుంచి ఒక్కొక్కరు ఎన్నికవుతారు. రాజ్యసభ మొత్తం సభ్యుల్లో ప్రతి రెండేళ్లకు 1/3 వంతు మంది సభ్యులు పదవీ విరమణ చేస్తే.. తిరిగి 1/3 వంతు మంది ఎన్నికవుతారు. రాజ్యసభ అధ్యక్షునిగా పదవీ రీత్యా ఉపరాష్ట్రపతి కొనసాగుతారు. సభ్యుల్లో ఒకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు. మొదటి ఉపాధ్యక్షుడు ఎస్.వి. కృష్ణమూర్తిరావు కాగా, ప్రస్తుతం కొనసాగుతోంది పి.జె.కురియన్.

పార్లమెంట్ సమావేశాలు

- ఆర్టికల్-85 ప్రకారం పార్లమెంట్ 6 నెలలకు ఒకసారి, సంవత్సరానికి రెండు సార్లు సమావేశం కావాలి. ప్రస్తుతం ఆనవాయితీగా సంవత్సరానికి మూడు సార్లు జరుగుతున్నాయి. గరిష్ట సమావేశాలపై పరిమితి లేదు. అవసరాన్ని బట్టి ఎన్ని రోజులైనా నిర్వహించవచ్చు. ఇటీవల వివిధ సంఘాలు కనీసం 100 రోజులు జరపాలని డిమాండ్ చేస్తున్నాయి.
- **పార్లమెంట్-కోరం:** ఆర్టికల్-100 ప్రకారం పార్లమెంట్ కోరం సభ అధ్యక్షునితో కలుపుకొని 1/10 వంతు మంది సభ్యులు. కోరం అనగా సభా సమావేశాల నిర్వహణకు హాజరు కావాల్సిన కనీస సభ్యుల సంఖ్య.

అర్హతలు

- ఆర్టికల్-84 పార్లమెంట్ సభ్యుల అర్హతల గురించి తెలియజేస్తుంది.

1. భారతీయ పౌరుడై ఉండాలి.
2. లోక్‌సభకు ఎన్నికయ్యేందుకు 25 సంవత్సరాలు, రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు 30 సంవత్సరాలు నిండి ఉండాలి.
3. ఆదాయం వచ్చే ప్రభుత్వ పదవిలో ఉండరాదు.
4. మానసికంగా ఆరోగ్యవంతుడై ఉండాలి.
5. దేశంలోని ఏదైనా ఒక నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకుని ఉండాలి.

విధులు- అధికారాలు

- భారత రాజ్యాంగం పార్లమెంట్‌కు విశేష అధికారాలు, విధులు కల్పించింది. పార్లమెంట్ స్వయంగా, ఇతర ప్రభుత్వ విభాగాల ద్వారా తన విధులు, అధికారాలను నిర్వహిస్తుంది. వీటిని కింది విధంగా విభజించవచ్చు.
- **శాసనాధికారాలు, విధులు:** పార్లమెంట్ ప్రధాన విధి శాసనాల రూపకల్పన. దీనికి కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని అంశాలతోపాటు అవశిష్ట అంశాలపై కూడా శాసన అధికారం ఉంది. ఆర్టికల్-251 ప్రకారం రాష్ట్ర అంశాలపై పార్లమెంట్ శాసనాలు చేస్తుంది.

కాంతారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ,
హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీస్



భారతదేశ జనగణన - 2011

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ



- 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా? - 121,05,69,573. (మణిపూర్‌లోని సేనాపతి జిల్లా పరిధిలోని మావోమరామ్, పావోమాట, పురుల్ సబ్ డివిజన్లలోని జనాభా అంచనాలను కలిపి దేశ జనాభా 121,07,26,932)
- 2001-11 మధ్య జనాభా వృద్ధిరేటు? -17.64 శాతం
- 2011 జనాభా లెక్కల ప్రకారం పురుషుల జనాభా వృద్ధి రేటు? - 17.1 శాతం
- 2011 జనాభా లెక్కల ప్రకారం స్త్రీల జనాభా వృద్ధిరేటు? - 18.3 శాతం
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అత్యధిక జనాభా గల మొదటి నాలుగు రాష్ట్రాలు?
  1. ఉత్తరప్రదేశ్ - 19.98 కోట్లు
  2. మహారాష్ట్ర - 11.23 కోట్లు
  3. బిహార్ - 10.40 కోట్లు
  4. పశ్చిమ బెంగాల్ - 9.12 కోట్లు
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అత్యల్ప జనాభా గల రాష్ట్రాలు? - సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా
- 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా గల కేంద్ర పాలిత ప్రాంతాలు? - ఢిల్లీ, పుదుచ్చేరి, చండీఘర్
- 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యల్ప జనాభా గల కేంద్ర పాలిత ప్రాంతాలు? - లక్షదీవులు, డామన్-డయ్యూ, దాద్రా నగర్ హవేలి
- ప్రపంచ జనాభాలో మన దేశ జనాభా వాటా? - 17.5 శాతం
- ప్రపంచ భూభాగంలో మన దేశ భూభాగ శాతం? - 2.4 శాతం
- ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం? - చైనా (2వ స్థానంలో భారత్ ఉంది. ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరు భారతీయుడు)
- 2001-11 దశాబ్దంలో దేశంలో అత్యధిక వృద్ధిరేటు గల రాష్ట్రాలు?
  1. మేఘాలయ - 27.9 శాతం
  2. అరుణాచల్‌ప్రదేశ్ - 26 శాతం
  3. బిహార్ - 25.4 శాతం
- అత్యల్ప వృద్ధిరేటు గల రాష్ట్రాలు?
  1. నాగాలాండ్ - 0.6 శాతం
  2. కేరళ - 4.9 శాతం
  3. గోవా - 8.2 శాతం
- అత్యధిక వృద్ధి రేటు గల కేంద్ర పాలిత ప్రాంతాలు?
  1. దాద్రా నగర్ హవేలీ - 55.9 శాతం
  2. డామన్-డయ్యూ - 53.8 శాతం
- అత్యల్ప వృద్ధిరేటు గల కేంద్రపాలిత ప్రాంతాలు? - లక్షదీవులు(6.3 శాతం), అండమాన్ నికోబార్ దీవులు (6.9 శాతం)
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అధిక జన సాంద్రత గల రాష్ట్రాలు?
  1. బిహార్ - 1106
  2. పశ్చిమబెంగాల్ - 1028
  3. కేరళ - 860
- 2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జన సాంద్రత - 304
- గొప్ప విభాజక సంవత్సరం అని దేన్ని పిలుస్తారు? - 1921

ముల్కల రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ,
జీవీఎస్ స్టడీ సర్కిల్



ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
10+2/గ్రాడ్యుయేట్స్ స్పెషల్	ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్	జాబ్ పాయింట్	కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	యూత్ స్టోరీ/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్
గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం

బులెటిన్ బోర్డ్

నేవీలో 17 ఖాళీలు

నేవీలో 17 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ (పైలట్/ ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్/అబ్జర్వర్) పోస్టుల భర్తీకి పెళ్లికాని యువతీ యువకుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టు పేరు:** షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్(ఎస్ఎస్‌సీ)
- **మొత్తం ఖాళీలు:** 17(ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్(ఏటీసీ)–5 + అబ్జర్వర్–4 +
- **వేతనం:** సబ్‌లెఫ్టినెంట్ హోదాలో రూ.56,100–రూ.1,10,700.
- **అర్హతలు:** 60శాతం మార్కులతో బీఈ/బీటెక్. దీంతోపాటు ఏటీసీ పోస్టుకు అదనంగా పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లోనూ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత. బీఈ/బీటెక్ తుది సంవత్సరం చదువుతున్న విద్యార్థులూ అర్హులే.
- **వయోపరిమితి:** ఏటీసీ పోస్టులకు 1993 జూలై 2–1 జూలై 1997 మధ్య, అబ్జర్వర్, పైలట్ పోస్టులకు 1994 జూలై 2–1 జూలై 1991 మధ్య జన్మించి ఉండాలి.
- **మెడికల్ స్టాండర్డ్స్:** పైలట్/అబ్జర్వర్ పోస్టులకు.. ఎత్తు–162.5 సెం.మీ, ఎత్తుకు తగిన బరువు, లెగ్ లెంగ్త్, సిట్టింగ్ హైట్, థై లెంగ్త్ ఉండాలి. ఏటీసీ పోస్టులకు.. ఎత్తు– పురుషులు 157 సెం.మీ, మహిళలు 152 సెం.మీ ఉండాలి. ఎత్తు, వయస్సుకు తగిన బరువు ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ(స్టేజ్–1, స్టేజ్–2 పరీక్షలు).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 16, 2017.
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

మైనారిటీలకు 'మెరిట్ కమ్ మీన్స్' స్కాలర్‌షిప్‌లు

మైనారిటీల్లోని పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. స్కాలర్‌షిప్‌లో భాగంగా మెయింటనెన్స్ అలవెన్స్ (ఏడాదికి) హాస్టల్ విద్యార్థులకు రూ.10 వేలు; డే స్కాలర్స్‌కి రూ.5 వేలు ఇస్తారు. కోర్సు ఫీజు రూ.20 వేలు లేదా మొత్తం (ఏది తక్కువైతే అది) చెల్లిస్తారు.

- **అర్హత:** ఇంటర్/డిగ్రీ కనీసం 50 మార్కులతో ఉత్తీర్ణులై టెక్నికల్/ ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్నవారు అర్హులు.
- **వార్షికాదాయం:** తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల లోపు ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో మాత్రమే అప్లై చేయాలి.
- **చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.b4s.in/edge/MCM9

'ది మసుమీ ఇంటర్నేషనల్' రీసెర్చ్ ఫెలోషిప్

జపాన్‌లోని మసుమీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్.. డాక్టోరల్ విద్యార్థులకు రీసెర్చ్ ఫెలోషిప్‌ను మంజూరుచేయనుంది. నేచురల్ సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో (జపాన్ దృష్టి కోణంలో) అధ్యయనం చేసేవారికి మాత్రమే వీటిని కేటాయించింది. ఫెలోషిప్‌లో భాగంగా నెలకు 2,20,000 యెన్లు, ప్రయాణ/ఆరోగ్య బీమా, రానుపోను విమాన ప్రయాణ టికెట్లు; స్థానిక ప్రయాణ, వసతి ఖర్చులకు ఏక మొత్తంగా 1,20,000 యెన్లు.

- **అర్హత:** పీహెచ్‌డీ పూర్తిచేసిన 49 ఏళ్ల లోపు వారు అర్హులు. ఇంగ్లిష్/జపనీస్ భాషలో మాట్లాడగలగాలి. పరిశోధన నిమిత్తం/వృత్తి రీత్యా గతంలో జపాన్‌లో ఉన్నవారు/ ప్రస్తుతం ఉంటున్నవారు దరఖాస్తు చేసేందుకు అనర్హులు.
- **షరతు:** ఫెలోషిప్ పూర్తయిన తర్వాత స్వదేశానికి తప్పనిసరిగా తిరిగి వెళ్లాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో పోస్టు ద్వారా దరఖాస్తు పంపాలి.
- **చివరి తేదీ:** ఆగస్టు 31 ❖ **వెబ్‌సైట్:** www.b4s.in/edge/TMI4

మైనారిటీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం అందించే పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైనవారు పీహెచ్‌డీ వరకు వీటిని అందుకోవచ్చు. ఇందులో భాగంగా డే స్కాలర్స్‌తో పాటు హాస్టల్ విద్యార్థులకు నెలవారీగా, ఏడాది వారీగా అడ్మిషన్, ట్యూషన్, మెయింటనెన్స్ ఫీజులు చెల్లించనుంది. మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో 30 శాతాన్ని విద్యార్థినులకు రిజర్వ్ చేసింది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి/ఇంటర్/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత.
- **వార్షికాదాయం:** తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో అప్లై చేయాలి.
- **చివరి తేదీ:** ఆగస్టు 31 ❖ **వెబ్‌సైట్:** www.b4s.in/edge/PMS21

పరీక్ష పేరు: సీఎస్ఐఆర్ యూజీసీ నెట్
నిర్వహించేది: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)
ఎవరికి ఉపయోగం: సైన్స్ సబ్జెక్టుల్లో పీజీ/ బీటెక్/ బీఈ/ బీ ఫార్మసీ/ ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసి బోధన, పరిశోధన వైపు వెళ్లాలనుకునేవారికి చక్కటి అవకాశం.
ఉత్తీర్ణత సాధిస్తే: లెక్చరర్‌షిప్‌కు అర్హత.. మెరుగైన ర్యాంకులో నిలిస్తే జేఆర్ఎఫ్‌కు అవకాశం ఉంటుంది. తద్వారా అభ్యర్థులకు పరిశోధనలు చేసేందుకు ఆర్థిక తోడ్పాటు దక్కుతుంది.
తాజాగా నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ వివరాలు..



సైన్స్‌లో బోధన, పరిశోధన..

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌తో సాకారం..

పరీక్ష ఒకటి.. ప్రయోజనాలు ఎన్నో..

దేశంలోనే ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలైన సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ–హైదరాబాద్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ– హైదరాబాద్) తదితరాలతో పాటు కేంద్రీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) పొందుతూ.. పీహెచ్‌డీ చేయాలనుకునే విద్యార్థులకు మార్గం చూపే పరీక్ష సీఎస్ఐఆర్–యూజీసీ–నెట్. దేశవ్యాప్తంగా అధ్యాపక నియామక పరీక్షలకు అర్హత పొందాలన్నా నెట్ రాయాల్సిందే.

పరీక్ష నిర్వహించే సబ్జెక్టులు

- కెమికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మ్యాథమెటికల్ సైన్సెస్

అర్హతలు

55 శాతం మార్కులతో ఎంఎస్సీ లేదా తత్సమాన విద్యార్హత/ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్/ నాలుగేళ్ల బీఎస్/ బీఈ/ బీటెక్/ బీఫార్మా/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. 55 శాతం మార్కులతో బీఎస్సీ (ఆనర్స్) లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులై ఇంటిగ్రేటెడ్ ఎంఎస్–పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు నమోదు చేసుకున్న అభ్యర్థులు, చివరి సంవత్సరం ఎంఎస్సీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరిని రిజల్ట్ వెయిటింగ్ కేటగిరీగా పరిగణిస్తారు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రిజర్వేషన్ నిబంధనల మేరకు సదరు కోర్సుల్లో 50 శాతం మార్కులు ఉండాలి.

వయసు

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు అర్హత సాధించాలంటే.. 2017 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు. వయో పరిమితిలో ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ (నాన్ క్రీమీ లేయర్)లకు మూడేళ్లు సడలింపు ఉంటుంది. లెక్చరర్‌షిప్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితి లేదు.

పరీక్ష విధానం

ఒకే పేపర్ ఉంటుంది. మొత్తం 200 మార్కులకు, మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలడుగుతారు. సబ్జెక్టును బట్టి ప్రశ్నల సంఖ్య ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. అందులోని మూడు విభాగాల గురించి..

పార్ట్–ఎ: ఈ విభాగం అందరికీ కామన్. లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, ఎనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్స్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ వంటి అంశాల్లో విద్యార్థి జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. ఈ విభాగం నుంచి 20 ప్రశ్నలడుగుతారు.

పార్ట్–బి: అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపై పరిజ్ఞానాన్ని ప్రశ్నించేలా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలడుగుతారు. సిలబస్‌లోని అన్ని టాపిక్‌లకు సంబంధించిన ప్రశ్నలు ఈ విభాగంలో వస్తాయి. అభ్యర్థి సబ్జెక్టును బట్టి ప్రశ్నల సంఖ్య మారుతుంది. 20 నుంచి 35 ప్రశ్నల వరకు ఉండొచ్చు.

పార్ట్–సి: అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టులలో పరిజ్ఞానాన్ని, లోతైన విశ్లేషణను పరీక్షించేలా, సమస్యాపూరకమైన ప్రశ్నలు ఎక్కువ వస్తాయి. అభ్యర్థి తన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ప్రశ్నలను విశ్లేషించుకుని సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నల సంఖ్య, వాటికిచ్చే మార్కులలో సబ్జెక్టులను బట్టి తేడా ఉంటుంది.

దరఖాస్తు ఫీజు

జనరల్–రూ.1000, ఓబీసీ (ఎన్‌సీఎల్)–రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.250

దరఖాస్తు ఇలా

అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి బ్యాంకు చలాన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. నిర్దేశిత ఫీజు ఏదైనా 'ఇండియన్ బ్యాంక్'లో సెప్టెంబర్ 15లోగా డిపాజిట్ చేయాలి. తర్వాత చలాన్ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి.

ప్రింటవుట్ పంపాల్సిన చిరునామా

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక, దాని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి 'డిప్యూటీ సెక్రెటరీ (ఎగ్జామ్), ఎగ్జామినేషన్ యూనిట్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ గ్రూప్, సీఎస్ఐఆర్ కాంప్లెక్స్, ఆపోజిట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, లైబ్రరీ ఎవెన్యూ, పూసా, న్యూఢిల్లీ–110012' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 2017 సెప్టెంబర్ 16
- దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ: 2017 సెప్టెంబర్ 23
- పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, గుంటూరు
- పరీక్ష తేదీ: 2017 డిసెంబర్ 17
- వెబ్‌సైట్: www.csirhrdg.res.in

రుణాత్మక మార్కులు

పరీక్షలో అన్ని విభాగాల్లోనూ తప్పుగా గుర్తించిన సమాధానాలకు రుణాత్మక (నెగెటివ్) మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ప్రశ్నకు కేటాయించిన మార్కుల ఆధారంగా రుణాత్మక మార్కులు ఉంటాయి.

ఫెలోషిప్

జేఆర్ఎఫ్‌లో ఉత్తీర్ణత సాధించి ప్రవేశం పొందిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.25 వేలు చెల్లిస్తారు. ఏడాదికి ఒకసారి కాంటింజెన్సీ గ్రాంట్‌గా రూ.20 వేలను యూనివర్సిటీ/ విద్యా సంస్థకు అందిస్తారు. అదనంగా అలవెన్సులు కూడా ఉంటాయి. పరిశోధన ప్రగతి, ఇంటర్వ్యూ ఆధారంగా మూడో సంవత్సరంలో సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) హోదా కల్పించి నెలకు రూ.28 వేలు చెల్లిస్తారు. జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ కలిపి గరిష్ఠంగా ఐదేళ్ల వరకు ఫెలోషిప్ లభిస్తుంది. ప్రతి సబ్జెక్టుకు పరిమిత సంఖ్యలో ఫెలోషిప్‌లుంటాయి. అందుబాటులోని జేఆర్ఎఫ్‌లు, వివిధ విభాగాలను దృష్టిలో ఉంచుకుని నెట్‌లో అత్యంత ప్రతిభావంతులైనవారిని మాత్రమే జేఆర్ఎఫ్‌కు ఎంపిక చేస్తారు.

ప్రిపరేషన్.. ఇతర పరీక్షలకూ ఉపయోగకరం

సన్నద్ధతలో అత్యంత కీలకం గత ప్రశ్నపత్రాలు. ఇవి అధికారిక వెబ్‌సైట్లల్లోనే అందుబాటులో ఉన్నాయి. వీటిని సేకరించి సరళిని పరిశీలించడం ద్వారా ప్రశ్నల స్థాయిపై అవగాహన ఏర్పడుతుంది. కోచింగ్ మెటీరియల్ మీదనే ఆధారపడకుండా.. అకడమిక్ పుస్తకాలతో పాటు ప్రామాణిక రిఫరెన్స్ బుక్స్ చదవాలి. ప్రశ్నల శైలి మూస ధోరణిలో కాకుండా వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. అభ్యర్థి అన్ని విభాగాల్లో మంచి స్కోరు సాధించాలంటే లోతైన పరిజ్ఞానం పెంచుకోవాలి. ముఖ్యం గా పార్ట్–సిలో స్కోరు చేసేందుకు సబ్జెక్టుపై గట్టి పట్టు అవసరం. దీనికోసం సంబంధిత అకడమిక్ పాఠ్యపుస్తకాలను లోతైన విశ్లేషణతో చదవాలి. మాదిరి ప్రశ్నలను ఎక్కువగా సాధన చేస్తే అధిక మార్కులకు అవకాశం ఉంటుంది. ఈ పరీక్షకు చేసే ప్రిపరేషన్ టీఐఎఫ్ఆర్, ఐఐఎస్సీ, జెస్ట్, ఐసీఏఆర్, ఐసీఎంఆర్, డీబీటీ–జేఆర్ఎఫ్, ఇతర పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లకు, బార్క్, డీఆర్‌డీఓ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుంది.

తొలి ప్రాధాన్యం వీరికే

రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో నిపుణులైన ఫ్యాకల్టీల అవసరం ఉంది. అత్యుత్తమ విద్య, పరిశోధనలకు పేరుగాంచిన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్ నెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, యూనివర్సిటీల్లో లెక్చరర్ల నియామక పరీక్షలకు అర్హత లభిస్తుంది. రాష్ట్రాల్లో స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్)లు నిర్వహిస్తున్నా.. సీఎస్ఐఆర్ నెట్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. అధ్యాపక నియామక పరీక్షల్లో విజయం సాధించిన వారిలో మొదట సీఎస్ఐఆర్ నెట్ ఉత్తీర్ణులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

టెక్ బిట్స్

ప్లాటోగ్రాఫ్..!



స్మార్ట్‌ఫోన్‌తో ఖాళీగా ఉండాలనిపించదు. ఏదో ఒక ఫొటో తీస్తూనే ఉంటాం. ముఖ్యంగా సెల్ఫీలకు లెక్కే లేదు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకోవడమే కాదు వాటికి రకరకాల ఫేస్‌లు, బ్యాక్‌గ్రౌండ్‌లు తగిలించి ముస్తాబు చేస్తుంటాం. కేవలం ఫొటోలను ఫిల్టర్ చేయడం లేదా జీఐఎఫ్‌లుగా మార్చడమే కాదు వాటిని కదిలించగలిగితే బాగుంటుంది కదూ..! అది ప్లాటోగ్రాఫ్ యాప్‌తో సాధ్యం.

ఏమిటీ ప్లాటోగ్రాఫ్..?

ఫొటోలను ఎడిట్ చేసే యాప్‌లు చాలానే ఉన్నాయి. కానీ ఎడిట్ చేసి మూవ్ చేయగలిగేవి మాత్రం అరుదు. ప్లాటోగ్రాఫ్ యాప్ ఇదే కోవకు చెందుతుంది. ఒక ఫొటోను యానిమేషన్ ద్వారా కదిలేలా చేయడమే ఈ యాప్ ప్రత్యేకత. 96.6 ఎంబీ మెమొరీ ఉండే ప్లాటోగ్రాఫ్‌ను ఐఓఎస్ డివైజ్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ధర రూ. 400.

ప్రత్యేకతలు

- బేసిక్ ఫిల్టర్‌తో పాటు సాటరేషన్ మార్చడం, పిక్చర్స్‌కు స్టిక్కర్లను యాడ్ చేయడం దీంతో కుదురుతుంది.
- ఒక పిక్చర్ రూపురేఖలు మార్చి పూర్తి కొత్త దానిగా చేయొచ్చు.
- హై ఎండ్ ఫొటో ఎడిటింగ్ ద్వారా ఫొటో సహజత్వానికి ఏమాత్రం తీసిపోకుండా ఉండేలా చూడటమే ఈ యాప్ ప్రత్యేకత.
- ఈ యాప్‌లో ఉండే డైరెక్షన్స్‌కు తగ్గట్లు ముందుకెళ్తే చాలు.. మంచి యానిమేటెడ్ ఫొటో సొంతమవుతుంది.

పేటీఎంలో పోస్ట్‌కార్డ్



మనీ వ్యాలెట్ సంస్థ 'పేటీఎం' సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పోస్ట్‌కార్డ్' పేరుతో ప్రవేశపెట్టిన ఈ ఫీచర్ సాయంతో బంధువులకు, స్నేహితులకు, కుటుంబసభ్యులకు డబ్బులు గిఫ్ట్‌గా పంపించుకోవచ్చు. ఇందుకోసం ముందుగా హోంస్క్రీన్‌పై ఉన్న 'పోస్ట్‌కార్డ్' బటన్ క్లిక్ చేయాలి. తర్వాత డబ్బులు పంపాలనుకుంటున్న వాళ్ల కాంటాక్ట్ నెంబర్ ఎంచుకోవాలి. అమౌంట్‌ను ఎంటర్ చేసి అకేషన్ థీమ్‌ను.. అంటే బర్త్‌డే, రాఖీ, థ్యాంక్యూ, లక్కీయూ లాంటివాటిని ఎంపిక చేసుకోవాలి. మీకు నచ్చిన థీమ్‌తో సెండ్ పోస్ట్‌కార్డ్‌ని ఎంటర్ చేయాలి. ఈ ఫీచర్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఎలాంటి ఛార్జీలు పడవు. మీరు పంపిన వ్యక్తి గిఫ్ట్‌ను అందుకుని ఓపెన్ చేసిన వెంటనే వ్యాలెట్‌లోకి డబ్బులు చేరిపోతాయి. యాప్‌లోనే 'మై పోస్ట్‌కార్డ్స్' సెక్షన్‌లో మీరు పంపిన పోస్ట్‌కార్డుల హిస్టరీని ట్రాక్ చేసుకోవచ్చు.

మ్యూజిక్ మస్తీ..!



ఇయర్ ఫోన్స్ పెట్టుకుని సంగీతం వింటుంటే చూసే వాళ్లకు తెలిసిపోతుంది. అదే కార్డ్‌లెస్ ఇయర్ బర్డ్స్ అయితే మీ ముఖంలో భావాలు గమనించాక గానీ.. మీరు మ్యూజిక్ వింటున్న విషయాన్ని గుర్తించలేరు. 'ట్రూలీ' ఇయర్‌బర్డ్స్ ఈ కోవకు చెందినవే. వీటితో మ్యూజి క్ వింటూ లేదా ఫోన్ మాట్లాడుతూ ఇతర పనులు చేసుకోవచ్చు. ఇందులో హ్యాండ్‌ఫ్రీగా మాట్లాడుకోవడానికి వీలుగా మైక్రోఫోన్ ఉంటుంది. బ్లూ టూత్ సాయంతో పనిచేసే ఈ ఇయర్‌బర్డ్స్‌లో నాణ్యమైన మ్యూజిక్ వినడానికి వీలుగా 'నాయిస్ రిడక్షన్' టెక్నాలజీ ఉపయోగపడుతుంది. రీచార్జ్ చేసుకుంటే చాలు.. చార్జ్ స్టేటస్‌ను లెడ్ ఇండికేటర్ చూపిస్తుంది.

ఎఫ్‌బీ మెసెంజర్ వాడి చూడండిలా

చేతిలో స్మార్ట్‌ఫోన్.. అందులో ఫేస్‌బుక్.. ప్రస్తుతం సర్వసాధారణం. ఎప్పుడైనా.. ఎక్కడైనా అలవోకగా చాటింగ్ చేసేస్తుంటాం. ఇలాంటి సమయంలో ప్రతిసారి ఫేస్‌బుక్‌ను ఓపెన్ చేయాల్సిన అవసరం లేకుండా చేస్తుంది 'మెసెంజర్'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1.2 బిలియన్ యూజర్లు ఎఫ్‌బీ మెసెంజర్ సొంతం. ఈ మెసెంజర్‌లో కొత్త ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి. అవేంటో చూద్దాం..



1. షేర్ యువర్ డే

స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్ లాగే ఫేస్‌బుక్ కూడా స్టోరీస్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టింది. వీటితోపాటు ఆండ్రాయిడ్, ఐవోఎస్‌లలో మెసెంజర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. కాంటాక్ట్స్ ఆధారంగా పనిచేసే మెసెంజర్‌లో మీకు సంబంధించిన ఓన్ డేను యాడ్ చేసుకోవాలంటే.. కెమెరా ఆప్షన్ మీద క్లిక్ చేసి.. ఎఫెక్ట్స్ మీద క్లిక్ చేయాలి.

2. యూజ్ ఇన్ చాట్ రియాక్షన్స్

ఫేస్‌బుక్‌లో వ్యక్తిగత పోస్టులకు లైక్, లవ్, హాహా, యాంగ్రీ, శాడ్ ఎమోజీలను సెట్ చేస్తుంటాం. దీంతో పోలిస్తే మెసెంజర్‌లో ఎమోజీలు కాస్త భిన్నంగా ఉంటాయి. మీరు ఏదైనా ఐకాన్ మీద క్లిక్ చేసినప్పుడు దాని రియాక్షన్ కింది భాగంలో కనిపిస్తుంది. అలాగే ఎమోజీ పంపగానే నోటిఫికేషన్ వస్తుంది.

3. ప్రొఫైల్ కోడ్

ప్రతి మెసెంజర్‌కు ప్రత్యేకమైన కోడ్ ఉంటుందన్న విషయం చాలామందికి తెలియదు. మెసెంజర్‌లోని ప్రొఫైల్లోకి వెళ్తే ప్రొఫైల్ పిక్చర్ సర్కిల్‌లో ఉన్నట్లు కనిపిస్తుంది. దాని మీద క్లిక్ చేస్తే మై కోడ్, స్కాన్ కోడ్ కనిపిస్తాయి. కొత్తవాళ్లను యాడ్ చేసుకోవాలనుకున్నప్పుడు స్కాన్ కోడ్‌ను క్లిక్ చేస్తే చాలు.

4. ప్లే మోర్ గేమ్స్

ఎఫ్‌బీలోలానే మెసెంజర్‌లోనూ గేమ్స్ ఆడుకోవచ్చు. ఈ యాప్‌లో గేమ్స్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే దాదాపు 10 గేమ్‌లు మనకు కనిపిస్తాయి. వీటిలో ఒకదానిని యాక్సెస్ చేసుకుంటే చాలు మిగిలిన గేమ్‌లన్నీ యాక్సెస్ అవుతాయి. ఇప్పటికే 60పైగా గేమ్‌లు అందుబాటులో ఉన్నాయి.

5. ఫ్రెండ్స్‌ని ట్యాగ్ చేయడం

గ్రూప్ చేస్తున్నా సరే ఒక వ్యక్తికి మాత్రమే మెసేజ్ పంపాలని అనుకుంటే.. వారిని ట్యాగ్ చేయొచ్చు. ఎట్ ద రేట్ అని టైప్ చేసి వారి పేరు టైప్ చేస్తే చాలు వ్యక్తిగతంగా నోటిఫికేషన్ పంపిస్తుంది. ఈ ఆప్షన్ ద్వారా మెసేజ్‌లు మిస్ అయ్యే అవకాశం ఉండదు.

6. రిమైండర్లు

రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన లేదా తేదీలవారీగా కూడా రిమైండర్లు సెట్ చేసుకోవచ్చు. ఇందుకు మెసేజ్ బాక్స్‌లో క్లిక్ చేసి మెసేజ్ టైప్ చేసి డేట్, టైం సెట్ చేసుకుంటే చాలు.

సాక్షి బిజినెస్
గురువారం 31-8-2017
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
258 ▲	88 ▲
31,646	9,884

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,364	▲	63
డోజోన్స్	21,901	▲	35
ఎఫ్‌టీఎస్ఈ 100	7,365	▲	28
డాక్స్	12,002	▲	57
షాంఘై	3,363	▽	2
నికాయ్	19,507	▲	144

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (మంగళవారం ముగింపు)

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.11	64.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.25	84.21
€	యూరో	ఎస్‌బీఐ	75.26	77.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.75	59.79
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.70	51.66
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.40	47.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.41	18.34
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.80	18.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.84	11.10

నల్లధనంపై తెల్లమొహం..!!

అసలు ఉందా లేక తెల్లగా మారిందా?

- రద్దయిన రూ.1,000 నోట్లలో 99 శాతం వెనక్కి
- వెనక్కి రాని నోట్ల విలువ కేవలం రూ. 8,925 కోట్లే.
- రూ.500 నోట్లపై బయటకు రాని పూర్తి గణాంకాలు
- ఆర్‌బీఐ తాజా నివేదికతో బయటపడిన వాస్తవాలు...



న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రూపంలో భారీగా నల్లధనం పోగుపడిందన్న అంచనాలతో, అవినీతిపరుల వెన్ను విరిచేందుకు నరేంద్ర మోదీ సర్కారు చేపట్టిన డీమోనిటైజేషన్ అస్త్రం సత్ఫలితాలను ఇచ్చిందా..? అన్న ప్రశ్నకు అవును అనే సమాధానం మాత్రం వినిపించడం లేదు. ఎందుకంటే ఆర్‌బీఐ తాజాగా వెల్లడించిన గణాంకాలు మరోలా ఉన్నాయి మరి. గతేడాది నవంబర్ 8న రూ.500, రూ.1,000 నోట్లు రద్దు చేస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం అప్పటికి మార్కెట్లో చలామణిలో ఉన్న రూ.1,000 నోట్ల విలువ రూ.6.86 లక్షల కోట్లు. కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ స్వయంగా ఈ ఏడాది ఫిబ్రవరి 3న లోక్‌సభకు ఈ విషయాన్ని వెల్లడించారు. మరి డీమోనిటైజేషన్ కార్యక్రమం ముగిసిపోయిన ఈ ఏడాది మార్చి నాటికి కేవలం రూ.8,925 కోట్ల విలువ చేసే రూ.1,000 నోట్లు మాత్రమే వెనక్కిరాలేదని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. దీని ప్రకారం చూస్తే మొత్తం రూ.1,000 నోట్లలో 99 శాతానికిపైగా తిరిగి వెనక్కి వచ్చాయి. కేవలం ఓ పావు శాతం లోపు నోట్లు మాత్రమే బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాకుండా ఆగిపోయాయనేది స్పష్టమైంది.

రూ.500 నోట్లపై అయోమయం!

ఇక రూ.500 నోట్ల విలువ గురించి ఈ విధంగా లెక్కించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే పెద్ద నోట్లను రద్దు చేసిన వెంటనే వ్యవస్థలోకి కొత్త రూ.500 నోట్లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇక ఆర్‌బీఐ పాత, కొత్త రూ.500 నోట్లకు సంబంధించి వేర్వేరు గణాంకాలను ప్రకటించలేదు. దీంతో రూ.500 నోట్ల చలామణి విషయమై అస్పష్టత నెలకొంది. కేంద్రం రద్దు చేసిన పెద్ద నోట్ల విలువ రూ.15.4 లక్షల కోట్లు కాగా, వీటిలో సగానికి పైగా రూ.500 నోట్లే. రద్దయిన రూ.500 నోట్లలో వాస్తవానికి ఎన్ని వెనక్కి వచ్చాయన్నది తెలియాలంటే ఆర్‌బీఐ స్పష్టమైన గణాంకాలు వెల్లడిస్తేనే సాధ్యం. వెనక్కిరాని 500 నోట్ల విలువ రూ.7,075 కోట్లుగా లెక్కతేలుతోంది.

నల్లధనం ఎంత పట్టారు?

రూ.500 నోట్లపై స్పష్టమైన గణాంకాలు బయటకు రానప్పటికీ వ్యవస్థలో ఉన్న నల్లధనాన్ని కేంద్రం ఏ మేరకు ఏరి పారేసిందో రూ.1,000 నోట్ల గణాంకాలను బట్టి అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూ.1,000 నోట్లలో దాదాపు 99.5% వెనక్కి వచ్చినట్టుగానే రద్దయిన రూ.500 నోట్లు కూడా అదే స్థాయిలో వ్యవస్థలోకి వచ్చినట్లు తాజా నివేదిక చెబుతోంది. అప్పుడు ఆర్థిక వ్యవస్థకు వెలుపల చలామణి అవుతున్న నల్లధనాన్ని కేంద్రం తుడిచేసింది ఏముందున్న ప్రశ్న తలెత్తక మానదు. అసలు నల్లధనం పెద్దగా లేకపోయి ఉండొచ్చు. లేదా అవినీతిపరులు నేరుగా లేదా బినామీల ద్వారా బ్యాంకుల నుంచి, ఇతర మార్గాల్లో (రాజకీయ విరాళాలు, కొనుగోళ్లు) తమ నల్లధనాన్ని తెల్లగా మార్చేసుకుని అయినా ఉండొచ్చు. ఒకవేళ ఇలా చేస్తే వీరికి పన్ను అధికారుల నుంచి తాఖీదులు అందుతాయి. భారీ పనిభారంతో సతమతం అవుతున్న ఐటీ శాఖ.. నిందితులను పట్టుకునేందుకు ఎన్నేళ్లయినా పట్టొచ్చు. అప్పటికీ జరిమానాలతో బయటపడే మార్గాలు ఉండనే ఉన్నాయి.

ఆర్‌బీఐ అందుకే వెల్లడించడం లేదా?

ఆర్‌బీఐ డీమోనిటైజేషన్ నివేదిక ప్రకారం చూస్తే... కేంద్రం కొండను తవ్వి పట్టిన నల్లధనం ఏ మేరకు ఉందో స్పష్టంగా తెలిసిపోతుంది. భారీగా నల్లధనం వ్యవస్థలో ఉందని... నకిలీ నోట్లు కూడా భారీస్థాయిలో ఇతర దేశాల నుంచి వస్తున్నాయంటూ ఊదరగొట్టిన మోదీ సర్కారు.. ఆర్‌బీఐ వద్దనున్న గణాంకాలను కావాలనే ఇన్నాళ్లూ తొక్కిపెట్టిందన్నది తాజా నివేదికతో బట్టబయలైంది. డీమోనిటైజేషన్ జరిగిన తొమ్మిది నెలలకుగాని ఈ గణాంకాలను ఆర్‌బీఐ వెల్లడించకపోవడానికి ఇదే ప్రధాన కారణంగా కనబడుతోంది. నిజానికి డీమోనిటైజేషన్ తర్వాత ప్రతీ బ్యాంకు శాఖ ఎంత మేర నల్లధనం స్వీకరించిందీ కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలో గణాంకాలతో సహా నమోదు చేశాయి. అలాగే, నకిలీ నోట్లను గుర్తించే పరికరాలతో స్కాన్ చేయడం కూడా ఎప్పుడో పూర్తయింది. దీంతో ఎంత మేర వెనక్కి వచ్చిందన్న దానిపై ఆర్‌బీఐ, ప్రభుత్వం వద్ద అంచనాలు చాన్నాళ్ల క్రితమే ఉన్నాయన్నది సుస్పష్టం. అయినా వెనక్కి వచ్చిన నోట్లు అసలా, నకిలీయా లెక్కింపు పూర్తి కాలేదంటూ ఆర్‌బీఐ ఇన్నాళ్లూ కాలయాపన చేయడం ఆశ్చర్యాన్ని కలిగించేదే. ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ ఆర్ గాంధీ అయితే వచ్చే ఏడాది మార్చి నాటికి కూడా రద్దయిన నోట్ల లెక్కింపు పూర్తి కాదని ఇటీవలే ఒక సందర్భంలో అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. మరి ఆర్‌బీఐ నోట్ల లెక్కింపు పూర్తి కాకుండానే... ప్రధాని మోదీ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో రూ.3 లక్షల కోట్ల మేర నల్లధనం వ్యవస్థలోకి రాలేదని ఎలా చెప్పారో ఆయనకే తెలియాలి మరి.

నోట్ల రద్దుతో మిగిలిందేంటి..?

కేంద్రంలోని మోదీ సర్కారు పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల నల్లధనం తుడిచిపెట్టుకుపోయిందో, లేదోగానీ... పన్ను చెల్లింపుదారుల సంఖ్య మాత్రం పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికితోడు రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలను రద్దు చేయడంతో పన్ను ఎగవేతలకు చెక్ పడుతుందంటున్నారు. కానీ, అసలు డీమోనిటైజేషన్ కార్యక్రమానికి కీలకమైన నల్లధనం ఏరివేత ప్రయోజనం మాత్రం సిద్ధించినట్టు కనిపించడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

మొండిబకాయిలపై ‘దివాలా’ కొరడా

రెండో లిస్టులో 26 సంస్థలు

- బ్యాంకులకు ఆర్‌బీఐ లేఖ
- జాబితాలో వీడియోకాన్, జేపీ అసోసియేట్స్ మొదలైనవి
- ఎన్‌పీఏలపై పరిష్కారానికి డిసెంబర్ 13 దాకా గడువు
- లేదంటే దివాలా చట్టం కింద చర్యలు



ముంబై: భారీగా మొండి బాకీలు పేరుకుపోయిన సంస్థలకు సంబంధించి ఆర్‌బీఐ బ్యాంకులకు పంపిన రెండో విడత లిస్టులో 26 సంస్థలు ఉన్నట్లు తెలుస్తోంది. నిర్దిష్ట పథకాల ద్వారా ఈ సంస్థల నుంచి బకాయిలు రాబట్టేందుకు డిసెంబర్ 13 దాకా రిజర్వ్ బ్యాంక్ గడువు విధించింది. ఆలోగా పరిష్కారం కాకపోతే.. డిసెంబర్ 31లోగా ఆయా సంస్థలపై దివాలా చట్టం కింద (ఐబీసీ) నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను బ్యాంకులు ఆశ్రయించాల్సి ఉంటుంది. బ్యాంకులకు రాసిన లేఖలో ఆర్‌బీఐ ఈ అంశాలు పేర్కొన్నట్లు సమాచారం. దాదాపు రూ. లక్ష కోట్లు పైగా బాకీపడిన 26 కంపెనీల్లో భారీ స్థాయి కోవకి చెందినవాటిల్లో వీడియోకాన్ ఇండస్ట్రీస్, జేపీ అసోసియేట్స్ (జేఏఎల్) ఉన్నాయి. తమ రుణ చెల్లింపు ప్రణాళికను రుణదాతల ఫోరం జూన్ 22న ఆమోదించిన నేపథ్యంలో తాజా జాబితాపై తాము స్పందించేందుకేమీ లేదని జేపీ గ్రూప్ చైర్మన్ మనోజ్ గౌర్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ లేఖలో పేర్కొన్నట్లుగా వస్తున్న వివరాలు వాస్తవమే అయిన పక్షంలో విషయం దివాలా చట్టం ప్రయోగించే దాకా వెళ్లకుండానే పరిష్కారాన్ని కనుగొనేలా ఇటు రుణదాతలకు, అటు రుణాలు తీసుకున్న సంస్థలను ప్రోత్సహించవచ్చని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. రెండో విడత లిస్టులో 40 దాకా సంస్థలు ఉన్నాయని, ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన 4 కంపెనీలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన మొండిబాకీలపై దృష్టి సారించిన ఆర్‌బీఐ.. టాప్ 500 భారీ ఖాతాల సమస్య పరిష్కారానికి 6 నెలల్లోగా తగు ప్రణాళిక రూపొందించాలంటూ బ్యాంకులను ఆదేశించింది. ఒకవేళ పరిష్కారం లభించకపోతే దివాలా చట్టం కింద చర్యలు తీసుకునేందుకు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించవచ్చని సూచించింది.

విద్యుదుత్పత్తి సంస్థలు .. టెల్కోలు..

ఆర్‌బీఐ మలివిడత లిస్టులో ప్రధానంగా విద్యుత్, టెలికం, ఉక్కు, ఇన్‌ఫ్రా సంస్థలు ఉన్నట్లు సమాచారం. లిస్టులోని సంస్థలు జూన్ 30 నాటికి చెల్లించాల్సిన బాకీల్లో సుమారు అరవై శాతం భాగాన్ని బ్యాంకులు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించాయి. ఈ కోవకి చెందినవాటినే జాబితాలో పొందుపర్చడం జరిగింది. జూన్ ఆఖరు నాటికి బ్యాంకుల్లో స్థూల నిరర్థక ఆస్తుల పరిమాణం 24% ఎగిసి రూ.7.79 లక్షల కోట్లకు చేరింది. వీటికి సంబంధించి తొలివిడతలో భారీగా బాకీపడిన 12 ఖాతాలను ఆర్‌బీఐ గుర్తించి.. తక్షణ చర్యలు చేపట్టాలని బ్యాంకులను ఆదేశించింది.

పెద్ద కారు ఇక ప్రియం!

జీఎస్‌టీ సెస్సు 25 శాతానికి పెంపు...

- ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం
- ఆర్డినెన్స్ ద్వారా జీఎస్‌టీ చట్ట సవరణ

న్యూఢిల్లీ: పెద్ద కార్లపై సెస్సును ప్రస్తుతమున్న 15 శాతం నుంచి గరిష్టంగా 25 శాతానికి పెంచే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. దీంతో మధ్య, పెద్ద కార్లు, లగ్జరీ వాహనాలు, హైబ్రీడ్ వాహనాలు, స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ మొదలైన వాటి రేట్లు పెరగనున్నాయి. వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) విధానం జూలై 1న అమల్లోకి వచ్చినప్పుడు పన్నుల శ్లాబుల్లో వ్యత్యాసాల కారణంగా లగ్జరీ కార్ల ధరలు సుమారు 3 శాతం దాకా తగ్గగా.. సాధారణంగా వినియోగించే పలు ఉత్పత్తుల రేట్లు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యత్యాసాలను సరిచేసే దిశగా గరిష్ట సెస్సు రేటును పెంచేందుకు జీఎస్‌టీ చట్టానికి ఆర్డినెన్స్ ద్వారా తగు సవరణలు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. వివిధ వాహనాలపై వాస్తవ సెస్సు ఎంత ఉండాలి, ఎప్పట్నుంచి అమలవుతుంది అన్నది జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుందని వివరించారు. సెప్టెంబర్ 9న జైట్లీ సారథ్యంలో ఈ కౌన్సిల్ హైదరాబాద్‌లో భేటీ కానుంది. ప్రస్తుతం 28% జీఎస్‌టీకి అదనంగా పెద్ద కార్లపై 15% దాకా సెస్సు ఉంటోంది. ఇదే 25%కి పెరగనుంది.

సామాన్యులకే ప్రయోజనం కలగాలి ..

విలాసవంతమైన ఉత్పత్తులు ధరలు తగ్గేలాగా, నిత్యావసరాల ధరలు పెరిగేలా చేయడమనేది పన్ను విధాన ప్రధానోద్దేశం కాదని జైట్లీ స్పష్టం చేశారు. ‘పన్ను ప్రయోజనం అనేది సామాన్యులకు ఉపయోగించే ఉత్పత్తులకు ఉండాలే తప్ప లగ్జరీ ఉత్పత్తులకు కాదు. రూ. 1 కోటి పెట్టి కారు కొంటున్న వారు రూ. 1.20 కోట్లు కూడా వెచ్చించి కొనుక్కోగలరు‘ అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు సిగరెట్స్ పైనా సెస్సును పెంచడంపై స్పందిస్తూ.. సిగరెట్లను చౌకగా అందించడం జీఎస్‌టీ లక్ష్యం కాదని జైట్లీ స్పష్టం చేశారు. ‘ఒకవేళ అలాగే చేసి ఉంటే మతిలేని వ్యవహారంగా ఉండేది‘ అని ఆయన వ్యాఖ్యానించారు. లగ్జరీ కేటగిరీ కింద అత్యధిక ఎక్సైజ్ సుంకం, వ్యాట్ వర్తించే కార్లపై తప్ప మిగతా వాటిపై రేటు పెంచే యోచనేదీ లేదని కేంద్ర రెవెన్యూ విభాగం కార్యదర్శి హస్‌ముఖ్ అధియా చెప్పారు.

వృద్ధికి ప్రతికూలం: వాహన పరిశ్రమ

లగ్జరీ కార్లు, ఎస్‌యూవీలపై సెస్సు పెంచాలన్న ప్రతిపాదన.. ఈ విభాగం వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మెర్సిడెస్–బెంజ్, ఆడి, జేఎల్ఆర్ తదితర ఆటోమొబైల్ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ‘సెస్సు పెంపును హడావిడిగా అమలు చేయాలన్న‘ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. కనీసం ఆరు నెలలైనా ఆగి జీఎస్‌టీ ప్రభావంపై స్పష్టత వచ్చాక సమీక్ష జరిపి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించాయి.


తగ్గి.. పెరిగిన పన్నులు...

జీఎస్‌టీ అమల్లోకి రాక మునుపు పెద్ద కార్లపై సేల్స్ ట్యాక్స్, సెస్ తదితరాలు కలిసి పన్ను రేటు 52–54.72% శ్రేణిలో ఉండేది. దీనికి సెంట్రల్ సేల్స్ ట్యాక్స్, ఆక్ట్రాయ్ మొదలైన వాటి రూపంలో అదనంగా మరో 2.5 శాతం వర్తించేది. అయితే, జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత మొత్తం పన్ను స్థాయి సుమారు 43%కి (28 శాతం జీఎస్‌టీతో 15% సెస్ కలిపి) దిగి వచ్చింది. దీంతో, ఎస్‌యూవీల ధరలు కూడా సుమారు రూ. 1–3 లక్షల మేర, కొన్ని లగ్జరీ కార్ల రేట్లు ఏకంగా రూ. 10 లక్షల దాకా కూడా దిగొచ్చాయి. ఈ నేపథ్యంలోనే సెస్సును పెంచాలని జీఎస్‌టీ కౌన్సిల్ ఆగస్టు 5న నిర్ణయించింది. ఇలా సెస్సుల రూపంలో వసూలైన మొత్తాన్ని జీఎస్‌టీ అమలుతో ఆదాయం నష్టపోతున్న రాష్ట్రాలకు పరిహారం కింద చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం వినియోగించనుంది.



ఉత్పత్తి లక్ష్యాన్ని కుదించిన ఎన్‌ఎండీసీ

హైదరాబాద్: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని కుదించింది. 2018–19 నాటికి 50 మిలియన్ టన్నులకు, 2021–22 నాటికి 67 మిలియన్ టన్నులకు సవరించింది. 2015లో ఎన్‌ఎండీసీ రచించుకున్న విజన్ 2025 ప్రణాళిక ప్రకారం వార్షిక ఉత్పత్తి 2018–19 కల్లా 75 మిలియన్ టన్నులు, 2021–22 కల్లా 100 మిలియన్ టన్నులకు చేరుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ముడి ఇనుముకు డిమాండ్‌తోపాటు ధరలూ పడిపోవడం, అలాగే నిల్వలు పేరుకుపోవడం సంస్థ తాజా నిర్ణయానికి కారణం. 2016–17లో కంపెనీ 34 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం.



6.1 నుంచి 6.6 వరకూ...

- తొలి త్రైమాసిక జీడీపీ వృద్ధిపై అంచనాలు
- నేడే గణాంకాల విడుదల



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) జూన్ త్రైమాసిక (2017, ఏప్రిల్–జూన్) గణాంకాలు ఆగస్టు 31వ తేదీన విడుదల అవుతున్న నేపథ్యంలో దీనిపై విభిన్న వర్గాల నుంచి అంచనాలు వెలువడుతున్నాయి. 6.1 శాతం నుంచి 6.6 శాతం శ్రేణిలో ఈ లెక్కలు ఉన్నాయి. జనవరి–మార్చి మధ్య జీడీపీ గణాంకాలు కేవలం 6.1 శాతంగా నమోదుకాగా, గత ఆర్థిక సంవత్సరం మొత్తంగా 7.1 శాతం వృద్ధి నెలకొంది. ఇక నాల్గవ త్రైమాసికంలో ఆర్థిక క్రియాశీలతను సూచించే జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) 5.6%గా ఉంది. ఈ నేపథ్యంలో రానున్న గణాంకాలపై వివిధ సంస్థల అంచనాలు చూస్తే...

నొమురా: తొలి త్రైమాసికంలో ఈ వృద్ధి రేటు 6.6% ఉంటుందని జపాన్ బ్రోకరేజ్ సంస్థ– నొమురా అంచనావేసింది. కాగా, ఆర్థికాభివృద్ధి పరంగా డీమోనిటైజేషన్, జీఎస్‌టీ నుంచి నెలకొన్న ప్రతికూలతలు తొలగిపోతున్నట్లు నొమురా పేర్కొంది.

ఇక్రా: జీడీపీ వృద్ధి రేటు 6.1 శాతంగానే ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అభిప్రాయపడింది. ఇక జీవీఏ వృద్ధి రేటు 6.3 శాతానికి తగ్గుతుందని ఇక్రా అంచనా వేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 7.6 శాతం. వస్తు సేవల పన్ను అమలు, రూపాయి బలోపేతం వంటి అంశాలను ఇందుకు కారణంగా చూపింది. ఇక జూన్ త్రైమాసికంలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు 7.4% నుంచి 3.9%కి పడిపోతుందని ఇక్రా తన తాజా నివేదికలో పేర్కొంది. తయారీ, విద్యుత్, గ్యాస్, జలవనరుల సరఫరా, నిర్మాణ రంగాల పేలవ పనితీరును ఇందుకు కారణంగా చూపింది.

జీవీఏ–జీడీపీ... వ్యత్యాసం!

ఉత్పత్తివైపు లేదా సరఫరాలవైపు నుంచి ఆర్థిక క్రియాశీలతను జీవీఏ గణాంకాలు సూచిస్తే, వినియోగపరంగా లేదా డిమాండ్ పరంగా ఉన్న పరిస్థితిని జీడీపీ గణాంకాలు సూచిస్తాయి.

లాభాలు...: వివిధ సంస్థల అంచనాల ప్రకారం– జీఎస్‌టీ, డీమోనిటైజేషన్ ప్రతికూల ఫలితాలు క్రమంగా వీడిపోతాయి. దేశంలో నెలకొన్న డిమాండ్ మొత్తం ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7 శాతం పైన నిలబెట్టే వీలుంది. తన వర్షపాతం గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పురోగతికి దోహదపడుతుంది.

నష్టాలు...: ఇప్పటికీ డీమోనిటేజేషన్ ఎఫెక్ట్ పూర్తిగా తొలగిపోలేదు. దీనికితోడు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లో క్లిష్టత నెలకొంది. సేవలు, కార్పొరేట్ ఆదాయాలు, పెట్టుబడులు బలహీనంగానే ఉన్నాయి. ఇక పారిశ్రామిక వృద్ధి పేలవంగానే ఉంది.

క్లుప్తంగా క్యూ1 అంచనాలు (శాతాల్లో) ఇలా...

సంస్థ	జీవీఏ	జీడీపీ
నొమురా	–	6.6
ఇక్రా	6.3	6.1
కేర్	6.3	6.5
ఇండియా రేటింగ్స్	6.4	6.6
హెచ్‌డీఎఫ్‌సీ	6.7	6.6
కొటక్ మహీంద్ర	6.0	–
యాక్సిస్ బ్యాంక్	5.9	6.1
హెచ్‌ఎస్‌బీసీ	6.0	6.2

జీవీఏ వృద్ధి రేటు 7.3 శాతం: ఆర్‌బీఐ

ముంబై: ఆర్థిక క్రియాశీలతను సూచించే జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్) వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.3%గా ఉంటుందని ఆర్‌బీఐ2016–17 వార్షిక నివేదికలో పేర్కొంది. గతేడాది(2016–17) ఇది 6.6%. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం 2017–18లో తొలి 6 నెలల్లో 2–3.5% శ్రేణిలో ఉంటుందని పేర్కొంది. ద్వితీయ భాగంలో ఈ రేటు 3.5–4.5% శ్రేణిలో ఉండొచ్చని వివరించింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2017–18లో కొంత రికవరీ జరిగే అవకాశం ఉందని నివేదికలో అభిప్రాయపడింది. ఆర్‌బీఐ రుణ రేటు తగ్గింపు ప్రయోజనం బ్యాంకింగ్ నుంచి అన్ని రంగాలకూ సమానంగా అందడంలేదన్న ఆందోళన వ్యక్తం చేసింది. 2017–18లో ఇప్పటివరకూ 4 రాష్ట్రాలు వ్యవసాయ రుణ రద్దు ప్రకటన చేశాయని, మరికొన్ని రాష్ట్రాలూ ఇదే బాటలో ఉన్నాయని పేర్కొన్న ఆర్‌బీఐ, ఇది స్వల్ప కాలంలో ద్రవ్య క్రమశిక్షణపై ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. బ్యాంకింగ్ మొండిబకాయిల భారం ఆందోళనకరమైనదేనని పేర్కొంది.

రూ. కోటిన్నర విలువ చేసే యాడ్రో శిల్పాలనూ కొన్నారు!

స్పా లైఫ్‌స్టైల్ సీఈవో నిఖిల్ లాంబా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యాడ్రో.. స్పెయిన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ ప్రీమియం బ్రాండ్ పోర్సిలిన్‌తో తయారైన శిల్పాలను విక్రయిస్తోంది. క్వీన్ ఆఫ్ ద నైల్ పేరుతో రూపొందించిన ప్రతిమ ఖరీదు రూ.1.65 కోట్లు. భారత్‌లోనూ దీనిని సొంతం చేసుకున్న కస్టమర్లు ఉన్నారని యాడ్రో బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న స్పా లైఫ్‌స్టైల్ సీఈవో నిఖిల్ లాంబా బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. లిమిటెడ్ ఎడిషన్‌లో 100 యూనిట్లు మాత్రమే కంపెనీ తయారు చేసిందని, అన్నీ అమ్ముడయ్యాయని చెప్పారు. కార్నివల్ ఆఫ్ వెనైస్ పేరుతో గతేడాది విడుదలైన రూ.1.66 కోట్ల విలువైన బొమ్మకూ భారత్ నుంచి ఎంక్వైరీలు వస్తున్నాయని వెల్లడించారు. భారత్‌కు సంబంధించి తొలిసారిగా 2001లో వినాయకుడి శిల్పాన్ని కంపెనీ ఆవిష్కరించింది. లిమిటెడ్ ఎడిషన్‌లో 2,000 పీసులు మాత్రమే తయారు చేశారు. అన్నీ కూడా ఏడాదిలోనే అమ్ముడుపోవడం విశేషం.

త్వరలో ఆభరణాలు..

భారత మార్కెట్ కోసం పోర్సిలిన్‌తో తయారైన ఆభరణాలను రానున్న రోజుల్లో ప్రవేశపెట్టనున్నట్టు నిఖిల్ వెల్లడించారు. ‘120 దేశాల్లో కంపెనీ 2,000పైగా సొంత ఔట్‌లెట్ల ద్వారా 500 రకాల విభిన్న ఉత్పాదనలను విక్రయిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 100 కొత్త శిల్పాలను ఆవిష్కరిస్తున్నాం. 8 స్టోర్లున్న భారత్ నుంచి 7 శాతం అమ్మకాలు నమోదవుతున్నాయి. జపాన్, యూఎస్ఏ టాప్ మార్కెట్లు. యూఎస్‌లో ఉన్న ఎన్నారైలు కంపెనీకి చాలా కీలకం. భారత్‌లో 250 మోడళ్లను అందుబాటులోకి తెచ్చాం. దేవతల శిల్పాలతోపాటు గాంధీ, మదర్ థెరిసా, గౌతమ బుద్ధ వీటిలో ఉన్నాయి. ఇక్కడ అమ్ముడవుతున్న వాటిలో భారత్‌తో ముడిపడి ఉన్న ప్రతిమల వాటా 40 శాతం దాకా ఉంది. బాలాజీ శిల్పం రూపొందించాల్సిందిగా కంపెనీకి ప్రతిపాదించాం’ అని తెలిపారు.



హైదరాబాద్ తాజ్‌కృష్ణాలోని యాడ్రో ఔట్‌లెట్లో నిఖిల్ లాంబా




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,750 (కనిష్ఠం) రూ.5,120 (గరిష్ఠం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.2,000 (కనిష్ఠం) రూ.5,000 (గరిష్ఠం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.3,525 (కనిష్ఠం) రూ.8,111 (గరిష్ఠం)
ఉల్లి (కర్నూలు)	------
చక్కెర (చెన్నై)	రూ.4,080
బియ్యం (కరీంనగర్)	రూ.3,650 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,800
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781











వేగంగా కోలుకున్న మార్కెట్

- జీఎస్‌టీ వసూళ్ల ఎఫెక్ట్
- సెన్సెక్స్ 258, నిఫ్టీ 88 పాయింట్లు అప్

ముంబై: ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగంతో క్రితం రోజు కుప్పకూలిన స్టాక్ మార్కెట్ బుధవారం వేగంగా కోలుకుంది. కొరియా దూకుడుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆచితూచి స్పందించడంతో ప్రపంచ ట్రెండ్ సానుకూలంగా మారిన నేపథ్యం..జూలై నెలలో జీఎస్‌టీ పన్ను వసూళ్ల లక్ష్యాన్ని మించి రూ. 92,283 కోట్లు వసూలయ్యాయన్న వార్తలతో గ్యాప్‌అప్‌తో మొదలైన మార్కెట్ రోజంతా లాభాల్ని నిలబెట్టుకోవడం విశేషం. బీఎస్‌ఈ సెన్సెక్స్ 258 పాయింట్లు జంప్‌చేసి 31,464 పాయింట్ల వద్ద ముగిసింది. మంగళవారం సెన్సెక్స్ 360 పాయింట్లు నష్టపోయిన సంగతి తెలిసిందే. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 88 పాయింట్లు ర్యాలీ జరిపి 9,884 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. తాజా ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద రూ. 1.54 లక్షల కోట్ల మేర పెరిగింది.



వెలుగులో ఆయిల్, మెటల్ షేర్లు...

బుధవారంనాటి ర్యాలీని ఆయిల్, మెటల్, ఫైనాన్షియల్ షేర్లు ముందుండి నడిపించాయి. పెట్రో మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్‌లు 4–5 శాతం మధ్య ర్యాలీ జరిపి ఆల్‌టైమ్ గరిష్టస్థాయి వద్ద ముగిసాయి. 3 శాతంపైగా పెరిగిన బీపీసీఎల్ రూ. 521 వద్ద క్లోజయ్యింది. ఈ షేరు రికార్డుస్థాయికి మరో 2 శాతం దూరంలో వుంది. ఆయిల్ ఇండెక్స్‌లో భాగమైన మరో దిగ్గజ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ 2 శాతంపైగా పెరిగి రూ. 1,564 వద్ద క్లోజయ్యింది.

విప్రో బైబ్యాక్‌కు షేర్‌హోల్డర్ల అనుమతి

దేశంలో మూడో పెద్ద ఐటీ కంపెనీ విప్రో ప్రతిపాదించిన రూ. 11,000 కోట్ల బైబ్యాక్‌కు షేర్‌హోల్డర్ల అనుమతి లభించింది. షేరుకు రూ. 320 ధరతో 34.37 కోట్ల షేర్ల కొనుగోలుకు గత నెలలో విప్రో బైబ్యాక్ ప్రతిపాదనను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనకు మెజారిటీ షేర్‌హోల్డర్లకు పోస్టల్ బ్యాలెట్, ఈ–ఓటింగ్ ద్వారా ఆమోదం తెలిపినట్లు కంపెనీ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఆగస్టు 28న ముగిసిన ఓటింగ్‌లో 99.68 శాతం ఓట్లు బైబ్యాక్‌కు అనుకూలంగా వచ్చినట్లు కంపెనీ పేర్కొంది. ఈ వార్త నేపథ్యంలో విప్రో షేరు స్వల్ప పెరుగుదలతో రూ. 291.40 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,479
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	23,269
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,30,519
ఎఫ్ఐఐ	-12
డీఐఐ	291

రూ. 195-205 ప్రైస్‌బ్యాండ్‌తో భారత్ రోడ్ నెట్‌వర్క్ ఐపీఓ

శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ గ్రూప్ కంపెనీ అయిన భారత్ రోడ్ నెట్‌వర్క్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) రూ. 195–205 ప్రైస్‌బ్యాండ్‌తో రానుంది. సెప్టెంబర్ 6న మొదలై 8న ముగిసే ఈ ఐపీఓ ద్వారా 2.93 కోట్ల షేర్లు జారీచేసి, రూ. 600 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యమని కంపెనీ తెలిపింది. సమీకరించిన నిధుల్లో అధికభాగం తమ ప్రాజెక్ట్ ఫైనాన్సింగ్‌కు, రుణాల్ని తీర్చేందుకు వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది.


బ్యాంక్ నిఫ్టీ... ఫ్యూచర్స్ సిగ్నల్స్



క్రితం రోజు ప్రధాన సూచీ నిఫ్టీకంటే తక్కువశాతం తగ్గిన బ్యాంక్ నిఫ్టీ...అదే ట్రెండ్‌లో భాగంగా బుధవారం నిఫ్టీకంటే తక్కువ పెరిగింది. బ్యాంకింగ్ షేర్లకంటే... ఇతర రంగాల షేర్లు చురుగ్గా ట్రేడ్‌కావడం ఇందుకు కారణం. స్పాట్ బ్యాంక్ నిఫ్టీ 24,309 పాయింట్ల వద్ద క్లోజ్‌కాగా, ఆగస్టు ఫ్యూచర్ 4 పాయింట్ల డిస్కౌంట్‌తో ముగిసింది. ఈ ఫ్యూచర్ ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) నుంచి 1.91 లక్షల షేర్లు (13 శాతం) కట్ అయ్యాయి. మొత్తం ఓఐ 12.79 లక్షల షేర్లకు తగ్గింది. ఇదే సమయంలో సెప్టెంబర్ ఫ్యూచర్‌లో 4.8 లక్షల షేర్లు యాడ్ అయ్యాయి. ఈ ఫ్యూచర్ ఓఐ 11.04 లక్షల షేర్లకు పెరిగింది. సెప్టెంబర్ ఫ్యూచర్ ప్రీమియం 40 పాయింట్ల మేర వుంది. మరో రోజులో ముగియనున్న ఆగస్టు ఫ్యూచర్లో స్క్వేర్‌ఆఫ్ కార్యకలాపాల్ని, సెప్టెంబర్ ఫ్యూచర్‌కు రోలోవర్స్‌తో పాటు కొత్త క్రియేషన్‌ను ఈ డేటా సూచిస్తోంది. అంతేగాని ఎటువంటి ట్రెండ్‌ను వెల్లడించడం లేదు. ఆగస్టు ఆప్షన్స్ విభాగంలో 24,200, 24,300 స్ట్రయిక్స్ వద్ద భారీగా పుట్ రైటింగ్ జరగడంతో 2.86 లక్షలు, 3.49 లక్షల చొప్పున పుట్స్ యాడ్ అయ్యాయి. ఈ రెండు స్ట్రయిక్స్ వద్ద 5 లక్షల చొప్పున పుట్ బిల్డప్ వుంది. మరోవైపు 24,500 స్ట్రయిక్ వద్ద భారీగా 12.46 లక్షల షేర్ల కాల్ బిల్డప్ వుంది. ఇక్కడ తాజాగా 1.07 లక్షల కాల్స్ యాడ్ అయ్యాయి. గురువారం బ్యాంక్ నిఫ్టీ 24,500 సమీపంలో గట్టి నిరోధాన్ని ఎదుర్కోవచ్చని, ఆపైన స్థిరపడితే వేగంగా ర్యాలీ జరపవచ్చని, క్షీణిస్తే 24,200–24,300 శ్రేణి మధ్య మద్దతు పొందవచ్చని, ఈ మద్దతును కోల్పోతే మరింత తగ్గవచ్చని ఈ ఆప్షన్స్ డేటా వెల్లడిస్తున్నది.

→ హిందాల్కో డెరివేటివ్ సంకేతాలు ఎలా వున్నాయ్? ఈ వివరాలు www.sakshibusiness.comలో

ఐసీఏఐ, ఐసీఏఎన్ భాగస్వామ్యం



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తాజాగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ నేపాల్ (ఐసీఏఎన్)తో పరస్పర అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకుంది. అకౌంటింగ్‌కు సంబంధించిన పలు అంశాలు సహా ప్రొఫెషనల్ అండ్ ఇంటెలెక్చువల్ డెవలప్‌మెంట్, మెంబర్ మేనేజ్‌మెంట్, ప్రొఫెషనల్ ఎథిక్స్, టెక్నికల్ రీసెర్చ్, ఆడిట్ క్వాలిటీ మానిటరింగ్, ప్రొఫెషనల్ అకౌంటెన్సీ ట్రైనింగ్ వంటి వాటిల్లో పరస్పర సహకారమే లక్ష్యంగా ఇరు సంస్థల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బహదూర్ దేవ్‌బా సమక్షంలో ఐసీఏఐ ప్రెసిడెంట్ నీలేశ్ ఎస్ వికంసే, ఐసీఏఎన్ ప్రెసిడెంట్ ప్రకాశ్ జంగ్ తాప ఈ ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.

ఫ్రీడం రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ కుకరీ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

ఫ్రీడం రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్.. ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌తో కలిసి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పట్టణాలో ఫ్రీడం సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కుకరీ వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. ఇందులో భాగంగా హైదరాబాద్ ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ప్రస్తుతం 6 వారాలపాటు– సెప్టెంబర్ 2వ వారం వరకూ ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. ఇందులో 20 మందికిపైగా పాల్గొంటున్నారు. వర్క్‌షాప్‌లో స్వీట్స్, చైనీస్ ఉత్పత్తులు, బేకరీ ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై శిక్షణ నిస్తున్నారు.

బైబ్యాక్‌లో వ్యవస్థాపకులూ పాల్గొనొచ్చు

ఇన్ఫీ షేర్ల బైబ్యాక్‌పై మాజీ సీఎఫ్‌వో బాలకృష్ణన్



బెంగళూరు: ఐటీ దిగ్గజం ప్రతిపాదించిన రూ. 13,000 కోట్ల బైబ్యాక్ ఆఫర్‌లో వ్యవస్థాపకులు కూడా తమ షేర్లను విక్రయించాలనుకోవడంలో తప్పేమీ లేదని సంస్థ మాజీ సీఎఫ్‌వో వి. బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఇన్వెస్టర్లకు ఇదేమీ తప్పుడు సంకేతాలు పంపబోదని పేర్కొన్నారు. 'సాధారణ పరిస్థితుల్లో వ్యవస్థాపకులు తమ షేర్లను విక్రయిస్తుంటేనే సందేహపడాల్సి రావొచ్చు. దేశీ పరిభాషలో బైబ్యాక్ అనేది పన్నుపరమైన ప్రయోజనాలు కల్పించే డివిడెండ్‌కు మరో రూపం లాంటిదిగా భావించవచ్చు. నిజానికి సీఈవో సిక్కా రాజీనామా చేయడానికి కాస్త ముందుగా కంపెనీ బోర్డు బైబ్యాక్ ప్రకటించడమే నాలాంటి బయటి వ్యక్తులకు అసాధారణమైనదిగా అనిపిస్తోంది' అని ఆయన తెలిపారు. వ్యవస్థాపకులు బైబ్యాక్‌లో షేర్లు విక్రయిస్తే. కంపెనీ భవిష్యత్‌పై సందేహాలుండటం వల్లే ప్రమోటర్లు బైబ్యాక్‌లో పాల్గొన్నారన్న సంకేతాలేమైనా ఇచ్చినట్లవుతుందా అన్న ప్రశ్నపై స్పందిస్తూ బాలా ఈ విషయాలు చెప్పారు.

సీఈవో గురించి వారెప్పుడూ మాట్లాడలేదు..

కంపెనీ తమ సారథ్యంలోనే నడుస్తున్నప్పటికీ వ్యవస్థాపకులు ఎప్పుడూ కూడా తమ వాటాలను అడ్డం పెట్టుకుని నియంత్రణాధికారాలు దక్కించుకునేందుకు చూడలేదని బాలా చెప్పారు. తమ పనితీరు ఆధారంగానే కంపెనీపై అజమాయిషీ చేశారని, పనితీరు బాగుండి షేర్‌హోల్డర్లకు ప్రయోజనాలు చేకూర్చినంతకాలం వాటాదారుల మద్దతు తమకు ఉంటుందని వారు విశ్వసించారని తెలిపారు. ఇక, సీఈవో గురించి గానీ కంపెనీ పనితీరు లేదా వ్యూహాల గురించి గానీ వారెప్పుడూ మాట్లాడలేదని, సంస్థ వ్యవహారాల్లోనూ తలదూర్చలేదని బాలా చెప్పారు.

ఏఐ అనుబంధ సంస్థపై బర్డ్ గ్రూప్ ఆసక్తి

ఏవియేషన్ సర్వీసెస్ ప్రొవైడర్ 'బర్డ్ గ్రూప్' తాజాగా ఎయిరిండియా (ఏఐ) అనుబంధ సంస్థపై ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే ఎయిరిండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ సంస్థ 'ఏఐఏటీఎస్ఎల్'ను సొంతం చేసుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ కూడా రాసింది.



బ్రిడ్జ్‌స్టోన్ ప్రచారకర్తగా సింధు..

టైర్ల తయారీ సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ప్రచారకర్తగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధును నియమించుకుంది. ఈ ఒప్పందం మూడేళ్లపాటు ఉంటుందని కంపెనీ బుధవారం ప్రకటించింది.

పసిడికి అమెరికా జీడీపీ బ్రేకులు..!



న్యూయార్క్: అమెరికా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రెండవ త్రైమాసిక (ఏప్రిల్–జూన్) గణాంకాలు అంచనాలకు మించి నమోదుకావడం ఒకవైపు డాలర్ ఇండెక్స్ పురోగమనానికి – మరోవైపు వ్యతిరేక దిశలో బంగారం తిరోగమనానికి దారితీసింది. నిజానికి జూన్ త్రైమాసిక వృద్ధి 2.7 శాతం ఉంటుందని అంచనావేస్తే, 3 శాతంగా బుధవారం గణాంకాలు వెల్లడించాయి. ఇది రెండేళ్ల గరిష్టస్థాయి. మొదటి త్రైమాసికంలో (జనవరి–మార్చి) వృద్ధి 2.6 శాతం. ఈ ఫలితంతో తిరిగి డాలర్ ఇండెక్స్ 92 దిగువ స్థాయి నుంచి (కడపటి సమాచారం అందే సరికి) 93 సమీపస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో కడపటి సమాచారం అందే సరికి చురుగ్గా ట్రేడవుతున్న పసిడి కాంట్రాక్ట్ ఔన్స్ (31.1గ్రా) ధర మంగళవారం ముగింపుతో పోల్చితే 6 డాలర్లు తక్కువగా 1,313 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీనికి అనుగుణంగా దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– ఎంసీఎక్స్‌లో ధర కడపటి సమాచారం అందేసరికి క్రితం ముగింపుకన్నా రూ.116 నష్టంతో, రూ. 29,540 వద్ద ట్రేడవుతోంది. ముంబై స్పాట్ మార్కెట్ బుధవారం పనిచేయలేదు. అయితే దేశంలోని వివిధ బులియన్ మార్కెట్లలో పసిడి ధరలు ఒక మోస్తరుగా తగ్గాయి.

బులియన్ రూ.లలో

	ధర	మార్పు
ముంబై (మంగళవారం ధరలు)		
బంగారం (99.9, 10గ్రా)	29,915	
బంగారం (99.5, 10గ్రా)	29,765	
వెండి (కిలో)	40,030	
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	– –	
బంగారం (22 క్యారెట్లు)	28,240	▼ 250
వెండి (కిలో)	– –	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	29,730	▼ 70
బంగారం (22 క్యారెట్లు)	28,240	▼ 70
వెండి(కిలో)	40,190	0
ప్రొద్దుటూరు (మంగళవారం ధరలు)		
బంగారం (24 క్యారెట్లు)	30,370	
బంగారం (22 క్యారెట్లు)	28,200	
వెండి(కిలో)	40,800	
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	30,350	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	28,230	▼ 70
వెండి(కిలో)	40,900	▼ 600
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	30,600	▼ 500
బంగారం (22 క్యారెట్లు)	28,400	▼ 150
వెండి(కిలో)	41,000	▼ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	30,570	▼ 250
బంగారం (22 క్యారెట్లు)	28,300	▼ 240
వెండి(కిలో)	40,800	▼ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	46.09	$46.44
బ్రెంట్	50.90	$51.66

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 31-8-2017

విశాఖ	362–00
చిత్తూరు	390–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	397–00
విజయవాడ	359–00
గోదావరి	359–00
నమక్కల్	387–00
30-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382–00
ఢిల్లీ	355–00
కోల్‌కతా	394–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1811.2	1801.5
ADANI PORT	389.75	383.3
AMBUJA CEME	280.15	275
ASIAN PAINT	1153.35	1151.7
AXIS BANK L	503.9	503.6
BAJAJ AUTO	2750.55	2726.6
BANK OF BAR	139.45	140.05
BHARTI AIRT	429	428.1
BOSCH LIMIT	22465.2	21693.35
BHARAT PETR	520.95	504.1
CIPLA LTD	566.35	568.9
COAL INDIA	241.8	238.25
EICHER MOTO	30984	30859.15
GAIL (INDIA	381	379
HCL TECHNOL	849.2	852.55
HDFC LTD	1759.05	1727.8
HDFC BANK L	1768.55	1746.15
HERO MOTOCO	3988.1	3945.7
HINDALCO I	236.35	227.3
HIND.Unilever	1204.3	1190.45
INDIABULLS	1208	1202.3
ICICI BANK	300.3	299.5
INDUSIND BA	1655.8	1643.3
BHARTI INFR	384.75	380.3
INFOSYS LIM	926.65	927.45
INDIAN OIL	452.85	434.5
ITC LTD	282	280.25
KOTAK MAHIN	971.35	964.4
LARSEN & TO	1139.65	1130.05
LUPIN LIMIT	988	989.3
MAHINDRA &	1358.15	1376.95
MARUTI SUZU	7557.45	7521.5
NTPC LTD	167.95	168.4
OIL AND NAT	158.4	157.25
POWER GRID	215.6	215.3
RELIANCE IN	1564.1	1532.15
STATE BANK	276.6	277
SUN PHARMAC	484.25	481.8
TATA MOTORS	378.5	376.1
TATA MOTORS	220.85	220.25
TATA POWER	77.65	76.95
TATA STEEL	638.65	630.2
TATA CONSUL	2484.55	2470.85
TECH MAHIND	425.75	431.75
ULTRATECH C	4013.05	3931.6
VEDANTA LIM	305.55	299.05
WIPRO LTD	291.2	290.75
YES BANK LI	1752.1	1721.55
ZEE ENTERTA	520.35	518.25
నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ		
ABB INDIA L	1348.6	1351.25
ASHOK LEYLA	107.3	105.05
BAJAJ FINSE	5489.65	5442.95
BAJAJ FINAN	1788.05	1773.4
BHARAT ELEC	191.85	185.15
BHEL	127.75	126.85
BRITANNIA I	4241.35	4172.6
CADILA HEAL	504.3	498.6
COLGATE PAL	1105.2	1096.8
CONTAINER C	1311.35	1259.9
CUMMINS IND	932.8	902.25
DABUR INDIA	314.35	309.25
DLF LIMITED	183.05	181.6
EMAMI LIMIT	1080.5	1075.65
GLAXOSMITHK	2425.8	2435.8
GLENMARK PH	616.6	615.05
GODREJ CONS	926	915.1
GLAXOSMITHK	5396.05	5349.85
HAVELLS IND	485.2	481.25
HIND.Petroleum	485.95	466.95
HIND.Zinc	295.35	284.1
ICICI PRU L	426.95	424.3
IDEA CELLUL	88	87.45
INTERGLOBE	1195.85	1172.05
JSW STEEL L	259.05	246.9
LIC HOUSING	663.9	659
MARICO LIMI	314.75	312.65
UNITED SPIR	2555.55	2563.55
MOTHERSON S	309.25	303.8
NHPC LTD	29.05	29
NMDC LTD.	126.5	121.8
ORACLE FIN	3425.25	3456.5
OIL INDIA L	292.05	289.2
PIRAMAL ENT	2716.5	2657.15
PETRONET LN	226.8	222.95
POWER FIN C	123.5	120.7
P&G HYGIENE	8294.95	8246.45
PIDILITE IN	831.3	827.25
PUNJAB NATI	142.5	141
RURAL ELEC	166.9	164.45
STEEL AUTHO	61.8	61.05
SHREE CEMEN	17699.55	17363.15
SIEMENS LTD	1276.85	1273.1
SHRIRAM TRA	975.3	971.6
SUN TV NETW	704.15	701.4
TITAN COMPA	611.6	600.45
TORRENT PHA	1209.65	1217.1
UNITED BREW	801.65	802.1
UPL LIMITED	839.85	840.15

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.03	8.4
Alphageo	770.95	759.45
Alu Flouride	67.75	66.7
Amar Raja Bat	778	764.2
And Bank	52	51.7
And Cemen	11.95	9.96
And Paper	297.25	291.45
And Petro	30.6	30.5
Anjani Portl	289.95	241.65
Aries Agro Ltd	142.3	138.1
Aurobindo Ph	735.85	731.45
Avantel Soft	254.1	252.05

A B C D

3M INDIA LI	14757.7	14457.35
63 MOONS TE	60.55	60.1
8K MILES SO	496.3	496.85
AARTI DRUGS	515.15	511.7
AARTI INDUS	844.7	824.4
ABAN OFFSHO	177.25	174.95
ABBOTT INDI	4261	4242.75
ACCELYA KAL	1399.85	1394.65
BF INVESTME	188.6	158.4
BF UTILITIE	372.25	325.1
BGR ENERGY	134.45	132.1
BHAGERIA IN	256.3	257.95
BHANSALI EN	86.05	84.1
BHARAT BIJL	1111	1097.6
BHARAT FIN	878.1	861.35
BHARAT FORG	1143.9	1129.1
BHARAT GEAR	139.85	140.75
BHARAT RASA	2984.95	2974.85
BHARAT WIRE	96.6	86.65
DONEAR IND.	59.8	55.4
DR. LAL PAT	804.55	798
DWARIKESH S	67.25	65.75
DYNAMATIC T	2261.05	2154.5
DYNEMIC PRO	117.75	117.05

E F G H

ECE INDUSTR	208.2	204.55
ECLERX SERV	1264.95	1264.05
EDELWEISS F	242	240.1
HARRISON MA	75.85	75.2
HATSUN AGRO	630.45	632.1
HEALTHCARE	270.85	270.3
HEG LTD	678.65	606.5
HEIDELBERGC	123.9	124.2
HERCULES HO	140.3	138.55
HESTER BIOS	863.45	870.3
HEXAWARE TE	273.95	270.05
HI-TECH PIP	166.6	174.5
HIKAL LIMIT	204.2	202.25
HIL LIMITED	1225.3	1197.25

I J K L

JK PAPER LI	99.55	98.85
JK TYRE & I	144.1	143.4
JKUMAR INFR	195	193.95
JM FINANCIA	126.8	126.35
JMC PROJECT	370.15	365
JOCIL LIMIT	172.7	169.25
JOHNSON CON	1960.85	1947.05
JSW ENERGY	66.6	65.35
JSW HOLDING	1805.4	1770.3
JUBILANT FO	1366.05	1344.85
JUBILANT IN	211.1	216.15

M N O P

MAYUR UNIQU	361.4	359.75
MAZDA LIMIT	356.5	354.95
MCLEOD RUSS	176.4	174.75
MEGHMANI OR	73.45	71.3
MENON BEARI	78.85	76.9
MEP INFRA.	115.55	114.15
MERCK LIMIT	1178.55	1191.35
MINDA CORPO	107.1	106.7
MINDA INDUS	825	802.25
MINDTECK (I	68.5	68.1
MINDTREE LI	462.1	472.1
PHILIPS CAR	674.95	638.5
PHOENIX LAM	210.15	207.3
PI INDUSTRI	721	713.1
PINCON SPIR	59.15	56.65
PIONEER DIS	190.85	192.8
PLASTIBLEND	277.35	257.55
PNB GILTS L	54.95	53.6
PNB HOUSING	1687.6	1600.6
PNC INFRATE	137.05	138.8
PODDAR HOUS	1359.3	1347.4
PODDAR PIGM	260.4	252.25

R S T U

SHALIM PAIN	203.8	199.9
SHANKARA BL	1179.5	1143.75
SHANTHI GEA	135.3	135.7
SHARDA CROP	453.8	452.4
SHARDA MOTO	2603.95	2576.1
SHEELA FOAM	1284.85	1293.55
SHEMAROO EN	356	365.3
SHILPA MEDI	605.95	589.45
SHIPPING CO	97.95	95.2
SHIRPUR GOL	149.25	145.65
SHIVA TEXYA	374.2	362.15
THE PHOENIX	522.5	523.35
THE RAMCO C	693.9	685.65
THE RUBY MI	318.2	311.05
THE STATE T	158.05	155.85
THE TINPLAT	159.5	155.55
THEJO ENGIN	390	383
THEMIS MEDI	434.5	434.85
THERMAX LTD	882.95	891.45
THIRU AROOR	55.95	54.35
THIRUMALAI	1218.4	1195.65
THOMAS COOK	216.3	214.75

V W X Z

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

ప్రయాణికులు సురక్షితం ● ప్రకాశం జిల్లాలో ఘటన


దగ్ధమైన బస్సు

హనుమంతునిపాడు (కనిగిరి): ప్రయాణికులంతా ఆదమరచి నిద్రిస్తున్న వేళఅకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కాలి బూడిదైంది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులంతా ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన బుధవారం వేకువజామున ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలో జరిగింది. బస్సు డ్రైవర్ ఎస్.కేశవ కథనం ప్రకారం.. ఏపీ 29 టీబీ 0306 నంబరు గల మేఘన ట్రావెల్స్‌కు చెందిన ఏసీ బస్సు మంగళవారం రాత్రి 9.40 గంటలకు కడప నుంచి 43 మంది ప్రయాణీకులతో విజయవాడ బయల్దేరింది. అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో బస్సు ఒంగోలు– నంద్యాల రహదారిలోని హనుమంతునిపాడు మండలం తాడివారిపల్లి ఘాట్ వద్దకు వచ్చే సరికి ఇంజన్ నుంచి పొగతో కూడిన వాసన వచ్చింది. దీన్ని గమనించిన డ్రైవర్ బస్సును వెంటనే రోడ్డు మార్జిన్‌లో ఆపాడు. కిందకు దిగి చూడగా అప్పటికే బస్సు మందు భాగంలో మంటలు వస్తుండటంతో, ప్రయాణికులను అప్రమత్తం చేయగా అందరూ కిందికి దిగేశారు. ఆ వెనువెంటనే బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. కొద్దిసేపటికే బస్సుతో పాటు ప్రయాణీకుల బ్యాగులు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రాణ భయంతో లగేజీలు వదిలి బస్సు దిగేశామని, వాటిలో ఉన్న బంగారు నగలు, నగదు, విలువైన వస్తువులు కాలిపోయాయని ప్రయాణికులు వాపోయారు. సమాచారం అందుకున్న దర్శి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పేశారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

డెంగీతో యువకుడి మృతి


పమిడి శివ (ఫైల్)

చీమకుర్తి రూరల్ (సంతనూతలపాడు): డెంగీతో ప్రకాశం జిల్లా చీమకుర్తిలో బుధవారం ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని మృతి చెందాడు. చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెం గ్రామానికి చెందిన పమిడి శివ(37)కు రెండు రోజుల కిందట జ్వరం వచ్చింది. దీంతో అతన్ని ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడం, జ్వరం తీవ్రం కావడంతో బుధవారం ఉదయం శివ మృతి చెందాడు. డెంగీ జ్వరంతోనే శివ మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారని మృతుడి బంధువులు తెలిపారు. దీనిపై డీఎంవో నాగేంద్రయ్యను వివరణ కోరగా.. రిపోర్టు చూసి ధ్రువీకరిస్తామని చెప్పారు.

రఘువీరా.. వెంటనే రాజీనామా చెయ్

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి పోలైన ఓట్లు చూస్తే కడుపు తరుక్కుపోతోందని, పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి వెంటనే పార్టీ పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ డిమాండ్ చేశారు. పీసీసీ పీఠంపై ఉండేందుకు రఘువీరా అర్హుడు కాదని ఆయన విమర్శించారు. బుధవారం ఉదయం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో చింతా మోహన్ విలేకరులతో మాట్లాడారు. తిరుపతి ఉప ఎన్నికలో కిందటిసారి నిరుపేద మహిళ శ్రీదేవిని అభ్యర్థిగా నిలబెడితే 10 వేల ఓట్లు పోలయ్యాయనీ, నంద్యాలలో మాత్రం వందల్లో ఓట్లు పడటం పార్టీకి తీరని అవమానంగా, తలవంపులుగానూ ఉందన్నారు. మూడు రోజుల పాటు కడుపులోని వ్యథను ఉగ్గపట్టుకుని ఈరోజు బయటపడి చెబుతున్నానంటూ, నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికే సరైంది కాదన్నారు. దీనికితోడు పార్టీ పరంగా ఎన్నో తప్పులు జరిగాయన్నారు. నంద్యాల్లో జరిగింది అసలు ఎన్నికలే కాదనీ, కోట్లతో ఓట్లు కొనుగోలు చేసే సంబరానికి ఎన్నికల కమిషన్, దానికో నోటిఫికేషన్ దండగన్నారు.

మహిళలను కించపరిచే ప్రచారానికి టీడీపీ స్వస్తి చెప్పాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు శైలజా చరణ్


శైలజా చరణ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజకీయాల్లో మహిళలు రాణించకుండా చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించటం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శైలజా చరణ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే రోజాపై సోషల్ మీడియా, టీవీ చానల్స్‌లో టీడీపీ వాళ్లు చేసే ప్రచారం జుగుప్సాకరంగా ఉందని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె విమర్శించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలే కానీ చౌకబారు ప్రచారాలకు దిగటం తగదన్నారు. మరొక్కమారు ఇలాంటి ప్రచారాలకు టీడీపీ సిద్ధపడితే తాము సైబర్ నేరాల క్రింద కేసు పెడతామని చెప్పారు.

శేషాచలం టు చెన్నై

- శేషాచలం అడవుల నుంచి చెన్నై తరలుతున్న ఎర్రచందనం
- చిత్తూరు, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల నుంచి రవాణా
- చెన్నైలో భారీగా ఎర్రచందనం నిల్వలు
- సముద్రమార్గం ద్వారా విదేశాలకు

సాక్షి, తిరుపతి

ఎర్రచందనం స్మగ్లర్లు చెన్నై మహానగరాన్ని అక్రమ నిల్వలకు అడ్డాగా మార్చుకున్నారు. శేషాచలం అడవుల్లో లభ్యమయ్యే ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగాచేసి అధికారుల కళ్లుగప్పి చెన్నైకి చేరవేస్తున్నారు. అక్కడి నుంచి సముద్రమార్గం ద్వారా విదేశాలకు తరలించి సొమ్ముచేసు కుంటున్నారు. అక్రమ రవాణాను పసిగట్టిన డైరెక్టరేట్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు చెన్నై నగరంలో వరుసదాడులు చేస్తున్నారు. వారు చేపట్టిన దాడుల్లో ఇప్పటి వరకూ 40 మెట్రిక్ టన్నులకుపైగా ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ సుమారు రూ.50 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

వేస్టేజ్ సంచుల్లో రవాణా

చిత్తూరు, వైఎస్సార్ జిల్లా, నెల్లూరు జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న శేషాచలం అడవుల్లో విలువైన ఎర్రచందనం సందప ఉన్న విషయం తెలిసిందే. దీనికి విదేశాల్లో డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల దృష్టి శేషాచలం అడవిపై మళ్లింది. రోజూ అడవిలోంచి ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు తరలిస్తూనే ఉన్నారు. చిత్తూరు, వైఎస్సార్ జిల్లా, నెల్లూరు జిల్లా పరిధి నుంచి వారం రోజులుగా భారీఎత్తున ఎర్రచందనం దుంగలను వివిధ మార్గాల ద్వారా చెన్నైకి చేరవేసినట్లు తెలుస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా వేస్టేజ్ సంచులు, కేబుల్, వాటర్‌పైప్ పార్సిల్స్‌లాచేసి రవాణా చేస్తున్నారు. చెన్నై నగరంలో రహస్య ప్రాంతంలో నిల్వ ఉంచి, విదేశీయులతో బేరం కుదిరాక పోర్టుకు చేరవేస్తున్నారు. అలా చేరవేస్తున్న విషయాన్ని పసిగట్టిన డైరెక్టరేట్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఈ నెల 24 నుంచి అక్కడే తిష్టవేసి దాడులు చేస్తున్నారు. దాడుల్లో భారీగా ఎర్రచందనం దుంగలను అధికారులు గుర్తించారు. కంటైనర్‌లో ఉంచిన ఎర్రచందనం నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని సోమవారం అడిషనల్ డైరెక్టర్ జనరల్ పి.ఉమాశంకర్, డీఆర్ఐ కాంతారావు, రామకృష్ణ, డీఎస్పీ హరినాథ్‌బాబు, ఏపీ టాస్క్‌ఫోర్స్ తదితరులు పరిశీలించారు.

ఆర్టీసీ బస్సుల ద్వారా శేషాచలం అడవుల్లోకి


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎర్రచందనం కూలీలు ఆర్టీసీ బస్సుల్లో శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రయాణీకుల్లా చేరుకుంటున్నారు. రెండు రోజుల కిందట ఆర్టీసీ బస్సులో కూలీలు తరలివెళ్తుండగా అధికారులు దాడులుచేశారు. కూలీలు తప్పించుకోగా.. వారికి సహకరించిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం శేషాచలం అడవిలోకి వందలాది మంది కూలీలు చేరుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తాజాగా నెల్లూరు జిల్లా రాపూరు, కలువాయి, అనంతసాగరం పరిధిలో పోలీసులు దాడులు చేశారు. స్మగ్లరు పోలీసులపై రాళ్లు రువ్వుతూ తప్పించుకునే ప్రయత్నంచేశారు. పోలీసులు చేపట్టిన మెరుపుదాడుల్లో రూ.కోటి విలువచేసే 1.1 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు నాటు తుపాకులు, 21 మంది అంతర్‌రాష్ట్ర, స్థానిక స్మగ్లర్లను అరెస్టుచేసి 11 వాహనాలు, 13 సెల్‌ఫోన్లు, రూ.5 వేలకు పైగా నగదును సీజ్‌చేశారు. శేషాచలం అడవుల్లో భారీఎత్తున స్మగ్లర్లు తిష్టవేసి ఉన్నారని తెలుసుకున్న చిత్తూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు డాగ్‌స్క్వాడ్ బృందంతో పలు చోట్ల తనిఖీలు చేశారు.

అప్పుల బాధతో కౌలురైతు బలవన్మరణం

- పురుగుల మందు తాగి ఆత్మహత్య
- కర్నూలు జిల్లాలో ఘటన

ఆలూరు రూరల్


జయరాముడు (ఫైల్ ఫొటో)

కర్నూలు జిల్లా ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన కౌలురైతు జయరాముడు (45) అప్పుల బాధ తాళలేక బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయరాముడు పదేళ్లుగా గ్రామస్తులకు చెందిన ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుండేవాడు. వరుసగా ఐదేళ్ల నుంచి ఖరీఫ్‌లో పొద్దుతిరుగుడు, సజ్జ, రబీలో పప్పుశనగ సాగుచేస్తూ వచ్చాడు. వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆశించిన దిగుబడి రాలేదు. ఈ క్రమంలో అప్పులు కూడా పెరిగిపోయాయి. బంధువుల వద్ద రూ. 2 లక్షలు, గ్రామంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద మరో రూ. 3 లక్షలు అప్పు చేశాడు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏడెకరాల్లో వేరుశనగ వేశాడు. ఇప్పటిదాకా వర్షాలు పడకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఆవేదన చెందిన జయరాముడు.. అప్పులు పెరిగిపోయాయని, ఎలా తీర్చాలని గత 15 రోజులుగా భార్య జయమ్మ వద్ద బాధపడుతూ ఉండేవాడు. పెళ్లీడుకొచ్చిన కుమార్తె వివాహం కూడా చేయలేనేమోనని బెంగ పెట్టుకున్నాడు. ఈ ఆవేదనతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే పురుగుల మందు తాగి.. గ్రామంలోని ఓ టీ దుకాణం వద్దకు వెళ్లాడు. అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పుల బాధతోనే జయరాముడు మృతిచెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆలూరు పోలీసులు తెలిపారు.

కౌలు రైతు గుర్తింపు కార్డు లేక...

జయరాముడు పదేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నా.. అతనికి అధికారులు కౌలు రైతు గుర్తింపు కార్డు ఇవ్వలేదు. ఆ కార్డు కోసం మూడేళ్లుగా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారుల చుట్టూ తిరుగుతూ వచ్చాడు. అయినప్పటికీ మంజూరు చేయలేదని మృతుడి తండ్రి గోవిందప్ప, తల్లి హర్దగేరి లింగమ్మ, భార్య జయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కార్డు లేకపోవడంతో బ్యాంకు రుణంకూడా తీసుకునే వీలు లేకుండా పోయిందన్నారు. జయరాముడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీరుగారిన ఎర్రచందనం టెండర్లు

- విదేశీ బిడ్డర్ల నుంచి స్పందన నామమాత్రం
- 1957.906 టన్నులకు టెండర్లు
- 467 టన్నులకే బిడ్లు ఆమోదం

సాక్షి, అమరావతి

ఎర్రచందనం విక్రయ టెండర్లు మళ్లీ నీరుగారాయి. చైనా, జపాన్ దేశాలకు ప్రభుత్వ బృందం వెళ్లి ఏడో విడత ఎర్రచందనం విక్రయ టెండర్లకు ప్రచారం కల్పించినా అంతర్జాతీయ సంస్థల నుంచి స్పందన కరువైంది. ఏడో విడతలో 1957.906 టన్నుల ఎర్రచందనం విక్రయించాలని నిర్ణయించిన ప్రభుత్వం జూన్ ఏడో తేదీన టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన మెటల్ స్క్రాప్ టేడ్ కార్పొరేషన్ (ఎంఎస్‌టీసీ)కి టెండరు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ)ని నోడల్ ఏజెన్సీగా నియమించింది. అయితే ఎంఎస్‌టీసీ ద్వారా సాగిన గ్లోబల్ ఇ-టెండర్ కమ్ ఇ-వేలానికి నామమాత్రపు స్పందనే వచ్చింది. ఇందులో పాల్గొనేందుకు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపలేదు. దీనివల్లే గత నెల, ఈ నెలలో మూడు విడతలుగా ఇ-టెండర్ కమ్ ఇ-వేలం నిర్వహించినా ప్రభుత్వం వేలానికి పెట్టిన ఎర్రచందనంలో నాలుగో వంతు కూడా అమ్ముడుపోయే పరిస్థితి కనిపించడంలేదు. ఏడో విడత టెండర్ల కింద 1957.906 మెట్రిక్ టన్నుల ఎర్రచందం విక్రయం కోసం లాట్ల వారీగా బిడ్లు పిలిచింది. వీటిలో 14 లాట్లకు సంబంధించిన 467.059 టన్నుల ఎర్రచందనం బిడ్లను మాత్రమే ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. వీటిలో 'ఎ' గ్రేడ్ 119.246 టన్నులు, 'బి' గ్రేడ్ 347.813 టన్నులు ఉంది. కనీస ధర రాలేదనే ఉద్దేశంతో మిగిలిన బిడ్లను పక్కన పెట్టేసింది.

ఇంత చేసినా రూ.89.40 కోట్లే...

విస్తృత ప్రచారం అనంతరం ఎర్రచందనం టెండర్లు నిర్వహించినా దీని ద్వారా రానున్న రాబడి రూ. 89.40 కోట్లు మాత్రమే కావడం సర్కారుకు తీవ్ర నిరాశ మిగిల్చింది. 467.059 టన్నులకు వచ్చిన అధిక ధరల (హెచ్-1) బిడ్లను సర్కారు ఆమోదించింది. వీటి ప్రకారం 467.059 టన్నులను ఆ సంస్థలకు అమ్మితే సర్కారుకు రానున్న రాబడి రూ. 89.40 కోట్లు మాత్రమే. ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపిన బిడ్ల ప్రకారం టన్ను సగటు ధర రూ.19.14 లక్షలు మాత్రమే. వేర్వేరుగా చూస్తే టన్ను 'ఎ' గ్రేడ్ రూ. 30.5 లక్షలు, 'సి' గ్రేడ్ రూ. 12.75 లక్షలు సగటు ధరలు పలికాయని తెలుస్తోంది.

సాగు భూమికి బదులుగా కంకర రాళ్ల క్వారీ

- పోలవరం నిర్వాసితులకు పనికిరాని భూములు
- దర్భగూడెంలో అధికారులు, బ్రోకర్ నిర్వాకం
- మండిపడుతున్న నిర్వాసితులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ అందిస్తామని ఊరించి భూములు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తమ నోట్లో మట్టి కొట్టిందని బాధితులు వాపోతున్నారు. సాగు భూమికి బదులుగా భూమి కాకుండా కంకర రాళ్లతో కూడిన క్వారీని కేటాయించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందు ఆయిల్‌పామ్ తోటలు చూపించి మభ్యపెట్టి ఆనక ఎందుకూ పనికిరాని భూమి కట్టబెట్టారని పేర్కొంటున్నారు.

కంకర రాళ్ల భూమికి 'ఏ' ధర చెల్లించిన సర్కారు

పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరుకు చెందిన నిర్వాసిత గిరిజనుల కోసం జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ప్రభుత్వం 1494 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అయితే కొందరు అధికారులు, ఓ బ్రోకర్లు కలిసి ఎందుకూ పనికిరాని భూములను కొనుగోలు చేయించారు. దర్భగూడెం సర్వే నెంబరు 294(1, 2)లో 3.14 ఎకరాల భూమిని గతంలో


క్వారీలో నాటిన ఆయిల్‌పామ్ మొక్క ఇది. దీన్ని ఏ గ్రేడ్ మొక్కగా చూపించి రూ. 3600 చొప్పన చెల్లించారు

కంకర క్వారీగా నమోదు చేశారు. దీన్ని 2015లో కేతిరెడ్డి రాఘవరెడ్డి పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం ఈ భూమిని పొక్లెయిన్‌తో చదును చేసి ఆగమేఘాల మీద బోరు, మోటార్ అమర్చి ఆయిల్‌పామ్ మొక్కలు వేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో చూపారు. భూమికి, బోరుకు, అప్పుడే వేసిన మొక్కలకు ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధర చెల్లించింది. ఈ భూమిలో ఉన్న వాగును కూడా పూడ్చేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ భూమిని తీసుకునేందుకు నిర్వాసితులు నిరాకరించటంతో పక్కనే ఉన్న ఆయిల్‌పామ్ తోటలను చూపించి వాటిని కేటాయిస్తామని చెప్పారు. తర్వాత ఇదే సర్వే నెంబర్ భూమిని వేలేరుపాడు సిద్దారం గ్రామానికి చెందిన కె.చిన్నక్క, ఎస్.గంగరాజులకు కేటాయించి స్వాధీన పత్రం ఇచ్చారు.


కంకర క్వారీలో మట్టిని తోలి చదును చెయ్యడంతో ప్రస్తుతం గడ్డి మొలిచిన దృశ్యం

ఖర్చుల పేరుతో రైతుల నుంచి బ్రోకర్ వసూళ్లు

దర్భగూడెంలో నిర్వాసితుల కోసం చేపట్టిన దాదాపు 1500 ఎకరాల భూ సేకరణ అంతా గ్రామానికి చెందిన ఓ బ్రోకర్ చేతిమీదుగానే నడిచింది. అతడిపై రైతులు భూసేకరణ అధికారికి పలుసార్లు ఫిర్యాదు చేసినా పెడచెవిన పెట్టారు. ఖర్చుల పేరుతో రైతుల నుంచి ఒక్కో ఎకరానికి రూ. 50 వేల చొప్పున బ్రోకర్ వసూలు చేసినట్లు సమాచారం. ఇలా వసూలు చేసిన దాదాపు రూ. 7.5 కోట్లను అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ అంతా పంచుకున్నట్లు సమాచారం. బ్రోకర్ దందాపై ప్రభుత్వానికి నివేదిక పంపకుండా నిఘా వర్గాలకు సైతం భారీగా ముట్టచెప్పినట్లు సమాచారం. ఏమాత్రం పనికిరాని భూమిని కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

పౌరసమాజం గొంతు నొక్కుతున్నారు

ప్రభుత్వంపై పీపుల్ అగెనెస్ట్ కరప్షన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్‌రెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న మారంరెడ్డి శ్రీకాంతరెడ్డి

కడప రూరల్: పౌర సమాజం గొంతు నొక్కేందుకు ప్రయత్నించడం దారుణమని టీడీపీ ప్రభుత్వంపై పీపుల్ అగెనెస్ట్ కరప్షన్ ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో 'పీపుల్ పార్లమెంట్–2017' పేరుతో జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సదస్సు నిర్వహించుకునేందుకు కడపలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ కోసం ఇన్‌చార్జ్ సీఈవోను అనుమతి కోరగా.. రోజుకు రూ.6 వేలు అద్దె అవుతుందని చెప్పారన్నారు. అందుకు తాము అంగీకరించామని.. కానీ 4 రోజుల కిందట మీటింగ్ హాల్ ఇచ్చేందుకు జెడ్పీ కార్యాలయం నిరాకరించిందని చెప్పారు. దీంతో నూతన కలెక్టరేట్‌లోని సభా భవన్ కోసం కలెక్టర్ బాబూరావు నాయుడుతో పాటు జిల్లా రెవెన్యూ అధికారిని అనుమతి కోరగా.. వారు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. కానీ ఆ తర్వాత ఏమైందో కానీ.. ఎన్జీవో లాంటి సంస్థలకు అనుమతులివ్వబోమంటూ బదులిచ్చారని తెలిపారు. అంతేకాక కడపలో మరెక్కడా సదస్సు నిర్వహించడానికి వీల్లేకుండా ఆదేశాలిచ్చినట్లు తెలిసిందన్నారు. సదస్సుకు వచ్చేదంతా అత్యున్నత స్థాయిలోని ప్రముఖులేనని.. రైతు, ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. అలాంటి సదస్సుకు ఆటంకాలు సృష్టించడం సరికాదని మండిపడ్డారు. సదస్సును తాత్కాలికంగా వాయిదా వేశామని.. త్వరలో కడపలోనే దీనిని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఇలియాస్‌రెడ్డి, ధీరజ్ పాల్గొన్నారు.

'వనం-మనం'పై ఉదాసీనత వద్దు

కాలుష్య పరిశ్రమలపై కఠిన వైఖరి: శిద్దా

సాక్షి, అమరావతి: వనం–మనం కార్యక్రమం కింద నవంబర్ నాలుగో తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో 25 కోట్ల మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం ఆయన వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. వనం–మనం విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. కాలుష్య కారక పరిశ్రమలపై కఠిన వైఖరి అవలంబించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్మగ్లర్లకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏపీ శాస్త్రసాంకేతిక మండలి ఆధ్వర్యంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒంగోలులో నిర్వహిస్తామని ప్రకటించారు.

జూనియర్లను చితకబాదిన సీనియర్లు

- ఫ్యాకల్టీని సైతం బెదిరిస్తున్న వైనం
- నూజివీడు ట్రిపుల్‌ఐటీలో అరాచకం
- పట్టించుకోని అధికారులు


ట్రిపుల్‌ఐటీ అధికారులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఈ-3 విద్యార్థులు

నూజివీడు: కృష్ణా జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. సీనియర్ విద్యార్థులు కొందరు అరాచక చర్యలకు పాల్పడుతున్నారు. గ్రూపుగా ఏర్పడిన కొందరు ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం(ఈ–4) విద్యార్థులు ఏకంగా ఫ్యాకల్టీని బెదిరిస్తుండడమేగాక.. జూనియర్ విద్యార్థులపైనా ప్రతాపం చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రతి విషయాన్నీ ఫ్యాకల్టీకి చేరవేస్తున్నారనే నెపంతో ఏకంగా మూడో సంవత్సరం(ఈ–3) చదువుతున్న విద్యార్థులు 30 మందిని తాజాగా తమ హాస్టల్‌లోని గదులకు పిలిపించుకుని మూకుమ్మడిగా చితకబాదారు. ఈ–3 విద్యార్థులు ఐ–2 హాస్టల్ భవనంలో ఉంటుండగా.. ఈ–4 విద్యార్థులు ఐ–1 హాస్టల్ భవనంలో ఉంటున్నారు. అయితే మీతో మాట్లాడాలంటూ మంగళవారం అర్ధరాత్రి జూనియర్లను సీనియర్లు తమ హాస్టల్‌కు పిలిపించుకుని.. వారిని గదుల్లోకి బలవంతంగా తోసి, లైట్లు తీసేసి మరీ పిడిగుద్దుల వర్షం కురిపించారు. తమను సీనియర్లు కొట్టారంటూ ఈ–3 విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం ఈ విషయం వెలుగు చూసింది. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు సీనియర్లు తమపై దాష్టీకానికి పాల్పడినట్టు వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం. కాగా, సీనియర్లు తమను కొట్టారంటూ ఫిర్యాదు చేయడానికి వీరంతా పరిపాలన భవనం వద్దకు రాగా, డైరెక్టర్ వీరంకి వెంకటదాసు సెలవులో ఉండగా, వీసీ క్యాంపస్‌లో లేరు. దీంతో వారు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ నాగార్జునదేవికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ ఈ–4 విద్యార్థులతో సమావేశం జరిపింది. అయితే నిర్ణయాన్ని డైరెక్టర్ వచ్చాక తీసుకుంటారని వాయిదా వేశారు.

ఫ్యాకల్టీనే బెదిరిస్తున్న విద్యార్థులు

ఇదిలా ఉంటే.. నాలుగో సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులు గ్రూపుగా ఏర్పడి ఏకంగా ఫ్యాకల్టీనే బెదిరిస్తున్నట్లు సమాచారం. క్యాంపస్‌లో క్రమశిక్షణను కఠినంగా అమలు చేస్తున్న ఫ్యాకల్టీలకు చెందినవారి ద్విచక్ర వాహనాలకున్న తాళాల్ని తీసిపారేయడం, టైర్లలో గాలి తీయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ–4 విద్యార్థుల్లో ముగ్గురు కీలకంగా వ్యవహరిస్తూ.. మిగతా వారందర్నీ రెచ్చగొట్టడం, ప్రేరేపించడం చేస్తున్నారని క్యాంపస్‌లో చర్చించుకుంటున్నారు. ఈ ముగ్గురిలో ఒకరు గతంలో ఏడాదిపాటు సస్పెండై ఇటీవలే తిరిగొచ్చి అశాంతిని ప్రేరేపిస్తున్నట్టు సమాచారం.

కళ్ల నొప్పి తాళలేక యువ సైంటిస్టు ఆత్మహత్య

నల్లకుంట: కళ్ల నొప్పిని భరించలేక ఓ యువ సైంటిస్టు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు.. గుంటూరుకు చెందిన పి.చంద్రశేఖర్ (25) నగరంలోని డీఆర్‌డీఓలో సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సోదరుడు దుర్గాప్రసాద్‌తో కలసి నల్లకుంట టీఆర్టీ కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కళ్ల సమస్యతో బాధపడుతున్న చంద్రశేఖర్ రెండేళ్ల క్రితం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి కళ్లు మరింతగా నొప్పి వస్తుండేవి. ఈ క్రమంలో పది రోజులుగా కళ్ల నొప్పి మరింత తీవ్రం కావడం, నిద్ర పట్టక పోవడం, భోజనం సహించకపోవడంతో చంద్రశేఖర్ భరించలేక పోయాడు. మంగళవారం విధుల నుంచి ఇంటికి వచ్చిన చంద్రశేఖర్ కళ్ల నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైట్ నోట్ రాసి, ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు విద్యుత్ వైర్‌తో ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. రాత్రి 9.30 గంటలకు విధుల నుంచి వచ్చిన సోదరుడు దుర్గాప్రసాద్ చూడగా సోదరుడు ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకొని వేళాడుతూ కనిపించాడు. సోదరుడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. రాత్రి 2 గంటలకు పోలీసులు వచ్చి శవ పంచనామా నిర్వహించారు.

చిట్ పేరుతో రూ.7 కోట్ల చీటింగ్


తిరుచానూరు: చిట్ పేరుతో రూ.7 కోట్లకు పైగా కుచ్చుటోపి పెట్టిన ఘటన తిరుపతి రూరల్ పద్మావతీపురంలో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన ఎన్.సంజయ్‌రెడ్డి నాలుగేళ్ల కిందట పద్మావతీపురంలో సంజన సిల్క్స్ అండ్ శారీస్ పేరుతో చిట్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. దీన్ని విస్తరించే క్రమంలో స్థానికంగా శ్రీకృష్ణ హెరిటేజ్ మిల్క్ పార్లర్ దుకాణాన్ని నడుపుతున్న గల్లా సతీశ్ బాబు నాయుడుతో చేతులు కలిపాడు. స్థానికుడైన సతీశ్‌ను నమ్మి చాలా మంది రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.5 లక్షల చిట్‌లు వేశారు. మొదట సక్రమంగా డబ్బులు చెల్లించిన వీరు.. కొద్ది కాలంగా అదిగో ఇదిగో అంటూ నెట్టుకురావడం మొదలెట్టారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం సంజయ్‌రెడ్డి పరారయ్యాడు. దీంతో చిట్ వేసిన వారంతా.. తమకు డబ్బులు తిరిగి చెల్లించాలంటూ సతీశ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. అతడు కూడా చేతులెత్తేయడంతో వారంతా తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో సతీశ్ మంగళవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సంజయ్‌రెడ్డి రూ.7 కోట్లకు పైగా చిట్ డబ్బులు తీసుకొని పారిపోయాడని బాధితులు చెబుతున్నారు. ఇప్పటి వరకు సుమారు వంద మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

సాక్షి స్పోర్ట్స్
గురువారం 31-8-2017



కౌంటీ క్రికెట్‌లో అశ్విన్ శుభారంభం

తొలిసారి కౌంటీ క్రికెట్ బరిలోకి దిగిన భారత టాప్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మొదటి మ్యాచ్‌లో రాణించాడు. వార్సెస్టర్‌షైర్ తరఫున ఆడుతున్న అశ్విన్... గ్లూసెస్టర్‌షైర్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 94 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో తమ జట్టు తరఫున మొత్తం నాలుగు మ్యాచ్‌లు కూడా ఆడాలని భావిస్తున్నట్లు అశ్విన్ చెప్పాడు. అతని నిర్ణయానికి బీసీసీఐ ఆమోదం తెలిపితే అశ్విన్, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు దూరమవుతాడు.



గట్టెక్కాడు

- తొలి రౌండ్‌లో ఐదు సెట్‌లలో ఫెడరర్ విజయం
- యూఎస్ ఓపెన్ టోర్నీ

న్యూయార్క్: ఈ ఏడాది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌కు యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే గట్టిపోటీ ఎదురైంది. అమెరికాకు చెందిన 19 ఏళ్ల కుర్రాడు ఫ్రాన్సిస్ టియాఫోతో జరిగిన తొలి రౌండ్‌లో ఫెడరర్ అతికష్టమ్మీద విజయం సాధించాడు. బుధవారం 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మూడో సీడ్ ఫెడరర్ 4–6, 6–2, 6–1, 1–6, 6–4తో టియాఫోపై గెలిచి ఊపిరి పీల్చుకొని రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మ్యాచ్ మొత్తంలో 17 ఏస్‌లు సంధించిన ఈ స్విస్ దిగ్గజం నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 41 విన్నర్స్ కొట్టిన ఫెడరర్ 56 అనవసర తప్పిదాలు కూడా చేశాడు. 17వ సారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న ఫెడరర్ ఈ టోర్నీలో ఏనాడూ తొలి రౌండ్‌లో ఓడిపోలేదు.

మరోవైపు ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) తొలి రౌండ్‌లో 7–6 (8/6), 6–2, 6–2తో దుసాన్ లాజోవిచ్ (సెర్బియా)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. ఆరో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా), 15వ సీడ్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్), 18వ సీడ్ మోన్‌ఫిల్స్ కూడా రెండో రౌండ్‌కు చేరారు.

బుచార్డ్ పరాజయం

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ మాజీ ఐదో ర్యాంకర్ యూజిన్ బుచార్డ్ (కెనడా) వరుసగా రెండో ఏడాది తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుచార్డ్ 6–7 (2/7), 1–6తో రొడినా (రష్యా) చేతిలో ఓడిపోయింది. నాలుగో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), 12వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా), 15వ సీడ్ కీస్ (అమెరికా) కూడా రెండో రౌండ్‌కు చేరారు.

యు ముంబా గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 38–32 స్కోరుతో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ముంబా ఆటగాళ్లు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రైడింగ్‌లో ఇరు జట్లు 21 పాయింట్లు సాధించగా... టాకిల్‌లో ముంబా 14 పాయింట్లు చేస్తే, హర్యానా 7 పాయింట్లే చేయగలిగింది. ఇదే మ్యాచ్‌ను ప్రభావితం చేసింది. ముంబా తరఫున అనూప్ 8, కుల్‌దీప్ 7 పాయింట్లు చేశారు. హర్యానా జట్టులో వికాస్ 9, వజీర్ సింగ్ 7, దీపక్ దహియా 5 పాయింట్లు సాధించారు. నేడు తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్, యు ముంబాతో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.



కోహ్లి

టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్... వన్డే సిరీస్ ఇప్పటికే సొంతం... శ్రీలంక గడ్డపై అడుగు పెట్టిన నాటి నుంచి ఎదురు లేకుండా సాగుతున్న భారత క్రికెట్ జట్టు ఆడుతూ పాడుతూ విజయాలు అందుకుంటోంది. ఇప్పుడు ఇదే జోరులో మరో మ్యాచ్ కోసం కోహ్లి సేన సన్నద్ధమైంది. దాంతో పాటు ఇప్పటి వరకు అవకాశం దక్కని ఆటగాళ్లను పరీక్షించేందుకు కూడా ఈ మ్యాచ్‌ను ఉపయోగించుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే లక్ష్యం మాత్రం మరో గెలుపే.

వరుసగా మూడు వన్డేల్లో ఓటమి, ఆటగాళ్ల సమష్టి వైఫల్యం, ఇప్పటికే ఇద్దరు కెప్టెన్లు మారారు... సెలక్టర్ల రాజీనామా, గత మ్యాచ్‌పై విచారణ, మరో కెప్టెన్‌తో మ్యాచ్ బరిలోకి... శ్రీలంక కష్టాల జాబితా చాంతాడంత ఉంది. ఇలాంటి స్థితిలో ఆ జట్టు ఎంత వరకు కోలుకోగలదు? సమస్యలను పక్కన పెట్టి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగగలదా? సొంతగడ్డపై ఆ జట్టు ఆశిస్తున్న మొదటి విజయం దక్కే అవకాశం ఏమాత్రమైనా ఉందా!



ధోని

ప్రయోగాల సమయం

తుది జట్టులో మార్పులకు భారత్ సిద్ధం • నేడు శ్రీలంకతో నాలుగో వన్డే • ఆతిథ్య జట్టుకు విజయం దక్కేనా!

కొలంబో: శ్రీలంకతో వన్డే సిరీస్‌ను ఇప్పటికే 3–0తో సొంతం చేసుకున్న భారత్, ఈ ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలని పట్టుదలగా ఉండగా... స్వదేశంలో ఇప్పటికే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న శ్రీలంక కాస్తయినా పరువు దక్కించుకోవాలంటే ఒక మ్యాచ్‌లోనైనా విజయం సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేడు ఇక్కడ జరిగే నాలుగో వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్ ఆడిన టీమ్‌నుంచి ఒకటి, రెండు మార్పులతో టీమిండియా బరిలోకి దిగే అవకాశం ఉండగా...లంక జట్టులో మాత్రం సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

పాండే, కుల్దీప్‌లకు చాన్స్!

ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా అందరికీ అవకాశాలు కల్పిస్తామని కెప్టెన్ కోహ్లి పదే పదే చెబుతున్నాడు. ఇప్పటికే సిరీస్ గెలవడంతో నాలుగో వన్డేలో భారత జట్టులో మార్పులు ఉండవచ్చు. కుల్దీప్‌ను ఆడించేందుకు సిద్ధమంటూ కోహ్లి ఇప్పటికే పరోక్షంగా చెప్పేశాడు. కాబట్టి అక్షర్, చహల్‌లో ఒకరిని తప్పించే అవకాశం ఉంది. బ్యాటింగ్‌లో రోహిత్ గత రెండు మ్యాచ్‌లలోనూ చెలరేగాడు. ధావన్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. కోహ్లి, ధావన్ బ్యాటింగ్ గురించి ఆందోళనే అనవసరం. అయితే తనకు పెద్దగా అలవాటు లేని నాలుగో స్థానంలో రాహుల్ కాస్త ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. అతను ఒక చక్కటి ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. ఇక ధనంజయ స్పిన్‌ను ఆడలేక వరుసగా విఫలమైన కేదార్ జాదవ్ స్థానంలో మనీశ్ పాండేను ఆడించవచ్చు. ముమ్ముందు తుది జట్టులో రెగ్యులర్ అయ్యే అవకాశం ఉన్న పాండేకు ఇక్కడ కనీసం రెండు మ్యాచ్‌లలో అవకాశం ఇవ్వడం ముఖ్యం. అయితే తుది జట్టు కూర్పును బట్టి చూస్తే రహానే, శార్దుల్ ఠాకూర్‌లు మాత్రం మళ్లీ బెంచీకే పరిమితం అయ్యే అవకాశాలే ఎక్కువ. ఇక కెరీర్‌లో 300వ వన్డే మ్యాచ్ బరిలోకి దిగుతున్న ధోని ఈ మ్యాచ్‌ను ఎలా చిరస్మరణీయం చేసుకుంటాడనేది ఆసక్తికరం.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: కోహ్లి (కెప్టెన్), ధావన్, రోహిత్, రాహుల్, పాండే, పాండ్యా, ధోని, అక్షర్/చహల్, కుల్దీప్, భువనేశ్వర్, బుమ్రా.

శ్రీలంక: మలింగ (కెప్టెన్), డిక్‌వెలా, మునవీరా, కుషాల్ మెండిస్, తిరిమన్నె, మాథ్యూస్, ధనంజయ డి సిల్వ, సిరివర్ధన, అఖిల ధనంజయ, చమీరా, ఫెర్నాండో

కపుగెడెరపై విచారణ

మూడో వన్డేలో టాస్ గెలిచిన తర్వాత కూడా బ్యాటింగ్ ఎంచుకోవడంపై శ్రీలంక క్రికెట్ బోర్డు విచారణ చేపట్టనుంది. మ్యాచ్‌కు ముందు రోజు టాస్ గెలిస్తే ఫీల్డింగ్ తీసుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. టాస్ గెలిచిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లంతా ఫీల్డింగ్‌కు సిద్ధమైపోయారు. అయితే కెప్టెన్ కపుగెడెర వచ్చి అనూహ్యంగా బ్యాటింగ్ అని చెప్పడంతో వారంతా ఆశ్చర్యపోయారు. పరిస్థితులు పేస్‌కు అనుకూలంగా ఉండటంతో లంక తొలుత బ్యాటింగ్ చేసి 217 పరుగులు మాత్రమే చేసింది.

పిచ్, వాతావరణం: ప్రేమదాస స్టేడియంలోని పిచ్‌పై ఎక్కువ సందర్భాల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. అయితే ఆరంభంలో పేస్ బౌలింగ్‌కు అనుకూలిస్తుంది. వర్షం అంతరాయం కలిగించవచ్చు.

మధ్యాహ్నం గం. 2.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కెప్టెన్‌గా మలింగ...

తొలి రెండు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన ఉపుల్ తరంగ సస్పెన్షన్‌తో దూరం కాగా, మూడో వన్డేలో కెప్టెన్‌గా ఉన్న కపుగెడెర గాయంతో సిరీస్ నుంచి తప్పుకున్నాడు. దాంతో ఈ మ్యాచ్‌లో లసిత్ మలింగ నాయకత్వంలో శ్రీలంక బరిలోకి దిగుతోంది. అయితే కెప్టెన్ ఎవరైనా జట్టులో ఇప్పుడు స్ఫూర్తి నింపడం అవసరం. గత ఏడాది కాలంలో శ్రీలంక వన్డే జట్టులోకి 40 మంది ఎంపిక కావడం ఆ టీమ్ నిలకడలేమిని చూపిస్తోంది. గత మ్యాచ్‌లో ఆడిన చండిమాల్ కూడా గాయంతో తప్పుకున్నాడు. ఇలాంటి స్థితిలో లంక విజయం సాధించాలంటే అసాధారణ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. బ్యాటింగ్‌లో డిక్‌వెలా, కుషాల్ పెరీరా మాత్రం కొంత వరకు ఫర్వాలేదనిపిస్తున్నారు. గత మ్యాచ్‌లో అర్ధసెంచరీ చేసిన తిరిమన్నె మళ్లీ రాణించాలని లంక కోరుకుంటోంది. మాజీ కెప్టెన్ మాథ్యూస్ ఇప్పటి వరకు టీమ్‌కు ఉపయుక్తమైన ఆటతీరు ప్రదర్శించలేకపోవడం జట్టును మరింత దెబ్బ తీస్తోంది. మలింగ బౌలింగ్‌లో మునుపటి వాడి లేకపోవడంతో లంక పేస్ బలహీనంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్ కోసం ధనంజయ డి సిల్వ, దిల్షాన్ మునవీరాలను లంక జట్టులోకి తీసుకుంది.

ధోని ‘ట్రిపుల్ సెంచరీ’

సాక్షి క్రీడా విభాగం

నేడు 300వ వన్డే ఆడనున్న ‘మిస్టర్ కూల్’

చిరస్మరణీయ సిక్సర్‌తో భారత్‌కు ప్రపంచ కప్ అందించిన ఇన్నింగ్స్... కొత్తగా వచ్చిన జులపాల జుట్టు కుర్రాడు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై ఆడిన మెరుపు బ్యాటింగ్... జైపూర్‌లో కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన... ఒకటా, రెండా... మహేంద్ర సింగ్ ధోని వన్డేల్లో ఆడిన ఇలాంటి అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎన్నో. ధోని ఉన్నాడంటే ఇక గెలిపించడం ఖాయమనే భరోసా... మరో ఎండ్‌లో ధోని ఉంటే చాలు, అవతలి బ్యాట్స్‌మన్‌కు అదో ధైర్యం... చివరి వరకు క్రీజ్‌లో నిలబడటం, తనదైన శైలిలో విన్నింగ్ షాట్‌తో మ్యాచ్‌ను ‘ఫినిష్’ చేయడం ఎన్ని సార్లు చూసినా తనివి తీరని దృశ్యమే. దాదాపు 12 ఏళ్ల కెరీర్‌లో వన్డేల్లో అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా ఎదిగి, ఎన్నో రికార్డులు తన పేర లిఖించుకున్న ‘మిస్టర్ కూల్’ నేడు మరో మైలురాయిని దాటుతున్నాడు. తన వన్డే కెరీర్‌లో అతను 300వ మ్యాచ్ ఆడబోతున్నాడు.

ధోని సాంకేతికంగా గొప్ప బ్యాట్స్‌మన్ కాదు. ఇది తానే స్వయంగా ఒప్పుకునే విషయం. అయితే అతను తనదైన శైలితోనే బ్యాటింగ్‌లో అద్భుతాలు చేశాడు. వేలాది పరుగులు సాధించినా, సిక్సర్లతో హోరెత్తించినా, అవసరమైనప్పుడు పట్టుదలగా ఇన్నింగ్స్‌ను నిర్మించినా అదంతా ధోని స్టైల్‌లోనే. అద్భుతమైన వికెట్ కీపర్ కాదు. అంతా సొంతంగా నేర్చుకున్నదే. అయినా కీపింగ్ రికార్డులు అతని చెంత వాలాయి. కెప్టెన్సీలో కూడా ఎవరికీ సాధ్యం కాని రీతిలో గుర్తుండిపోయే వ్యూహాలతో గొప్ప విజయాలు అందించాడు. నాయకుడిగా తప్పుకున్న తర్వాత వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్‌గా ఇప్పటికీ తనదైన ముద్ర చూపిస్తున్న మాహి, 2019 వరల్డ్ కప్ వరకు కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు.

ధోని వన్డే కెరీర్

మ్యాచ్‌లు	299
పరుగులు	9608
సగటు	51.93
సెంచరీలు	10
అర్ధ సెంచరీలు	65
ఫోర్లు	736
సిక్సర్లు	209
క్యాచ్‌లు	278
స్టంపింగ్‌లు	99

- **21** మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు
- **6** మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు
- **2** రెండు సార్లు (2008, 09) ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు
- **6** 300 వన్డేలు ఆడిన ఆరో భారత క్రికెటర్. ఓవరాల్‌గా 20వ ఆటగాడు.
- **3** ధోని 300 వన్డేల్లో 3 మ్యాచ్‌లు ఆసియా ఎలెవన్ తరఫున ఆడినవి ఉన్నాయి. ఆఫ్రికా ఎలెవన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లలో ధోని 1 సెంచరీ సహా 174 పరుగులు సాధించాడు.
- **0** తొలి వన్డేలో ఒకే ఒక బంతిని ఎదుర్కొని రనౌట్ (డకౌట్) అయ్యాడు.

ధోని టాప్–5 వన్డే ఇన్నింగ్స్

- 183 నాటౌట్ (శ్రీలంక; జైపూర్–2005)
- 148 (పాకిస్తాన్; విశాఖపట్నం–2005)
- 139 నాటౌట్ (ఆఫ్రికా ఎలెవన్; చెన్నై – 2007)
- 139 నాటౌట్ (ఆస్ట్రేలియా; మొహాలి – 2013)
- 134 (ఇంగ్లండ్; కటక్–2017)

రహానేకు చోటు లేకపోవడమా?

సునీల్ గావస్కర్

శ్రీలంకతో వన్డే సిరీస్ ఫలితం తేలిపోవడంతో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఏమైనా ప్రయోగాలు చేస్తుందో లేదో ఆసక్తికరంగా మారింది. ఒకవేళ మార్పులు చేసినా జట్టు సమతుల్యం దెబ్బకుండా జాగ్రత్త పడాలి. అయితే రిజర్వ్ బెంచ్‌లో ఉన్న ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో వరుస విజయాలు సాధిస్తున్న జట్టులో మార్పులు చేయాలనుకుంటే అది అవివేకమే అవుతుంది. తొలి మూడు వన్డేల్లో ఆడని నలుగురు ఆటగాళ్లలో ఇద్దరు మాత్రం తుది జట్టులో తమకు ఆడే సత్తా ఉందని... ప్రయోగాల పేరుతో తమకు ఆడే అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. మనీశ్ పాండే, కుల్దీప్ యాదవ్‌లాంటి అపార నైపుణ్యమున్న ఇద్దరు ఆటగాళ్లు డ్రింక్స్ తేవడానికి పరిమితమయ్యారంటే భారత జట్టు ఎంత పటిష్టంగా ఉందో అర్థమవుతోంది. అడపాదడపా అందివచ్చిన అవకాశాలను వీరిద్దరు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకున్నారు. అయితే అజింక్య రహానే పరిస్థితి ఏమిటి? ఈపాటికే తానేంటో నిరూపించుకున్నా... ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయేలా రహానే ఆటతీరు ఉండటంలేదని భావించి అతడిని పక్కనబెట్టారనిపిస్తోంది. భారీ సిక్సర్లు కొట్టే నైపుణ్యం రహానేలో లేకపోయినా కళాత్మక షాట్‌లతో అతను కొట్టే బౌండరీలతో పరుగులు నిలకడగా వస్తుంటాయి. జట్టులో నిలదొక్కుకొని గాయాల కారణంగా మ్యాచ్‌లకు దూరమై... పునరాగమనం చేసే సందర్భంలో వారికే చోటు కల్పించడం, ఒకే స్థానంలో బాగా ఆడిన వారిని అదే స్థానంలో కొనసాగించడం భారత జట్టు విధానంగా ఉంది. అయితే జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్న ఆటగాళ్లకు సమాన ప్రతిభ ఉన్న ఆటగాళ్లు కూడా కనిపిస్తుంటారు. విండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నిలకడగా రాణించినప్పటికీ రహానేకు ఈ సిరీస్‌లో తుది జట్టులో చోటు లభించడంలేదు. ప్రస్తుతం భారత్ వరుస విజయాలు సాధిస్తుండటంతో ఎవరూ ఎలాంటి ప్రశ్నలు వేయడంలేదు. బాగా ఆడి కూడా తుది జట్టులో స్థానం లభించకపోవడం వేరే ఆటగాళ్లకు తప్పుడు సంకేతాలు ఇస్తుంది.



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తాను సాధించిన రజత పతకాన్ని ఆంధ్ర ప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకు చూపిస్తున్న పీవీ సింధు. కోచ్ పుల్లెల గోపీచంద్, సింధు వెలగపూడిలోని సచివాలయంలో సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో సింధు మరిన్ని పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్, భారతదేశానికి పేరు తేవాలని సీఎం ఆకాంక్షించారు. అమరావతి బాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో కోచ్ గోపీచంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలోగా అకాడమీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. - సాక్షి, అమరావతి

ప్రజ్ఞాన్ ఓజాకు గంగూలీ ఝులక్



కోల్‌కతా: తిరిగి హైదరాబాద్‌కు ఆడాలన్న ప్రజ్ఞాన్ ఓజా ఆశలపై బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ నీళ్లు చల్లారు. బెంగాల్ నుంచి లెఫ్టార్మ్ స్పిన్నర్‌ను విడుదల చేయబోమని స్పష్టం చేశారు. రెండేళ్లుగా బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ స్పిన్నర్ ఈ సీజన్ కోసం తిరిగి సొంత జట్టు హైదరాబాద్‌కు వెళ్లాలని ఆశించాడు. ఈ మేరకు నిరభ్యంతర పత్రం కోసం దరఖాస్తు కూడా చేశాడు. తాజాగా దీన్ని భారత మాజీ కెప్టెన్ తిరస్కరించారు. ‘అతను విడుదల చేయాలని కోరాడు. కానీ మేం చేయం. హైదరాబాద్ ప్లేట్ డివిజన్‌లో ఉన్నప్పుడు మా జట్టుతో చేరాడు. ఇప్పుడు హైదరాబాద్ ఎలైట్‌కు చేరిందని వెళితే ఎలా? అతని సేవలు మాకు అవసరం’ అని అన్నారు. సీజన్‌కు ముందు జరిగే శిబిరంలో ఓజా పాల్గొంటాడని దాదా చెప్పారు. దీనిపై హెచ్‌సీఏ కార్యదర్శి శేష్‌నారాయణ్ స్పందిస్తూ ‘బెంగాల్ నిరభ్యంతర పత్రం ఇవ్వనపుడు మేం చేయగలిగిందేమీ లేదు. గంగూలీ అంటే మాకెంతో గౌరవం. మాజీ సారథి ఆట కోసం, ఆటగాళ్ల కోసం బాగా ఆలోచిస్తారు’ అని అన్నారు. 2015–16 సీజన్‌లో బెంగాల్‌కు ఆడిన ఓజా 36 వికెట్లు, గత సీజన్‌లో10 వికెట్లు తీశాడు.

‘దులీప్’ జట్లలో మిలింద్, సిరాజ్

సెప్టెంబర్ 7 నుంచి 29 వరకు టోర్నీ

న్యూఢిల్లీ: దులీప్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన జట్లలో తెలుగు రాష్ట్రాల క్రికెటర్లకు చోటు దక్కింది. ఆంధ్ర ఆటగాడు కె. శ్రీకర్ భరత్... సురేశ్ రైనా సారథ్యంలోని భారత బ్లూ జట్టుకు ఎంపికయ్యాడు. గత సీజన్‌లో ఆంధ్రకు ప్రాతినిధ్యం వహించిన భార్గవ్ భట్ కూడా ఇదే జట్టులో ఉన్నాడు. హైదరాబాద్ ఆల్‌రౌండర్ సీవీ మిలింద్, స్టార్ బ్యాట్స్‌మన్ అంబటి తిరుపతి రాయుడు, రాహుల్ సింగ్ భారత రెడ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. పేసర్ మొహమ్మద్ సిరాజ్‌కు భారత గ్రీన్ జట్టులో చోటు దక్కింది. గాయంతో లంక టూర్‌కు దూరమైన భారత ఓపెనర్ మురళీ విజయ్ కూడా ఈ జట్టులోనే ఉన్నాడు. నాలుగు రోజుల మ్యాచ్‌లు వచ్చే నెల 7 నుంచి 29 వరకు కాన్పూర్, లక్నో వేదికల్లో జరుగుతాయి. మొదట్లో ఈ టోర్నీకి బీసీసీఐ వార్షిక షెడ్యూల్లో చోటు లేకపోయింది. గంగూలీ జోక్యంతో హడావుడిగా దీన్ని షెడ్యూలులో చేర్చారు.

బంగ్లా పులిలా...



ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం

- షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

ఢాకా: సిరీస్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియాను తాము క్లీన్‌స్వీప్ చేస్తామన్న బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ వ్యాఖ్యలపై ఆసీస్ జట్టు సారథి స్టీవ్ స్మిత్ హేళనగా స్పందించాడు. బంగ్లాదేశ్ వంద టెస్టులాడితే పట్టుమని పదైనా గెలవలేకపోయిందన్నాడు. అన్నట్లుగానే షకీబ్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాకు శుభారంభం ఇచ్చాడు. తొలి టెస్టులో బంగ్లాదేశ్ 20 పరుగుల తేడాతో మాజీ టెస్టు నంబర్‌వన్ ఆస్ట్రేలియాపై సంచలన విజయం సాధించింది. టెస్టు క్రికెట్లో నంబర్‌వన్ ఆల్‌రౌండర్ అయిన షకీబ్ తన హోదాకు న్యాయం చేసే ప్రదర్శన కనబరిచాడు. బ్యాటింగ్‌లో 84 పరుగులు చేసిన షకీబ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు (5/68, 5/85) పడగొట్టాడు. వార్నర్ (112; 16 ఫోర్లు, 1 సిక్స్) శతకం సాధించాడు. నాలుగు రోజు 265 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు 109/2 ఓవర్‌నైట్ స్కోరుతో బుధవారం ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 244 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ వార్నర్ 121 బంతుల్లో సెంచరీని పూర్తిచేశాడు. టెస్టుల్లో అతనికిది 19వ సెంచరీ కాగా... మిగతా బ్యాట్స్‌మెన్‌లో కెప్టెన్ స్మిత్ (37), కమిన్స్ (33) మినహా మిగతా వారు విఫలమయ్యారు. తొలి సెషన్‌లో స్మిత్ అండతో సెంచరీ పూర్తిచేసిన వార్నర్‌ను కాసేపటికే షకీబ్ పెవిలియన్ చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత స్మిత్ కూడా షకీబ్ స్పిన్‌కే చిక్కడంతో ఆసీస్ పతనం జోరందుకుంది. రెండో టెస్టు సెప్టెంబర్ 4 నుంచి చిట్టగాంగ్‌లో జరుగుతుంది.

11 భారత ఉపఖండంలో ఆడిన గత 13 టెస్టుల్లో ఆస్ట్రేలియా 11 మ్యాచ్‌ల్లో ఓడింది. కేవలం ఒక్కటంటే ఒకటే గెలవగా... మరొకటి డ్రా అయింది.

10 బంగ్లాదేశ్ ఇప్పటివరకు 101 టెస్టులు ఆడి పదింటిలో గెలిచింది. బంగ్లా చేతిలో ఓడిన ఐదో దేశం ఆస్ట్రేలియా.

5 తమ జట్టు ఆడిన 50వ టెస్టుల్లో పది వికెట్లు తీసిన ఐదో బౌలర్ షకీబ్. గతంలో బెయిలీ, హ్యాడ్లీ, మురళీధరన్, హర్భజన్ ఇలా చేశారు.



స్నపనాభిషేకంతో దేవీ నవరాత్రులు ప్రారంభం

- సెప్టెంబర్ 21 తెల్లవారుజామున స్నపనాభిషేకం, జలసేవ
- అదే రోజు ఉదయం 7.30కు గణపతి పూజ, కలశ ప్రతిష్ట.. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం
- ఉత్సవాల ఏర్పాట్లకు అధికారుల శ్రీకారం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమం): స్థానిక దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 21 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రుల ఏర్పాట్లకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. 21వ తేదీన తెల్లవారుజామున 2.30 గంటలకు అమ్మవారికి స్నపనాభిషేకం, ఉదయం 6 గంటలకు జలసేవ (కృష్ణానది)తో శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయి. అదే తేదీన ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, నవరాత్రి కలశ ప్రతిష్ట జరిగిన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

5వ అంతస్తులో కుంకుమార్చనలు

దసరా ఉత్సవాలకు మహా మండపం ఆరో అంతస్తులో ఉన్న అమ్మవారి ఉత్సవమూర్తిని ఐదో అంతస్తుకు మార్చి అక్కడే కుంకుమార్చనలు నిర్వహించాలని ఆలయ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఐదో అంతస్తులోని షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి ప్రత్యేక పూజలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

షిఫ్టుకు 250 టికెట్లు మాత్రమే విక్రయం

అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక కుంకుమార్చనలు, శత చండీ యాగం టికెట్ల ధరలను నిర్ణయించారు. ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధరను రూ.3 వేలుగా నిర్ణయించారు. 27వ తేదీన మూలా నక్షత్రం రోజు మాత్రం రూ.5 వేలు వసూలు చేస్తారు. షిఫ్టుకు 250 టికెట్లు మాత్రమే విక్రయించాలని దేవస్థానం నిర్ణయించింది. ఇక శతచండీ యాగం టికెట్ ధరను రూ.4 వేలుగా నిర్ణయించారు. 21న మధ్యాహ్నం 12 గంటలకు కుంకుమార్చన ప్రారంభమవుతుంది. 22న ఉదయం 7, 10 గంటలకు పరోక్ష కుంకుమార్చన జరుగుతుంది. మూలా నక్షత్రం రోజు మొత్తం ఉదయం 7, 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 3 షిఫ్టుల్లో కుంకుమార్చన నిర్వహిస్తారు.

దర్శనం ఉదయం 3 నుంచి..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనానికి భక్తులకు అనుమతిస్తారు. రోజూ సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు అమ్మవారి దర్శనం నిలిపేస్తారు. అమ్మవారికి నివేదనలు, ఇతర పూజా కార్యక్రమాల అనంతరం దర్శనం ప్రారంభమవుతుంది. మూలా నక్షత్రం రోజు తెల్లవారుజామున 2 గంటల నుంచి భక్తులకు దర్శనం ఉంటుంది. మూలా నక్షత్రం రోజున సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తుంది. 30వ తేదీ విజయ దశమి సందర్భంగా సాయంత్రం 4 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవం ప్రారంభమవుతుంది. ఆ రోజు రాత్రి 12 గంటల వరకు దర్శనం ఉంటుంది.

పర్యాటక ప్రాంతాలుగా గండికోట, పోలవరం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మెరుగైన పర్యాటక ప్రాంతాలుగా గండికోట, పోలవరంను తీర్చిదిద్దనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి అంతర్జాతీయ హంగులు అద్దుతూ విభిన్న ప్రాజెక్టులకు రూపకల్పన తదితర అంశాలపై బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేసే విషయమై వివిధ సంస్థలు సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్‌ను ఆయన పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయగలమన్న దానిపై సమాలోచనలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోటపై ఫీడ్‌బ్యాక్ ఇన్‌ఫ్రా, సైట్ కాన్సెప్ట్, టీమ్ వన్ ఇండియా, మాస్టర్ అసోసియేట్స్ సంస్థలు తమ ఆలోచనలను వెల్లడించాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక ప్రాధికార సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: గుంటూరు జిల్లా కోటప్పకొండ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. బుధవారం ఈ విషయమై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో ఆయన సమావేశమై చర్చించారు. కోటప్పకొండ అభివృద్ధిపై రూపొందించిన ప్రణాళికల అమలు గురించి ఆయన స్పీకర్‌కు వివరించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఏపీకి కేంద్రం నిధులు

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వివిధ పథకాలకు కేంద్రం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ బుధవారం ఢిల్లీలో వివరాలు వెల్లడించారు. ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కింద రూ.448 కోట్లు, ఓబీసీల స్కాలర్‌షిప్ కింద 1.26 లక్షల మంది విద్యార్థులకు రూ.153 కోట్లు, కార్పొరేషన్ కింద లబ్ధిదారులకు అందించే రుణాలకు రూ.114 కోట్లు, ఎస్సీ లబ్ధిదారుల రుణాలకు రూ.90 కోట్లు, ఎస్సీ, ఓబీసీ హాస్టళ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు, శిక్షణాభివృద్ధికి రూ.2 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసినట్టు దత్తాత్రేయ తెలిపారు.

‘స్టార్టప్‌లకు నిధుల కొరత లేదు’

సాక్షి, అమరావతి: స్టార్టప్‌లకు నిధుల కొరత లేకుండా వీటిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఏపీ ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ ఎస్.వి.గిరిధరరావు తెలిపారు. సింగిల్‌విండోతోపాటు అనేక ప్రోత్సహకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం సీఐఐ ఏపీ చాప్టర్ విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ ఇన్వెస్టర్ మీట్‌లో పాల్గొన్న గిరిధరరావు మాట్లాడుతూ.. సిడ్బీ స్టార్టప్ మిత్ర పేరుతో ఇంక్యుబేషన్‌తోపాటు, రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఔత్సాహికులు 12 స్టార్టప్ ప్రజెంటేషన్లను సమర్పించినట్లు సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ జేఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. డ్రోన్లతో వ్యవసాయం, హెల్త్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఐటీ, ఐటీఈఎస్ రంగాలకు చెందిన వాటిపై ప్రాజెక్టులను సమర్పించారని, వీటికి కావల్సిన ఆర్థిక వనరులను సీఐఐ సమకూరుస్తుందన్నారు.

ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు

- శాసనసభ కమిటీలపై స్పీకర్ కోడెల స్పష్టీకరణ
- అసెంబ్లీ కమిటీల సభ్యులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ



బుధవారం నిర్వహించిన అసెంబ్లీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ కోడెల, చిత్రంలో కమిటీ సభ్యులు, అధికారులు.

సాక్షి, అమరావతి: శాసనసభ కమిటీలకు చెందిన సభ్యులెవరికీ ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించే అవకాశం లేదని, ఏదేని ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు, ఖర్చుచేసే నిధులు, అక్కడ జరిగే పనుల్ని పరిశీలించి నివేదికలివ్వడం వరకే వారి బాధ్యతని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు స్పష్టం చేశారు. శాసనసభ భవనం మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో బుధవారం పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ), పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ(పీయూసీ), ఎస్టిమేట్స్ కమిటీల తొలి సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయా కమిటీల చైర్మన్లు, సభ్యులు ఈ సందర్భంగా సమస్యలు, సౌకర్యాలతోపాటు పలు అంశాల్ని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కోడెల మాట్లాడుతూ.. శాసనసభ కమిటీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అసెంబ్లీ కమిటీలు 19 వరకున్నాయని, వాటిలో దేని ప్రాధాన్యత దానిదేనని, అయితే ఆర్థికపరమైన అంశాలకు సంబంధించిన ఈ మూడు కమిటీలు కీలకమైనవన్నారు. కమిటీలు పనిచేసే విధానం, నియమ నిబంధనల్ని వివరించారు. కమిటీలకు గదులు కేటాయించడానికి తగిన స్థలం లేదని, పక్కన కొత్తగా నిర్మించే భవనంలో కేటాయించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. కమిటీ సభ్యులు ఏదైనా పర్యటనకు వెళ్లదానికి 15 రోజులు ముందు చెబితే సౌకర్యాలు కల్పించడానికి వీలవుతుందని శాసనసభ స్పెషల్ సెక్రటరీ పీపీకె రామాచార్యులు చెప్పారు. సమావేశంలో పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కాగిత వెంకట్రావు, మూడు కమిటీల సభ్యులు, పూర్వ కార్యదర్శి కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌తో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ బుధవారం స్పీకర్ కోడెలను శాసనసభ ప్రాంగణంలోని స్పీకర్ చాంబర్‌లో గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల్ని వివరించారు. అమరావతిలో నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంట్‌కు సంబంధించిన ప్రసంగాల పుస్తకాన్ని, గౌతమబుద్ధుని చిత్రపటాన్ని ఈ సందర్భంగా ఆండ్రూకు ఆయన అందజేశారు. తర్వాత ఆండ్రూ అసెంబ్లీని సందర్శించారు. లోపల స్పీకర్‌తో కలసి ఫొటోలు దిగారు. అనంతరం కోడెల మీడియాతో మాట్లాడుతూ.. మూడేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ఫ్లెమింగ్‌కు తెలిపానన్నారు. సామాజిక, ఆర్థిక, సేవారంగాల్లో కలసి పనిచేయడానికి ఆండ్రూ సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు.

దుకాణదారులకు పని, ఆహార భద్రత కల్పించాలి

చౌకధరల దుకాణదారుల సమాఖ్య డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: చౌక ధరల దుకాణదారులకు ప్రభుత్వాలు పని, ఆహార భద్రత కల్పించాలని ఆ దుకాణదారుల జాతీయ సమాఖ్య డిమాండ్ చేసింది. వీరి సమస్యలపై అఖిల భారత సమాఖ్య బుధవారం ఢిల్లీలో సమావేశమై చర్చించింది. రేషన్ డీలర్లను పీడీఎస్ ఉద్యోగులుగా గుర్తించాలని, పని, ఆహార భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు, పెన్షన్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పెండింగ్ బకాయిలను ప్రభుత్వాలు విడుదల చేయాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు ఏపీ సమాఖ్య జనరల్ సెక్రటరీ సత్యసాయి గిరిజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లు అంగీకరించకపోతే నవంబర్ 1వ తేదీ నుంచి దేశం మొత్తం సరుకుల రవాణను నిలిపివేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

విమానాన్ని ఢీకొట్టిన పక్షి

పైలెట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖ విమానాశ్రయంలో బుధవారం తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఇండిగో విమానం ఉదయం 7.40కి విశాఖ విమానాశ్రయం నుంచి 180 మంది ప్రయాణికులతో బెంగళూరుకు బయల్దేరింది. ఇది రన్‌వే పైకి దూసుకెళ్తుండగా హఠాత్తుగా ఓ పక్షి వచ్చి విమానాన్ని ఢీకొట్టింది. ఆ పక్షి విమానం ప్రొఫెల్లర్‌లోకి వెళ్లడంతో ఇంజిన్ సమస్య తలెత్తింది. పైలెట్ అప్రమత్తంగా వ్యవహరించి.. విమానాన్ని వెనక్కి మళ్లించి తిరిగి అప్రాన్‌పైకి తీసుకొచ్చి నిలిపారు. విమానం తిరిగి వెళ్లేందుకు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కర్ణాటక కాంగ్రెస్ నేతలపై మళ్లీ ఐటీ దాడులు

మంత్రి డీకే సన్నిహితుల ఇళ్లలో సోదాలు



ఐటీ దాడులు జరిగిన విజయ్ ముళగుంద నివాసం

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో అధికార కాంగ్రెస్ నేతలపై మరోసారి ఐటీ దాడులు జరిగాయి. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి డీకే శివకుమార్, ఆయన సన్నిహితుల నివాసాలపై ఇదివరకే సోదాలు నిర్వహించిన ఐటీ శాఖ ఈ సారి కూడా ఆయన ఆప్తులపైనే దృష్టిపెట్టింది. మంత్రి డీకేకు సన్నిహితులైన కేపీసీసీ కార్యదర్శి విజయ్ ముళగుందతో పాటు కాంగ్రెస్ నేత బీఎస్ శ్రీధర్ ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం ఐటీ అధికారులు సోదాలు జరిపారు. ఈ నెల మొదటి వారంలో మంత్రి డీకే నివాసం, కార్యాలయాల్లో జరిపిన దాడుల్లో లభించిన సమాచారం ఆధారంగా తాజాగా సోదాలు చేపట్టినట్లు ఐటీ వర్గాలు చెబుతున్నాయి. బెంగళూరులోని రాజాజీనగర్, జయనగర్ తదితర ప్రాంతాలతో పాటు ఢిల్లీ, చెన్నై, ముంబై తదితర పది ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల సమయంలో బెంగళూరులో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల బస ఏర్పాట్లను డీకేతో పాటు వీరు కూడా నిర్వహించినట్లు సమాచారం. ఐటీ దాడులు కక్ష సాధింపు చర్య అని, తగు సమయంలో వీటిపై స్పందిస్తామని మంత్రి డీకే చెప్పారు.

ప్రభుత్వ సంస్థలు, సొసైటీలపై బాబు సర్కారు కత్తి

- పీఆర్సీ సిఫార్సుల నుంచి ఆ ఉద్యోగులను తప్పించిన ప్రభుత్వం
- గత ఏడాదే కేబినెట్‌లో నిర్ణయం.. అమలుపై తాజాగా కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ఆధారంగా 50 ఏళ్లకే బలవంతపు పదవీ విరమణ చేయించి ఇంటికి పంపేలా ముసాయిదా జీవోలను సైతం సిద్ధం చేసిన చంద్రబాబు సర్కారు.. ఆ విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తేవటంతో తాత్కాలికంగా పక్కనపెట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీ ఉద్యోగులపైనా సర్కారు కత్తికట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పీఆర్సీ సిఫార్సుల నుంచి తప్పించింది. పీఆర్సీ సిఫార్సులు ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులకు వర్తించవని గతేడాది ఆగస్టు 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ, ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోలకు ప్రత్యేకంగా వేజ్ బోర్డులున్నాయి. మిగతా ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు 9, 10వ షెడ్యూల్లోని సంస్థలు, సొసైటీలకు వేజ్ బోర్డులు లేవు. అయితే గత ప్రభుత్వాలు ఆ సంస్థలకు కూడా పీఆర్సీ సిఫార్సులను అమలు చేశాయి. ఈ నేపథ్యంలో అదే తరహాలో తమకు కూడా 2015 సవరించిన పే స్కేల్స్‌ను వర్తింప చేయాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 6న సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం సంబంధిత సంస్థలు, సొసైటీల పరిపాలన శాఖల సిఫార్సుల మేరకు 2015 సవరించిన పే స్కేల్స్‌ను వర్తింప చేయాలని పేర్కొన్నారు. అయితే పీఆర్సీ సిఫార్సుల నుంచి ప్రభుత్వ సంస్థలు, సొసైటీల ఉద్యోగులను తప్పించాలని, వీరి కోసం ప్రత్యేకంగా వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని అంతకు ముందే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఆయా సంస్థల్లో పనిచేసే వారికి వేతనాల ప్యాకేజీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను పనితీరు సూచికల ఆధారంగానే వర్తింపజేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దీని అమలుపై అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ (ఇన్‌చార్జి) ఎం.రవిచంద్ర బుధవారం జీవో ఇచ్చారు. ప్రభుత్వ సంస్థల శాఖ ప్రత్యేక సీఎస్ లేదా ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ (వ్యయం) ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి కమిటీలో ఉంటారు. సెప్టెంబర్ 30వ తేదీ లోగా ప్రభుత్వానికి సిఫార్సులతో నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆర్టీసీ, జెన్‌కో, ట్రాన్స్‌కోల్లో మినహా మిగతా ప్రభుత్వ సంస్థలు, సొసైటీల్లో 40 వేల నుంచి 50 వేల మంది వరకు ఉద్యోగులు ఉంటారని సమాచారం.

దుబాయ్ నుంచి వాటర్ బాటిళ్లలో బంగారం

- వినూత్న పద్ధతుల్లో అక్రమ రవాణా
- చెన్నై విమానాశ్రయంలో 3 కిలోల బంగారం స్వాధీనం

సాక్షి, చెన్నై: విదేశాల నుంచి బంగారాన్ని తీసుకువచ్చేందుకు అక్రమార్కులు వినూత్న పద్ధతులు ఉపయోగిస్తున్నారు. బుధవారం చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల తనిఖీలు చేపట్టగా మూడు కిలోల బంగారం పట్టుబడింది. దుబాయ్, కువైట్ నుంచి వచ్చిన ముగ్గురు ప్రయాణికులు.. వాటర్ బాటిళ్ల ద్వారా ద్రవ రూపంలో 700 గ్రాముల బంగారాన్ని, బ్యాగ్‌లో 300 గ్రాములు, సూట్‌కేసులో సన్నటి కమ్మీల రూపంలో రెండు కేజీల బంగారాన్ని తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో కస్టమ్స్ అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడినవారిలో చెన్నైకి చెందిన మహ్మద్ అబ్దుల్ నవాజ్, బాషా, అబుబక్కర్ ఉన్నారు. వీళ్లు ద్రవరూపంలో తీసుకొచ్చిన బంగారంలో హైడ్రోక్లోరిక్, నైట్రిక్ ఆమ్లాలు ఉన్నాయని, వాటిని విడదీయడానికి ఎనిమిది గంటలు సమయం పట్టిందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. అలాగే సన్నటి కమ్మీల రూపంలో ఉన్న బంగారాన్ని ప్రత్యేక పరికరాల ద్వారా గుర్తించాల్సి వచ్చిందని చెప్పారు. కాగా, ఈ పట్టుబడిన బంగారం విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో కోటి రూపాయలు ఉంటుందని తెలిపారు.

కాలేయాన్ని భద్రపరిచే పరికరం!

కోయంబత్తూరు శాస్త్రవేత్తల ఆవిష్కరణ



టీ.నగర్ (చెన్నై): కాలేయాన్ని 20 గంటల పాటు భద్రపరిచే పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు పీఎస్‌జీ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్, పీఎస్‌జీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్లు దీన్ని రూపొందించారు. పరికరం రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన డా.స్వామినాథన్, డా.జోసెఫ్ జాన్, డా.కె.వెంకట్రామన్ బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సాధారణంగా కాలేయాన్ని ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల్లోగా రోగులకు అమర్చాల్సి ఉంటుందని, లేకపోతే అది చెడిపోతుందని తెలిపారు. కాలేయంలోని కణాలు క్రమంగా మృతి చెందుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో కాలేయాన్ని 20 గంటలపాటు భద్రపరిచే నూతన పరికరాన్ని తాము అభివృద్ధి చేశామని వివరించారు. ఈ పరికరంలోని విడిభాగాలు చాలా వరకు భారత్‌లోనే తయారయ్యాయని, మోటార్, అల్ట్రా సౌండ్ సెన్సార్ విడిభాగాలు మాత్రం జర్మనీ, అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నామని చెప్పారు.

వీరంగం సృష్టించిన ఆడ ఏనుగు మృతి

కుంకీ ఏనుగులు అడవిలోకి తరుముతుండగా కుప్పకూలిన వైనం



మృతి చెందిన ఏనుగు

కేకే నగర్ (చెన్నై): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో 14 రోజులుగా వీరంగం సృష్టిస్తున్న ఆడ ఏనుగు బుధవారం మృతిచెందింది. దాన్ని అదుపు చేసేందుకు రంగంలోకి దించిన కుంకీ ఏనుగులు (శిక్షణ పొందినవి) అడవిలోకి తరుముతుండగా హఠాత్తుగా కుప్పకూలి మరణించింది. వాల్పారై కరుమలై ఎస్టేట్ ప్రాంతంలో రెండు వారాలుగా ఓ ఆడ ఏనుగు నివాస గృహాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తోంది. అలాగే అరటి తోటలను నాశనం చేస్తోంది. దీంతో ఆ ఏనుగును అడవిలోకి పంపాలని ఆ ప్రాంత ప్రజలు అటవీ అధికారులను కోరారు. స్పందించిన అధికారులు దాన్ని అడవిలోకి తరిమేందుకు కలీం, మారియప్పన్, భరణి అనే మూడు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. ఈ క్రమంలో బుధవారం కుంకీ ఏనుగులు దాన్ని తరుముతుండగా నడుమలై ఎస్టేట్‌లోని తేయాకు తోటలో హఠాత్తుగా కుప్పకూలిపోయింది. వాటిని వెంబడించిన అధికారులు ఆడ ఏనుగు మృతిచెందినట్లు తెలిపారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.